
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 19

శుక్రవారం 11-4-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



రాహుల్ గెలిపించాడు

ఐపీఎల్ టోర్నీలో ఢిల్లీకి వరుసగా నాలుగో విజయం -17లో



టారిఫ్ 'రిలీఫ్' ర్యాలీ

ట్రంప్ సుంకాలకు విరామంతో పుంజుకున్న అంతర్జాతీయ మార్కెట్లు -17లో



ఎన్ఐఏ అదుపులో రాణా

అమెరికా నుంచి తీసుకొచ్చిన ముంబై దాడుల సూత్రధారి తహవ్వుర్ రాణాను ఎన్ఐఏ అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచింది.

వివరాలు 6లో ▸



నో వీసా, నో పర్మిట్

సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించాకే విదేశీయులకు వీసాలు, నివాస అనుమతులు ఇవ్వనున్నట్లు అమెరికా ప్రకటించింది.

వివరాలు 6లో ▸



తలుపులు తెరిచే ఉన్నాయి

టారిఫ్‌ల విషయంలో అమెరికాతో చర్చలకు తమ తలుపులు తెరిచే ఉన్నాయని చైనా వాణిజ్య శాఖ ప్రతినిధి తెలిపారు.

వివరాలు 6లో ▸



బిహార్‌లో వర్ష బీభత్సం

బిహార్‌లో బుధ, గురువారాల్లో భారీ వర్షాలు, పిడుగుపాటు ఘటనల్లో 38 మంది మృతి చెందినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

వివరాలు 6లో ▸

యంగ్ ఇండియా నా బ్రాండ్

ఎడ్యుకేషన్, ఎంప్లాయ్‌మెంట్ అనేది మా బ్రాండ్ • విద్య, వైద్యం, ఉపాధికే మా ప్రాధాన్యం

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



పోలీస్ స్కూల్ ప్రారంభించిన అనంతరం విద్యార్థులతో కలిసి సరదాగా ఫుట్‌బాల్ ఆడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

పోలీసులు తమ పిల్లల చదువు విషయంలో ఆందోళన చెందకుండా ఉండేందుకే ఈ స్కూల్

సైనిక్ స్కూల్‌కు దీటుగా ఒక బ్రాండ్‌ను క్రియేట్ చేసేలా ఈ పాఠశాలను తీర్చిదిద్దాలి

ఇకపై ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రీస్కూల్

ప్రైవేటుబడుల మాదిరిగా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ

నిరుపేద పిల్లలకు ఉచితంగా రవాణా సదుపాయం

సాక్షి, హైదరాబాద్: 'గతంలో ప్రధాన మంత్రులుగా, ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారికి ఒక్కొక్కరికి ఒక్కో బ్రాండ్ ఉందని, అధికారంలోకి వచ్చి 16 నెలలైనా ఏ బ్రాండ్ సృష్టించుకోలేదని కొందరు అంటున్నారు. విమర్శకులకు నా సమాధానం ఇదే..నా బ్రాండ్ యంగ్ ఇండియా..మహాత్మాగాంధీ స్ఫూర్తితో యంగ్ ఇండియా బ్రాండ్‌ను తెలంగాణలో క్రియేట్ చేసుకున్నాం. ఎడ్యుకేషన్, ఎంప్లాయ్‌మెంట్ అనేది మా బ్రాండ్. విద్య, వైద్యం, ఉపాధికే మా ప్రాధాన్యం..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో నిర్మించిన యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు.

రూ.100 కోట్లతో కార్పస్ ఫండ్

'దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందని నేను విశ్వసిస్తా. నిత్యం విధుల్లో ఉండే పోలీసులు వారి పిల్లల చదువుల విషయంలో ఆందోళనతో ఉండొద్దన్న ఉద్దేశంతోనే యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ఏర్పాటు చేశాం. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నెరవేర్చాం. సైనిక్ స్కూల్‌కు దీటుగా పోలీస్ స్కూల్‌ను తీర్చిదిద్దాలి. పోలీసు స్కూల్‌లో చదివామన్న ఒక బ్రాండ్‌ను

మిగతా 3వ పేజీలో ▶

గురువారం కంచ గచ్చిబౌలి భూములను పరిశీలిస్తున్న కేంద్ర సాధికార కమిటీ



అసలేం జరిగింది?

కంచ గచ్చిబౌలి భూముల్లో సాధికార కమిటీ పర్యటన

- రాష్ట్ర అధికారులతో కలిసి చెట్ల కూల్చివేత, చదును చేసిన భూమి పరిశీలన
- పీకాక్, బఫెల్లో లేక్ వరకు వెళ్లి చూసిన కేంద్ర బృందం
- వివిధ శాఖల అధికారులతో వాస్తవ పరిస్థితిపై ఆరా
- చెట్లు నరకడానికి అనుమతులు తీసుకున్నారా..? అని ప్రశ్న
- ఎంసీహెచ్ఆర్‌డీలో విద్యార్థి సంఘాలు, అధ్యాపకులు, పర్యావరణవేత్తలతో భేటీ
- హోటల్లో ప్రభుత్వాధికారులతో సమావేశం.. బీఆర్ఎస్, బీజేపీ నేతల నుంచి వినతిపత్రాల స్వీకరణ
- మరోసారి భూములు పరిశీలిస్తామన్న కేంద్ర కమిటీ

14లో

సర్కారు బరి తెగింపు

- కంచ గచ్చిబౌలిలో జీవ విధ్వంసం చేసింది
- సీఎం రేవంత్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- కేంద్ర సాధికార కమిటీతో బీఆర్ఎస్ బృందం
- ఉల్లంఘనలపై హరీశ్ తదితరుల నివేదిక

14లో

హెచ్‌సీయూ భూమిని పరిరక్షించండి

సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీకి బీజేపీ ఎంపీల వినతిపత్రం

న్యూస్‌రీల్

స్వతంత్ర భారత చరిత్రలో సన్నబియ్యం ఇచ్చింది మేమే



నిరుపేదలందరికీ ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, స్వతంత్ర భారత చరిత్రలో మొదటిసారి పేదలకు సన్నబియ్యం ఇస్తోంది కూడా తామేనని మంత్రి ఉత్తమ్ చెప్పారు.

- వివరాలు 14లో▶

గ్రామ గ్రామానికి నాణ్యమైన విత్తనాలు



మేలైన విత్తనాలను ప్రతి గ్రామంలో రైతులకు పంపిణీ చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. వచ్చే మూడేళ్లలో ప్రతి గ్రామంలోని రైతులందరికీ నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంటాయన్నారు.

- వివరాలు 5లో▶

పీఆర్ ఆర్డీలో పునరావాసం



పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో రిటైరైనప్పటికీ గతంలో మళ్లీ అపాయింట్ అయిన పలువురు అధికారులను ఇటీవలే తొలగించడం తెలిసిందే. కానీ వారిలో కొందరిని మళ్లీ కొనసాగిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

- వివరాలు 3లో▶


17న జేఈఈ మెయిన్ ఫలితాలు



జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ మెయిన్) ఫలితాలు ఈ నెల 17న విడుదల చేయనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) తెలిపింది.

- వివరాలు 18లో▶

ఇదండీ సంగతి



అకాల వర్షం.. ఆగమాగం

- జనగామ, దేవరకద్ర మార్కెట్లలో కొట్టుకుపోయిన ధాన్యం
- పలు జిల్లాల్లో కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వడ్లు
- వడగండ్ల వానకు నేలరాలిన మామిడి కాయలు, వరి, మొక్కజొన్న
- వేర్వేరు చోట్ల పిడుగులు పడి రైతు, గొర్రెల కాపరి, విద్యార్థి మృత్యువాత..
- పంటనష్టం జరిగిందంటూ ఓ రైతు ఆత్మహత్యాయత్నం

సాక్షి, నెట్‌వర్క్: క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో పలు జిల్లాల్లో అకాలవర్షం కురిసింది. గురువారం గాలి దుమారంతో ప్రారంభమై.. ఓ మోస్తరు వర్షం కురిసింది. వడగండ్లతో రైతులకు కడగండ్లు మిగిలాయి. కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. మూడుచోట్ల పిడుగులు పడి ముగ్గురు చనిపోయారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లో కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం తడిసింది. వడగండ్ల వానకు మామిడి కాయలు నేలరాలాయి. వరి చేలు

మిగతా 5వ పేజీలో ▶



యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం

పాజ్ కాదు.. కొత్త ఫేజ్!



మెనోపాజ్ స్టేజీని అర్థం చేసుకుని అండగా నిలబడే వాళ్లుంటే అదృష్టమే! కాని అది అరుదు! అందుకే మనల్ని మనమే సముదాయించుకోవాలి.. మోటివేట్ చేసుకోవాలి. డాక్టర్‌ను సంప్రదించి అవసరమైన మెడికేషన్ తీసుకోవాలి. మెనోపాజ్‌ను కొత్త ఫేజ్‌గా భావించాలి. – సునీత

'సాక్షి' ఫ్యామిలీలో **మెనోపాజ్ క్యాంపెయిన్**

ఒలింపిక్స్‌లో ఆరు క్రికెట్ జట్లు

- టి20 ఫార్మాట్‌లో మ్యాచ్‌ల నిర్వహణ.. ఐసీసీ ప్రకటన

17లో

చదువుకోసమే వచ్చారా?

భారతీయ విద్యార్థులపై అమెరికాలో నిరంతర నిఘా



- చదువుతున్నారా? పార్ట్ టైం ఉద్యోగాలు చేస్తున్నారా? అని ఏఐ సాయంతో ఆరా
- ధ్రువపత్రాలు, బ్యాంక్ బ్యాలెన్స్ వివరాలు సేకరణ
- కేంద్ర ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసిన భారత ఎంబసీ
- కన్సల్టెన్సీల సమాచారం ఇవ్వాలని రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం

18లో

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు

'సాక్షి' ఎడిటర్ ఆర్. ధనంజయరెడ్డిపై కేసు నమోదు

ఏపీలో అరాచకాలను ప్రశ్నిస్తున్నందుకు కక్ష కట్టిన ప్రభుత్వం

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తను హత్య చేసిన టీడీపీ గూండాలు
- వాస్తవాన్ని వెలుగులోకి తెచ్చినందుకే అక్రమ కేసు
- హత్య కేసును పక్కదారి పట్టించే కుతంత్రం
- ప్రాంతానికో రకంగా వార్తలు రాసింది 'పచ్చ' పత్రికలే..

-13లో▶



ఇది టీడీపీ చేసిన హత్యే

- ఈనెల 3న పింఛన్ కోసం వస్తుండగా నా భర్త కిడ్నాప్.. ఆపై హత్య
- దోషులంతా టీడీపీ వర్గీయులు
- మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి అనుచరుడైనందుకే ఈ దారుణం
- టీడీపీ గెలిచిన వెంటనే మాపై దాడి చేశారు
- భయంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి రక్షణ కోరాం
- వైఎస్సార్‌సీపీలో ఉన్న మీకు రక్షణ ఎలా కల్పిస్తామన్నారు
- దిక్కుతోచకే తెలంగాణకు వెళ్లాం.. మృతుడు హరిశ్చంద్ర భార్య నిర్మల కన్నీటి పర్యంతం

13లో

లులు చేతికి 'మంజీరా'

రూ.318 కోట్లకు ఆమోదం తెలిపిన ఎన్‌సీఎల్‌టీ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఉన్న మంజీరా మాల్‌ను నిర్వహిస్తున్న మంజీరా రిటైల్ హోల్డింగ్స్‌ను స్వాధీనం చేసుకునేందుకు లులు ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్‌కు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) అనుమతి ఇచ్చింది. దివాలా తీసిన మంజీరా కోసం మొత్తం 49 కంపెనీలు పోటీపడగా, 8 కంపెనీలను క్రెడిటర్ల కమిటీ (సీవోసీ) షార్ట్‌లిస్ట్ చేసింది. అత్యధికంగా రూ.318.42 కోట్లకు లులు రిజల్యూషన్ ప్లాన్‌ను సమర్పించడంతో రిజల్యూషన్ ప్రొఫెషనల్ (ఆర్‌పీ) అనుమతించారు. దీనిపై ఎన్‌సీఎల్‌టీ బెంచ్‌కు నివేదిక సమర్పించగా, బెంచ్ అందుకు అంగీకారం తెలిపింది. రుణాలు చెల్లించలేకపోయిన మంజీరా కన్‌స్ట్రక్షన్స్‌పై దివాలా పరిష్కార ప్రక్రియ చేపట్టాలని కొంతకాలం క్రితం కేటలిస్ట్ ట్రస్టీషిప్ లిమిటెడ్ అనే సంస్థ ఐబీసీ సెక్షన్–7 కింద ఎన్‌సీఎల్‌టీలో ఫిర్యాదు చేసింది. దీన్ని అనుమతించిన ట్రిబ్యునల్.. దివాలా ప్రక్రియ ప్రారంభించింది. రిజల్యూషన్ ప్రొఫెషనల్ (ఆర్‌పీ)గా టీరేంద్ర కుమార్ అగర్వాల్‌ను నియమించింది. చర్చల తర్వాత వాసవి, లులు, బొమ్మిడాల, కల్యాణ్ టోల్ సహా 8 కంపెనీలు సవరించిన రిజల్యూషన్ ప్లాన్‌లను సమర్పించాయి. అన్ని అంశాలు పరిశీలించిన తర్వాత లులు ప్లాన్ అనుమతి పొందింది.

నా బ్రాండ్ యంగ్ ఇండియా

▶ మొదటి పేజీ తరువాయి

క్రియేట్ చేసేలా తయారు చేయాలి. కావాల్సిన నిధులు, అనుమతులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కేజీ నుంచి పీజీ వరకు తీర్చిదిద్దుకోండి. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ఎన్నో కంపెనీలకు పోలీసులు రక్షణ కల్పిస్తున్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కింద కొన్ని నిధులను అందించాల్సిన బాధ్యత ఆ సంస్థలకు ఉంది. పోలీస్ స్కూల్ కోసం రూ.100 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసుకోవాలని డీజీపీని ఆదేశిస్తున్నా. ఇందుకు అవసరమైన అనుమతులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది..' అని సీఎం చెప్పారు.

రైతు బాంధవుడిగా వైఎస్సార్ గుర్తుంటారు

'దేశ చరిత్రలో ఎంతోమంది ప్రధానులు, ముఖ్యమంత్రులు అయ్యారు. కానీ అందులో కొద్దిమంది మాత్రమే చరిత్రలో గుర్తుండిపోయారు. ఆ కొద్దిమంది తీసుకున్న నిర్ణయాలు చరిత్రను మలుపు తిప్పాయి. జలయజ్ఞం, వ్యవసాయాన్ని ప్రాధాన్యతగా తీసుకుని ఉచిత కరెంటు ఇవ్వడం, సాగునీటి ప్రాజెక్టులు నిర్మించడం మొదలు రైతుల సమస్యలను చర్చించినప్పుడు రైతు బాంధవుడిగా డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గుర్తుకు వస్తారు. రూ.2 కిలో బియ్యంతో ఎన్టీఆర్ ప్రతి పేదవాడి మనసులో స్థానం సంపాదించుకున్నారు. చంద్రబాబు హైదరాబాద్‌లో ఐటీని అభివృద్ధి చేశారు. సంస్కరణలతో భారతదేశాన్ని ప్రపంచంతో పోటీపడే స్థాయిలో నిలిపిన ఘనత తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావుది. ఆనాడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చారు. ఆయన దార్శనికతతోనే మన దేశం ప్రపంచ దేశాలతో పోటీ పడే స్థాయికి చేరింది.



పాఠశాలలో బోధన పరికరాలను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

అయితే తెలంగాణ ప్రదాతలం, ఉద్యమకారులమని కొందరు బ్రాండ్‌లు క్లెయిమ్ చేసుకుంటుంటారు. వారి గురించి నేను చర్చించను..' అని రేవంత్ పేర్కొన్నారు.

మన విద్యా విధానం ప్రాథమిక స్థాయిలోనే లోపం

'ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రీ స్కూల్ విధానం ప్రవేశపెట్టాలనే ఆలోచనలో ఉన్నాం. రాష్ట్రంలో 29 వేల ప్రభుత్వ స్కూళ్లు ఉంటే, వాటిల్లో 18.50 లక్షల మంది పిల్లలు చదువుతున్నారు. ప్రైవేటులో 11,500 స్కూళ్లు ఉంటే వాటిల్లో 30 లక్షల మంది విద్యార్థులున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ అర్హతలు ఉన్న వారు పని చేస్తున్నప్పటికీ విద్యార్థులు చేరడం లేదంటే మన విద్యా విధానంలో ఉన్న లోపాలు ఏమిటనే ఆలోచన చేశాం. ప్రాథమిక స్థాయిల్లోనే అస్పష్టత ఉందనే విషయం గమనించాం. నిపుణులతో చర్చించిన తర్వాత ప్రభుత్వ బడుల్లోనూ ప్రైవేటు పాఠశాలల మాదిరిగా ప్రీస్కూల్ విధానం ప్రవేశపెట్టాలని, నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ అందుబాటులోకి తేవాలనే ఆలోచన చేశాం..' అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

ప్రతి విద్యార్థికీ ఉద్యోగ భద్రత

'విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు పెద్ద పెద్ద కంపెనీల భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసుకున్నాం. ఈ వర్సిటీలో చేరే ప్రతి విద్యార్థికి ఉద్యోగ భద్రత లభిస్తుంది. ఈ యూనివర్సిటీతో పాటు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ అకాడమీ మొదలు పెట్టాం. ఇవి కాకుండా 58 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను చేపట్టాం..' అని రేవంత్ వివరించారు.

సామాజిక బాధ్యత కింద విరాళాలు

పోలీస్ స్కూల్‌కు సీఎస్‌ఆర్ కింద ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి రూ.30 లక్షలు, ఏసీ రెడ్డి రూ.కోటి, జీజీఎస్ ఇంజనీరింగ్‌కు చెందిన ప్రవీణ్‌రెడ్డి రూ. 50 లక్షలు, తేజస్వి డెవలపర్స్‌కు చెందిన నిరంజన్ రూ.50 లక్షలు విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, కాలే యాదయ్య, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, సీఐడీ డీజీ శిఖాగోయల్, జైళ్లశాఖ డీజీ సౌమ్యా మిశ్రా, గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీ స్టీఫెన్ రవీంద్ర, ఇతర పోలీస్, జైళ్ల శాఖల అధికారులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

పోలీసులకు ఎంత చేసినా తక్కువే: మంత్రి శ్రీధర్‌బాబు

దేశంలో ఎక్కడా లేని విధంగా పోలీసుల పిల్లల కోసం ప్రత్యేకంగా పాఠశాల ఏర్పాటు చేసిన ఘనత తెలంగాణకే దక్కుతుందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ప్రజల ప్రశాంత జీవనం కోసం ఎన్నో త్యాగాలు చేసే పోలీసుల కోసం ఎంత చేసినా తక్కువే అని అన్నారు. డీజీపీ జితేందర్ మాట్లాడుతూ.. పోలీసుల పిల్లల పరి స్థితులు అర్థం చేసుకుని ప్రత్యేకంగా పాఠశా లను ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి పోలీస్ శాఖ తరఫున ధన్యవాదాలు తెలిపారు. హైదరా బాద్ సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ..ఈ స్కూల్‌లో ఫీజులు ఎక్కువగా ఉన్నాయన్న అంశంపై దృష్టి పెట్టామని, తగ్గింపుపై త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిపారు.

విద్యార్థులకు కిట్లు: స్కూలు విద్యార్థులకు యూనిఫాం, ఇతర వస్తువులు ఉన్న కిట్లను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు అందజేశారు. పోలీస్ స్కూల్ ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతగా పోలీస్ అధికారులు, సిబ్బంది తమ క్యాప్‌లను చేతపట్టుకుని ఊపుతూ ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

పూలే బాట స్ఫూర్తిదాయకం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి,హైదరాబాద్: వెనుకబడిన వర్గాలు, దళిత జనోద్ధరణకు మహాత్మా జ్యోతిబా పూలే ఎంచుకున్న బాట, సమాజ శ్రేయస్సును కాంక్షించే వారందరికీ స్ఫూర్తిగా నిలుస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పూలే స్ఫూర్తితోనే రాష్ట్ర ప్రభుత్వం అనేక వినూత్న ప్రజాప్రయోజన కార్యక్రమాలు చేపట్టిందని, ఆయన అనుసరించిన మార్గం అందరికీ ఆచరణీయమని పేర్కొన్నారు. శుక్రవారం పూలే 198వ జయంతి సందర్భంగా ఆయన త్యాగాలు, సమాజానికి చేసిన సేవలను సీఎం స్మరించుకున్నారు. సమానత్వం ఉండాలని జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియాడారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రగతి భవన్‌కు మహాత్మా జ్యోతిబా పూలే పేరు పెట్టి ప్రజాభవన్‌గా మార్చామని గుర్తు చేశారు.

గల్ఫ్ కార్మికుల సమస్యల అధ్యయనానికి సలహా కమిటీ

చైర్మన్‌గా బీఎం వినోద్‌కుమార్, వైస్ చైర్మన్‌గా మంద భీంరెడ్డి



వినోద్‌కుమార్



భీంరెడ్డి

సాక్షి, హైదరాబాద్: గల్ఫ్ కార్మికుల సమస్యలపై అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సలహా కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా మాజీ ఐఎఫ్‌ఎస్ అధికారి డాక్టర్ బీఎం వినోద్‌కుమార్, వైస్ చైర్మన్‌గా మంద భీంరెడ్డిలను నియమించింది. సభ్యులుగా ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం, డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, టీజీఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్‌కుమార్‌తో పాటు కార్మిక సంఘాల నాయకులు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, డా.లిజీ జోసెఫ్, చెన్నమనేని శ్రీనివాసరావు, కొట్టాల సత్యం నారగౌడ్, గుగ్గిల్ల రవీందర్, నంగి దేవేందర్, స్వదేశ్ పర్కిపండ్ల నియమితులయ్యారు. ఈ కమిటీ సభ్య కార్యదర్శిగా సాధారణ పరిపాలన విభాగం సంయుక్త కార్యదర్శి (ప్రొటోకాల్)ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ రెండేళ్ల పాటు కొనసాగనుంది. గల్ఫ్ దేశాలైన బహ్రెయిన్, కువైట్, ఇరాక్, ఒమన్, ఖతర్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల్లోని తెలంగాణ రాష్ట్రానికి చెందిన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంది.

ఏడాది క్రితం సీఎం హామీతో...

గల్ఫ్ దేశాల్లోని కార్మిక సంఘాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతేడాది 16న ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ సమగ్ర ఎన్నారై పాలసీని ప్రభుత్వం రూపొందిస్తుందన్నారు. ఇందులో భాగంగా సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో సీఎం ఇచ్చిన హామీలో భాగంగా ప్రత్యేకంగా సలహా కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. గల్ఫ్ దేశాల్లో వలస కార్మికులకు అందుతున్న సంక్షేమ కార్యక్రమాలను ఈ కమిటీ పరిశీలించనుంది. ప్రవాసీ కార్మికుల సమస్యలను అర్థం చేసుకోవడానికి, పరిష్కారాలను కనుగొనడానికి ఈ కమిటీ గల్ఫ్ దేశాలను కూడా సందర్శించనుంది. ఆ తర్వాత సమగ్ర నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తుంది. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా... సమగ్ర ఎన్నారై పాలసీ రూపకల్పన జరగనుంది.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

భట్టికి ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి వినతి



సాక్షి, హైదరాబాద్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే చెల్లించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు.. ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు డిప్యూటీ సీఎంను అతని క్యాంపు కార్యాలయంలో గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ అంశంపై భట్టి సానుకూలంగా స్పందించారని, ఇకనుంచి ప్రతి నెలా బిల్లులు చెల్లించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్టు శ్రీపాల్ పేర్కొన్నారు. భట్టిని కలిసిన వారిలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్షుడు గుండు లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

పీఆర్ ఆర్డీలో పునరావాసం

- పీఆర్ ఈఎన్‌సీ కనకరత్నంకు ఏడాది పొడిగింపు...
- స్త్రీ నిధి ఎండీ విద్యాసాగర్ రెడ్డికి ఏడాది...
- మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డికి అక్టోబర్ వరకు..

సాక్షి, హైదరాబాద్: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి (పీఆర్ ఆర్డీ) శాఖలో పాతకాపులకు పునరావాసం కల్పించారనే విమర్శలొస్తున్నాయి. గతంలోనే రిటైర్ అయ్యి మళ్లీ అపాయింట్ అయిన పలువురు అధికారులను ఇటీవలే తొలగించిన విషయం తెలిసిందే. ఇలా తొలగించిన వారిలో కొందరిని మళ్లీ కొనసాగిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ శాఖలోని పలు కీలక పోస్టుల్లో కొన్నేళ్లుగా రిటైరైన ఉన్నతాధికారులే కొనసాగుతుండగా... వారి సర్వీసులను రద్దుచేయాలనే సీఎస్ ఆదేశాలతో మిషన్ భగీరథ ఈఎన్‌సీగా కృపాకర్‌రెడ్డి, స్టేట్ ఎలక్షన్ కమిషన్ కార్యదర్శిగా అశోక్ కుమార్, స్త్రీ నిధి సంస్థ ఎండీ విద్యాసాగర్ రెడ్డిలను రీ అపాయింట్‌మెంట్ సర్వీసు నుంచి తొలగించారు. వీరితోపాటు మార్చి 31తో పంచాయతీ రాజ్ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) కనకరత్నం కూడా పదవీ విరమణ చేశారు. ఈ విభాగాలకు సంబంధించి కీలక బాధ్యతల్లో ఉన్న వీరిని ఉపసంహరించినా, ఆయా విభాగాల్లో తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందనే విమర్శలు వచ్చాయి. కనీసం ఆయా పోస్టులకు ఇన్‌చార్జీలను అయినా నియమించి ఉంటే సమస్య ఇంత తీవ్రంగా మారి ఉండేది కాదనే అభిప్రాయం వ్యక్తమైంది. అయితే సీఎస్ ఇచ్చిన ఆదేశాల్లోనే... అవసరాన్ని బట్టి ఆయా అధికారులను 'రీ అపాయింట్' చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పీఆర్ ఈఎన్‌సీగా కనకరత్నం సర్వీస్‌ను ఏడాది పొడిగించారు. మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి రీఅపాయింట్‌మెంట్ అయినప్పుడే 2025 అక్టోబర్ వరకు గడువు ఉండటంతో ఆయన సర్వీసును కూడా అప్పటిదాకా, స్త్రీ నిధి సంస్థ ఎండీ విద్యాసాగర్‌రెడ్డి సర్వీస్‌ను మరో ఏడాది పొడిగించారు.

ఫార్మాకు ట్రంప్ భయం

- సుంకాలు విధిస్తే కష్టాలు తప్పవంటున్న పరిశ్రమ వర్గాలు
- సంగారెడ్డి జిల్లాలోనే సుమారు 350కి పైగా ఫార్మా కంపెనీలు
- ఏటా రూ.22 వేల కోట్ల విలువైన ఎగుమతులు
- ఎగుమతుల్లో అత్యధికం అమెరికాకే



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పెంపు నిర్ణయాలు రాష్ట్రంలో ఫార్మా పరిశ్రమను వణికిస్తున్నాయి. ఫార్మా ఉత్పత్తులపైనా భారీగా సుంకాలు విధిస్తామన్న ట్రంప్ ప్రకటనతో ఈ పరిశ్రమ వర్గాల్లో కలకలం రేగింది. రాష్ట్రంలో అత్యధికంగా ఫార్మా కంపెనీలు సంగారెడ్డి జిల్లాలో ఉన్నాయి. మల్టీ నేషనల్ కంపెనీలకు చెందిన యూనిట్లు ఇక్కడ ఉత్పత్తులు కొనసాగిస్తున్నాయి. బల్క్ డ్రగ్ పరిశ్రమలు కూడా జిల్లాలో ఉన్నాయి. సంగారెడ్డి జిల్లాలోనే సుమారు 350 పైచిలుకు ఫార్మా, బల్క్‌డ్రగ్ పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల ఉత్పత్తులు వివిధ దేశాలకు ఎగుమతి అవుతుంటాయి. సుమారు 80 శాతం ఉత్పత్తులను అమెరికానే దిగుమతి చేసుకుంటోందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఇప్పుడు ఫార్మా ఉత్పత్తులపై భారీగా సుంకాలు విధిస్తామని ట్రంప్ ప్రకటించడంతో ఉత్పత్తిపై ప్రభావం పడుతుందని, తద్వారా పరిశ్రమల్లో పనిచేసే సుమారు 20 వేల మంది కార్మికులు, ఉద్యోగుల ఉపాధి దెబ్బ తింటుందని అంచనా వేస్తున్నారు. అయితే చైనా వంటి దేశాలతో పోల్చితే మనదేశ ఉత్పత్తులపై విధిస్తున్న సుంకాలు తక్కువేననే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. సుంకాలు పెరిగితే లాభాలు తగ్గుతాయని ఓ కంపెనీలోని హెచ్‌ఆర్ విభాగం ఉన్నతాధికారి తెలిపారు.

మల్టీనేషనల్ కంపెనీల యూనిట్లు

సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో మల్టీనేషనల్ కంపెనీల యూనిట్లు అధికంగా ఉన్నాయి. ప్రధానంగా పాశమైలారం, ఖాజీపల్లి వంటి పారిశ్రామిక వాడల్లో ఎక్కువగా ఈ పరిశ్రమలు ఉన్నాయి. హానర్, గ్లెన్‌మార్క్, గ్రాన్యూల్, న్యూలాండ్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, హెటిరో, ఎంఎస్‌ఎన్, దివీస్, సాయిల్యాబ్ సైన్సెస్, జీవీకే వంటి కంపెనీల యూనిట్లు ఉన్నాయి. ఈ పరిశ్రమల్లో ప్రధానంగా బీపీ, డయాబెటిక్, గుండె జబ్బులు, గ్యాస్ట్రో, మైగ్రేన్, క్యాన్సర్, హెచ్ఐవీ రోగాలకు సంబంధించిన ఔషధాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ మందులను దిగుమతి చేసుకునే దేశాల్లో అమెరికానే ముందు వరుసలో ఉంది.

రూ.22 వేల కోట్ల ఎగుమతులు

ఒక్క సంగారెడ్డి జిల్లా నుంచే వివిధ దేశాలకు ఎగుమతి అవుతున్న ఫార్మా వస్తు, సేవల విలువ సుమారు రూ.22 వేల కోట్లు ఉంటుందని అంచనా. 2023–24లో రూ.21,934 కోట్ల విలువైన ఎగుమతులు జరిపినట్లు రాష్ట్ర ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో 87 శాతం ఫార్మా ఉత్పత్తులే. ఈ ఫార్మా ఉత్పత్తులను 70 శాతానికి పైగా అమెరికానే దిగుమతి చేసుకుంటుందని పరిశ్రమల వర్గాలు చెబుతున్నాయి. సంగారెడ్డి తర్వాత మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లో ఫార్మా పరిశ్రమలు అధికంగా ఉన్నాయి. ఈ జిల్లా నుంచి 2023–24లో వివిధ దేశాలకు రూ.25,444 కోట్ల విలువైన ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. ఇందులో 60 శాతం ఫార్మా ఉత్పత్తులే. అవి కూడా అమెరికానే ఎక్కువగా దిగుమతి చేసుకుందని సమాచారం.

ప్రతి ప్రాణీ మృత్యువును చవిచూస్తుంది. మరియు మేము మీ అందరినీ, మంచి మరియు చెడు స్థితులకు గురిచేసి పరీక్షిస్తాము. మరియు మీరందరూ మా వైపునకే మరలింపబడతారు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 11 ఏప్రిల్ 2025

నిజాయితీపరులకు న్యాయమెలా?

షడ్రసోపేత విందు సాగుతుండగా హఠాత్తుగా ఎవరోవచ్చి పంక్తి నుంచి అమర్యాదగా మెడపట్టి గెంటేస్తే? కాళ్లకింది నేల ఒక్కసారిగా బద్దలై మింగేస్తే? పశ్చిమబెంగాల్‌లో పదేళ్లుగా కొలువులు చేస్తున్న వేలాది ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది స్థితి అలాంటిదే. 2016లో స్కూల్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) ద్వారా ఎంపికైన మొత్తం 25,752 మంది టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాలు చెల్లబోవని, వారిని తక్షణం తొలగించాలని గత వారం సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుతో వారంతా రోడ్డున పడ్డారు. కేన్సర్ బారినపడిన ఒకే ఒక్క ఉపాధ్యాయురాలిని మాత్రం ధర్మాసనం మినహాయించింది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మొదలుకొని అందరూ ఉద్యోగాలు కోల్పోయినవారిపై సానుభూతి ప్రకటిస్తున్నారు. మమత అయితే తీర్పును తప్పుబట్టారు. ఉద్యోగాలు కోల్పోయినవారు ఎప్పటిలాగే విధి నిర్వహణ చేయొచ్చని, వేరే ప్రభుత్వ ఉద్యోగాల్లో సర్దుతామని బింకంగా ప్రకటించారు. వారికోసం జైలుకు పోవటానికీ సిద్ధమేనన్నారు.

రేపటి సమాజం తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందంటారు. సగటు విద్యార్థులను సమున్నతంగా తీర్చిదిద్దటం, వారి సృజనాత్మకతను వెలికితీసి మెరికల్లా మార్చటం, పటుతర శక్తిగా మలచటం ఉపాధ్యాయులు చేసే పని. ఇంతటి మహత్కార్యాన్ని నిర్వర్తించాల్సినవారు కాస్తా ముడుపులు సమర్పించుకుని దొడ్డిదారిన వచ్చిచేరారంటే అంతకన్నా దారుణం మరొకటుండదు. ఈ రిక్రూట్‌మెంట్‌పై ఆ రోజుల్లోనే తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. అభ్యర్థుల ర్యాంకులు తలకిందులు చేశారని, అధిక మార్కులు వచ్చినవారికి అన్యాయం జరిగిందని, అసలు మెరిట్ లిస్టులోగానీ, వెయిటింగ్ లిస్టులోగానీ లేనివారు చివరిలో విజేతల జాబితాకెక్కారని, మెరుగైన మార్కులతో ఉత్తీర్ణులై ఇంటర్వ్యూలో సైతం నెగ్గినవారికి ఉద్యోగాలు నిరాకరించారని ఆ ఆరోపణల సారాంశం. అయినా ప్రభుత్వం కిమ్మనలేదు. దీనిపై హైకోర్టు నియమించిన విశ్రాంత న్యాయమూర్తి ఆధ్వర్యంలోని నలుగురు సభ్యుల కమిటీ 2021లో ఎన్నో అవకతవకలు బయటపెట్టింది. అభ్యర్థుల ఓఎంఆర్ షీట్‌ల మూల్యాంకనానికి నియమించిన సంస్థ దాన్ని మరో సంస్థకు అప్పగించటమూ వెల్లడైంది. సీబీఐ దర్యాప్తులో కీలక సాక్ష్యాధారాలున్న మూడు హార్డ్ డిస్క్‌లు స్వాధీనమయ్యాయి. అయిదుగురు అరెస్టయ్యారు. అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లు గల్లంతయినట్టు కనుక్కుంది. తమ అవకతవకలు కప్పిపుచ్చేందుకు నిబంధనల సాకుచూపి 2019లోనే వాటిని ధ్వంసం చేసినట్టు నిర్ధారణైంది. ఆ సంస్థ నివేదిక ఆధారంగా మొత్తం రిక్రూట్‌మెంట్ ప్రక్రియను రద్దుచేస్తూ, తిరిగి నోటిఫికేషన్ ఇచ్చి నియామకాలు చేయాలని ఆదేశిస్తూ నిరుడు ఏప్రిల్‌లో కలకత్తా హైకోర్టు తీర్పునిచ్చింది. దీనిపై మొదట్లో సుప్రీంకోర్టు స్టే ఇచ్చినా హైకోర్టు తీర్పునే సమర్థిస్తూ ఈ నెల 3న తీర్పునిచ్చింది. మొత్తం రిక్రూట్ మెంట్ రద్దు చేయటం భావ్యంకాదని, ఇందులో నిజాయితీగా ఎంపికైనవారూ ఉన్నారని ప్రభుత్వం చేసిన వాదనతో సుప్రీం ఏకీభవించలేదు. ఓఎంఆర్ షీట్లు లేకుండా ఆ సంగతెలా నిర్ధారిస్తామంది.

హఠాత్తుగా ఉద్యోగాల నుంచి గెంటేయటం బాధాకరమనటంలో సందేహం లేదు. ఎందుకంటే ఎంపికైన వారంతా అవినీతిపరులు కాదు. వారి సంఖ్య 5,300 మించివుండదంటున్నారు. ఇలాంటి ఎంపికల్లో మొత్తం ప్రక్రియను భ్రష్టుపట్టించటం ఎంతటి అవినీతిపరులకైనా అసాధ్యం. కానీ సరైన మార్గంలో వచ్చినవారెవరో తెలిసేదెలా? ఇందుకు ప్రధానంగా నిందించాల్సింది ప్రభుత్వాన్నే. ఈ రిక్రూట్‌మెంట్‌ను సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలు చేసిన సీపీఎం నేత, న్యాయవాది వికాస్‌రంజన్ భట్టాచార్యకు నోబెల్ బహుమతి ఇవ్వాలని మమత వ్యంగ్యంగా వ్యాఖ్యానించటం సరేగానీ... తన వంతు ఆమె చేసిందేమిటి? ఒకపక్క ఆరోపణలొస్తున్నప్పుడు ఓఎంఆర్ షీట్లు భద్రపరచటం వంటి కనీస చర్యనైనా ఎందుకు తీసుకోలేకపోయారు? ఉపద్రవం ముంచుకొస్తున్నదని తెలిసినా నిమ్మకు నీరెత్తినట్టు ఎలావున్నారు? ఓఎంఆర్ షీట్లుంటే అక్రమార్కుల నిర్ధారణ సులభమయ్యేది. నిజాయితీపరులకు రక్షణ దొరికేది. అయినా తమ వద్ద కచ్చితంగా నిర్ధారించగల ఇతరేతర సాక్ష్యాలున్నాయని ఉన్నతాధికారులంటున్నారు.

ఉద్యోగాలు కోల్పోయిన టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ఆగ్రహం అర్థం చేసుకోదగిందే. వారు ఇప్పటికే తమకంటూ గూడు నిర్మించుకుని వుంటారు. నెలవారీ వాయిదాల్లో చెల్లించేలా రుణాలు తీసుకుంటారు. అనారోగ్యం వల్లనో, మరే ఇతర కారణంతోనో దొరికినచోట అప్పుచేస్తారు. ఈ రుణవలయం నుంచి బయటపడేదెలా? అందరూ దొంగలు కాదు. అయినా కొలువు పోయింది... జీవనాధారం మాయమైంది, కానీ అదొక్కటే సమస్య కాదు తమ శిష్యుల ముందు చులకనైపోయారు. అవినీతిపరులన్న ముద్రపడింది. దీన్ని చాలామంది జీర్ణించుకోలేకపోతున్నారు. విద్యార్థులది మరో సమస్య. వార్షిక పరీక్షలు దగ్గర పడుతుండగా గురువులు లేక పోవటం, కొన్నిచోట్ల సిబ్బంది కొరతతో యూనిట్ పరీక్షలు వాయిదా పడటం వారిని కలచి వేస్తోంది. అస్తవ్యస్త పాలనకు బెంగాల్ చిరునామాగా మారింది. నిరుడు ఆగస్టులో ఆర్‌జీ కార్ ఆస్పత్రిలో ఒక మహిళా వైద్యురాలిపై అత్యాచార ఉదంతంలో సైతం స్పందన అంతంతమాత్రం. చివరకు సుప్రీంకోర్టు జోక్యం తప్పలేదు. ఇప్పుడు ఎస్ఎస్‌సీ స్కాంలోనూ అదే నిర్వాకం. ప్రస్తుతం నిజంగా అర్హులైన ఉపాధ్యాయులను గుర్తించి వారికి న్యాయం చేసేందుకు ఏయే అవకాశాలున్నాయో చూడటం, తమ దగ్గరున్న సాక్ష్యాధారాలివ్వటం తప్ప మరే మార్గమూ లేదు. దానికి బదులు కోర్టుల్ని నిందించి, మరొకరిని తప్పు బట్టి ప్రయోజనం లేదని మమతా బెనర్జీ గ్రహించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.చతుర్దశి రా.2.34 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** ఉత్తర ప.2.54 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** రా.12.04 నుండి 1.51 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.17 నుండి 9.06 వరకు, తదుపరి ప.12.23 నుండి 1.14 వరకు, **అమృత ఘడియలు:** ఉ.7.05 నుండి 8.51 వరకు.

సూర్యోదయం : 5.50
సూర్యాస్తమయం: 6.10
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

ధ్వంసరచన

విశ్లేషణ



సుష్మా రామచంద్రన్

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దూసిన వాణిజ్య సుంకాల కత్తి పోట్లకు ఇండియా సహా ప్రపంచ స్టాక్ మార్కెట్స్ నెత్తురోడాయి. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ అకస్మాత్తుగా అనిశ్చితి ఊబిలో కూరుకుపోయింది. చైనా, కెనడా వెంటవెంటనే తొలివిడత ప్రతీకార సుంకాలను ప్రకటించాయి. దీంతో ట్రేడ్ వార్ అనివార్యం అనిపిస్తోంది. ఈ యుద్ధరంగంలో దూకేందుకు తామూ సిద్ధమే నంటూ యూరోపియన్ యూనియన్ హెచ్చరిక జారీ చేసింది. ఇతర దేశాలు అమెరికా నూతన విధానం పట్ల ఆగ్రహావేశాలు వ్యక్తం చేశాయి. ఈ వాణిజ్య ఉద్రిక్తతల తక్షణ ప్రభావంతో నాస్‌డాక్ ఇండెక్స్ కుప్పకూలింది. ఇతర ఏషియన్ సూచీలూ పతనమయ్యాయి. చమురు ధర బ్యారెల్ 64 డాలర్లకు దిగివచ్చింది.

ఆభరణాలకు దెబ్బ – వస్త్రాలకు మేలు

ఇండియా ప్రస్తుతానికి దీనిపై ఎలాంటి స్పందనా వ్యక్తం చేయలేదు. దీనిక్కారణం, ఇప్పటికే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం సంప్రదింపులు ప్రారంభమై ఉండటమే. గతంలో ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) వేదికపై ధనిక దేశాల ఒత్తిళ్లను అధిగమించి ఇండియా వ్యవసాయ రంగం కోసం రాయితీలను సాధించింది. ఇప్పుడూ అమెరికాతో విజయవంతంగా ఒప్పందం కుదురుతుందని నిపుణుల అంచనా. అలాగే, ఇక్కడ తయారు కాని వస్తువులపై విధించే నిర్హేతుకమైన అధిక సుంకాలకు ఒప్పందంలో అంగీకరించవచ్చు. బదులుగా, ప్రాసెస్డ్ ఫుడ్స్, సాగర ఉత్పత్తుల ఎగుమతిపై నాన్–ట్యారిఫ్ ఆంక్షలు సరళీకరించాలని కోరుతుంది. స్థానిక సర్వర్లలో డేటా నిల్వ (డేటా లోకలైజేషన్), మేధాసంపత్తి హక్కులు వంటి అంశాలు అంత తేలిగ్గా పరిష్కారం కావు. రాజీ ఫార్ములాలే శరణ్యం అవుతాయి.

ఇండియా వాణిజ్యపరంగా తన పరిశ్రమలను, వ్యవసాయాన్ని కాపాడుకునేందుకు స్వీయ రక్షణ విధానాలను అవలంబిస్తోందని ట్రంప్ పదే పదే విమర్శిస్తున్నప్పటికీ, ఆయన హయాంలో ఉభయ దేశాల నడుమ వ్యూహాత్మక సంబంధాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది. రక్షణ బంధం బలపరచుకోడానికి రెండు దేశాలూ సిద్ధంగా ఉన్నాయి. ఏమైనప్పటికీ, కొత్త సుంకాలు కొన్ని భారతీయ పరిశ్రమలకు స్వల్ప కాలంలో అశని పాతంగా పరిణమిస్తాయి. వజ్రాలు – ఆభరణాల పరిశ్రమనే తీసుకుందాం. ఇది 2023–24 ఆర్థిక సంవత్సరంలో 33 బిలియన్ డాలర్ల ఎగుమతులు చేయగా, అందులో మూడో వంతు ఒక్క అమెరికాకే సరఫరా అయ్యాయి. ఈ పరిశ్రమ ప్రధానంగా చిన్న, మధ్య తరహా సంస్థలతో కూడుకుని ఉంది. దాదాపు 50 లక్షల మంది (పూర్తి నైపుణ్యం ఉన్న, ఒకమాదిరి నైపుణ్యం ఉన్న) కార్మికులు జీవనోపాధి కోసం వీటిపై ఆధారపడుతున్నారు. కోవిడ్–19 మహమ్మారి సృష్టించిన సంక్షోభ కాలంలో వీరు ఉపాధి కోల్పోయి గ్రామాలకు తరలి పోయారు. ఇప్పుడు మళ్ళీ అమెరికా ఆర్డర్లు తగ్గిపోయి అలాంటి దుఃస్థితి పునరావృతం అవుతుందన్న భయాలు వ్యాపిస్తున్నాయి.

అయితే, అమెరికా వాణిజ్య సుంకాల పెంపు వల్ల ఇండియాకు అంతా ప్రతికూలమే అనుకోనక్కర్లేదు. మారిన పరిస్థితుల్లో ఇండియా దుస్తుల ఎగుమతి ధరలు పోటీ దేశాల్లో కంటే తక్కువగా ఉంటాయని వస్త్ర ఉత్పత్తుల కేంద్రమైన తిరుప్పూరు (తమిళనాడు) నుంచి వార్తలు వస్తున్నాయి. దీంతో కొనుగోలు దారులు ఇప్పటికే ఇండియా మీద దృష్టి సారించారు. కాబట్టి, భారతీయ వస్త్ర ఉత్పత్తులకు ఆర్డర్లు భారీగా పెరిగే వీలుంది.

అమెరికాకే నష్టం

సుంకాల పెంపు సంక్షోభం ఫలితంగా ఇతర ప్రపంచ దేశాల కంటే యూఎస్ ఆర్థిక వ్యవస్థే అధికంగా నష్టపోతుంది. అమెరికాలోనూ, ప్రపంచవ్యాప్తంగానూ స్టాక్ మార్కెట్లు కుప్పకూలిన తీరు రానున్న దుర్భర స్థితికి సంకేతం. అమెరికాలో ఆర్థిక మాంద్యం వస్తుందని ఇంతకు ముందునుంచే అంటున్నారు. సుంకాల పెంపు వల్ల ఈ రిస్క్ అనూహ్యంగా పెరుగుతుందని రేటింగ్ ఏజెన్సీలు అంచనా వేస్తున్నాయి. జేపీ మోర్గాన్ ప్రకారం, 'అమెరికా విచ్ఛిన్నకర రాజకీయాల' ఫలితంగా అక్కడ ఆర్థిక మాంద్యం రిస్క్ 40 నుంచి 60 శాతానికి పెరిగింది. కొత్త సుంకాల వల్ల యూఎస్ ఆర్థిక వ్యవస్థపై 700 బిలియన్ డాలర్ల భారం పడుతుంది. ఇది ఇంకా ఎక్కువే ఉంటుంది. ఈ లెక్కలు చైనా 34 శాతం ప్రతీకార సుంకాలు విధించక ముందు వేసినవి!

ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ మాంద్యంలో కూరుకుపోతే అది ఇండియా సహా అన్ని దేశాలకూ దుర్వార్తే! దీంతో, దేశం గడచిన సంవత్సరాల్లో సాధించిన వృద్ధి తగ్గిపోతుంది. 2025–26కి ఇండియా వృద్ధిరేటు 6.3 నుంచి 6.1కి క్షీణిస్తుందని 'గోల్డ్‌మన్ సాక్స్' ఇప్పటికే అంచనాలు సవరించింది.

అంతర్జాతీయంగా వాణిజ్య సుంకాలను హేతుబద్ధీకరించడానికి రెండో ప్రపంచ యుద్ధం ముగిసి నప్పటి నుంచీ ప్రయత్నాలు మొదలై, దశాబ్దాల పాటు సంప్రతింపులు, చర్చలు జరిగి ఎట్టకేలకు ఒక బహుళ పక్ష వేదిక ఏర్పడింది. ఈ ప్రపంచ ఆర్థిక పాలనలో పేద దేశాల మాటకు విలువ కల్పించిన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) ఇప్పుడు విధ్వంసమైపోతోంది.

ట్రేడ్ వార్ ప్రభావం ఇండియాపై అనుకున్న దానికంటే తీవ్రంగానే ఉంటుంది. మరి దీనికి పరిష్కారం ఏమిటి? యూరోపియన్ యూనియన్ వంటి బడా వాణిజ్య భాగస్వాములతో ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవాలి. అదే సమయంలో, ప్రతీకార సుంకాల నేపథ్యంలో ఏ దేశాలు ఎగుమతులకు అనువైనవో గుర్తించాలి. ఈ ప్రపంచ వాణిజ్య యుద్ధాల్లో అంతిమంగా ఇండియా నష్టపోతుందా, ప్రయోజనం పొందుతుందా అనేది ఇప్పుడప్పుడే తేలదు. రానున్న రోజుల్లో ఈ గొడవ సద్దుమణిగిన తర్వాతే వాస్తవిక అంచనా సాధ్యమవుతుంది.

వ్యాసకర్త సీనియర్ ఫైనాన్షియల్ జర్నలిస్ట్ । ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

అమెరికా అధ్యక్షుడు ట్రంప్: వివిధ దేశాలపై విధించిన ప్రతి సుంకాలకు 90 రోజుల విరామం ఇస్తున్నట్టు అమెరికా ప్రకటించినప్పటికీ, ఈ సంక్షోభం ఇప్పుడప్పుడే సమసిపోయేది కాదు.



> ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన అమెరికా మాంద్యంలో కూరుకుపోతే నిజానికి అది ఇండియా సహా అన్ని దేశాలకూ దుర్వార్తే. 2025–26కు ఇండియా వృద్ధిరేటు 6.3 నుంచి 6.1 శాతానికి క్షీణిస్తుందని 'గోల్డ్‌మన్ సాక్స్' ఇప్పటికే అంచనాలు సవరించింది.

> ఒక దేశం దాని సుంకాలను తగ్గించినప్పటికీ, ఆ దేశంతో అమెరికా వాణిజ్య లోటు తగ్గదు. ఎందుకంటే ఆ దేశానికి అమెరికా మరిన్ని ఎగుమతి చేయాలి. అంటే, ముందుగా వస్తువులను ఉత్పత్తి చేయాలి. అది కూడా ఇతర దేశాలకు ఆసక్తి కలిగించే ధరకు ఉత్పత్తి చేయాలి.

మూర్ఖత్వం

విశ్లేషణ



వివేక్ కౌల్

1. 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' మద్దతుదారులలో చాలామంది, బహుశా ట్రంప్ కూడా, అమెరికాకు వస్తువులను ఎగుమతి చేసే దేశాలే అధిక సుంకాలను చెల్లిస్తాయని నమ్ముతున్నట్లుంది. వాస్తవం ఏమిటంటే, సుంకాలను దిగుమతి దారులు చెల్లిస్తారు. వారు ఆ ఖర్చును వినియోగదారులకు, ఈ సందర్భంలో, అమెరికన్ ప్రజలకు బదిలీ చేస్తారు.

2. సుంకాల విధింపు అనేది చర్చల వ్యూహంలో భాగమా? ట్రంప్ మొదటి పదవీకాలం విషయంలో అది నిజమే కావచ్చు. ఇప్పుడు అలా చేయడం కష్టతరమైన ఆలోచన. కొన్ని దేశాలు తమ సుంకాలను తగ్గించుకోవచ్చు. కానీ చాలా దేశాలు ప్రతీకార సుంకాలను విధిస్తున్నాయి. తన మద్దతుదారులకు తాను బలంగా కనిపించాలని ట్రంప్ అనుకుంటున్నట్లుగానే, ఇతర దేశాల నాయకులు కూడా బలహీనంగా కనిపించడానికి ఇష్టపడకపోవచ్చు.

3. ట్రంప్ మాంద్యాన్ని పెంచి పోషించడానికీ, తద్వారా అమెరికా ఫెడరల్ రిజర్వ్‌ను వడ్డీ రేట్లను తగ్గించమని బలవంతం చేయడానికీ ప్రయత్నిస్తున్నారని కూడా చెబుతున్నారు. తక్కువ వడ్డీ రేట్లు ఆర్థిక వృద్ధిని నడిపిస్తాయి. అలాగే 2026 మధ్యంతర ఎన్నికలలో రిపబ్లికన్ పార్టీకి సహాయపడతాయి. అయితే, ఆర్థిక వ్యవస్థ కారు లాంటిది కాదు. కారు వేగాన్ని యాక్సిలరేటర్‌తోనూ, బ్రేక్‌తోనూ సులభంగా నియంత్రించవచ్చు. ఇది సంక్లిష్టమైన వ్యవస్థ. అమెరికా సుంకాలు అలాగే ఉంటే, అక్కడ రిటైల్ ద్రవ్యోల్బణం పెరుగుతుంది, వడ్డీ రేటు కోత అవకాశాలను తగ్గిస్తుంది. ఇంకొకటి: ప్రజలు పేదరికాన్ని అనుభూతి చెందుతూ సాధారణంగా వారు చేసే దానికంటే తక్కువ ఖర్చు చేయడం వల్ల, వినియోగదారుల వ్యయం, ఆర్థిక వృద్ధి మందగిస్తాయి.

4. దేశాలేవీ గతంలో సుంకాలను వేయలేదని దీని అర్థం కాదు. అవి వాటిని అస్త్రాలుగా వాడాయి. కానీ సార్వత్రిక సుంకాలు సాధారణంగా బలహీనంగా ఉండే ఆర్థిక ఫలితాలకు దారితీస్తాయి. 1930 జూన్‌లో అమెరికా ఆమోదించిన ట్యారిఫ్ చట్టం (లేదా స్మూట్–హాలీ చట్టం), 1929లో ప్రారంభమైన మహా మాంద్యం తర్వాత దాని ఆర్థిక వ్యవస్థను రక్షించడానికి ఉద్దేశించబడింది. రక్షణ వాద ప్రభంజన కాలంలో ఈ చట్టం 20,000 పారిశ్రామిక, వ్యవసాయ వస్తువులపై సుంకాలను రికార్డు స్థాయికి పెంచింది. ఇతర దేశాలు తమ సొంత సుంకాలతో స్పందించాయి. ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను మరింత దెబ్బతీసి, మాంద్యాన్ని పొడిగించింది. దేశాలు రెండవ ప్రపంచ యుద్ధానికి ఖర్చులతో సిద్ధమై, పోరాడటం ప్రారంభించిన తర్వాత పరిస్థితి మారింది. నాటి ఈ పాఠాన్ని అమెరికా పాలనాయంత్రాంగం మరచిపోయింది.

5. పరస్పర సుంకాల రేట్లను చాలా మోటు సూత్రాన్ని ఉపయోగించి నిర్ణయించినట్లు అనిపిస్తుంది. భారతదేశం విషయంలో, ఈ సుంకం 26 శాతం వేశారు. 2024లో, అమెరికా భారతదేశంతో 45.7 బిలియన్ డాలర్ల విలువైన వాణిజ్య లోటును కలిగి ఉంది. అంటే భారతదేశం నుండి అమెరికా వస్తువుల దిగుమతులు భారతదేశానికి దాని వస్తువుల ఎగుమతుల కంటే చాలా ఎక్కువగా ఉన్నాయని ఇది సూచిస్తుంది. భారతదేశం నుండి అమెరికా సరుకుల దిగుమతులు 87.4 బిలియన్ డాలర్లు. ఈ 87.4 బిలియన్ డాలర్ల విలువైన దిగుమతుల్లో 45.7 బిలియన్ డాలర్ల అమెరికా లోటు 52 శాతానికి వస్తుంది. ఈ రేటును సగానికి తగ్గించినప్పుడు, 26 శాతం అవుతుంది.

ఇక్కడ బహుళ సమస్యలు ఉన్నాయి. సేవల వాణిజ్యాన్ని పరిగణించలేదు. కరెన్సీ తారుమారు, వాణిజ్యేతర అడ్డంకులను పరిగణనలోకి తీసుకోలేదు. ఒక దేశం దాని సుంకాలను తగ్గించాలని నిర్ణయించుకున్నప్పటికీ, ఆ దేశంతో అమెరికా వాణిజ్య లోటు తగ్గకపోవచ్చు. ఎందుకంటే ఆ దేశానికి అమెరికా మరిన్ని ఎగుమతి చేయవలసి ఉంటుంది. మరిన్ని ఎగుమతి చేయడం అంటే తక్కువ సుంకాల రేటు గురించి మాత్రమే కాదు. అమెరికా ముందుగా వస్తువులను ఉత్పత్తి చేయాలి. అది కూడా ఇతర దేశాలకు ఆసక్తి కలిగించే ధరకు ఉత్పత్తి చేయాలి.

తనకు తెలియదని తెలియదు!

6. ట్రంప్ ఇలా సుంకాలు వేస్తున్నారంటే, తాను దాని గురించి క్షుణ్ణంగా ఆలోచించే ఉంటారని నమ్మే ఒక ఆలోచనా విధానం కూడా ఉంది. ఇది మన ముందున్న అతిపెద్ద ప్రమాదాన్ని వెల్లడిస్తుంది: ట్రంప్‌కు తనకు తెలియనిది తెలియదని తేలికపోవచ్చు. ఆయన అందరి దృష్టీ తన వైపు ఉండటాన్ని ఇష్టపడుతున్నట్లు, తనను తాను నిర్ణయాత్మక వ్యక్తిగా చూపించుకుంటున్నట్లు అనిపిస్తుంది.

7. విధించిన ఈ సుంకాలు దేశీయ మార్కెట్ కోసం అమెరికాలోనే ఉత్పత్తి చేయమని కంపెనీలపై ఒత్తిడి తెస్తాయనే నమ్మకాన్ని ట్రంప్ మాటలు సూచిస్తున్నాయి. కానీ అది అంత సులభం కాదు. ఎందుకంటే అమెరికాలో ఉత్పత్తి చేయడం ఖరీదైన ప్రతిపాదన కావచ్చు. అసలు అందుకే కంపెనీలు మొదటగా బయటకు వెళ్లాయి. ఇప్పుడు కంపెనీల సరఫరా గొలుసులు చాలా పరిణామం చెందాయి. ఒక ఉత్పత్తి దాని తయారీ ప్రక్రియలో అనేకసార్లు అమెరికా సరిహద్దులను దాటవచ్చు. అందుకే కంపెనీలు ట్రంప్ రెండవ పదవీ కాలం ముగిసేదాకా వేచి ఉండాలని నిర్ణయించుకునే అవకాశం కూడా ఉంది.

8. ట్రంప్ ఈ సుంకాల విధింపు వ్యూహాన్ని ద్విగిణీకృతం చేసినట్లయితే, అది దేశాలను అమెరికా నుండి మరింత దూరం చేస్తుంది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అమెరికన్ డాలర్ కేంద్రంగా ఉద్భవించిన ప్రపంచ క్రమాన్ని అది చెదరగొడుతుంది.

ఇప్పుడు దానికి మరొక వివరణాత్మక వ్యాసం అవసరం. కానీ ఒకే వాక్యంలో చెప్పాలంటే, గ్రాహమ్ గ్రీన్ 1978లో ప్రచురించిన 'ది హ్యూమన్ ఫ్యాక్టర్' నవలలో ఇలా రాశాడు: 'మనకు చైనీయులు అవసరమయ్యే రోజు రావచ్చు'.

వ్యాసకర్త ఆర్థిక అంశాల వ్యాఖ్యాత, రచయిత । ('ద మింట్' సౌజన్యంతో)

ఇన్ బాక్స్

సాహసోపేత జీవితం

ఆవగింజంత కృషికి తాటికాయంత ప్రచారం చేసుకునే రోజులలో సుమారు 20 దాకా నవలలు రాసి, తానొక రచయితనని ప్రచారం చేసుకోవడం పట్ల ఏమాత్రం ఆసక్తి లేని వ్యక్తి ఆయన. అతనికి బడుగు జీవులతో కలిసిమెలిసి జీవించడమే ప్రాణ సమాన కార్యకలాపం. అలాంటి వ్యక్తి ప్రజా ఉద్యమ కారుడు కూడా అయితే, అందుకు అతను పొందిన పురస్కారం 'ఎన్‌కౌంటర్ హత్య'! ఆ పురస్కార గ్రహీత కొమ్మిరెడ్డి విశ్వమోహన రెడ్డి.



కొమ్మిరెడ్డి విశ్వమోహన్

కడప జిల్లాలో ధనిక రైతు కుటుంబంలో పుట్టిన విశ్వమోహన్ జీవితానుభవాలు చాలా ప్రత్యేకమైనవి. హోటల్ నడిపాడు, సినిమాలు తీసే ప్రయత్నం చేశాడు. పాలేరుగా మారాడు. రిక్షా తొక్కి, కార్మిక సంఘం నిర్మించాడు. అప్పటికి అతను విశ్వసించిన పార్టీ నిర్ణయంపై ప్రభుత్వ బ్యాంకును కొల్లగొట్టాలని చూశాడు. పోలీసు చిత్రహింసలను భరించాడు. వైద్యం చేశాడు. పత్రికలు నడిపాడు. నాటకాలు ఆడాడు, ఆడించాడు. కడప జిల్లాను వదిలిన తర్వాత 1980వ దశకంలో అద్దంకి, ఇంకొల్లు ప్రాంతం నుండి నరసరావుపేట మీదుగా పిడుగురాళ్లకు చేరుకున్నాడు. అతివాద రాజకీయాలను వదిలి ప్రజా ఉద్యమ కార్యకలాపాలలోకి నడిచి పిడుగురాళ్లలో సున్నపురాయి కార్మికులను సంఘటిత పరిచాడు. దీన్ని సహించలేని ప్రభుత్వం 2000 ఏప్రిల్ 11న ఒక కట్టుకథల ఎన్‌కౌంటర్‌లో ఆయనను హత్య చేసింది. ఆయన ఆశయ స్ఫూర్తిని నూతన తరాలకు అందిద్దాం. ఆయన వ్యక్తిత్వాన్నీ, సాహిత్యోద్యమ కృషినీ 'జ్వాలా శిఖ విశ్వమోహన్'గా ఆవిష్కరించుకుందాం!!

– జనసాహితి (నేడు గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో 'జ్వాలాశిఖ విశ్వమోహన్' పుస్తకావిష్కరణ)

కన్నీరు కార్చడమే దేశద్రోహమా?

అభిప్రాయం



ఎన్. వేణుగోపాల్

ఉత్తరాది రాష్ట్రాలు ఆశ్చర్యకరమైన వార్తలకు జన్మనిస్తాయి. ఉత్తర ప్రదేశ్ పవర్ కార్పొరేషన్ ఉద్యోగి సాఖిబ్ ఖాన్ (35)ను ఉద్యోగం నుంచి తొలగించారనేది అటువంటి తాజా వార్త. సాఖిబ్ ఖాన్ సహారన్‌పూర్ జిల్లా కైలాష్‌పురిలో విద్యుత్ సంస్థకు చెందిన సబ్ స్టేషన్‌లో కాంట్రాక్టు మీద లైన్ మన్‌గా పని చేస్తున్నాడు. మార్చి 31న ఈద్ నమాజ్ అయిపోయిన తర్వాత పాలస్తీనా జెండా పట్టుకుని ఫొటో దిగి, ఆ ఫొటోను సోషల్ మీడియా మీద పంచుకున్నాడు. ఆ విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఆయనను పిలిచి రెండు గంటల పాటు ప్రశ్నించి ఏ నేరారోపణలూ, కేసూ లేకుండా వదిలివేశారు. ఆయన మీద ఏ చర్యా తీసుకోకపోతే నిరసన ప్రదర్శనలు చేస్తామని స్థానిక సంఘ్ పరివార్ సంస్థలు పోలీసులను హెచ్చరించాయి. ఈలోగా ఈ విషయం విద్యుత్ శాఖ దృష్టికి వచ్చి, ఆ చర్యను దేశద్రోహకర చర్యగా పరిగణించి, తక్షణమే ఆయనను ఉద్యోగం నుంచి తొలగించారు.

అదే సమయంలో సహారన్‌పూర్‌లో అంబాలా రోడ్ ఈద్గాలో నమాజ్ ముగిసిన తర్వాత పాలస్తీనా జెండాను ప్రదర్శించిన కొందరు యువకుల వీడియో తమ దృష్టికి వచ్చిందని, వారిలో ఎనిమిది మందిని గుర్తించి దేశద్రోహ నేరానికి విచారణ జరపనున్నామని నగర పోలీస్ సూపరింటెండెంట్ వ్యోమ్ బిందాల్ వార్తాసంస్థలకు తెలిపాడు. ఈ యువకులు చేసిన నేరం ఏమిటి? చనిపోయిన వారికి కన్నీరు కార్చడం! గత ముప్పై నెలలుగా గాజా మీద ఇజ్రాయెల్ బాంబు దాడులు సాగిస్తున్నది. యుద్ధ విరమణ ఒప్పందం మీద సంతకం చేసిన తర్వాత కూడా మారణహోమం కొనసాగిస్తున్నది. కళ్ళముందర ఘోరకలి సాగిపోతుంటే ఇంకేమీ చేయలేకపోయినా, 'మీ దుఃఖం పంచుకుంటున్నాము' అని పాలస్తీనీయుల పతాకను ప్రదర్శించడం అత్యంత మానవీయమైన, ప్రతీకాత్మక చర్య. సానుభూతి ఈ దేశంలో నేరమైపోయిన పాడు కాలానికి చేరాం.

నిజానికి పాలస్తీనా జెండా ప్రదర్శించడం, ఆ మాటకొస్తే స్నేహ సంబంధాలున్న ఏ దేశపు జెండానైనా ప్రదర్శించడం భారత చట్టాల ప్రకారం, ప్రత్యేకించి 'ది ఫ్లాగ్ కోడ్ ఆఫ్ ఇండియా 2002' ప్రకారం నేరం కాదు. దేశద్రోహం



కాదు. కానీ గత రెండు సంవత్సరాలుగా, ముఖ్యంగా గాజా మారణకాండ ప్రారంభమైనప్పటి నుంచీ పాలస్తీనా బాధితుల పట్ల సంఘీభావం వ్యక్తం చేస్తూ ముహర్రం ఊరేగింపులోనో, ప్రార్థనల తర్వాతనో పాలస్తీనా పతాకం ప్రదర్శించిన వందల మంది మీద ఉత్తరాది రాష్ట్రాల పోలీసులు కేసులు బనాయిస్తున్నారు. కొందరి మీద చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కేసులు కూడా పెట్టారు. అదే సమయంలో ఇజ్రాయెల్‌కు అనుకూలంగా ఇజ్రాయెల్ జెండా ప్రదర్శిస్తూ ప్రదర్శనలు జరిపినవారి మీద ఎటువంటి కేసులూ లేవు.

దేశంగా పాలస్తీనాతో, పాలస్తీనా ప్రజల ఆకాంక్షలతో, చివరికి సాయుధ పోరాటం చేస్తుండిన పాలస్తీనా విమోచన సంస్థతో, దాని నాయకుడు యాసర్ అరాఫాత్‌తో భారత ప్రభుత్వానికీ, భారత దేశానికీ ఉండిన సంబంధాల నేపథ్యంలో చూస్తే ఈ కొత్త 'దేశద్రోహకర నేరం' ఆశ్చర్యం కలిగిస్తుంది. బ్రిటిష్ ప్రభుత్వం బాల్ఫోర్ డిక్లరేషన్ ద్వారా పాలస్తీనాలో యూదులను స్థిరపరచడానికి ప్రయత్నాలు ప్రారంభించిన నాటి నుంచీ భారత వలస వ్యతిరేక జాతీయోద్యమ నాయకులందరూ బ్రిటిష్ ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ, పాలస్తీనాకు సంఘీభావం ప్రకటించడం ప్రారంభించారు. 1938లోనే ఒక వ్యాసంలో గాంధీ 'ఇంగ్లండ్ ఇంగ్లిష్ వాళ్లకూ, ఫ్రాన్స్ ఫ్రెంచి వాళ్లకూ ఎలా చెందుతుందో, అదే విధంగా పాలస్తీనా కూడా అరబ్బులకు చెందుతుంది. అరబ్బుల మీదికి యూదులను రుద్దడం తప్పు, అమానుషం' అన్నారు.

పాలస్తీనాను విభజించి ఇజ్రాయెల్ ఏర్పాటు చేయాలనే ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ తీర్మానానికి 1947లోనే భారతదేశం వ్యతిరేకంగా ఓటు వేసింది. ఇజ్రాయెల్ ఏర్పాటును 1950లో ఆమోదించినప్పటికీ, 1992 దాకా దౌత్య సంబంధాలు నెలకొల్పలేదు. పాలస్తీనా మీద ఇజ్రాయెల్ దురాక్రమణను ఖండిస్తూ... 'పాలస్తీనా పాలస్తీనీయులదే' అని అంతర్జాతీయ వేదికల మీద మాట్లాడుతూ, ఐక్యరాజ్యసమితిలో ఇజ్రాయెల్ వ్యతిరేక తీర్మానాలను సమర్థిస్తూ వచ్చింది భారతదేశం. ఇజ్రాయెల్ మీద సాయుధ పోరాటం ప్రారంభించిన పాలస్తీనా విమోచన సంస్థ (పీఎల్‌ఓ)ను 'పాలస్తీనా ప్రజల ఏకైక, సాధికార ప్రతినిధి'గా గుర్తించి, 1974లోనే ఢిల్లీలో కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడానికి భారత ప్రభుత్వం అనుమతించింది. 1980 నాటికి పీఎల్‌ఓతో పూర్తి స్థాయి దౌత్య సంబంధాలు ఏర్పరచుకున్నది. 1988 నవంబర్ స్వాతంత్ర్య ప్రకటనతో ఏర్పాటైన పాలస్తీనాను గుర్తించిన తొలి అరబ్బేతర దేశం భారతదేశమే! గాజాలో 1996లోనే భారత ప్రభుత్వ ప్రతినిధి కార్యాలయం స్థాపించింది. అదే సమయంలో 1990ల నుంచే ఇజ్రాయెల్‌తో కూడా భారత ప్రభుత్వం వాణిజ్య సంబంధాలు ప్రారంభించింది. దీంతో పాలస్తీనా నాయకులలో వ్యక్తమైన అనుమానాలను కూడా భారత నాయకులు కొట్టివేస్తూ వచ్చారు.

పీఎల్‌ఓ అధ్యక్షుడు యాసర్ అరాఫాత్ 1997 నవంబర్‌లో భారత పర్యటనకు వచ్చినప్పుడు ఎన్నో వాణిజ్య, పారిశ్రామిక సహకార, సాంస్కృతిక సంబంధాల ఒప్పందాల మీద సంతకాలు జరిగాయి. అప్పుడే అరాఫాత్ హైదరాబాద్‌కు కూడా వచ్చి ఇండో–అరబ్ భవన సముదాయానికి పునాది వేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ స్వీకరించారు.

ఈ సుహృద్భావాన్నీ, సంఘీభావాన్నీ తోసివేస్తూ, 2014 తర్వాత భారత ప్రభుత్వం అధికారికంగా తన వైఖరి మార్చుకోకుండానే, అనధికారికంగా పాలస్తీనాకు దూరంగా, ఇజ్రాయెల్‌కు దగ్గరగా జరుగుతూ వచ్చింది. ఆ దేశాన్ని సందర్శించిన తొలి భారతీయ ప్రధానిగా నరేంద్ర మోదీ 2017 జూలైలో ఇజ్రాయెల్ వెళ్లి బెంజమిన్ నెతన్యాహూను కౌగిలించుకుని సాన్నిహిత్యాన్ని ప్రకటించారు. అక్కడి నుంచి ఆ సంబంధాలు మరింత బలపడుతూ, 2023 అక్టోబర్ 27న, మారణహోమం మొదలైన ఇరవై రోజుల తర్వాత ఇజ్రాయెల్ దాడిని ఆపి, శాంతి ఒప్పందానికి రావాలని ఐక్యరాజ్య సమితిలో ప్రవేశపెట్టిన తీర్మానానికి భారత ప్రభుత్వం ఓటు వేయకుండా ఉండిపోయింది. మరి, అరవై వేల మరణాలకు కన్నీరు కార్చడం, సానుభూతి ప్రకటించడం దేశద్రోహకర నేరమవుతుందా?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

అకాల వర్షం.. అంతా ఆగమాగం

▶ మొదటి పేజీ తరువాయి

నేలకొరిగాయి. ఆత్మకూర్(ఎం)లో కరెంట్ తీగలు తెగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గాలి దుమారానికి పలుచోట్ల ఇళ్ల పైకప్పు రేకులు లేచిపోయాయి. గుండాలలో బండపై రైతులు ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోయింది.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: ఎడపల్లి మండలం బాపూనగర్‌లో వడగండ్లు పడ్డాయి. విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. బలమైన గాలులకు ధాన్యం కుప్పలపై కప్పిన టార్పాలిన్లు ఎగిరిపోయాయి. రైతులు ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. ఈదురు గాలులతో వరితోపాటు మొక్కజొన్న, జొన్న పంటలు నేలవాలాయి.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా: పలు మండలాల్లో ఈదురుగాలులు, వర్షానికి ధాన్యం పొలాల్లోనే రాలిపోయింది. మొక్కజొన్న నేలవాలింది. గంభీరావుపేట మండలం గజసింగవరంలో కొనుగోలు కేంద్రంలోని ధాన్యం తడిసి ముద్దయ్యింది. వేములవాడ మండలం నాగాయపల్లి శివారులో గాలివానకు పడిపోయిన చెట్లను బ్లూ కోల్ట్స్ తొలగించారు.

జనగామ జిల్లా: జనగామ వ్యవసాయ మార్కెట్‌లో 600 బస్తాల వరకు ధాన్యం తడిసిపోగా, రఘునాథపల్లి, స్టేషన్ ఘన్‌పూర్ మండలాల్లో కోతకు సిద్ధంగా ఉన్న పంట దెబ్బతింది. గాలి దుమారంతో 11 కేవీ విద్యుత్ లైన్లపై చెట్లు విరిగి పడిపోవడంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.

సిద్దిపేట జిల్లా: సిద్దిపేట జిల్లా నంగునూరు, చిన్నకోడూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఈదురు గాలుల ధాటికి కొన్ని గ్రామాల్లో చెట్లు నేలకూలగా, పొలాల్లోనే గింజలు రాలడంతో వరి మొక్కకు పిలకలే మిగిలాయి. మొక్కజొన్న, మిర్చి, టమాటా, కూరగాయ పంటలు నేలకొరిగాయి.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా: దేవరకద్ర మార్కెట్‌లో వేలం వేసిన ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. రైతులు కవర్లు కప్పినా.. అప్పటికే చాలా ధాన్యం తడిసి ముద్దయ్యింది. కొల్లాపూర్‌లో ఈదురుగాలులకు మామిడికాయలు నేలరాలాయి.

నిర్మల్ జిల్లా: పలు మండలాల్లో ఈదురు గాలులతోపాటు రాళ్ల వర్షం కురిసింది. దీంతో కోతకు వచ్చిన పంటలు నేలవాలాయి. ఇప్పటికే కోసి కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసింది. మొక్కజొన్న తడిసి ముద్దయ్యింది.కల్లాల్లో ఆరబెట్టిన మక్కలు కొంత మేరకు తడిసిపోయాయి.


నిర్మల్ జిల్లా వెంకూర్‌లో నేలవాలిన జొన్నను చూపిస్తున్న రైతు


నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం బాపూనగర్‌లో తడిసిన ధాన్యం

రైతు ఆత్మహత్యాయత్నం

ములుగు జిల్లా మొట్లగూడెం గ్రామానికి చెందిన యాలం నర్సింహారావు తనకున్న ఐదెకరాలతోపాటు మరో 15 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి, మొక్కజొన్న, మిర్చి పంటలు సాగు చేశాడు. మరో మూడు రోజుల్లో వరి పంట కోయాల్సి ఉండగా.. ఈనెల 7న సాయంత్రం వడగళ్ల వాన పడింది. దీంతో వరి చేనులో గింజకూడా లేకుండా రాలిపోవడంతో తీవ్ర నష్టం జరిగింది. అప్పులు తీర్చే మార్గం లేక నర్సింహారావు బుధవారం రాత్రి తన ఇంటికి సమీపాన ఉన్న పొలం వద్ద పురుగుల మందుతాగాడు. ఉదయాన్నే స్థానికులు గుర్తించి ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ముగ్గురి ప్రాణం తీసిన పిడుగులు

వేర్వేరు జిల్లాలో పిడుగులు పడి ముగ్గురు మృత్యువాత పడ్డారు. జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నేలపోగుల గ్రామానికి చెందిన రైతు మందాడి రవీందర్ రెడ్డి(55) రోజు మాదిరిగానే గురువారం గేదెలను మేపడానికి వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుమారుడు సంకీర్త్‌రెడ్డి వ్యవసాయబావి వద్దకు వెళ్లి చూడగా విగతజీవుడై పడి ఉన్నాడు. సాయంత్రం ఐదున్నర గంటల సమయంలో పిడుగు పడిందని, దీంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు గుర్తించారు.

- సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గంగారాం గ్రామానికి చెందిన సంపత్‌కుమార్ అలియాస్ సతీశ్(19), జశ్వంత్, కార్తీక్‌లు సదాశివపేట మండల పరిధిలోని గొల్లగూడెంలోని ఓ కాలేజీలో ఐటీఐ చదువుతున్నారు. క్లాస్‌లు ముగిశాక ఒకే బైక్‌పై ముగ్గురూ స్వగ్రామానికి బయలు దేరారు. వర్షం ఎక్కువ కావడంతో సిద్దాపూర్-గొల్లగూడెం శివారులోని మైసమ్మ కట్ట వద్ద బైక్‌ను నిలిపి సంపత్‌కుమార్, జశ్వంత్ చింత చెట్టు కింద నిల్చున్నారు. కార్తీక్ మరో చెట్టు కింద నిలబడ్డాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా పిడుగుపడి సంపత్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, జశ్వంత్‌కు తీవ్రగాయాలు అయ్యాయి.
- నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం ఆమలూరు గ్రామానికి చెందిన గొర్రెల కాపరి మేకల రాములు(55) గ్రామ సమీపంలో తన గొర్రెలను మేపుతుండగా.. అకస్మాత్తుగా గాలి దుమారంతో వర్షం కురిసింది. రాములు పక్కనే పిడుగుపడడంతోఅక్కడికక్కడే మృతిచెందగా ఆయన కుమారుడు నరసింహకు తీవ్ర గాయాలయ్యాయి. ఆలేరు మండలం మంతపురిలో పిడుగుపాటుకు గేదె మృతి చెందింది.

అకాల వర్షాలపై అప్రమత్తంగా ఉండండి : సీఎం రేవంత్‌రెడ్డి

అకాల వర్షాలు పడుతున్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌తోపాటు పలు జిల్లాల్లో వర్షాలు పడుతున్నాయని, రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. మరో రెండు రోజుల పాటు ఓ మోస్తరు వర్షాలు వివిధ జిల్లాల్లో కురిసే అవకాశముందన్న వాతావరణ శాఖ సూచనలను పరిగణనలోకి తీసుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను సీఎం అప్రమత్తం చేశారు.

'ప్రాణహిత' పూర్తి చేయండి

- మంత్రి ఉత్తమ్‌కు కోదండరాం, పాల్వాయి హరీశ్ వినతి

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి ప్రాణహిత ప్రాజెక్టు తప్ప మరో గత్యంతరం లేదని, ప్రాణహిత-తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించాలని ఎమ్మెల్సీ కోదండరాం, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌రావులు రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు గురువారం జలసౌధలో తెలంగాణ జలసాధన సమితి కన్వీనర్ నైనాల గోవర్ధన్, ప్రాణహిత పరిరక్షణ వేదిక కన్వీనర్ కె.వి.ప్రతాప్‌లతో కలిసి మంత్రి ఉత్తమ్‌కు వినతిపత్రం అందజేశారు. కుప్టి, కొమురంభీం, జగన్నాథ్‌పూర్, గొల్లవాగు, నీల్వాయి ప్రాజెక్టుతోపాటు న్యూ సదర్‌మాట్ బరాజ్ పనులు కొద్దిపాటి నిధులతో పూర్తవుతాయని, వెంటనే ఈ మేరకు కేటాయించాలని కోరారు.

సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుల పునర్వ్యవస్థీకరణ

స్లాట్ బుకింగ్ సౌలభ్యంతోపాటు అధికభారం తగ్గించేలా కొత్త కార్యాలయాల ఏర్పాటు

- జీహెచ్‌ఎంసీ పరిధిలోనే 15 చోట్ల కొత్తవాటికి ప్రతిపాదనలు
- త్వరలోనే ఆమోదం తెలపనున్న ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరించే కసరత్తును రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇప్పటికే అధికభారంతో కొన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను తగ్గించడంతోపాటు కొత్తగా అమల్లోకి వచ్చిన స్లాట్ బుకింగ్ సౌలభ్యాన్ని ప్రజలు వినియోగించుకునేలా త్వరలోనే ఈ పునర్వ్యవస్థీ కరణకు ఆమోద ముద్ర పడనున్నట్టు తెలిసింది. ఒక్క జీహెచ్‌ఎంసీ పరిధిలోనే సుమారు 15 కొత్త సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల ఏర్పాటుకు స్టాంపు లు, రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయని, అతి త్వరలోనే వీటికి ఆమోదముద్ర పడుతుందని తెలుస్తోంది.

- శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్, మహేశ్వరం, పటాన్‌చెరు, గండిపేట, మూసాపేట, మేడ్చల్ కార్యాలయాల పరిధిని విభజించి కొత్తగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు.
- ఇప్పటికే కుత్బుల్లాపూర్ సబ్‌రిజి స్ట్రార్ కార్యాలయానికి ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లను అదనంగా నియమించగా, త్వరలోనే మిగిలిన చోట్ల కూడా కొత్త సబ్ రిజిస్ట్రార్లను నియమించనున్నారు.
- మరోవైపు తక్కువ పనిఉండే సబ్ రిజి స్ట్రార్ కార్యాలయాల పరిధిని విలీనం కూడా చేయనున్నారు. అందులో భా గంగా ఇప్పటికే రంగారెడ్డి జిల్లా లోని చంపాపేట, సరూర్‌నగర్ సబ్ రిజి స్ట్రార్ కార్యాలయాల అధికార పరి ధిని విలీనం చేయగా, రాష్ట్ర వ్యాప్తంగా మరో ఏడెనిమిది కార్యాలయాల పరిధిని విలీనం చేయనున్నట్టు తెలుస్తోంది.
- అవినీతికి చెక్‌పెట్టడం, పనిభారాన్ని తగ్గించడం, ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలను అందించడమే లక్ష్యంగా ఈ పునర్వ్యవస్థీకరణ జరుగుతోందని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు.


రంగారెడ్డి జిల్లా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకున్న కొనుగోలుదారునికి డాక్యుమెంట్ అందజేస్తున్న స్టాంప్స్- రిజిస్ట్రేషన్ డీఐజీ (రంగారెడ్డి) ట్వింకిల్ జాన్, జిల్లా రిజిస్ట్రార్ సంతోష్ రెడ్డి

మొదటి రోజు 626 రిజిస్ట్రేషన్లు

రిజిస్ట్రేషన్ల వ్యవస్థలో స్లాట్‌బుకింగ్ విధానాన్ని అమల్లోకి తెచ్చిన తొలిరోజు రాష్ట్ర వ్యాప్తంగా 626 రిజిస్ట్రేషన్లు జరిగినట్టు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వెల్లడించింది. గురువారం నుంచి 22 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ స్లాట్‌బుకింగ్ విధానం అమల్లోకి వచ్చిందని, ప్రజల నుంచి మంచి స్పందన కనిపించిందని తెలిపారు. అయితే, ఉదయం కొంతసేపు ప్రధాన సర్వర్ మొరాయించడంతో కొంత ఇబ్బంది కలిగినా అ తర్వాత రిజిస్ట్రేషన్లు ఊపందుకున్నట్టు సమాచారం. తొలిరోజు కావడంతో రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులంతా పైలట్ ప్రాజెక్టు అమలుపైనే దృష్టి సారించారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా డీఐజీ స్థాయి అధికారులు వెళ్లి అక్కడే ఉండి రిజిస్ట్రేషన్లు జరుగుతున్న తీరును పరిశీలించారు. స్లాట్‌బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్లు జరుగుతున్న తీరు, ప్రజల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఈ విధానం అమలుపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు సులువైన, వేగవంతమైన సేవలు అందించడమే లక్ష్యంగా స్లాట్ బుకింగ్ విధానాన్ని అమల్లోకి తెచ్చామని, తద్వారా 10–15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుండడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సేవల్లో జాప్యం, సిఫారసులు, దళారుల జోక్యం లాంటి వాటి నుంచి క్రయ విక్రయదారులకు ఈ విధానం ఉపశమనం కలిగిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

గ్రామగ్రామానికి నాణ్యమైన విత్తనాలు



- జూన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: అన్ని రకాల నాణ్యతా పరీక్షలు నిర్వహించిన మేలైన విత్తనాలను ప్రతి గ్రామంలో రైతులకు పంపిణీ చేస్తా మని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దీంతో వచ్చే మూడేళ్లలో ప్రతి గ్రామంలోని రైతులందరికీ నాణ్య మైన విత్తనాలు అందుబాటులో ఉంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దీనివల్ల నకిలీ విత్తనాల ముప్పు నుంచి బయటపడటమే కాకుండా, సాగులో దిగుబడి 10 నుంచి 15 శాతం అదనంగా పెరుగుతుందని అన్నారు. 'గ్రామగ్రామానికి జయశంకర్ వ్యవసాయ వర్సిటీ నాణ్యమైన విత్తనం'అనే నూతన కార్యక్రమాన్ని జూన్ మొదటి వారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారని వెల్లడించారు. గురువారం సచివాలయంలో మంత్రి, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా సుమారు 2,500 నుంచి 3 వేల క్వింటాళ్ల (వరి, కంది, పెసర, మినుము, జొన్న) విత్తనాలను 40 వేల మంది రైతులకు అందజేస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం అనేక రకాల కొత్త వంగడాలను అభివృద్ధి చేసిందని, వాటిలో ముఖ్యమైన విత్తనాలను రైతులకు అందిస్తామని చెప్పారు.

మిర్చి బస్తాలు తీసుకెళ్లారని రైతు ఆత్మహత్యాయత్నం

వాజేడు: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అప్పు కింద పురుగు మందుల దుకాణ యజమాని తీసుకెళ్లడంతో మనస్తాపానికి గురైన రైతు ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఈ సంఘటన ములుగు జిల్లాలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వాజేడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన బొగట నర్సింహారావు రెండెకరాల్లో మిర్చి పంట సాగు చేశాడు. అదే గ్రామానికి చెందిన ప్రశాంత్ వద్ద మిర్చి తోటకు కావాల్సిన పురుగు మందులను అప్పుగా తెచ్చి పిచికారీ చేశాడు. పండిన మిర్చిని బస్తాల్లో నింపుతుండగా బాకీ వసూలు చేసుకోవడానికి ప్రశాంత్ బుధవారం అక్కడికి వెళ్లాడు. రూ.90 వేల వరకు బాకీ ఉంది.. వెంటనే చెల్లించాలని రైతును అడగడంతో పాటు మిర్చి బస్తాలను తీసుకెళ్లేందుకు ప్రయత్నించాడు. 'బాకీ కింద 15 బస్తాల మిర్చి ఇస్తాను.. మిగతా బాకీ వచ్చే ఏడాది చెల్లిస్తాను' అని రైతుమొర పెట్టుకున్నా వినకుండా బస్తాలు తీసుకువెళ్లడంతో మనస్తాపంతో ఇంట్లోకి వెళ్లిన రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు ఏటూరునాగారం తరలించి వైద్యం అందిస్తున్నారు. ఈ ఘటనపై అధికారులు విచారణ చేపట్టారు.

భూకంపమంటూ వదంతులు

- రామగుండంలో ప్రకంపనలకు అవకాశం: ఎపిక్ పేరిట 'ఎక్స్'లో పోస్టు
- గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో కలకలం

సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లాలోని పారిశ్రామిక ప్రాంతమైన రామగుండం(గోదావరిఖని)లో భూకంపం వచ్చే అవకాశం ఉందంటూ ఎపిక్ (ఎర్త్ క్వేక్ రీసె ర్చ్ అండ్ ఎనాలసిస్ సంస్థ) 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. తమ పరిశోధన, విశ్లేషణ ప్రకారం ఈ నెల 10వ తేదీ నుంచి 17వ తేదీ మధ్య భూకంపం వచ్చే అవకాశా లున్నాయని, దీని ప్రభావం వరంగల్, హైదరాబాద్, అమరావతి, మహారాష్ట్ర ప్రాంతాల వరకూ ఉంటుందని వెల్లడించింది. రామగుండంలో భూకంపం రాబోతోందనే విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జిల్లా ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గోదావరి నదీ పరీవాహక ప్రాంతమైన రామగుండం ఏరియాలో సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, జెన్‌కో, ఎన్టీపీసీ విద్యుత్ ప్లాంట్లతోపాటు, ఎల్లంపల్లి, కాళేశ్వరం తదితర సాగునీటి ప్రాజెక్టులు ఉన్నాయి. చిన్న ప్రకంపనలు వచ్చినా.. పెద్దఎత్తున ప్రాణ, ఆస్తినష్టం జరిగే అవకాశాలున్నాయని జిల్లా ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇదే విషయమై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను సంప్రదించగా భూకంపం రాబోతుందని ప్రభుత్వం నుంచి, అధికారిక సంస్థల నుంచి తమకు ముందస్తు సమాచారం, హెచ్చరికలు రాలేదని స్పష్టం చేశారు. ప్రజలు భయాందోళనలు చెందకుండా.. అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

సరస్వతీ పుష్కరాలకు 'టెంట్‌సిటీ' కష్టమే!

- పట్టించుకోని టూరిజం శాఖ ఉన్నతాధికారులు


టెంట్‌సిటీ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు(ఫైల్)

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు సరస్వతీ పుష్కరాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో వీఐపీ ఘాట్ (సరస్వతీ ఘాట్) వద్ద సుమారు రూ.83 లక్షలతో టూరిజం శాఖ టెంట్‌సిటీ నిర్మాణం చేపట్టడానికి స్థలసేకరణ చేసింది. అయితే పుష్కరాల సమయం దగ్గర పడుతున్నా నిర్మాణాల జాడ లేకపోవడంతో పనులు చేపడతారా లేదా అని భక్తులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. వీఐపీ ఘాట్ వద్ద టూరిజం, దేవాదాయ శాఖలకు చెందిన ఆరెకరాల స్థలం కేటాయించారు. అందులో మిర్చి పంట వేసిన రైతుకు నష్టపరిహారం సైతం చెల్లించారు. అయితే ఇప్పటికీ నిర్మాణాలపై స్పష్టత లేదు. ఈ నిర్మాణాలు చేపడితే వీవీఐపీలు ఉండేలా వసతితో పాటు ఏసీ గదులు, అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి ప్రణాళికలు రూపొందించినా నేటికీ ఆచరణలోకి రాలేదు. ఉన్నతాధికారులు ముందుచూపుతో నిధులు కేటాయించినా టూరిజం శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. శుక్రవారం (నేడు) టూరిజం శాఖ అధికారులతో నిర్వహించే జూమ్ మీటింగ్‌లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. టూరిజం శాఖ ఏఈఈ జీవన్‌ను ఫోన్‌లో సంప్రదించగా రెండు రోజుల్లో స్పష్టత వస్తుందని చెప్పారు.



ఎన్ఐఏ అదుపులో రాణా

26/11 ముంబై దాడుల సూత్రధారి భారత్‌కు తరలింపు

- ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరు
- 20 రోజులపాటు తమ కస్టడీ ఇవ్వాలని ఎన్ఐఏ వినతి
- ఉత్తర్వును రిజర్వ్ చేసిన జడ్జి చందర్‌జిత్ సింగ్

న్యూఢిల్లీ: ముంబై ఉగ్రవాద దాడుల సూత్రధారుల్లో ఒకడైన తహవ్వుర్ హుస్సేన్ రాణాను ఎట్టకేలకు ఇండియాకు తీసుకొచ్చారు. అతడిని ఎప్పుడు తీసుకొస్తారు? ఎలా తీసుకొస్తారు? అన్నదానిపై ఉత్కంఠకు తెరపడింది. భారత దర్యాప్తు అధికారులు అమెరికా నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి తరలించారు. బుధవారం సాయంత్రం అమెరికాలోని లాస్‌ఏంజెలెస్ నుంచి బయలుదేరిన విమానం గురువారం సాయంత్రం 6.30 గంటలకు ఢిల్లీ పాలం ఎయిర్‌పోర్టులో ల్యాండయ్యింది. విమానం నుంచి బయటకు రాగానే రాణాను ఎన్ఐఏ బృందం అధికారికంగా అరెస్టు చేసింది. అనంతరం కట్టుదిట్టమైన భద్రత మధ్య ఢిల్లీలోని పటియాలా హౌస్ కోర్టుకు తరలించారు. ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు న్యాయమూర్తి చందర్‌జిత్ సింగ్ ఎదుట హాజరుపర్చారు. ఎన్ఐఏ తరఫున సీనియర్ అడ్వొకేట్లు నరేందర్ మాన్, దయాన్ కృష్ణన్, రాణా తరఫున ఢిల్లీ లీగల్ సర్వీసెస్ అథారిటీ అడ్వొకేట్ పీయూష్ సచ్‌దేవా వాదనలు వినిపించారు. పోలీసులు కోర్టు గదిలోకి ఇతరులను అనుమతించలేదు. మీడియా ప్రతినిధులను సైతం బయటకు పంపించారు. ముంబై దాడుల కేసులో విచారణ నిమిత్తం రాణాను 20 రోజులపాటు ఎన్ఐఏ కస్టడీకి అప్పగించాలని దయాన్ కృష్ణన్ కోరగా, న్యాయమూర్తి తన ఉత్తర్వును రిజర్వ్ చేశారు. అర్ధరాత్రి వరకూ కోర్టులో వాదనలు కొనసాగాయి. ఉగ్రవాద దాడుల్లో రాణా పాత్రకు సంబంధించి కొన్ని సాక్ష్యాధారాలను కోర్టుకు కృష్ణన్ సమర్పించారు.

అతిపెద్ద దౌత్య విజయం

భారత్‌కు అప్పగించవద్దని, అక్కడ తనకు రక్షణ ఉండదని మొండికేస్తూ అమెరికా కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేస్తూ 15 ఏళ్ల కాలక్షేపం చేసిన తహవ్వుర్ రాణా ఆశలు నెరవేరలేదు. అతడి అప్పగింత ప్రక్రియ సుదీర్ఘంగా కొనసాగించింది. కొన్ని రోజులు క్రితం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమైన భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ అంశాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆ తర్వాత రాణా అప్పగింత ప్రక్రియ చకచకా పూర్తయ్యింది. 2008 నాటి ఉగ్రవాద దాడుల కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) ప్రత్యేక కోర్టులో రాణాపై ఇక విచారణ ప్రారంభం కానుంది. నేరపూరిత కుట్ర, భారతదేశంపై యుద్ధం ప్రకటించడం, హత్యతోపాటు చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం కింద రాణాపై అభియోగాలు నమోదయ్యాయి. అతడిని అమెరికా నుంచి భారత్‌కు రప్పించడం అతిపెద్ద దౌత్య, న్యాయపరమైన విజయంగా భావిస్తున్నారు. 26/11 దాడుల్లో మృతిచెందినవారికి, బాధితులకు న్యాయం చేకూర్చడంలో రాణా అప్పగింత ఒక కీలకమైన ముందడుగు అని అమెరికా న్యాయ శాఖ గురువారం వెల్లడించింది.

ముంబైలో ఆ రోజు ఏం జరిగింది?

2008 నవంబర్ 26న పాకిస్తాన్‌కు చెందిన 10 మంది లష్కరే తోయిబా ఉగ్రవాదులు దేశ ఆర్థిక రాజధాని ముంబైలో మారణహోమం సృష్టించారు. నవంబర్ 26 నుంచి 29 దాకా.. నాలుగు రోజులపాటు వేర్వేరు చోట్ల తుపాకులు, గ్రెనేడ్లతో చెలరేగిపోతూ నెత్తుటేర్లు పారించారు. ఛత్రపతి శివాజీ టెర్మినస్, ఒబెరియ్ ట్రిడెంట్ హోటల్, తాజ్‌మహల్ ప్యాలెస్ హోటల్, లియోపోల్డ్ కేఫ్, కామా హాస్పిటల్, నారిమన్ హౌస్, మెట్రో సినిమా హాల్ తదితర ప్రాంతాల్లో విచక్షణారహితంగా దాడులకు పాల్పడ్డారు. ఆరుగురు అమెరికా పౌరులు సహా 166 మంది మృతిచెందారు. 300 మంది క్షతగాత్రులుగా మారారు. భద్రతా సిబ్బంది కాల్పుల్లో 9 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. అజ్మల్ కసబ్ ఒక్కడే సజీవంగా దొరికిపోయాడు. సుదీర్ఘ విచారణ అనంతరం అతడికి ఉరిశిక్ష అమలు చేశారు. ముంబైలో ఉగ్రవాద దాడులకు రాణా సహాయ సహకారాలు అందించినట్లు ఎన్ఐఏ చెబుతోంది. 2009లో ఎఫ్‌బీఐ రాణాను అరెస్టు చేసింది. లాస్‌ఏంజెలెస్‌లోని మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్‌లో నిర్బంధించింది.




గురువారం పాలం ఎయిర్‌పోర్టులో ఎన్ఐఏ అధికారుల అదుపులో తహవ్వుర్ రాణా

ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నరేందర్ మాన్



న్యూఢిల్లీ: ముంబై ఉగ్రవాద దాడుల కేసులో తహవ్వుర్ రాణాపై ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో ఎన్ఐఏ తరఫున వాదించడానికి ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ అడ్వొకేట్ నరేంద్ర మాన్‌ను కేంద్రం నియమించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ బుధవారం అర్ధరాత్రి తర్వాత నోటిఫికేషన్ జారీ చేసింది. ఆయన నియామకం రాబోయే మూడేళ్లపాటు లేదా కేసు విచారణ పూర్తయ్యేదాకా అమల్లో ఉంటుంది. ఉగ్రవాద దాడులకు సంబంధించి ఢిల్లీలోని ఎన్ఐఏ ప్రత్యేత కోర్టుల తోపాటు అప్పిలేట్ కోర్టులో నరేంద్ర మాన్ వాదిస్తారు.

అప్పటి హీరోనే ఇప్పటి ఎన్ఐఏ చీఫ్



1990 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సదానంద్ దాతే 26/11 దాడుల సమయంలో ఉగ్రవాదులతో హోరాహోరీగా తలపడ్డారు. అప్పట్లో ఏసీపీగా పని చేస్తున్న సదానంద్ ఆ రోజు రాత్రి ముంబై కామా ఆసుపత్రిలో ఉగ్రవాదులు అజ్మల్ కసబ్, అబూ ఇస్మాయిల్‌ను 40 నిమిషాలపైగా ఒంటరిగా ఎదుర్కొన్నారు. ముష్కరుల కాల్పుల్లో మిగతా పోలీసులు గాయపడగా, ఆయన ఒక్కరే ధైర్యంగా ముందడుగు వేశారు. ఎదురు కాల్పులు జరుపుతూ ఆ ఇద్దరినీ ఉక్కిరిబిక్కిరి చేశారు. ఉగ్రవాదులు విసిరిన గ్రనేడ్ పేలి సదానంద్ గాయపడ్డారు. అయినప్పటికీ కాల్పులు ఆపలేదు. 40 నిమిషాలపాటు సమయం చిక్కడంతో చాలామంది ప్రజలు ఆసుపత్రి నుంచి బయటకు వెళ్లిపోయారు. దాంతో పెద్ద ఎత్తున ప్రాణనష్టం తప్పింది. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. 26/11 దాడుల కేసులో దర్యాప్తు చేస్తున్న ఎన్ఐఏకు సదానంద్ దాతే 2024 మార్చి నుంచి సారథ్యం వహిస్తున్నారు. 2026 డిసెంబర్ 31దాకా ఆయన ఈ పదవిలో కొనసాగుతారు.

ఎవరీ రాణా?

పాకిస్తాన్‌లో ధనవంతుల కుటుంబంలో 1961 జనవరి 12న జన్మించిన తహవ్వుర్ హుస్సేన్ రాణా చివరకు ఉగ్రబాట పట్టాడు. ఇస్లామాబాద్‌లో పెరిగిన రాణా హసన్ అబ్దల్ కేడెట్ కాలేజీలో చదువుకున్నాడు. అక్కడే డేవిడ్ కోలోమన్ హెడ్లీ అలియాస్ దావూద్ గిలానీతో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ సన్నిహిత మిత్రులయ్యారు. వైద్య విద్య అభ్యసించిన రాణా పాకిస్తాన్ సైన్యంలో డాక్టర్‌గా పనిచేశాడు. 1997లో మేజర్ హోదాలో పదవీ విరమణ పొందాడు. తర్వాత కెనడాకు చేరుకున్నాడు. ఇమ్మిగ్రేషన్ సేవలు అందించే కంపెనీ స్థాపించాడు. కెనడా పౌరసత్వం సంపాదించాడు. అనంతరం అమెరికాలోని షికాగోకు మకాం మార్చాడు. ఇమ్మిగ్రేషన్, వీసా ఏజెన్సీ ప్రారంభించాడు. హలాల్ మాంసం విక్రయించే వ్యాపారం చేశాడు. హెడ్లీ సూచన మేరకు రాణా ముంబైలో ఇమ్మిగ్రేషన్ కార్యాలయం ఏర్పాటు చేశాడు. 2006 నుంచి 2008 దాకా హెడ్లీ ఈ ఆఫీసుకు ఐదుసార్లు వచ్చి వెళ్లాడు. ముంబైలో ఎక్కడెక్కడ దాడులు చేయాలో నిర్ణయించుకున్నాడు. 26/11 దాడులకు రాణా ఆఫీసును ఉగ్రవాదులు ఒక అడ్డాగా వాడుకున్నారు. ఆరుగురు ప్రధాన కుట్రదారుల్లో రాణా కూడా ఉన్నాడు. అయితే, హెడ్లీ అప్రూవర్‌గా మారిపోయాడు. ప్రస్తుతం అమెరికాలో కస్టడీలో ఉన్నాడు.

రాణాను బహిరంగంగా ఉరి తీయాలి: ఏక్‌నాథ్ ఓంబలే

ఉగ్రవాది తహవ్వుర్ రాణాను బహిరంగంగా ఉరి తీయాలని ఏక్‌నాథ్ ఓంబలే డిమాండ్ చేశాడు. వందల మంది ప్రాణాలను బలిగొన్న ముష్కరుడికి బతికే హక్కు లేదని అన్నాడు. భారత్‌పై దాడులు చేయాలన్న ఆలోచన వస్తే ఏం జరుగుతుందో ఉగ్రవాదులకు తెలియాలంటే రాణాను జనం సమక్షంలో ఉరికంభం ఎక్కించాల్సిందేనని తేల్చిచెప్పాడు. 2008 నాటి ముంబై ఉగ్రవాద దాడుల్లో ఏక్‌నాథ్ ఓంబలే సోదరుడు, అసిస్టెంట్ ఎస్ఐ తుకారాం ఓంబలే కన్నుమూశాడు. ఉగ్రవాది అజ్మల్ కసబ్‌ను బంధించే ప్రయత్నంలో మృతిచెందాడు. ఆ సమయంలో తుకారాం వద్ద లాఠీ తప్ప ఎలాంటి ఆయుధం లేదు. ఆయినప్పటికీ కసబ్‌ను ధైర్యంగా అడ్డుకున్నాడు. కోపోద్రిక్తుడైన కసబ్ కాల్పులు జరపడంతో తుకారాం నేలకొరిగాడు. కసబ్‌ను చాలాసేపు నిలువరించడం వల్లే చాలామంది ప్రాణాలతో బయటపడ్డారు. తుకారాంకు ప్రభుత్వం అశోకచక్ర అవార్డు ప్రకటించింది.

దాడులకు ముందు తాజ్‌మహల్ సందర్శన

ఉగ్రవాది తహవ్వుర్ రాణా ముంబై దాడుల కంటే ముందు భార్యతో కలిసి ఆగ్రాలోని తాజ్‌మహల్‌తోపాటు కొచ్చి, ముంబై నగరాల్లో పర్యాటక ప్రాంతాలను సందర్శించాడు. 2008 నవంబర్ 26న దాడులు జరిగాయి. నవంబర్ 13 నుంచి 21 దాకా రాణా ఇండియాలోనే ఉన్నాడు. అతడు దేశం వదిలివెళ్లిపోయిన ఐదు రోజుల తర్వాత 10 మంది ఉగ్రవాదులు ముంబైలో మారణహోమం సృష్టించారు. భార్య డాక్టర్ సమ్రజ్ అక్తర్‌తో కలిసి రాణా నవంబర్ 13న ఢిల్లీకి చేరుకున్నాడు. తర్వాత వారు మీరట్, ఘజియాబాద్‌లోని సమ్రజ్ బంధువుల ఇళ్లకు వెళ్లారు. తర్వాత వేగన్‌ఆర్ కారులో ఆగ్రాకు చేరుకొని ఓ హోటల్‌లో బస చేశారు. మరుసటి రోజు తాజ్‌మహల్‌ను సందర్శించారు. అక్కడి నుంచి ఢిల్లీకి తిరిగివెళ్లారు. కొచ్చిలో రెండు రోజులు ఉన్నారు. తర్వాత ముంబైలో పోవై హోటల్‌లో, జలవాయు విహార్ హౌసింగ్ కాంప్లెక్స్‌లో బస చేశారు. జలవాయు విహార్‌లో 1971 నాటి యుద్ధ వీరులు నివసిస్తుంటారు. ఈ యుద్ధంలో భారత్ చేతిలో పాకిస్తాన్ ఓడిపోయిన సంగతి తెలిసిందే. అందుకే ప్రతీకారం తీర్చుకోవడానికి ఈ కాంప్లెక్స్‌ను పేల్చివేయాలని రాణా భావించాడు. కానీ, అక్కడ దాడులకు పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ఆ ఆలోచన విరమించుకున్నాడు. నవంబర్ 21న ఇండియా నుంచి వెళ్లిపోయాడు.

దయాన్ కృష్ణన్ కృషి వల్లే..



తహవ్వుర్ రాణాను రప్పించడం వెనుక సీనియర్ లాయర్ దయాన్ కృష్ణన్ కృషి ఎంతో ఉంది. రాణా కేసులో భారత ప్రభుత్వం తరఫున అమెరికా కోర్టుల్లో ఆయన సమర్థంగా వాదనలు వినిపించారు. అమెరికా కోర్టులో రాణాపై విచారణ 2018లో ప్రారంభమైంది. 2023 మే 16న కృష్ణన్ చేసిన వాదనను యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు ఆఫ్ సెంట్రల్ డిస్ట్రిక్ట్ ఆఫ్ కాలిఫోర్నియా మేజిస్ట్రేట్ జడ్జి పరిగణనలోకి తీసుకున్నారు. రాణాను ఇండియాకు అప్పగించేందుకు సుముఖత వ్యక్తం చేస్తూ తీర్పు ఇచ్చారు. రాణాను రప్పించే విషయంలో ఈ తీర్పు కీలకమైన మైలురాయిగా నిలిచింది. ఒకే కేసులో రెండుసార్లు ఎలా శిక్షిస్తారంటూ రాణా తరఫు న్యాయవాది పాల్ గార్లిక్ క్యూసీ చేసిన వాదనను దయాన్ కృష్ణన్ గట్టిగా తిప్పికొట్టారు. రాణాపై ఎన్ఐఏ కోర్టులో ఎన్ఐఏ తరఫున వాదించే బృందంలో కృష్ణన్ సైతం చేరబోతున్నట్లు తెలిసింది. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ నరేందర్ మాన్‌కు ఆయన సహకరిస్తారు. ఈ బృందంలో అడ్వొకేట్లు సంజీవి శేషాద్రి, శ్రీధర్ కాలే సైతం ఉంటారని సమాచారం.

‘వక్ఫ్’ పిటిషన్లపై 16న సుప్రీం విచారణ

సాక్షి, న్యూఢిల్లీ: వక్ఫ్(సవరణ)చట్టం–2025 చట్టబద్ధతను సవాల్ చేస్తూ ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ సహా దాఖలు చేసిన 10 వరకు పిటిషన్లపై సుప్రీంకోర్టు ఈ నెల 16న విచారణ చేపట్టనుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా సారథ్యంలోని త్రిసభ్య ధర్మాసనం వాదనలు వింటుందని సుప్రీంకోర్టు వెబ్‌సైట్ పేర్కొంది. ధర్మాసనంలో జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథ్ ఉంటారు. ఒవైసీతోపాటు ఆప్ నేత అమానతుల్లా ఖాన్, అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ అర్షద్ మదానీ, సమస్త కేరళ జమియతుల్ ఉలెమా, అంజుమ్ కదారి, తయ్యబ్ ఖాన్ సల్మానీ, మహ్మద్ షఫీ, మహ్మద్ ఫజలుర్రహీమ్, ఆర్‌జేడీ నేత మనోజ్ కుమార్ ఝా పిటిషన్లు వేశారు. ఈ చట్టంపై ఎలాంటి ఆదేశాలు జారీ చేసినా ముందుగా తమ వాదనను వినాలంటూ ఈ నెల 8న కేంద్రం సుప్రీంకోర్టులో కెవియెట్ దాఖలు చేయడం తెల్సిందే. పార్లమెంట్ ఆమోదం అనంతరం రాష్ట్రపతి ముర్ము సంతకం చేయడంతో వక్ఫ్(సవరణ) చట్టం–2025ను గురువారం నోటిఫై చేసింది. తీవ్ర వ్యతిరేకత నడుమ పార్లమెంట్ ఆమోదం పొందిన ఈ చట్టంతో తమిళనాడులోని 50 లక్షల మందితోపాటు దేశంలో ఉన్న 20 కోట్ల మంది ముస్లింల హక్కులకు భంగం వాటిల్లనుందని పిటిషనర్లలో ఒకటైన డీఎంకే అంటోంది. ఈ చట్టంలోని అంశాలు ఏకపక్షంగా, ప్రాథమిక హక్కులకు భంగకరంగా ఉన్నాయని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ (ఏఐఎంపీఎల్‌బీ) అంటోంది.

టార్గెట్ చైనా ఎందుకంటే..!

- ‘ప్రపంచ ఫ్యాక్టరీ’ ముద్రను చైనా నుంచి తొలగించాలని చూస్తున్న ట్రంప్
- అమెరికాకు ఫ్యాక్టరీలు బాటపట్టాలని అమెరికా అధ్యక్షుడు వ్యూహరచన
- టారిఫ్‌ల మోత అందుకేనని నిపుణుల విశ్లేషణ



కొళ్లబేరానికి వచ్చిన కారణంగా డజన్ల కొద్దీ ప్రపంచదేశాలపై ఆంక్షల కత్తిని దింపకుండా 90 రోజులు ఆగుతానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ప్రకటించారు. వాస్తవానికి బుధవారం నుంచే అన్ని దేశాలపై పెరిగిన టారిఫ్‌లు అమల్లోకి రావాల్సి ఉండగా ఆఖరి నిమిషంలో ట్రంప్ తన నిర్ణయాన్ని అనూహ్యంగా వాయిదా వేశారు. అయితే ఇందులో అనూహ్యమేమీ లేదని, ట్రంప్ అసలు లక్ష్యం ఈ దేశాలు కాదని, చైనాయే అసలు లక్ష్యమని కొందరు అంతర్జాతీయ వాణిజ్యరంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. వాళ్లు చెప్పినట్లు నిజంగానే ట్రంప్ కేవలం చైనా ఉత్పత్తులు, ఎగుమతి మార్కెట్‌పై కత్తిగట్టారా? అనే చర్చ ఇప్పుడు వాణిజ్యవర్గాల్లో మొదలైంది. దీనికి కొన్నేళ్ల క్రితమే బీజాలు పడ్డాయని తెలుస్తోంది.

తొలి దఫా పగ్గాలు చేపట్టినప్పుడే

దాదాపు 13 ఏళ్ల క్రితంనాటి సంగతి. చైనా వాణిజ్య రాజధాని షాంఘైలో హఠాత్తుగా అంతర్జాతీయ వాణిజ్య సంబంధాల బలోపేతంపై విస్తృతస్థాయి సమావేశాలు జరిగాయి. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వస్తూత్పత్తుల వినిమయ అవకాశం ఉన్న దేశాలతో చైనా వాణిజ్య సంబంధాలను బలపర్చుకుంది. అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు, కంపెనీలు, దేశాల ప్రభుత్వాలతో చైనా కమ్యూనిస్ట్ ప్రభుత్వం చర్చలు జరిపింది. చవగ్గా సరుకుల సరఫరాపై ఒప్పందాలు కుదిరాయి. విదేశీ సంస్థల ప్రతినిధులు, చైనా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఉన్నతాధికారులు, ప్రముఖ ఆర్థికవేత్తల మధ్య సఖ్యత కుదిరింది. దీంతో చైనా నుంచి అన్ని రకాల ఉత్పత్తుల ఎగుమతి అనూహ్యంగా ఊపందుకుంది. చైనాకు నిరాయుధ సైన్యంగా పేరొందిన కార్మికుల కష్టంతో పురుడుపోసుకున్న లక్షల కోట్ల రూపాయల వస్తువులు ప్రపంచదేశాలకు ఎగుమతి అయ్యాయి. ఆ పరంపర అప్రతిహతంగా కొనసాగి అమెరికాను తోసిరాజని చైనా ప్రపంచ ఎగుమతి కేంద్రంగా మారింది. మారిన ఈ పరిణామాలను ట్రంప్ అస్సలు జీర్ణించుకోలేకపోయారు. తక్కువ ధరకే వస్తువులు లభిస్తుండటంతో ప్రపంచదేశాల కీలక వ్యాపారసంస్థలన్నీ చైనాకే క్యూకట్టాయి. అక్కడ ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పాయి. రోల్స్ రాయిస్, జనరల్ మోటార్స్, ఫోక్స్‌వ్యాగన్ సంస్థల ఉత్పత్తులూ చైనాలో తయారవడం మొదలైంది. దీంతో దశాబ్దాల చరిత్ర కల్గిన అమెరికాలోని కొన్ని కంపెనీల నుంచి ఉత్పత్తి తగ్గింది. దీంతో అమెరికా పరిశ్రమల్లో కార్మికుల జీవితాల్లో వెలుగులు తగ్గిపోయాయి. అమెరికాకు పరిశ్రమల నుంచి రెవెన్యూ పడిపోయింది. అమెరికా పారిశ్రామికరంగానికి పూర్వవైభవం తెస్తానని తొలిసారి ఎన్నికల్లో పోటీచేసినప్పుడే ట్రంప్ ఓటర్లకు మాటిచ్చారు. గెలిచి అధికారం చేపట్టారు. కానీ ఆ నాలుగేళ్లలో అనుకున్న వ్యూహాలను అమలుచేయలేకపోయారు. దీనికి ఇతరత్రా కారణాలున్నాయి. ఇప్పుడు రెండోదఫా అధికారంలోకి రాగానే పాత ప్రణాళికలకు పదునుపెట్టి ప్రయోగిస్తున్నారు. దాని ఫలితమే ఈ టారిఫ్‌ల పరంపర.

ఎగుమతులు పెరిగాక చైనాలో ఏం జరిగింది?

ఎగుమతులతో చైనా ఆర్థికాభివృద్ధి సాధించాక అక్కడ పౌరులు పాలనలో సంస్కరణలు కోరుకున్నారు. కానీ ఏక పార్టీ, నియంతృత్వపాలనలో ఆ కల నెరవేరలేదు. కొనుగోలు శక్తి పెరిగాక వినిమయ సమాజంగా అభివృద్ధి చెందాలని జనం భావించినా అదీ నెరవేరలేదు. ప్రభుత్వం కేవలం ఎగుమతుల పైనా దృష్టిసారించింది. 2015లో బహిర్గతమైన ‘‘మేడిన్ చైనా 2025’ బ్లూప్రింట్ సైతం ఇదే విషయాన్ని ఉద్ఘాటించింది. గుండుసూది నుంచి గగనతల రక్షణ వ్యవస్థలదాకా, విద్యుత్‌వాహనాలు మొదలు అధునాతన యుద్ధవిహంగాల దాకా ప్రతి రంగంలో అగ్రగామిగా వెలుగొందడమే లక్ష్యంగా ముందుకుసాగి ఆ పనిలో సఫలీకృతమైంది. ఇదే సమయంలో అమెరికాలో ట్రంప్ రాజకీయ రంగప్రవేశంచేసి చైనా ఎగుమతి మార్కెట్ ఎదుగుదలకు అడ్డుకట్టవేయాలని కంకణం కట్టుకున్నారు. ఎన్నికల హామీల్లోనే అదే చెప్పారు. చైనా ఇప్పటికే ప్రపంచంలోని మొత్తం విద్యుత్ వాహనాల తయారీలో 60 శాతం వాటాను ఒడిసిపట్టింది. ఈ 60 శాతంలో కూడా అధిక బ్రాండ్లు స్వదేశానివే కావడం విశేషం. ఇక బ్యాటరీల్లోనూ 80 శాతం అక్కడే తయారవుతున్నాయి. వీటిని దెబ్బకొట్టేందుకే ట్రంప్ టారిఫ్‌ల కొరడాను ఝుళిపిస్తున్నారు. చైనా పరిశ్రమలను దెబ్బకొడితే అమెరికా పరిశ్రమలకు పునరుజ్జీవం సాధ్యమని ట్రంప్ బలంగా నమ్ముతున్నారు. ట్రంప్ నిర్ణయం యావత్ ప్రపంచ వాణిజ్యవ్యవస్థనే కుదుపునకు గురయ్యేలా చేస్తోంది.

ఇప్పుడేం జరగొచ్చు?

అతి టారిఫ్‌ల భారాన్ని అమెరికా తమపై మోపిన నేపథ్యంలో చైనా ముంగిట ఇప్పుడు రెండు మార్గాలున్నాయి. సంప్రదింపుల ప్రక్రియ ద్వారా టారిఫ్‌లను చైనా తగ్గించుకోవచ్చు. ఇందుకోసం చైనా తన ఎగుమతి ఆధారిత ఆర్థికవ్యవస్థ విధానాలను అమెరికాకు అనుగుణంగా మార్చుకోవాల్సి ఉంటుంది. అయితే చైనా గత చరిత్రను చూస్తే ఇది జరగకపోవచ్చని అర్థమవుతుంది. అగ్రగామి ప్రపంచ ఆర్థిక శక్తిగా మారేందుకు ఎన్నాళ్లనుంచో చైనా కలలుకంటోంది. అందుకోసమే ప్రభుత్వ వ్యతిరేకతను ఉక్కుపాదంతో అణిచివేస్తూ దాదాపు ప్రజలందర్నీ ఓ మోస్తరు వృత్తినిపుణులుగా మార్చేసింది. ఆటబొమ్మలు మొదలు ఫోన్‌లదాకా అన్ని వస్తువులు కుటీర పరిశ్రమల్లా ఇళ్లలోనే తయారవుతాయి. చైనాలో ఏం జరుగుతోందనే వివరాలు బయటకు పొక్కకుండా మీడియాపైనా కఠిన ఆంక్షలు కొనసాగుతున్నాయి. సొంత టెక్నాలజీనే నమ్ముకున్న ప్రభుత్వం దేశీయ సంస్థలు మినహా చైనా గడ్డపై ఎవరినీ ఎదగనీయదు. ఈ నేపథ్యంలో అమెరికా టెక్నాలజీ కంపెనీలకు చైనా గడ్డపై ఎదిగేందుకు ఒప్పుకోకపోవచ్చు. టారిఫ్‌ల భయాలతో విదేశీ కంపెనీలు చైనాలో పెట్టుబడులను తగ్గించుకుని అమెరికాలో పెట్టుబడులను పెంచుకుంటాయని ట్రంప్ భావిస్తున్నారు. చైనాకు ఆర్డర్లు ఇవ్వడం మానేసి అమెరికన్ కంపెనీలు మళ్లీ దేశీయంగా కర్మాగారాలను తెరుస్తాయని ట్రంప్ ఆశిస్తున్నారు. అదే నిజమైతే మళ్లీ అమెరికాలో కొత్త పారిశ్రామిక విప్లవం రావొచ్చు.

– సాక్షి, నేషనల్ డెస్క్

బిహార్‌లో వర్షాలు, పిడుగుల బీభత్సం

రెండు రోజుల్లో 38 మంది మృతి

పట్నా: బిహార్‌లో బుధ, గురువారాల్లో భారీ వర్షాలు, పిడుగుపాటు ఘటనలు 38 మందిని బలి తీసుకున్నాయి. బుధవారం 13 మంది చనిపోగా, గురువారం మరో 25 మంది మృత్యువాతపడ్డారు. వీరిలో మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారు. పిడుగులు పడటంతోపాటు చెట్లు, ఇళ్లు, కరెంటు స్తంభాలు కూలిన ఘటనల్లో అత్యధికంగా నలందలో 18 మంది చనిపోయారు. సివాన్‌లో ఇద్దరు, దర్భంగా, బెగుసరాయ్, కటిహార్, భాగల్పూర్, జెహానాబాద్‌లలో ఒక్కరు చొప్పున ప్రాణాలు కోల్పోయారు. క్షతగాత్రులైన మరో 11 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బుధవారం పిడుగులు పడిన ఘటనల్లో నాలుగు జిల్లాల్లో కలిపి 13 మంది చనిపోయారని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. మృతుల కుటుంబాలకు సీఎం నితీశ్‌కుమార్ సానుభూతి తెలిపారు. రూ.4 లక్షల చొప్పున వీరి కుటుంబాలకు సాయం అందజేస్తామని ప్రకటించారు. బిహార్‌లో 38 జిల్లాలకుగాను 24 జిల్లాలకు యెల్లో అలర్ట్, 8 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ వాతావరణ శాఖ ప్రకటించింది. శుక్ర, శనివారాల్లో భారీ వర్షాలు కూడా కురిసే అవకాశముందని తెలిపింది.

మా తలుపులు తెరిచే ఉన్నాయి

అమెరికాతో చర్చలపై చైనా

బీజింగ్/వాషింగ్టన్: టారిఫ్‌ల విషయంలో అమెరికాతో చర్చలకు తమ తలుపులు తెరిచే ఉన్నాయని చైనా వాణిజ్య శాఖ ప్రతినిధి హీ యోంగ్‌కియాన్ గురువారం చెప్పారు. తాము ఘర్షణ కోరుకోవడం లేదని అన్నారు. చైనా వైఖరి స్పష్టంగా, స్థిరంగా ఉందన్నారు. ఎవరూ కవ్వింపు చర్యలకు పాల్పడొద్దని సూచించారు. అమెరికాతో చర్చలు పరస్పర గౌరవం, సమానత్వం ప్రాతిపదికన జరగాలని ఆకాంక్షించారు. కానీ, ఒత్తిళ్లకు, బెదిరింపులకు గురిచేయడం, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడడం వంటి చర్యలకు దిగితే సహించబోమని హెచ్చరించారు. చైనాతో డీల్ చేసే విధానం అది కాదని అన్నారు. ఒకవేళ వాణిజ్య యుద్ధాన్ని అమెరికా మరింత ముందుకు తీసుకెళ్తే తాము చివరి వరకూ పోరాడుతామని తేల్చిచెప్పారు.

జిన్‌పింగ్ తెలివైన నాయకుడు: ట్రంప్

చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ చాలా తెలివైన నాయకుడని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసించారు. ఎప్పుడేం చేయాలో జిన్‌పింగ్‌కు బాగా తెలుసని అన్నారు. టారిఫ్‌ల విషయంలో చైనా పాలకులు అమెరికాతో ఒప్పందం కుదుర్చుకుంటారని భావిస్తున్నట్లు తెలిపారు. దీనిపై చర్చించడానికి జిన్‌పింగ్ నుంచి త్వరలోనే తనకు ఫోన్‌కాల్ వస్తుందని భావిస్తున్నానని చెప్పారు. చైనాలో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని ట్రంప్ స్పష్టంచేశారు.

చైనాపై 145 శాతం బాదుడు

చైనా ఉత్పత్తులపై 125 శాతం సుంకాలు విధిస్తున్నట్లు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ప్రకటించగా, మరో 20 శాతం సుంకాలను కూడా దీనికి జతచేసినట్లు శ్వేతసౌధం తాజాగా స్పష్టంచేసింది. చైనా నుంచి ఫెంటనిల్ అక్రమ రవాణాకు సంబంధించి గతంలో విధించిన 20 శాతం సుంకాలకు ఈ 125 శాతం సుంకాలు అదనమని తెలియజేసింది. చైనాపై మొత్తం సుంకాలు 145 శాతానికి చేరుకున్నట్లు నిర్ధారించింది. మరోవైపు అమెరికా ఉత్పత్తులపై చైనాలో సుంకాలు 84 శాతానికి చేరిన సంగతి తెలిసిందే.

ఇండియాపై 26 శాతం అదనపు టారిఫ్ జూలై 9 దాకా రద్దు

ఇండియాపై విధించిన 26 శాతం అదనపు టారిఫ్‌ను 90 రోజులపాటు రద్దు చేస్తున్నట్లు వైట్ హౌస్ ప్రకటించింది. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేసింది. ఈ ఏడాది జూలై 9 దాకా ఈ అదనపు సుంకాలు అమల్లో ఉండవని పేర్కొంది.

అమెరికాపై ప్రతీకార సుంకాలు

90 రోజులు వాయిదా

యూరోపియన్ యూనియన్ ప్రకటన

బ్రస్సెల్స్: అమెరికా ఉత్పత్తులపై ప్రతీకార సుంకాల అమలును 90 రోజులపాటు నిలిపివేస్తున్నట్లు యూరోపియన్ యూనియన్(ఈయూ) ఎగ్జిక్యూటివ్ కమిషన్ గురువారం వెల్లడించింది. తమ ఉత్పత్తులపై విధించిన టారిఫ్‌లను 90 రోజులు నిలిపివేస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో తాము సైతం ఆయన బాటలో నడవనున్నట్లు ప్రకటించింది. టారిఫ్‌ల విషయంలో అమెరికాతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లెయెన్ గురువారం ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. 23.25 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా ఉత్పత్తులపై సుంకాలు విధిస్తూ ఇప్పటికే తీసుకున్న నిర్ణయాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని చెప్పారు. అమెరికాలో చర్చలకు ఒక అవకాశం ఇవ్వాలన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉద్ఘాటించారు. చర్చలు సంతృప్తికరంగా సాగకపోతే అమెరికాపై ప్రతీకార సుంకాలు కచ్చితంగా అమల్లోకి వస్తాయని స్పష్టంచేశారు. ఈయూ నుంచి దిగుమతి అయ్యే స్టీల్, అల్యూమినియంపై ట్రంప్ తొలుత 25 శాతం టారిఫ్ విధించిన సంగతి తెలిసిందే. దీన్ని 90 రోజులపాటు ఆయన నిలిపివేశారు.

వ్యతిరేక పోస్టులుంటే

నో వీసా, నో పర్మిట్



వాషింగ్టన్: సోషల్ మీడియా ఖాతా చూస్తే వ్యక్తుల గురించి తెలిసిపోతుంది. అందుకే.. అమెరికా ఇమిగ్రేషన్ అధికారులు ఇప్పుడు దానిపై దృష్టి పెట్టారు. సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించిన తరువాతే వీసాలు, నివాస అనుమతులు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. హమాస్, పాలస్తీనా ఇస్లామిక్ జీహాద్, లెబనాన్‌కు చెందిన హెజ్‌బొల్లా, యెమెన్‌కు చెందిన హౌతీలతో సహా ఉగ్రవాదులుగా అమెరికా వర్గీకరించిన గ్రూపులకు మద్దతుగా సోషల్ మీడియాలో పోస్టులుంటే వారికి అమెరికాలోకి ప్రవేశం లేదు. అమెరికా, ఇజ్రాయెల్ వ్యతిరేక పోస్టులుంటే వీసాలు, నివాస అనుమతులు నిరాకరిస్తామని తెలిపారు. ఈ విధానం తక్షణమే అమల్లోకి వస్తుందని హోంల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ ఏజెన్సీ అయిన యూఎస్ సిటిజన్ షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ తెలిపింది. అమెరికాలో ఉండేందుకు పర్మనెంట్ రెసిడెంట్ ‘గ్రీన్ కార్డుల’ కోసం దరఖాస్తు చేసేవారికీ ఇది వర్తిస్తుందని పేర్కొంది. విదేశీ ఉగ్రవాదాన్ని, యాంటీసెమిటిక్ ఉగ్రవాద సంస్థలు లేదా ఇతర యాంటీసెమిటిక్ కార్యకలాపాలను సమర్థించడం, ప్రోత్సహించడం లేదా మద్దతు ఇచ్చేవిగా సోషల్ మీడియా కంటెంట్ ఉంటే.. యూఎస్ ప్రతికూల అంశంగా పరిగణిస్తుందని ఏజెన్సీ తెలిపింది. ప్రపంచంలోని ఉగ్రవాద సానుభూతిపరులకు అమెరికాలో చోటు లేదని డీహెచ్ఎస్ పబ్లిక్ అఫైర్స్ అసిస్టెంట్ సెక్రటరీ ట్రిసాయ మెక్లాఫ్లిన్ అన్నారు. మరోఅడుగు ముందుకేసి అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో.. రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనే విద్యార్థులను ఉన్మాదులుగా అభివర్ణించారు.

సాక్షి
హైదరాబాద్
శుక్రవారం । 11 । ఏప్రిల్ । 2025



బుల్లెట్ తీసి బతికించారు..
యువకుడి తలలోకి దూసుకెళ్లిన బుల్లెట్‌ను కేర్ హాస్పిటల్ వైద్యులు శస్త్ర చికిత్సతో వెలికితీశారు. విలేకరుల సమావేశంలో డాక్టర్ లక్ష్మీనాథ్ శివరాజు వివరాలు వెల్లడించారు. -8లో



శిక్షణే వినూత్న లక్షణం..
వేసవి సెలవుల్లో సమ్మర్ క్యాంపులకు నగరం వేదికగా మారింది. విద్యార్థులు, యువతకు వివిధ రంగాల్లో నైపుణ్యం పెంపొందించుకునేందుకు అవకాశం ఏర్పడింది. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
38.0/25.0

వాతావరణం
నగరంలో శుక్రవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 38, కనిష్టంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

రేపు తాగునీటి సరఫరాలో అంతరాయం

సాక్షి, సిటీబ్యూరో: గోదావరి తాగునీటి సరఫరా పథకంలో భాగంగా హైదర్ నగర్ నుంచి అల్వాల్ వరకు 1200 ఎంఎం డయా ఎంఎస్ గ్రావిటీ మెయిన్ పైపులైన్‌కు షాపూర్ నగర్ వద్ద మరమ్మతు పనులు చేపడుతున్న నేపథ్యంలో శనివారం ఉదయం 6 నుంచి సాయంత్రం 9 గంటల వరకు కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా, మరికొన్ని ప్రాంతాల్లో పాక్షికంగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జలమండలి గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది.

అంతరాయం ఏర్పడే ప్రాంతాలివే..
నగర శివారులోని షాపూర్‌నగర్, సంజయ్ గాంధీ నగర్, కళావతి నగర్, హెచ్ఎంటీ సొసైటీ, హెచ్ఏఎల్ కాలనీ, టీఎస్ఐఐసీ కాలనీ, రోడ మేస్త్రి నగర్, శ్రీనివాస్ నగర్, ఇందిరానగర్, గాజులరామారం, శ్రీ సాయి హిల్స్, దేవేందర్ నగర్, కైలాస్ హిల్స్, బాలాజీ లేఅవుట్, కైసర్ నగర్, గాజులరామారం తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని జలమండలి స్పష్టం చేసింది.

21 నుంచి అరుదైన నాణేలు, కరెన్సీ ప్రదర్శన



చార్మినార్: ఈ నెల 21, 22, 23 తేదీల్లో పాతబస్తీలోని ఉర్దూ ఘర్‌లో అరుదైన అంతర్జాతీయ నాణేలు, కరెన్సీ నోట్లు, పురాతన వస్తువుల ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు సందర్శకులకు ప్రవేశం ఉచితమని పేర్కొన్నారు. అరుదైన నాణేలు, పేపర్ కరెన్సీ, స్టాంపులు, పెయింటింగ్‌ల ప్రదర్శన చరిత్రపై ఆసక్తి ఉన్నవారికి ఈ ఎగ్జిబిషన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగే ఈ అంతర్జాతీయ నాణేలు, కరెన్సీ ఎగ్జిబిషన్ అందరికీ అందుబాటులో ఉంటుందని.. తమకు కావాల్సిన వాటిని ఖరీదు చేయవచ్చని, అలాగే తమ వద్ద ఉన్న పురాతన నాణేలను విక్రయించవచ్చని సొసైటీ కార్యదర్శి డాక్టర్ సయ్యద్ అబ్దుల్ హై ఖాద్రీ తెలిపారు. నాణేలు, పేపర్ కరెన్సీ, స్టాంపులు, పెయింటింగ్‌లతో పాటు ఇతర పురాతన వస్తువుల మిశ్రమ కలయిక వస్తువులను ఎగ్జిబిషన్‌లో సందర్శకులకు అందుబాటులో ఉంచుతున్నామన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

అనుదీప్ దురిశెట్టి

లక్డీకాపూల్: జిల్లాలో మాతృ మరణాలు సంభవించకుండా గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వారికి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని, చికిత్సలు అందించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మాతృ మరణాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణుల (జనన పూర్వ సంరక్షణ) సేవలను మెరుగుపరచాలని, వారి ఆరోగ్యంపై ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఫాలోఅప్ చేయాలన్నారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కాన్పు సమయాల్లో ఇబ్బంది కలగకుండా, తల్లీబిడ్డలు క్షేమంగా ఉండేలా వైద్య సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే కాన్పు కోసం రిఫరల్ ఆస్పత్రికి పంపించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, అదనపు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ జయమాలిని, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సుచేతన, గాంధీ మెడికల్ కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యవతి, ఎస్పీహెచ్ఓలు, మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

52 కిలోల గంజాయి పట్టివేత

చిలకలగూడ : సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఏడో నంబరు ప్లాట్‌ఫారంపై తరలించేందుకు సిద్ధంగా ఉంచిన రూ. 26 లక్షల విలువైన 52 కిలోల గంజాయిని ఆర్పీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్పీఎఫ్ ఎస్ఐ రమేష్ నేతృత్వంలో సిబ్బంది సూర్య, నరేష్, రమేష్‌లు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఏడో నంబరు ప్లాట్‌ఫారంపై 26 బ్యాగులను గుర్తించారు. అక్కడ ఉన్న ప్రయాణికులు, షాప్‌కీపర్స్‌ను వాకబు చేశారు. అనుమానం వచ్చిన పోలీసులు సదరు బ్యాగులను తెరిచి చూడగా గంజాయి కనిపించింది. మొత్తం 26 బ్యాగుల్లో 52 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు గురువారం సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ ఎస్ఎన్ జావేద్ తెలిపారు.





గ్యారంటీ.. ఇవ్వరేంటీ!

కేంద్రం పూచీకత్తు ఇస్తే రెండో దశ మెట్రో నిధులిస్తానంటున్న జైకా

వివిధ నగరాల్లో మెట్రో రెండు, మూడో దశలు ఇలా...

చెన్నై: మెట్రో రెండో దశకు రూ.63,246 కోట్లతో అంచనాలు 2024 అక్టోబర్‌లో ఆమోదం.

బెంగళూరు: సుమారు రూ.14,788 కోట్ల అంచనాలతో చేపట్టిన మెట్రో రెండో దశకు 2021 ఏప్రిల్‌లో అనుమతి లభించింది. మూడో దశలో భాగంగా రూ. 15,611 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టుకు 2024 ఆగస్టులో అనుమతి.

హైదరాబాద్: రెండో దశ ప్రాజెక్టు కోసం రూ. 24,269 కోట్లతో రూపొందించిన ప్రాజెక్టు డీపీఆర్‌ను 2024 నవంబర్‌లోనే కేంద్రానికి అందజేశారు. కానీ.. ఇప్పటివరకూ అనుమతి లభించలేదు.



- ఆ సంస్థతో చర్చలు జరుపుతున్న హెచ్ఏఎంఆర్ఎల్
- కేంద్ర ప్రభుత్వ అనుమతి లభించకపోవడంతోనే జాప్యం
- ప్రైవేట్ సంస్థల నుంచి 52 శాతం నిధుల సేకరణకు కసరత్తు

సాక్షి, సిటీబ్యూరో:

'అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్నట్లుంది రెండో దశ మెట్రో పరిస్థితి. నిధులిచ్చే సంస్థలు ఉన్నా అడుగు ముందుకు పడటంలేదు. ప్రతిపాదనలు, ప్రణాళికలు, సమగ్రమైన ప్రాజెక్టు నివేదికలను కూడా సిద్ధం చేసుకొని, చివరకు నిధులను సమకూర్చే సంస్థలను సైతం ఎంపిక చేసుకున్నప్పటికీ కేంద్రం ప్రాపకం లభించకపోవడంతో రెండో దశ మెట్రో ప్రాజెక్టుపై ప్రతిష్టంభన నెలకొంది. నిధుల సేకరణలో భాగంగా హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఏఎంఆర్ఎల్) సంస్థ పలు అంతర్జాతీయ ఆర్థిక సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది. ఈ క్రమంలో రెండో దశ మెట్రోకు నిధులను అందజేసేందుకు జపాన్‌కు చెందిన ఆర్థిక సంస్థ జైకా నుంచి సుముఖత లభించినట్లు తెలిసింది. ఆ సంస్థ ప్రతినిధులతో హెచ్ఏఎంఆర్ఎల్ ఇప్పటికే పలుమార్లు చర్చలు జరిపింది. ప్రస్తుతం ప్రక్రియ కూడా తుది దశకు చేరుకున్నట్లు సమాచారం. కేవలం కేంద్రం నుంచి సావరిన్ గ్యారంటీ లభించకపోవడం అనేదే ఇప్పుడు సాంకేతికంగా ఎదురవుతున్న సమస్య. రెండో దశపై రూపొందించిన డీపీఆర్‌లను రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో కేంద్రానికి పంపించి 6 నెలలైంది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి కనెక్టివిటీనిచ్చే ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే పలుమార్లు కేంద్ర మంత్రులను కూడా కలిశారు. కానీ ఇప్పటికీ కేంద్రం నుంచి సావరిన్ గ్యారంటీ లభించలేదు. దీంతో రుణాలు ఇచ్చే సంస్థలు సిద్ధంగా ఉన్నప్పటికీ పనులు చేపట్టలేని పరిస్థితి నెలకొంది.

ప్రైవేట్ సంస్థల నుంచి 52 శాతం నిధుల సేకరణ..

మెట్రో రెండో దశలో ప్రతిపాదించిన 76.4 కిలోమీటర్ల కారిడార్‌ల నిర్మాణానికయ్యే మొత్తం వ్యయం రూ.24,269 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఇందులో 30 శాతం అంటే రూ.7,313 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోంది. మరో 18 శాతం నిధులు అంటే రూ.4,230 కోట్లు కేంద్రం భరించాల్సి ఉంటుంది. మిగతా 52 శాతం నిధులు.. రూ.12,726 కోట్లు అంతర్జాతీయ సంస్థల నుంచి రుణాల రూపంలో సేకరించాలని నిర్ణయించారు. మెట్రో స్టేషన్‌లలో మౌలిక సదుపాయాలతో పాటు పలు పనులను పీపీపీ విధానంలో చేపట్టాలని ప్రతిపాదించారు. కేంద్రం నుంచి లభించే ఆర్థిక సహాయంతో పాటు రుణాల సేకరణ ద్వారా ఈ ప్రాజెక్టును చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు జైకా సంస్థ నుంచి సానుకూలత లభించింది. కేంద్రం అనుమతి సహా అన్నీ అనుకూలిస్తే 2028 నాటికి ప్రతిపాదిత 5 కారిడార్‌లలో రైళ్లను నడపాలని హెచ్ఏఎంఆర్ఎల్ లక్ష్యంగా పెట్టుకుంది.

– గతేడాది డీపీఆర్‌లు సిద్ధం చేసినప్పటికీ ఇప్పటి వరకు సావరిన్ గ్యారంటీ లభించకపోవడంతో తీవ్రమైన జాప్యం నెలకొంది. 'మెట్రో రెండో దశకు నిధుల కొరత ఏ మాత్రం సమస్య కాదు. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు నిధులను ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. కానీ కేంద్రం అనుమతి లభించడమే కీలకం' అని అధికారులు చెబుతున్నారు. జైకాతో సంప్రదింపులు చాలావరకు తుదిదశకు చేరుకున్నాయని పేర్కొన్నారు. ఇతర మెట్రోపాలిటన్ నగరాల్లో మెట్రో రెండు, మూడో దశలు కూడా పూర్తయ్యాయి. కానీ.. హైదరాబాద్‌లో మాత్రం ఏడు సంవత్సరాలు ఆలస్యంగా రెండోదశకు ప్రణాళికలను రూపొందించారు.ప్రస్తుతం మొదటి దశలోని 69 కిలోమీటర్ల కారిడార్‌లలో 5 లక్షల మంది ప్రయాణం చేస్తుండగా, రెండో దశలో ప్రతిపాదించిన 5 కారిడార్‌లు అందుబాటులోకి వస్తే ప్రయాణికుల సంఖ్య 8 లక్షలు దాటే అవకాశం ఉన్నట్లు అంచనా.

ఆస్తుల లెక్క.. ఇక పక్కా!

లే ఔట్ ఖాళీ స్థలాలు, పార్కులు, బల్దియా కార్యాలయాలు..

- మార్కెట్లు, కమ్యూనిటీ హాళ్లు, స్థిరాస్తులు తదితరాలు
- అంగుళం సైతం తేడా రాకుండా డీజీపీఎస్ సర్వే
- తొలుత ఎల్‌బీనగర్, కూకట్‌పల్లి జోన్ల పరిధిలో..
- కన్సల్టెంట్లకు జీహెచ్ఎంసీ ఆహ్వానం



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో కోటి మందికి పైగా ప్రజలకు వివిధ పౌర సేవలందిస్తున్న జీహెచ్ఎంసీకి ప్రధాన, జోనల్, సర్కిల్ కార్యాలయాలతో పాటు పలు ఆస్తులున్నాయి. మున్సిపల్ మార్కెట్లు, షాపులు, భూములతో పాటు పార్కులు, డంపింగ్ యార్డులు, స్లాటర్ హౌస్‌లు తదితరాలున్నాయి. అయినా.. తమ స్థిరాస్తులు ఎక్కడ ఎన్ని ఉన్నాయో, ఎవరి స్వాధీనంలో ఉన్నాయో, ఎంత విస్తీర్ణంలో ఉన్నాయో, వాటిలో ఎవరుంటున్నారో కనీస వివరాలు కూడా జీహెచ్ఎంసీ వద్ద లేకుండాపోయాయి. అంతేకాదు.. లేఔట్‌ల ఖాళీ స్థలాల్లో పార్కులు, ఆటస్థలాలు, ఇతరత్రా సదుపాయాలు కల్పించాల్సి ఉండగా, అసలు ఆ లేఔట్లలోని ఖాళీ ప్రదేశాలు ఎన్ని చోట్ల ఉన్నాయో, ఎంత విస్తీర్ణంలో ఉన్నాయో వంటి వివరాలు కూడా జీహెచ్ఎంసీ వద్ద లేవు. సుదీర్ఘ కాలం మొద్దు నిద్ర తర్వాత ఎట్టకేలకు జీహెచ్ఎంసీ తమ ఆస్తులెన్ని ఉన్నాయో కచ్చితంగా తెలుసుకోవాలనే నిర్ణయానికొచ్చింది. అందుకుగాను ఆషామాషీగా కాకుండా కచ్చితమైన, అంగుళం కూడా తేడా రాకుండా వాటిని కనిపెట్టడంతో పాటు రియల్ టైమ్‌లోనూ వాటిని ఆన్‌లైన్ ద్వారా వీక్షించే సదుపాయం ఉండాలని భావిస్తోంది. అందుకోసం తమ స్థిరాస్తుల సర్వే, డిజిటలీకరణ, జియో రిఫరెన్సింగ్ తదితరమైనవి చేయగల కన్సల్టెంట్ల సేవలను ఆహ్వానిస్తూ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ఎఫ్‌పీ)టెండర్లను ఆహ్వానించింది. ఈ పనులకు ఎంపికయ్యే కన్సల్టెన్సీ జీపీఎస్ సర్వే కాకుండా అంగుళం వరకు కూడా కచ్చితమైన వివరాలందజేయగల డీజీపీఎస్ (డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) సర్వే నిర్వహించాల్సి ఉంటుంది.

సర్వే చేయాలిలా..
ప్రతి ఆస్తికి సంబంధించిన విస్తీర్ణం, సరిహద్దులు, చుట్టుపక్కల ఉన్న భవనాలు, రోడ్లు, వాటర్, విద్యుత్, సివరేజి వంటి యుటిలిటీస్ లైన్లు తదితరమైనవి డీజీపీఎస్‌ను ఉపయోగించి చేయాలి. ఆస్తికి సంబంధించి ప్రతీ మూల రియల్ కోఆర్డినేట్లు గుర్తించాలి. అన్ని భవనాల ముందు, పక్కల, లోపల దృశ్యాలు కనిపించేలా ఫొటోలు తీయాలి. సదరు భవనం జీహెచ్ఎంసీ ఏ సర్కిల్‌లో ఉందో పేర్కొనడంతో పాటు సర్వే నెంబరు, టౌన్ సర్వే నెంబరు, డోర్ నెంబర్, లొకాలిటీ పేరు, గ్రామం, మండలం, జిల్లా పేర్లతో పాటు ఖాళీ ప్రదేశమా, భవనమా, భవనమైతే నాలుగువైపులా సరిహద్దులు, ప్రహరీ ఉందా.. లేదా? భవనమైతే ప్రస్తుత వినియోగం, బిల్టప్ ఏరియా, భవనంపేరు వంటి వివరాలు పొందుపరచాలి.

- లే ఔట్ ఓపెన్ స్పేస్‌లైతే లే ఔట్ పేరు, నెంబరు, లే ఔట్ మేరకు ఎంత ఓపెన్‌స్పేస్ ఉండాలి.. ఎంత ఉంది.. (చదరపు గజాల్లో), ఎంత మేర కబ్జా అయింది, కబ్జాలో జరిగిన నిర్మాణాల వంటి వివరాలు సైతం పొందుపరచాలి. జీహెచ్ఎంసీకి సంబంధించిన స్థిరాస్తులన్నింటికీ యూనిక్ ఐడీ నెంబరు ఇవ్వాలి. ఇందుకుగాను తగినన్ని బృందాల్ని నియమించాలి. జోన్‌కు కనీసం రెండు బృందాల వంతున ఆరు జోన్లకు తగినన్ని బృందాల్ని నియమించాలి. ఈ బృందాలకు ఆయా అంశాల్లో జీహెఎంసీ టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇంజినీరింగ్ విభాగాలు సహకరిస్తాయి. టౌన్‌ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో సర్వే చేయిస్తారు. తొలుత ప్రయోగాత్మకంగా ఎల్‌బీనగర్, కూకట్‌పల్లి జోన్లలో ఈ సర్వే నిర్వహిస్తారు.

ఈదురు గాలులు.. మోస్తరు జల్లులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో పలు చోట్ల ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. గురువారం ఉదయం నుంచే వాతావరణం చల్లబడగా.. సాయంత్రం హిమాయత్‌నగర్, హఫీజ్‌పేట, ఆర్‌సీ పురం, లింగంపల్లి, చందానగర్, మియాపూర్, గచ్చిబౌలి, మేడ్చల్, ఎస్ఆర్ నగర్, పంజాగుట్ట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. మరి కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరుగా జల్లులు పడ్డాయి. నగరంలో రానున్న 48 గంటల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని, ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది.

తొలిరోజు.. తడబాటు

సాంకేతిక సమస్యతో గంట సేపు ఆలస్యం

- మందకొడిగా సాగిన దస్తావేజుల నమోదు

తొలి రోజు స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ నమోదు ఇలా

సబ్ రిజిస్ట్రార్	మొత్తం స్లాట్లు	బుకింగ్	నమోదు
ఆజంపురా	48	28	26
కుత్బుల్లాపూర్	144	93	93
మేడ్చల్ ఆర్వో	48	44	41
చంపాపేట	48	10	08
చిక్కడపల్లి	48	19	16
వల్లభ్‌నగర్	48	17	15
శంషాబాద్	48	18	18
సరూర్ నగర్	48	23	23

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ ద్వారా స్థిరాస్తి రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ తొలిరోజు గురువారం సాంకేతిక సమస్యతో మందకొడిగా సాగింది. రిజిస్ట్రేషన్ శాఖ సర్వర్‌లో ఉదయం సాంకేతిక సమస్యలు ఏర్పడటంతో ఉదయం 11 గంటల తర్వాత దస్తావేజుల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఎనిమిది సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుల్లో స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ పక్రియను డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ)లు మధుసూదన్ రెడ్డి, సైదిరెడ్డి, జిల్లా రిజిస్ట్రార్లు అశోక్ కుమార్, ఆర్.తులసి తదితరులు పరిశీలించారు. కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసును మేడ్చల్ కలెక్టర్ గౌతం సందర్శించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు.

ఇలా సాగింది..
- మలక్‌పేటలో తొలి స్లాట్ బుకింగ్ రిజిస్ట్రేషన్‌కు దాదాపు 45 నిమిషాల సమయం పట్టింది. తదుపరి రిజిస్ట్రేషన్లు 20 నుంచి 30 నిమిషాల వ్యవధిలో పూర్తయ్యాయి.
- శంషాబాద్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉదయం 11:30 గంటలకు తొలి దస్తావేజు నమోదు పూర్తయింది.



మేడ్చల్‌లో దస్తావేజు పత్రాలు అందజేస్తున్న అధికారులు

ఈజీగానే ఉంది: అమీన్ సుల్తానా, శంషాబాద్



స్లాట్ బుకింగ్ ద్వారా స్థిరాస్తి రిజిస్ట్రేషన్ ఈజీగానే ఉంది. మేం ఒక రోజు ముందు బుక్ చేసుకున్నాం. ఉదయం 11 గంటలకు స్లాట్ దొరికింది. 11.20 గంటల వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయింది. రద్దీ లేకుండా బాగుంది.

గంటసేపు పట్టింది: జక్కా మోహన్‌రెడ్డి, మూసారంబాగ్




ప్లాట్ రిజిస్ట్రేషన్ కోసం వచ్చాం. స్లాట్ బుకింగ్ చేసుకున్నాం. ఆఫీసుకు వచ్చిన తర్వాత గంట లోపల అన్ని పనులు పూర్తయ్యాయి. 30 నిమిషాల్లో రిజిస్ట్రేషన్, ఆ తర్వాత రిజిస్ట్రేషన్ పత్రాలు వచ్చాయి.

సిటీ @ 26/11

నగరంలోనూ ముంబై ఉగ్రదాడుల చేదు గుర్తులు

- దాడుల్లో కన్నుమూసిన ఇద్దరు హైదరాబాదీలు
- ఇక్కడి అడ్రస్‌లతో ఉగ్రవాదుల గుర్తింపు కార్డులు
- ఎట్టకేలకు అమెరికా నుంచి తెహవూర్ రాణా తరలింపు



తెహవూర్ రాణా



గోయల్

సాక్షి, సిటీబ్యూరో: 26/11 ముంబై మారణహోమం కేసులో కీలక నిందితుడిగా ఉన్న తెహవూర్ రాణాను ఎట్టకేలకు ఢిల్లీకి తీసుకువచ్చారు. గురువారం అమెరికా నుంచి ప్రత్యేక విమానంలో ఇండియాకు ఇతడిని తీసుకువచ్చినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ ప్రకటించింది. ముంబై మహా నగరంలో 2008 నవంబర్ 26న అజ్మల్ కసబ్ సహా పది మంది సృష్టించిన మారణకాండకు సంబంధించి భాగ్య నగరంలోనూ కొన్ని చేదు గుర్తులున్నాయి. నాటి దాడుల్లో ఇద్దరు హైదరాబాదీలు మరణించగా.. నగరంలోని కొన్ని ప్రాంతాల చిరునామాలతో ఉగ్రవాదుల దగ్గర నకిలీ గుర్తింపు కార్డులు లభించాయి. దీంతో కొందరు నగరవాసులు ఆ కేసుల్లో సాక్షులుగా వాంగ్మూలం ఇచ్చారు.


అసువులు బాసిన ఇరువురు..
మారణహోమం సృష్టించడానికి పాకిస్థాన్ నుంచి సముద్ర మార్గంలో వచ్చిన ఉగ్రవాదులు 'బుద్వార్ పార్క్ జెట్టీ' నుంచి ఓ ట్యాక్సీలో 'వీటీ' రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ దిగుతూ.. అందులో బాంబు అమర్చారు. పాతబస్తీకి చెందిన కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ కన్సల్టెంట్ అడ్వొకేట్ లక్ష్మీ నారాయణ గోయల్ ఓ కేసు పని నిమిత్తం ముంబై వెళ్లారు. తిరుగు ప్రయాణంలో భాగంగా అదే రోజు కాందవెల్లీ ప్రాంతం నుంచి 'వీటీ' రైల్వే స్టేషన్‌కు ఆలస్యంగా చేరుకున్నారు. దీంతో ఆయన ఎక్కాల్సిన హుస్సేన్‌సాగర్ ఎక్స్‌ప్రెస్‌ను మిస్సయ్యారు. వీటీ స్టేషన్ నుంచి తిరిగి కాందవెల్లీలోని తన మరదలు ఉష ఇంటికి వెళ్లడానికి ఉగ్రవాదులు దిగిన ట్యాక్సీనే ఎక్కారు. ఈ ట్యాక్సీ 'విల్లే పార్లే' సమీపంలోకి చేరుకోగానే అందులోని బాంబు పేలడంతో ఆయన కన్నుమూశారు. నగరంలోని నేరేడ్‌మెట్ పరిధిలోని డిఫెన్స్ కాలనీకి చెందిన విజయరావు బాంజే అక్కడి తాజ్ హోటల్‌లో చీఫ్ చెఫ్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేశారు. ముష్కరులు టార్గెట్ చేసిన వాటిలో ఈ హోటల్ కూడా ఒకటి. అతిథులను రక్షించే ప్రయత్నంలో ఉగ్రవాదుల తూటాలకు బాంజే బలయ్యారు.

బోగస్ గుర్తింపు కార్డుల్లోనూ...
26/11 దాడుల్లో పాల్గొన్న పది మంది ఉగ్రవాదుల్లో తొమ్మిది మంది దగ్గర బోగస్ పేర్లతో గుర్తింపు కార్డులు లభించాయి. వీటిలో కొన్నింటిపై హైదరాబాద్‌లోని వివిధ చిరునామాలు ముద్రించి ఉన్నాయి. ఈ మారణహోమంలో సజీవంగా దొరికిన ఉగ్రవాది అజ్మల్ కసబ్ (2012లో ఉరి తీశారు) దగ్గర లభించిన బోగస్ గుర్తింపు కార్డులో నాగోలు ప్రాంతానికి చెందిన చిరునామా ఉంది. దిల్‌సుఖ్‌నగర్‌లోని అరుణోదయ డిగ్రీ కళాశాలలో చదువుతున్నట్లుగా చక్రబర్తి పేరుతో ఉన్న ఆ గుర్తింపు కార్డులో నాగోలులోని మమతానగర్ కాలనీ, ఇస్మాయిల్ ఖాన్‌కు నరేష్ విలాస్ వర్మ పేరుతో నాగోలు, నిస్సార్‌కు దినేష్‌కుమార్ పేరుతో సరూర్‌నగర్‌లోని హుడా కాలనీ, ఫహదుల్లాకు రోహిత్ దీపక్ పాటిల్ పేరుతో విజయ్‌నగర్ కాలనీలోని ఎస్‌కే అపార్ట్‌మెంట్స్ చిరునామాలతో నకిలీ గుర్తింపు కార్డులు తయారు చేశారు. ఈ నేపథ్యంలోనే ముంబై దాడుల కేసులు దర్యాప్తు చేసిన అక్కడి క్రైమ్ బ్రాంచ్ అధికారులు హైదరాబాద్ సైతం వచ్చి నాగోలు, అరుణోదయ డిగ్రీ కళాశాలలో విచారణ చేశారు. 26/11 ఉదంతాలపై నమోదైన కేసుల్లో అరుణోదయ కాలేజీ ప్రిన్సిపల్‌గా పని చేసిన రాధాకృష్ణయ్య, గోయల్, బాంజే కుటుంబాలు సైతం కీలక సాక్షిగా ఉండి న్యాయస్థానంలో వాంగ్మూలం ఇచ్చాయి.

అప్పట్లో 48 గంటల ఉత్కంఠ..
దాడులు జరుగుతున్న రోజే ఆ ఉగ్రవాదుల్లో షాదుల్లాహ్, ఇమ్రాన్ బాబర్ ఓ న్యూస్ ఛానల్ ఫోన్ ద్వారా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇందులో తమది హైదరాబాద్ అంటూ చెప్పడంతో తీవ్ర కలకలం రేగింది. వాళ్లు ఎవరు? నగరంలో ఎక్కడి వాళ్లు? అనే ఉత్కంఠ 48 గంటలు నెలకొంది. చివరకు లింగ్విస్టిక్ ఎక్స్‌పర్ట్స్ (భాషా నిపుణుల) వల్ల దీనికి తెర పడింది. ఈ నిపుణులు ఉగ్రవాదుల ఇంటర్వ్యూ రికార్డులు విశ్లేషించారు. వీరి మాటల్లో 'జిహాద్' (పవిత్ర యుద్ధం), 'జుల్మ్' (అట్రాసిటీ) పదాలే ఎక్కువగా ఉన్నాయి. వీరు వాడిన మాండలికం ఆధారంగా పాకిస్థాన్‌లోని పంజాబ్, పెషావర్‌లకు చెందిన వారుగా భాషా నిపుణులు నిర్ధారించారు. టెర్రరిస్టులు వాడిన 'ఖత్లే ఆమ్' (సామూహిక మారణకాండ) పదాన్ని అక్కడి వారే ఉచ్చరిస్తారని తేల్చారు. ఇలా మరికొన్ని పదాలను విశ్లేషించిన నిపుణులు ఉగ్రవాదులకు హైదరాబాద్‌తో సంబంధం లేదని తేల్చారు. దీంతో పోలీసు, నిఘా వర్గాలు ఊపిరి పీల్చుకున్నాయి.



ముంబై పేలుళ్ల దృశ్యం (ఫైల్)



ఐడీ కార్డు

15న స్త్రీ సమ్మిట్ 2.0

లోగో ఆవిష్కరించిన కొత్వాల్ ఆనంద్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో మహిళల భద్రతను మరింత పెంచడమే లక్ష్యంగా హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్‌తో (హెచ్‌సీఎస్‌సీ) కలిసి సిటీ పోలీసులు 'స్త్రీ' (షీ ట్రంప్స్ త్రూ రెస్పెక్ట్, ఈ క్వాలిటీ అండ్ ఎంపవర్‌మెంట్) పేరుతో మరోసారి సదస్సు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 2023లో ఓసారి ఈ సదస్సు నిర్వహించారు. ఈ నెల 15న నిర్వహించనున్న రెండో సమ్మిట్‌కు సంబంధించిన లోగోను కొత్వాల్ సీవీ ఆనంద్ గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. వివిధ వర్గాలకు చెందిన మహిళలు, యువతులతో పాటు నిపుణులు ఈ సమ్మేళనంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా తమ అనుభవాలను పంచుకోవడంతో పాటు సలహాలు, సూచనలు ఇస్తారు.

బుల్లెట్ తీసి బతికించారు..

రెండు నెలలకు పైగా తలలో బుల్లెట్

- గచ్చిబౌలి కేర్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్స
- 3.5 సెంటీ మీటర్ల బుల్లెట్‌ను బయటకు తీసిన కేర్ వైద్యులు
- సురక్షితంగా బయటపడ్డ సోమాలియా యువకుడు



వివరాలను వెల్లడిస్తున్న డాక్టర్ లక్ష్మీనాథ్ శివరాజు



బుల్లెట్‌ను చూపిస్తున్న వైద్యులు

గచ్చిబౌలి: సోమాలియా దేశంలో జరిగిన సివిల్ వార్‌లో ఓ యువకుడికి తలలోకి బుల్లెట్ దూసుకెళ్లింది. కోమాలోకి వెళ్లిన యుకుడికి బుల్లెట్‌ను తీసేందుకు అక్కడి వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. రెండు నెలల అనంతరం రోగిని ఎయిర్ అంబులెన్స్‌లో గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. 12 గంటల పాటు శస్త్ర చికిత్స చేసిన కేర్ హాస్పిటల్ డాక్టర్ల బృందం 3.5 సెంటీ మీటర్ల పొడవు ఉన్న బుల్లెట్‌ను బయటకు తీసింది. దీంతో సదరు యువకుడు గులెమ్ మహముద్ హెర్సీ(27) ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడు. గురువారం కేర్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ లక్ష్మీ నాథ్ శివరాజు వివరాలు వెల్లడించారు. సోమాలియాకు చెందిన గులెమ్ మహమూద్ హెర్సీ అనే యువకుడికి అక్కడ జరిగిన సివిల్ వార్‌లో నుదుటి నుంచి బుల్లెట్ తలలోకి దూసుకెళ్లిందన్నారు. చిన్న మెదడు దగ్గర చేరడంతో అతడు కోమాలోకి వెళ్లాడని, అక్కడి వైద్యులు తల ముందు పుర్రె ముందు భాగం నుంచి బుల్లెట్‌ను తీసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయిందన్నారు. కోమాలోంచి కొద్దిగా కోలుకున్న తర్వాత అతడిని రెండు నెలల అనంతరం ఎయిర్ అంబులెన్స్‌లో గచ్చిబౌలి కేర్ హాస్పిటల్‌కు తీసుకొచ్చారన్నారు. రేడియాలజీ, సిటీస్కాన్, ఎంఆర్‌ఐలో బుల్లెట్ పొజిషన్, లోకేషన్‌ను గుర్తించామన్నారు. న్యూరో నావిగేషన్, సర్జికల్ మైక్రో స్కోప్ ద్వారా బ్రెయిన్ ఫంక్షన్‌కు ఎలాంటి ఇబ్బంది కలగకుండా 12 గంటల పాటు ఆపరేషన్ చేసి బ్లీడింగ్ కాకుండా, వైటల్ స్టక్చర్స్‌ను కాపాడుకుంటూ బుల్లెట్‌ను తీశామన్నారు. బ్రెయిన్ స్టెంట్ దగ్గర ఉన్న బుల్లెట్‌ను బయకు తీయడం చాలా అరుదుగా జరుగుతుంటుందన్నారు. సర్జరీ జరిగి రెండు వారాలు గడిచిందని, రోగి ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. అతడిని రిహాబిలిటేషన్ సెంటర్ ఉంచామని, మరో నాలుగు వారాలు గడిస్తే మరింత కోలుకునే అవకాశం ఉందని తెలిపారు. కేర్ హాస్పిటల్స్ సీఈఓ నీలేష్ మాట్లాడుతూ ఇలాంటి క్లిష్టమైన కేసులకు అత్యాధునిక వైద్య సదుపాయాలు , నిపుణులైన వైద్యులు తమ వద్ద ఉన్నారని తెలిపారు. ఆఫ్రికా, దక్షిణ ఆసియా దేశాల నుంచి వచ్చే అంతర్జాతీయ రోగులకు గమ్య స్థానంగా కేర్ హాస్పిటల్ ఉందన్నారు.

ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా ఉప్పల్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

ఉప్పల్: రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శనివారం జరుగనున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా ఉప్పల్ వైపు వచ్చే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వరంగల్ జాతీయ రహదారి నుంచి ఉప్పల్ వైపు వచ్చే, పోయే భారీ వాహనాల రాక పోకలను నిషేధిస్తున్నామన్నారు. ఈ నెల12న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ నేపథ్యంలో మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి దాటే వరకు భారీ వాహనాలను ఉప్పల్ వైపు అనుమతించబోమన్నారు. చెంగిచర్ల వయా బోడుప్పల్, ఫిర్జాదిగూడ వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు ఉప్పల్ నల్ల చెరువు దాటిన తర్వాత హెచ్‌ఎండీఏ లే అవుట్ భగాయత్ నుంచి నాగోల్ రోడు మీదుగా వెళ్లాలి.

- ఎల్‌బీనగర్ నుంచి ఉప్పల్ వైపు వచ్చే వాహనాలు నాగోల్ మెట్రో స్టేషన్ కింద నుంచి యూటర్న్ తీసుకుని హెచ్‌ఎండీఏ లేఅవుట్ భగాయత్ నుంచి బయటికి వెళ్లాల్సి ఉంటుంది.
- తార్నాక నుంచి ఉప్పల్ వైపు వచ్చే భారీ వాహనాలు హబ్సిగూడ చౌరస్తా నుంచి నాచారం వయా ఐటీసీ చర్లపల్లి వరంగల్ జాతీయ రహదారిని చేరుకోవాల్సి ఉంటుంది.
- రామంతాపూర్ నుంచి వచ్చే వాహనాలు హబ్సిగూడ చౌరస్తా నుంచి నాచారం మీదుగా ఐటీసీ చర్లపల్లి ద్వారా వరంగల్ జాతీయ రహదారిని చేరుకోవాల్సి ఉంటుందన్నారు.

కంబైన్డ్ డిఫెన్స్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఈ నెల 13 నుంచి పరీక్షల నిర్వహణ
- హాజరుకానున్న 8086 మంది అభ్యర్థులు
- ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు
- అన్ని కేంద్రాల్లోనూ మౌలిక వసతుల కల్పన
- జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి



లక్డీకాపూల్ : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో మూడు సెషన్లలో నిర్వహించనున్న డిఫెన్స్ సర్వీస్ పరీక్షతో పాటు పాటు రెండు సెషన్లలో జరిగే నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటా చారి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి జరగనున్న పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్‌లు, రూట్ ఆఫీసర్లు, లోకల్ ఇన్స్పెక్టింగ్ అధికారులు, టైం డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పరీక్షల నిర్వహణకు 22 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా కేంద్రాల్లో 8086 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. అధికారులు పరీక్షా కేంద్రాలను ముందుగా పరిశీలించి వసతులు కల్పనపై నివేదికలు అందజేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో భాగంగా ఐదు రూట్లుగా విభజించడం జరిగిందని లోకల్ ఇన్స్పెక్టింగ్ అధికారులుగా 22 మందిని నియమించామన్నారు. డిఫెన్స్ సర్వీస్ ఎగ్జామినేషన్ ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, ఇంగ్లిష్, మధ్యాహ్నం 12 నుంచి 2.30 వరకు జనరల్ నాలెడ్జ్ పరీక్ష అలాగే సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు ఎలిమినేటరి మ్యాథమెటిక్స్ పరీక్ష ఉంటుందన్నారు. విధంగా నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ ఎకాడమీ ఎగ్జామినేషన్ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు మ్యాథమెటిక్స్ పరీక్ష , మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు జనరల్ ఎబిలిటీ టెస్ట్ ఉంటుందన్నారు. అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని, హాల్ టికెట్‌తో పాటు గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతి లేదన్నారు. అన్ని కేంద్రాల గేట్లను అరగంట ముందే మూసివేస్తామన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ భాస్కర్, పర్యవేక్షకులు జహీరుద్దీన్ , చీఫ్ సూపరింటెండెట్‌లు, రూట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

'బిల్డ్ నౌ'తో విప్లవాత్మక మార్పులు

స్వల్ప వ్యవధిలోనే 308 దరఖాస్తుల ప్రాసెసింగ్ • టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన అధునాతన ఏఐ ఆధారిత వ్యవస్థ 'బిల్డ్ నౌ' ద్వారా జీహెచ్‌ఎంసీ పరిధిలో స్వల్ప వ్యవధిలోనే 308 దరఖాస్తుల ప్రాసెసింగ్ జరిగిందని టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ డైరెక్టర్ ఎస్. దేవేందర్‌రెడ్డి అన్నారు. డిజిటల్ గవర్నెన్స్ వైపు సాగుతున్న ప్రభుత్వం వేసిన సాహసోపేతమైన అడుగుల్లో భాగంగా 'బిల్డ్ నౌ'ను ఇటీవలే ఆవిష్కరించడాన్ని ప్రస్తావిస్తూ, ఈ సంచలనాత్మక వ్యవస్థ కృత్రిమ మేధస్సు..ఆటోమేషన్ ద్వారా నిర్మాణ అనుమతులను వేగవంతం చేస్తూ పట్టణ పాలనలో సరికొత్త ప్రమాణాలను నిర్దేశిస్తోందన్నారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా దీనిని అమలు చేయనున్నట్లు గురువారం ఓ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.సమగ్ర డీసీఆర్ (డ్రాయింగ్ స్క్రూటినీ) ఇంజిన్ తక్షణమే ప్లాన్ స్క్రూటినీ ప్రారంభిస్తుందని, అనుమతుల ప్రక్రియ వేగంగా, పారదర్శకంగా జరుగుతుందన్నారు. రియల్ టైమ్ ట్రాకింగ్ తో దరఖాస్తు స్థితిని తెలుసుకోవచ్చునని, నిపుణుల కోసం ప్రత్యేకంగా వాట్సప్, వన్ -ఆన్-వన్ కాల్ సహాయం అందుబాటులో ఉంటుందన్నారు. అవాంతరాల్లేకుండా డాక్యుమెంటేషన్ జరుగుతుందని, తక్షణ అనుమతులు జారీ అయ్యే ఈ వ్యవస్థ ప్రభుత్వ నిబద్ధతకు ఉదాహరణ అన్నారు. ఈ అత్యాధునిక సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా తెలంగాణ పట్టణాభివృద్ధిలో విప్లవాత్మక మార్పులు రానున్నాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని సాంకేతిక నిపుణులకు ఈనెల 19వ వరకు హెచ్‌ఎండీఏలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి యత్నం



సీఎం ఇంటి ముట్టడికి యత్నించిన వారిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

బంజారాహిల్స్: లంబాడీ ఎమ్మెల్యేలకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తూ లంబాడీల లడాయి సేవాలాల్ బంజారా సంఘం ఆధ్వర్యంలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడికి యత్నించారు. దాదాపు 50 మంది లంబాడా మహిళలు సీఎం ఇంటి ముట్టడికి యత్నించగా వారిని అడ్డుకున్న పోలీసులు బలవంతంగా వాహనంలో ఎక్కించి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సేవాలాల్ బంజారా సంఘం నాయకులు మాట్లాడుతూ అగ్రకుల ఆధిపత్యంలో నలిగిపోతున్న లంబాడీలకు మంత్రివర్గంలో స్థానం కల్పించి గుర్తింపునివ్వాలన్నారు. రాష్ట్రంలోని 45 నియోజకవర్గాల్లో లక్షల సంఖ్యలో లంబాడాల ఓట్లు ఉన్నాయని, గెలుపోటములను ప్రభావితం చేయగలిగిన సత్తా కల లంబాడాలకు ప్రభుత్వంలో భాగస్వామ్యం లేకపోవడం దారుణమన్నారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా ఉన్న లంబాడీలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించుకున్నామన్నారు. లంబాడీలను విస్మరించడం తగదని, తమకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని కోరారు. లేని పక్షంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామన్నారు. అరెస్టైన వారిలో నాయకులు సక్రిబాయి, కొర్ర చందునాయక్, లావుడియా ప్రసాద్ నాయక్, ధరావత్ గణేష్‌నాయక్, శాంతి బాయి, నాగునాయక్, కొర్ర లాలునాయక్, శ్యామలనాయక్, నునావత్ రాంబాబునాయక్, నాగరాజునాయక్, శ్రీనునాయక్, బానోత్ బాలాజీనాయక్ తదితరులు ఉన్నారు.

శోభాయాత్రకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్

మీర్‌పేట: 27 కిలో మీటర్లు, లక్షలాది మందితో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వీర హనుమాన్ శోభాయాత్రకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి డా.రావినూతల శశిధర్ తెలిపారు. ఈ నెల 12న హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం మందమల్లమ్మ చౌరస్తాలోని చంద్రా గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం ఉదయం 8 గంటలకు కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి దేవాలయం నుంచి శ్రీ వీర హనుమాన్ విజయయాత్ర ప్రారంభమై కోఠి మీదుగా తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు కొనసాగుతుందన్నారు. నగరంలోని అన్ని ఆధ్యాత్మిక ధార్మిక సంస్థలు పాల్గొనే ఈ యాత్రలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వలంటీర్లు ప్రసాదం, తాగునీరు అందిస్తారన్నారు. అధిక సంఖ్యలో శోభాయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు తూము పురుషోత్తంరెడ్డి, కార్యదర్శి సుధాకర్, బజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ నవారు రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కేసని గణేశ్, ఉప్పల సంజయ్, గురువయ్య, మీడియా ఇన్‌చార్జి ఎస్.బ్రహ్మచారి పాల్గొన్నారు.

నిట్ విద్యార్థి ఆత్మహత్య

కాజీపేట: హనుమకొండ జిల్లా, కాజీపేట 61వ డివిజన్ వడ్డేపల్లి చెరువులో నిట్ వరంగల్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. సీఐ సుధాకర్ రెడ్డి కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన రుత్విక్ సాయి(23) నిట్ వరంగల్‌లో ఇంజనీరింగ్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. బుధవారం అతను చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం సాయంత్రం అతడి మృతదేహం చెరువులో తేలియాడుతుండటాన్ని గుర్తించిన స్థానికుల పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి ఎంజీఎం మార్చురీకి తరలించారు. కాగా రిత్విక్‌సాయి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య



సందీప్ కుమార్ (ఫైల్)

అల్వాల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. అల్వాల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్‌దేవ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వెస్ట్ మారేడ్‌పల్లి ప్రాంతానికి చెందిన నర్సింగ్‌రావు కుమారుడు సందీప్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తూ అల్వాల్ టెలికాం కాలనీలో నివాసం ఉంటున్నాడు. గత కొన్నేళ్లుగా వివిధ లోన్ యాప్‌ల నుంచి అప్పు తీసుకున్నాడు. యాప్‌ల నిర్వాహకులు ఒత్తిడి చేయడంతో మనస్తాపానికి లోనైన అతను బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి నర్సింగ్‌రావు ఫిర్యాదు మేరకు అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

- విషాదం నింపిన పుట్టు వెంట్రుకల వేడుక
- కారులో వేములవాడకు వెళ్లిన కుటుంబం
- తిరుగు ప్రయాణంలో లకుడారం గ్రామ శివారులో కారు బోల్తా
- ఆరుగురికి స్వల్ప గాయాలు



బోల్తా పడిన కారు



కార్తీక్ మృతదేహం

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో ఏడేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన కుకునూరుపల్లి మండలం, లకుడారం గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. హైదరాబాద్‌లోని మూసాపేటకు చెందిన ఉమేశ్ తన 5 నెలల కుమారుడి పుట్టు వెంట్రుకలను తీయించేందుకు కుటుంబ సభ్యులతో వేముల వాడలోని రాజరాజన్న దేవ స్థానానికి కారులో బయలు దేరారు. ఈ నేపథ్యంలో ఉమేశ్ చెల్లెలు కుమారుడు రామారం కార్తీక్ (7) కూడా మేనమామతో కలిసి కారులో వెళ్లాడు. కార్యక్రమం అనంతరం తిరుగు ప్రయాణంలో కుకునూరుపల్లి మండలంలోని లకుడారం గ్రామ శివారులోకి రాగానే కారు అదుపు తప్పి రాజీవ్ రహదారి పక్కన విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో కార్తీక్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న మిగితా ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తమ కుమారుడి మృతికి కారణమైన బావమరిది ఉమేశ్‌పై చర్యలు తీసుకోవాలంటూ రామారం బాబీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మామిడి రైతుల ప్రయోజనాలే ముఖ్యం

గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి



మామిడి రైతులతో మాట్లాడుతున్న ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: పండ్ల మార్కెట్‌కు వచ్చే మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ వారి ప్రయోజనాల కోసమే మార్కెట్ కమిటీ పనిచేస్తోందని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. మామిడి సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో గురువారం ఆయన బాటసింగారం పండ్ల మార్కెట్‌లో జరుగుతున్న మామిడి పండ్ల క్రయవిక్రయాలను పాలకవర్గ సభ్యులు, అధికారులతో కలిసి పరిశీలించారు. మామిడి మార్కెట్ యార్డులో కలియ తిరిగి రైతుల సమస్యలు, క్రయవిక్రయాలను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌కి వచ్చిన రైతుల సమస్యలు తెలుసుకొని వారి సలహాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది కంటే ఈ సంవత్సరం మామిడి దిగుబడి అధికంగా ఉందని, మార్కెట్‌కి వచ్చే రైతులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. రైతులకు గిట్టుబాటు అందించేలా అధికారులు చొరవ చూపాలని సూచించారు. రోజుకు 800 వాహనాలు మార్కెట్‌కి వస్తున్న తరుణంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కరాచారి, మార్కెట్ సెక్రటరీ ఎల్.శ్రీనివాస్, డైరెక్టర్లు బండి మధుసూదన్ రావు, అంజయ్య, నవరాజ్, రఘుపతి రెడ్డి, నరసింహ, జైపాల్ రెడ్డి, మచ్చేందర్ రెడ్డి, గణేశ్‌నాయక్, వెంకటేశం గుప్తా, ఇబ్రహీం పాల్గొన్నారు.

బోధన్ షకీల్ తిరిగొచ్చాడు

దుబాయ్ నుంచి రాక

- ప్రజాభవన్ వద్ద బారికేడ్ల ప్రమాదం కేసులో వాంటెడ్‌గా
- కొన్నాళ్లుగా విదేశంలో తలదాచుకున్న మాజీ ఎమ్మెల్యే
- తల్లి మరణించడంతో తిరిగి వస్తున్నట్లు పోలీసులకు సమాచారం
- ఎయిర్‌పోర్టులో అండర్‌టేకింగ్ తీసుకుని విడిచిపెట్టిన అధికారులు
- అంత్యక్రియల తంతు ముగిసిన తర్వాత విచారించాలని నిర్ణయం

సాక్షి, సిటీబ్యూరో: పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజాభవన్ వద్ద 2023లో చోటు చేసుకున్న 'బీఎండబ్ల్యూ కారు ప్రమాదం' కేసులో నిందితుడిగా ఉన్న బోధన్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమీర్ ఎట్టకేలకు తిరిగి వచ్చారు. సుదీర్ఘకాలం దుబాయ్‌లో తలదాచుకున్న ఆయన తల్లి మరణంతో గురువారం తెల్లవారుజాముున నగరానికి చేరుకున్నారు. విమానాశ్రయానికి వెళ్లిన పంజగుట్ట పోలీసులు తల్లి అంత్యక్రియల అనంతరం విచారణకు హాజరవుతానంటూ షకీల్ నుంచి అండర్‌టేకింగ్ తీసుకుని విడిచిపెట్టారు. బోధన్ షకీల్ కుమారుడు సాహిల్, అతడి స్నేహితుడితో పాటు ఇద్దరు యువతులు 2023 డిసెంబర్ 24న తెల్లవారుజామున బీఎండబ్ల్యూ కారులో (టీఎస్ 13 ఈటీ 0777) బేగంపేట వైపు నుంచి పంజగుట్ట వైపు వస్తున్నారు. ఆ సమయంలో కారును సాహిల్ నడుపుతున్నాడు. తెల్లవారుజామున 2.45 గంటల ప్రాంతంలో ఈ కారు ప్రజాభవన్ ఎదురుగా ఉన్న బారికేడ్లను ఢీ కొట్టింది. దీంతో అవి పూర్తిగా ధ్వంసం కావడంతో పాటు కారు వాటిలో ఇరుక్కుపోయింది. ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో అందులో ఉన్న నలుగురూ సురక్షితంగా బయటపడ్డారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే సాహిల్ తన స్నేహితులను అక్కడికి రప్పించాడు. విషయం తెలుసుకున్న పంజగుట్ట పోలీసులూ అక్కడకు చేరుకున్నారు. కారులో ప్రయాణించిన మిగిలిన ముగ్గురి వివరాలు నమోదు చేసుకుని సాహిల్‌ను పోలీసుస్టేషన్‌కు తరలించారు. దీనిపై సమాచారం అందడంతో షకీల్ తెరవెనుక ఉండి కథ నడిపాడు. పోలీసు అధికారులనూ మ్యానేజ్ చేస్తూ సాహిల్‌ను తప్పించి... అతడి స్థానంలో మరో వ్యక్తిని ఉంచారు. ఈ వ్యవహారంలో భారీ మొత్తం చేతులు మారిందని ఆరోపణలు వెల్లువెత్తడంతో ఉన్నతాధికారులు దర్యాప్తునకు ఆదేశించారు. దీంతో విషయం వెలుగులోకి రావడంతో సోహైల్, షకీల్ సహా మరికొందరిని నిందితులుగా చేర్చారు. ఆ సమయంలో దుబాయ్‌లో ఉన్న షకీల్ తన కుమారుడినీ అక్కడికి రప్పించుకున్నారు. చాలాకాలం అక్కడే ఉన్న అతను గత ఏడాది ఏప్రిల్‌లో తిరిగి రాగా అరెస్టు చేశారు. అతడి విచారణలో షకీల్ పాత్రపై మరింత స్పష్టత రావడంతో పంజగుట్ట పోలీసులు షకీల్‌పై లుక్ ఔట్ సర్క్యులర్ (ఎల్‌ఓసీ) జారీ చేసి అన్ని విమానాశ్రయాలకు పంపారు. దీనిని న్యాయస్థానంలో సవాల్ చేసిన షకీల్ సస్పెండ్ చేయించారు. అయినా అతడు తిరిగి వచ్చిన వెంటనే అరెస్టు చేయడానికి సిద్ధమయ్యారు. షకీల్ తల్లి ఆరోగ్యం బుధవారం రాత్రి విషమించింది. దీంతో పంజగుట్ట పోలీసులకు దుబాయ్ నుంచి ఫోన్ చేసిన అతను తన తల్లి పరిస్థితిని వివరించారు. ఆమెను చూడటానికి తాను దుబాయ్ నుంచి వస్తున్నానని, మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కోరారు. వెంటనే స్పందించిన పోలీసులు షకీల్ తల్లి విషయం ఆరా తీసి నిజమేనని నిర్ధారించుకున్నారు. ఎలాంటి షరతులూ లేకుండా షకీల్ తిరిగి రావడానికి అంగీకరించారు. ఇది జరిగిన కొంతసేపటికే షకీల్ తల్లి చనిపోవడంతో ఆయన వెంటనే తిరిగి వచ్చారు. గురువారం తెల్లవారుజామున శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లిన పోలీసులు షకీల్ నుంచి అండర్‌టేకింగ్ తీసుకున్నారు. తల్లి అంత్యక్రియలకు సంబంధించిన క్రతువు పూర్తయిన తర్వాత విచారణకు వస్తానంటూ రాసివ్వడంతో విడిచిపెట్టారు.

మీ-సేవ కేంద్రాలు కిటకిట

ధ్రువపత్రాల కోసం క్యూ కడుతున్న జనం

- అన్ని అర్హతలు ఉంటే మూడు రోజుల్లోనే పత్రాలు
- రాజీవ్ యువ వికాసం పథకానికి ఈ నెల 14న ఆఖరు
- రేషన్‌కార్డు ఉంటే ఆదాయ ధ్రువపత్రం అవసరం లేదు



బంజారాహిల్స్ రోడ్డునెంబర్-7లోని మీ సేవ కేంద్రంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తుదారులు

బంజారాహిల్స్: ఖైరతాబాద్, షేక్‌పేట మండలాల్లో సాధారణ రోజుల్లో ఆదాయం, కుల ధ్రువపత్రాల కోసం నిత్య 5-10 దరఖాస్తులు మాత్రమే వచ్చేవి. ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తుండడంతో దీనికి కుల, ఆదాయ ధ్రువపత్రాలు తప్పనిసరిగా అవసరం కావడంతో ప్రస్తుతం షేక్‌పేట మండల పరిధిలో ఆదాయ ధ్రువపత్రాల కోసం రూ.300-400లు, కుల ధ్రువీకరణ కోసం 250-300 దరఖాస్తులు వస్తున్నాయి. అలాగే ఖైరతాబాద్ మండలంలో ఆదాయ ధ్రువపత్రాల కోసం ప్రస్తుతం రోజూ 400-500 దరఖాస్తులు వస్తుండగా, కుల ధ్రువీకరణ పత్రాల కోసం 300-350 దరఖాస్తులు అందుతున్నాయి.

యువతకు స్వయం ఉపాధికి రాయితీ రుణాలు..

ఈ పథకంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల యువతకు స్వయం ఉపాధిని కల్పించడానికి రాయితీ రుణాలు ఇవ్వనున్నారు. దీనికి దరఖాస్తు చేసుకోవడానికి పట్టణాలకు చెందిన వారి వార్షిక ఆదాయం రూ.2 లక్షలు, గ్రామీణులకు రూ.1.50 లక్షల లోపు ఉండాలని నిబంధనలు విధించారు. కుల ధ్రువీకరణ పత్రం తప్పకుండా ఉండాలని పేర్కొన్నారు. దీంతో దరఖాస్తుదారులు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం మీ-సేవ కేంద్రాలకు పరుగులుపెడుతున్నారు. షేక్‌పేట మండల పరిధిలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వర కాలనీ, షేక్‌పేట, యూసుఫ్‌గూడ డివిజన్లు వస్తుండగా, ఖైరతాబాద్ మండల పరిధి కిందకు సోమాజీగూడ, ఖైరతాబాద్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్, రహమత్‌నగర్ డివిజన్లతో పాటు యూసుఫ్‌గూడ డివిజన్‌లో కొంతభాగం వస్తాయి. వీటి పరిధిలోని అర్హులైన వారు రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు గత మూడు వారాల నుంచి మీ-సేవ కార్యాలయాలు, మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

మండల కార్యాలయాలకు అనూహ్యంగా పెరిగిన తాకిడి..

సాధారణ రోజుల్లో 10 వరకు దరఖాస్తులు వస్తుండగా, రాజీవ్ యువ వికాసం పథకం నేపథ్యంలో దరఖాస్తుల సంఖ్య 20 ఇంతల పైగా పెరిగింది. షేక్‌పేట, ఖైరతాబాద్ పెద్ద మండలాలు కావడంతో దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ఈ రెండు మండలాల పరిధిలో రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హుల సంఖ్య కూడా ఎక్కువగా ఉండడం ఇందుకు కారణంగా అధికారులు పేర్కొంటున్నారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 14 ఆఖరు కావడంతో అర్హులైన వారంతా ధ్రువపత్రాల కోసం మీ-సేవా కేంద్రాలకు క్యూ కడుతున్నారు. అర్జీల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడంతో ఆ మేరకు మండల కార్యాలయాల్లో కూడా తహసీల్దార్లతో పాటు సిబ్బంది రేయింబవళ్లు పనిచేయాల్సి వస్తుంది. ప్రతిరోజూ ఒక్కో మండల పరిధిలో 300లకు పైగా ధ్రువపత్రాలను దరఖాస్తుదారులకు పంపిణీ చేస్తున్నారు.

మూడు రోజుల్లోనే ఇస్తున్నాం..

రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునే వారు రేషన్‌కార్డు ఉంటే ఆదాయ ధ్రువీకరణ పత్రం అవసరం లేదు. రేషన్ కార్డులో పేరు లేకపోతే మాత్రమే ఆదాయ ధ్రువ పత్రం తీసుకోవాలి. మాకు ప్రతిరోజూ ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం 500-600 వరకు దరఖాస్తులు వస్తుండగా ఎప్పటికప్పుడు వాటిని పరిశీలించి క్షేత్రస్థాయిలో పర్యటించి వెనువెంటనే పంపిణీ చేస్తున్నాం. ఇందుకోసం మూడు రోజుల సమయం పడుతుంది. సిబ్బంది ఈ పత్రాల కోసం రేయింబవళ్లు పనిచేస్తున్నారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ఈ పథకంలో లబ్ధి చేకూర్చాలన్నదే మా ఉద్దేశం. ఇందుకోసం అన్ని పత్రాలు సరిగ్గా ఉంటే అప్పటికప్పుడే ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్నాం.

- అనితారెడ్డి, తహసీల్దార్, షేక్‌పేట

వైభవంగా అమ్మవారి విగ్రహ ఊరేగింపు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని కమాన్‌లో మిథిలానగర్ రోడ్డులో కొలువుదీరిన శ్రీభవానీ శంకర, గణపతి, భక్త ఆంజనేయస్వామి సహిత నవగ్రహ ఆలయంలో శ్రీభవానీ (పార్వతి) అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజున గురువారం భవానీ అమ్మవారి విగ్రహాన్ని స్థానిక వీధుల్లో ఊరేగించారు. విగ్రహ ప్రతిష్ఠాపన శుక్రవారం ఉదయం 11 గంటలకు జరగనుంది. అనంతరం శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నారు. పార్వతి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆలయానికి భక్తులు వందలాదిగా తరలివస్తూ పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయంలో భక్తుల కోసం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు.

పార్కిన్సన్స్ వ్యాధిపై అవగాహన అవసరం

లక్డీకాపూల్ : పార్కిన్సన్స్ వ్యాధితో బాధపడుతున్న వారి జీవితాలను డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్(డీబీఎస్)తో మెరుగుపర్చవచ్చని నిమ్స్ సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ శిరీష యరీదా తెలిపారు. మందులు, డీబీఎస్ వంటి శస్త్ర చికిత్సలతో రోగులు రోజు వారి కార్యకలాపాల్లో పాల్గొనడంతో చురుకైన జీవనశైలిని పొందవచ్చన్నారు. గురువారం నిమ్స్ ట్రామా బ్లాక్‌లో పార్కిన్సన్స్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్ వంటి పథకాల్లో డీబీఎస్ శస్త్ర చికిత్సలను చేర్చడం వల్ల ఎంతో మంది పేద రోగులకు మేలు జరిగిందన్నారు. న్యూరో సర్జరీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ వంశీ కృష్ణ మాట్లాడుతూ..డీబీఎస్‌తో పాటు హీట్ ప్రోబ్ ఉపయోగించి పార్కిన్సన్స్‌తో బాధపడేవాళ్ల జీవన విధానంలో మెరుగైన ఫలితాలను పొందవచ్చన్నారు.

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల అరెస్టులను ఖండిస్తున్నాం

హిమాయత్‌నగర్: ఉద్యోగ భద్రతకు ప్రజాస్వామ్యబద్ధంగా ఉన్నత విద్యా మండలి ఎదుట ధర్నా నిర్వహించడానికి వచ్చిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల అక్రమ అరెస్టును ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ యూసుఫ్ గురువారం ఓ ప్రకటనలో ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా విధానాన్ని నీరుగార్చటానికి కాంట్రాక్ట్ విధానంలో ఉపాధ్యాయులను, అసిస్టెంట్ ప్రొఫెసర్లను అలాగే మిగిలిన సిబ్బందిని కాంట్రాక్ట్ విధానంలో నియమించి ఈ ఉద్యోగం ఎంతకాలం ఉంటుందో తెలియక అభద్రతా భావానికి లోనవుతున్నారన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల, ఉపాధ్యాయుల, అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. లేని యెడల ఏఐటీయూసీ పూర్తి స్థాయిలో ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. అలాగే కాంట్రాక్ట్ ప్రొఫెసర్లు నిర్వహిస్తున్న ఉద్యమాలకు పూర్తి మద్దతును తెలియజేస్తుందన్నారు.

బీసీలపై కేంద్ర ప్రభుత్వం వివక్ష

లిబర్టీ: అన్ని విషయాల్లో కేంద్రంలోని కేంద్ర ప్రభుత్వం బీసీలపై వివక్ష చూపుతుందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం బీసీల వ్యతిరేక ప్రభుత్వంగా ముద్ర వేసుకుందని ధ్వజమెత్తారు. గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించే వరకు బీసీలు నిద్రపోకూడదని పిలుపునిచ్చారు. బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ కూటమికి బీసీలు మూడుసార్లు పట్టం కడితే బీసీలకు వరగబెట్టింది ఏమిటని సూటిగా ప్రశ్నించారు. దేశ జనాభాలో 70 శాతం ఉన్న బీసీలను విస్మరిస్తే బీసీల ప్రతిఘటన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తాం

హిమాయత్‌నగర్: తెలంగాణలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ పోటీ చేస్తుందని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ప్రకటించారు. ఇందుకు సంబంధించి స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఆప్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విడుదల చేశారు. అనంతరం దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ..ఆమ్ ఆద్మీ పార్టీ సభ్యులు కాకపోయినా ఎవరైనా సామాన్యులు పారదర్శకత, జవాబుదారీతనం ఉన్న వారు రాష్ట్రంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నుంచి పోటీ చేయడానికి ఆప్ క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించి దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఆప్ నేతలు జావీద్ షరీఫ్, నర్సింగ్ యమునా గౌడ్, డాక్టర్ లక్ష్మ నాయుడు, సుధారాణి, షాబాజ్, లియాఖత్ ఖాన్, లతా, మౌనిక, ధర్మేందర్ తివారి, స్వామి, సురేష్, నాగరాజ్, విజయ్ ముల్లంగి పాల్గొన్నారు.

రథయాత్ర కరపత్రం ఆవిష్కరణ

పంజగుట్ట: బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో రాజకీయ చైతన్యం లేకనే తెలంగాణలో వెలమ, రెడ్డిల చేతుల్లో రాజ్యం ఉందని తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ రైట్స్, రాజ్యాధికార సాధన జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహారాజ్ అన్నారు. త్యాగల పేరుతో మనం అమరత్వాన్ని పొందితే అధికారం వారు పొందుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్య స్థాపనకు, ప్రజా సమస్యల పరిష్కారానికి ఏప్రిల్ 14న ఆదిలాబాద్ పట్టణం నుంచి ఒక లక్ష కిలోమీటర్ల భూమి రథయాత్ర ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రథయాత్ర కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఈ యాత్ర ఈ నెల 14న ప్రారంభమై 11 జులై 2028 వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర కో కన్వీనర్‌లు తోట్ల రాఘవేందర్ ముదిరాజ్, రాసాల వినోద్ యాదవ్, రాష్ట్ర కమిటీ సభ్యులు సాయిబాబా పూసల, అబ్దుల్ రహమాన్, గడ్డం హరీష్ గౌడ్, రెడపాక రాజ్ కమల్ పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న విశారదన్ మహారాజ్

నేడు అయ్యప్ప జన్మనక్షత్ర మహోత్సవాలు

బంజారాహిల్స్: శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానం అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామి వారి జన్మనక్షత్ర మహోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసశర్మ తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత దర్శనం, మహాగణపతి హోమం, మహాన్యాసపూర్వక లఘు రుద్రాభిషేకం, పడి పూజ, భజన, హారతి, తీర్థప్రసాద వితరణ, మధ్యాహ్నం 12.15 గంటలకు అన్నదానం, సాయంత్రం 6.30 గంటలకు పల్లకీ సేవ, భజన, రాత్రి 9 గంటలకు హారతి, హరివరాసనము, అల్పాహారం ఉంటాయని పేర్కొన్నారు.

కేబీఆర్ పార్కు వద్ద చెత్తను తొలగించరా ?



కేబీఆర్ పార్కు ముందు ఫుట్‌పాత్‌పై చెత్తతో నిండిన కవర్లు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు మెయిన్‌గేటుతో పాటు చుట్టూ ఫుట్‌పాత్‌పై, రోడ్ల పక్కన స్వీపర్లు ఊడ్చిన చెత్తాచెదారాన్ని, ఇతర వ్యర్థాలను నల్ల కవర్లలో వేసి ఫుట్‌పాత్‌లపై పెడుతున్నారు. జీహెచ్‌ఎంసీలో మెక్లిన్ అనే సంస్థ కేబీఆర్ పార్కు చుట్టూ ఫుట్‌పాత్‌ల క్లీనింగ్‌తో పాటు రోడ్ల పక్కన పార్కింగ్ స్థలాల్లో చెత్తాచెదారం తొలగించే కాంట్రాక్టర్ దక్కించుకుంది. అయితే మెక్లిన్ సంస్థలో స్వీపర్లు రోజూ కేబీఆర్ పార్కు చుట్టూ ఊడ్చాల్సి వస్తుంది. వీరిపై ఎస్ఎఫ్ఏల పర్యవేక్షణ కూడా ఉంటుంది. కొంత కాలంగా ఎస్ఎఫ్ఏల పనితీరుపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. స్వీపర్లు కూడా నిబంధనలకు అనుగుణంగా లేనట్లుగా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతిరోజూ ఊడ్చిన చెత్తను బ్లాక్ కవర్లలో వేస్తుండగా, వీటిని తొలగించాల్సిన బాధ్యత ఎస్ఎఫ్ఏలపై ఉంటుంది. చుట్టూ చెత్త డబ్బాలు ఏర్పాటుచేయగా, అవి నిండితే ఆ చెత్తను కూడా తరలించాల్సి ఉంటుంది. ఈ విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చోటుచేసుకుంటుంది. కేబీఆర్ పార్కు చుట్టూ గురువారం ఫుట్‌పాత్‌లపై 10 చోట్ల చెత్తతో నిండిన బ్లాక్ కవర్లు తొలగించలేదు. సీఎం రేవంత్‌రెడ్డి గురువారం పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు వచ్చారు. ఆయన వస్తున్న సందర్భంలో కూడా ఫుట్‌పాత్‌లపై చెత్తతో నిండిన కవర్లు అలాగే ఉన్నాయంటే ఎంత నిర్లక్ష్యం చోటుచేసుకుందో అర్థం చేసుకోవచ్చు. జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 డీఎంసీ, ఏఎంఓహెచ్‌లు ఈ విషయంపై దృష్టిసారించి మెక్లిన్ సంస్థ, ఎస్ఎఫ్ఏలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



మస్తాన్‌నగర్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ సిబ్బంది

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-46లోని అంబేడ్కర్‌నగర్ కాలనీలో మస్తాన్‌నగర్ వైపు జేఎన్ఎన్‌యూఆర్ఎం భవనాల పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన కట్టడాలను షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు గురువారం కూల్చివేశారు. పక్కా ఇళ్ల పక్కన ప్రభుత్వానికి చెందిన ఖరీదైన స్థలం ఉండగా కొంతమంది స్థానిక లీడర్లు ఈ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. దీంతో షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి సంబంధిత సిబ్బందితో కలిసి కబ్జా స్థలాన్ని పరిశీలించి జేసీబీతో నిర్మాణాలు కూల్చివేయించారు. ఈ సందర్భంగా బస్తీవాసులకు, అధికారులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. బస్తీవాసులు జేసీబీ అద్దాలను ధ్వంసం చేయడంతో పాటు రెవెన్యూ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను కూలిచ్చివేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ప్రస్తుతం అక్రమ నిర్మాణాలు చేపట్టిన ప్రభుత్వ స్థలం పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించేందుకు కేటాయించామని తెలిపారు. అయితే కొందరు నేతలు ఈ స్థలాన్ని ఆక్రమించి కమ్యూనిటీ హాల్ పేరుతో, ఆలయం పేరుతో ఆక్రమించి డబ్బులు వసూలు చేసి ఇళ్లు నిర్మిస్తున్నారని తెలిపారు. జేసీబీ అద్దాలను పగులగొట్టిన వ్యక్తులతో పాటు అధికారుల విధులకు ఆటంకం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. గతంలోనే ఈ స్థలాన్ని ఆక్రమించిన లీడర్‌పై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ కూడా నమోదైందన్నారు. మరోసారి ఈ స్థలాన్ని ఆక్రమిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

జేఐసీలోకి ప్రవేశించిన వ్యక్తిపై కేసు నమోదు

బంజారాహిల్స్: తమ సంస్థలోకి అక్రమంగా ప్రవేశించడమే కాకుండా సెక్యూరిటీగార్డ్‌లను నెట్టేసి నిబంధనలకు విరుద్ధంగా ఫొటోలు తీసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ మేనేజర్ జగదీశ్వర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు పెద్ది వేణుగోపాల్ అనే వ్యక్తిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో కొంత కాలంగా తాము ఓల్డ్ కిచెన్‌ను మరమ్మతులు చేస్తున్నామని, అయితే ఈ నిర్మాణాలను తరచూ ఫొటోలు తీస్తూ జీహెచ్‌ఎంసీ అధికారులమంటూ బెదిరిస్తూ జూబ్లీహిల్స్ క్లబ్ ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ప్రతిష్ఠను దెబ్బతీస్తూ వేధింపులకు కూడా గురిచేస్తున్నారని, బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇష్టమొచ్చిన రీతిలో ఫొటోలు తీస్తూ సర్క్యులేట్ చేస్తున్నారని ఆరోపించారు. దీంతో పోలీసులు వేణుగోపాల్‌పై బీఎన్ఎస్ సెక్షన్ 329 (3), 308 (3) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు అంబేడ్కర్ వర్సిటీలో పూలే జయంతి

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో మహనీయుల జయంత్యుత్సవాలను పురస్కరించుకుని సామాజిక సాధికారత వారోత్సవాలను నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి వెల్లడించారు. విశ్వవిద్యాలయంలో ఏప్రిల్ 5 నుంచి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, శుక్రవారం నుంచి సోమవారం వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగానే ఈ నెల 11న ఉదయం మహాత్మా జ్యోతి బాపూలే జయంతి సందర్భంగా బీసీ కుల గణన, సాధికారత అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమం, మధ్యాహ్నం డాక్టర్ అంబేడ్కర్ బహుముఖ ప్రజ్ఞాశాలి అనే అంశంపై మహిళా ప్రముఖులతో సదస్సు, సాయంత్రం సాహిత్య సమ్మేళనం, 12న అంబేడ్కర్ అండ్ ఇంటర్ సెక్షనాలిటీస్' అనే అంశంపై సదస్సు, సాయంత్రం అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ గ్లోబల్ అలుమ్ని, 13న ఉదయం రాజ్యాంగ పీఠిక పఠనం, 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఉదయం అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి, ఆ తర్వాత అంబేడ్కర్ స్మారకోపన్యాసంలో ముఖ్యవక్తగా డాక్టర్ కత్తి పద్మారావు ఉపన్యాసం చేస్తారన్నారు. సాయంత్రం గోరటి వెంకన్న ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ప్రకటించారు. ఆయా కార్యక్రమాల్లో విశ్వ విద్యాలయ ఉద్యోగులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులు, మేధావులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొననున్నారని వెల్లడించారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా తప్పదు



వినాయకనగర్ బస్తీలో చెత్త సేకరణ విధానాన్ని పరిశీలిస్తున్న డీసీ

బంజారాహిల్స్: నివాసితులు కచ్చితంగా చెత్త సేకరించే వాహనానికి చెత్తను ఇవ్వాల్సిందేనని అలా కాకుండా చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేస్తే జరిమానాలు తప్పవని జూబ్లీహిల్స్ సర్కిల్-18 డీఎంసీ సమ్మయ్య అన్నారు. గురువారం జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలోని జూబ్లీహిల్స్, షేక్‌పేట డివిజన్లలో ఆయన పర్యటించారు. ప్రతి ఇల్లు చెత్త సేకరించే బండితో కనెక్ట్ అయి ఉండాల్సిందేనని అన్నారు. చెత్తబండికి లింక్‌లేని ఇళ్లను గుర్తించి వెంటనే వారిని చెత్త సేకరించే వ్యక్తితో అనుసంధానం చేయాలని అధికారులకు ఆయన సూచించారు. ఒక భవనంలో ఉండే నివాసిలందరికీ ఆ ఇంటి యజమానిదే బాధ్యత అని అన్నారు. సహకరించని యజమనులను సైతం గుర్తించి జరిమానాలు విధిస్తామన్నారు.



మాదిగ ఉద్యమకారులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి



మాట్లాడుతున్న రుద్రవరం లింగస్వామి మాదిగ

హిమాయత్‌నగర్: ఎస్సీ వర్గీకరణ పోరాటంలో అమరులైన ఉద్యమకారులను, వారి కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని మాదిగ దండోర ఉద్యమకారుల వేదిక (ఎండీయూవీ) రాష్ట్ర కమిటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రుద్రవరం లింగస్వామి మాదిగ విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ఉద్యమకారులపై నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలన్నారు. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధాక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కమిటీ అధ్యక్షుడు జిల్లా వెంకటేష్ మాదిగతో కలిసి ఆయన మాట్లాడారు. ఉద్యమంలో అమరులైన కుటుంబాల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందన్నారు. ఉద్యమకారులకు, అమర వీరుల కుటుంబాలకు 250 గజాల స్థలం ఇవ్వడంతోపాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. అలాగే సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం అమరవీరుల కుటుంబాలకు ఇళ్లు నిర్మించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలులో దండోరా ఉద్యమకారులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలన్నారు. నగరంలో మాదిగ అమరవీరుల స్మృతి వనం నిర్మించాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారులకు, అమరులకు ప్రభుత్వం కల్పించిన ప్రయోజనాలు వర్గీకరణ ఉద్యమకారులకు కూడా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్లు మీసాల కురుమయ్య మాదిగ, నక్క రమేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



మహిళలకు అవగాహన కలిగిస్తున్న అంగన్‌వాడీ టీచర్ పుష్పలత

ఫిలింనగర్: పోషణ పక్షోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు గృహ సందర్శన చేపట్టిన గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కలిగించారు. ఐసీడీఎస్ ఖైరతాబాద్ ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న 151 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గురువారం టీచర్లు ఇంటింటికీ తిరిగి తమ పరిధిలోని గర్భిణులు, బాలింతలను కలిసి ఏ ఆహారంలో ఎలాంటి పోషకాలు ఉన్నాయో తెలియజేశారు. అలాగే ఎత్తుకు తగ్గ బరువు, పిల్లలు పోషకాహారంతో బాధపడుతున్నారా..? అన్న వివరాలను తెలుసుకున్నారు. తమ పరిధిలోనే లభించే ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

ఇద్దరు పిల్లలతో సహా గృహిణి అదృశ్యం



ఫిలింనగర్: పనిచేయకుండా ఇంట్లో కూర్చుంటే ఎలా అంటూ భార్య నిలదీయడంతో ఆగ్రహించిన భర్త ఆమెను కొట్టడంతో అలిగి ఇద్దరు పిల్లలతో సహా అదృశ్యమైన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్ బస్తీలో నివసించే రాఘవేంద్ర సినీ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. మూడు నెలల నుంచి సరిగ్గా పనులు రావడం లేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటుండగా భార్య మూడు రోజుల క్రితం నిలదీసింది. ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి కోపంతో రాఘవేంద్ర భార్య సౌమ్యను కొట్టాడు. ఎన్నడూ లేనిది భర్త తనపై చేయి చేసుకోవడమే కాకుండా ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాన్ని నడపడం తన వల్ల కాదంటూ ఆమె తన కుమారులు నందోనర్షిత్ (9), నితిన్ (8)ను తీసుకుని భర్తకు చెప్పకుండా అదృశ్యమైంది. ఇంటికి వచ్చిన భర్త భార్యాపిల్లలు లేకపోయేసరికి అన్ని ప్రాంతాలూ గాలించాడు. బంధుమిత్రుల ఇళ్లలో వాకబు చేశాడు. ఆచూకీ దొరకకపోవడంతో తన భార్యాపిల్లలు కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిలింనగర్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని సౌమ్యతో పాటు ఆమె ఇద్దరి పిల్లలను గాలిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 87125 68961లో సంప్రదించాలని కోరారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

ఫిలింనగర్: బాలిక అదృశ్యమైన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..షేక్‌పేట మినీ గుల్షన్‌కాలనీలో నివసించే మరియం (15) ఈ నెల 7న ఉదయం 10 గంటలకు సరుకులు తీసుకురావడానికి కిరాణా షాపునకు వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి రాకపోయేసరికి తల్లిదండ్రులు అన్ని ప్రాంతాలూ గాలించారు. బంధుమిత్రుల ఇళ్లల్లోనూ వాకబు చేశారు. తన సోదరి కనిపించడం లేదంటూ జమీర్‌ఖాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని తప్పిపోయిన మరియం కోసం గాలిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 87125 70298లో సంప్రదించాలని కోరారు.

వాటర్ ట్యాంకర్స్ డ్రైవర్స్, ఓనర్ల సమావేశం

శ్రీనగర్‌కాలనీ: వాటర్ ట్యాంకర్స్ డ్రైవర్స్, ఓనర్లతో ఎర్రగడ్డలో గురువారం గ్రేటర్ హైదరాబాద్ వాటర్ ట్యాంకర్స్ ఓనర్స్, డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీజీ నాయుడు సమావేశమయ్యారు. ఈ విషయమై వాటర్‌వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించనున్నట్లు తెలిపారు. వేసవిలో వాటర్ ట్యాంకర్లకు పలు మినహాయింపులు ఇవ్వాలని కోరారు. అంతేకాకుండా వాహన యజమాని పాత అనుమతి కలదో వారికి కొత్త అనుమతి ఇవ్వాలని, నూతనంగా వచ్చే వాహనాలకు ఇవ్వరాదని విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ సభ్యులు భవ్యచందు, మాధవరావు, భగవాన్, ఆసిఫ్, కిరణ్, సాయి, ప్రశాంత్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమస్యలపై చర్చించుకుంటున్న గ్రేటర్ వాటర్ ట్యాంకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

వేసవి సెలవుల్లో అంగన్‌వాడీ బాట

- పూర్వ ప్రాథమిక విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి
- పిల్లల హాజరు శాతం పెంచాలి
- పోషక విలువల ఆహారాన్ని అందించాలి
- పోషణ పక్షం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి




శిశువులకు అన్నప్రాశన, గర్భిణులకు సీమంతం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ తదితరులు

లక్డీకాపూల్/కవాడిగూడ: వేసవి సెలవుల్లో అంగన్‌వాడీ బాట ప్రత్యేక కార్యక్రమం చేపట్టి అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య పెంచాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా హిమాయత్‌నగర్ సెక్టార్ నాంపల్లి ప్రాజెక్ట్‌లో భీమా మైదాన్ అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. పిల్లలు ఆటల సమయంలో ఆట పరికరాలతో గడిపే విధంగా చూడాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ఇచ్చే శిక్షణ తీరును అడిగి తెలుసుకున్నారు. కేంద్రాలకు పిల్లలు యూనిఫాంతో వచ్చేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు అందిస్తున్న పాలు, బాలామృతం, గుడ్లు, బియ్యాన్ని కలెక్టర్ పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలతోపాటు గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు అందాలని, ఆ దిశగా సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఖాళీ స్థలంలో గార్డెన్ ఏర్పాటుతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పిల్లల ఆరోగ్యం నిమిత్తం అంగన్‌వాడీ కేంద్రాలను ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తప్పక సందర్శించాలని సూచించారు. కేంద్రంలో తాగునీటి లైన్ ఏర్పాటుకు సత్వరమే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా సీడీపీవో, సూపర్‌వైజర్లతో కలిసి గర్భిణులకు సీమంతం కార్యక్రమంలో పాల్గొని సారె, కానుకలు అందించారు. పిల్లలకు బాలామృతం తినిపించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో అక్కేశ్వరరావు, తహసీల్దార్ సంధ్యారాణి, సీడీపీవో కృష్ణ చైతన్య, సూపర్‌వైజర్ బాల, డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

సాగుకు నిరంతర విద్యుత్ సరఫరా భేష్



మాట్లాడుతున్న సీఎండీ ముషారఫ్ ఫారూఖీ

హస్తినాపురం: వ్యవసాయానికి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అవుతోందని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ అన్నారు. గురువారం హస్తినాపురంలోని బీడీ రెడ్డి గార్డెన్‌లో సరూర్‌నగర్, రాజేంద్రనగర్ సర్కిళ్లలోని విద్యుత్ సంస్థల ఉద్యోగుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు తమ సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకొచ్చారు. ముషారఫ్ మాట్లాడుతూ ఈ సీజన్‌లో కరెంటు సరఫరాపై రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ బకాయిలు వసూలు చేయడానికి వెళ్లిన సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. సిబ్బందిపై దాడులు జరిగితే ఎస్‌ఈ, డీఈలు స్పందించి నిందితులపై కఠిన చర్యలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎండీ సూచించారు. సబ్‌స్టేషన్లలో సిబ్బంది కొరతపై ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రజల ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తే వారి మద్దతు లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈలు సీహెచ్ మాధవరెడ్డి, వెంకన్న, డీఈలు రామకృష్ణ, నరేశ్‌కుమార్, రాజేందర్, గోపాలకృష్ణ, రత్నాకర్, శ్యాంసుందర్‌రెడ్డి, ఏడీఈలు, ఏఈలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని పత్రికానగరంలో జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ సైన్స్ పార్కు ఉదయం 5 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఫుడ్ ఇండియా ఎక్స్‌పో–2025 జరుగుతుంది.
- ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో ఓయూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్స్‌తోపాటు యూజీసీ వ్యవహారాల డీన్ కార్యాలయం ఆధ్వర్యంలో మహనీయుల జయంతి ఉత్సవాలు జరుగుతున్నాయి.
- తెలంగాణ 3ఏ సైడ్ వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో 3ఏ సైడ్ ఫెడరేషన్ కప్ చాంపియన్‌షిప్ 2025 వాలీబాల్ టోర్నమెంట్ జరుగుతుంది.
- జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో మహనీయుల జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఉదయం 10 బీసీ కులగణన, సాధికారత అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమం, మధ్యాహ్నం డాక్టర్ అంబేడ్కర్ బహుముఖ ప్రజ్ఞాశాలి అనే అంశంపై మహిళా ప్రముఖులతో సదస్సు, సాయంత్రం సాహిత్య సమ్మేళనం జరుగుతాయి.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

అంధకారంలో 40 గ్రామాలు

నాలుగు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా బంద్



శంషాబాద్ రూరల్: ఈదురు గాలులతో కూడిన వర్షానికి గురువారం సాయంత్రం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శంషాబాద్ మండలంలోని నర్కూడ, జూకల్, మల్కారం సబ్‌స్టేషన్లతోపాటు మొయినాబాద్ మండలంలోని అమ్డాపూర్ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ఆయా సబ్‌స్టేషన్లకు చిన్న గోల్కొండ వద్ద ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షానికి ఈ లైన్ బ్రేక్‌డౌన్ కావడంతో సుమారు 40 గ్రామాల్లో అంధకారం నెలకొంది. కరెంటు సరఫరా పునరుద్ధరణకు అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సబ్‌స్టేషన్లకు కరెంటు సరఫరా చేసే లైన్ బ్రేక్‌డౌన్ అయినప్పుడు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడం వల్ల ఈ పరిస్థితి నెలకొంది. ఆయా సబ్‌స్టేషన్లకు చదన్‌వెల్లి స్టేషన్ నుంచి కరెంటు సరఫరా చేసే అవకాశం ఉన్నా ఈ లైన్ సరిగా లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. వేసవి కాలంలో ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు కరెంటు లేక రాత్రంతా జాగారం చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇక బీసీల ప్రత్యక్ష ఉద్యమం: చిరంజీవులు



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన బీసీ మేధావుల ఫోరం సమావేశంలో పాల్గొన్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మేధోపరమైన కార్యక్రమాలు, అవగాహన సదస్సులకే పరిమితమైన బీసీ మేధావులు ఇక నుంచి ప్రత్యక్ష ఉద్యమంలోకి రానున్నారని బీసీ మేధావుల ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి. చిరంజీవులు అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కోర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు రాజకీయ రంగంలో జరిగిన అన్యాయాన్ని బీసీ సమాజానికి తెలియజేస్తామని చెప్పారు. కలిసి వచ్చే బీసీ సంఘాలు, రాజకీయ పార్టీల నేతలతో సమన్వయం చేసుకుంటూ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. జిల్లాల వారీగా, మండలాల వారీగా మేధావుల ఫోరాన్ని బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించి లక్షలాది మందిని పోరాటయోధులుగా చేస్తామన్నారు. బీసీ సబ్‌ప్లాన్, బీసీల రాజ్యాధికారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీసీ మేధావుల ఫోరం నాయకులు కోల జనార్దన్ గౌడ్, చామకూర రాజు, కేవీగౌడ్, వేణు, కిరణ్ కుమార్, ప్రొఫెసర్ వీరస్వామి, ప్రొఫెసర్ బెనర్జీ, రిటైర్డ్ డీఎస్పీ కళ్యాణ్, కొమురయ్య, రూప, దివ్య తదితరులు పాల్గొన్నారు.

ఇండో–జర్మన్ విద్యా సహకారంపై ఒప్పందం



ఇండో–జర్మన్ విద్యా సహకార ఒప్పందం కుదుర్చుకున్న అధికారులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్, జర్మనీలోని ఆకెన్ నగరానికి చెందిన జర్మన్ యూనివర్సిటీ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీస్(జీవీ) మధ్య ఇండో–జర్మన్ విద్యా, పరిశోధన, ఆవిష్కరణ పరస్పర సహకారానికి సంబంధించి అవగాహన ఒప్పందం కుదిరింది. జేఎన్‌టీయూహెచ్‌లో గురువారం జరిగిన ఈ ఒప్పందంపై జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ డా.కె.వెంకటేశ్వర రావు, జీవీ మేనేజింగ్ డైరెక్టర్ రాజ్ వంగవండు, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్‌రెడ్డిల సమక్షంలో అధికారులు సంతకాలు చేశారు. కార్యక్రమంలో ఇండో–యూరో ఆఫ్ సింక్రనైజేషన్ ఇండియా సీఈఓ ఎన్.బంగార్రాజు, విశ్వవిద్యాలయ అకాడమిక్ వ్యవహారాల విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎన్.వి. రమణ పాల్గొన్నారు. ఈ అవగాహన ఒప్పందం ప్రకారం అంతర్జాతీయ మోడల్‌లో ద్వైత డిగ్రీ ప్రోగ్రాముల ప్రారంభం, విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి, పరిశోధన సహకార కార్యక్రమాలు, ఇండో–జర్మన్ అధ్యాపకుల ద్వారా వర్క్‌షాపులు, అతిథి ఉపన్యాసాల నిర్వహణ, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ స్థాపనపై చర్చలు వంటివి చేపట్టవచ్చని తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులు, అధ్యాపకులకు అంతర్జాతీయ అవగాహన పెరిగి, ప్రపంచ స్థాయి విద్యా, పరిశోధనలో అవకాశాలు లభించనున్నాయని పేర్కొన్నారు.

వాతావరణ మార్పులపై అధ్యయనం అవసరం

సాక్షి, సిటీబ్యూరో: అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించుకుని వాతావరణ మార్పులపై అధ్యయనం చేయాలని పలువురు వాతావరణ నిపుణులు, పరిశోధకులు అభిప్రాయపడ్డారు. నగరానికి చెందిన కేఎల్‌హెచ్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 'గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ రిఫ్లెక్టోమెట్రీ'పేరిట అజీజ్ నగర్ క్యాంపస్‌లో వర్క్‌షాప్ ప్రారంభించింది. వాతావరణ మార్పులు, విపత్తు నిర్వహణ సంబంధిత 'రిఫ్లెక్టోమెట్రీ'లో నైపుణ్యం మెరుగుపరచడం లక్ష్యంగా ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని వర్సిటీ ప్రతినిధులు తెలిపారు. వాతావరణ మార్పులు, వ్యవసాయం, హైడ్రాలజీ, నేల తేమ పర్యవేక్షణ, విపత్తు నిర్వహణ వంటి అంశాలపై దృష్టి పెడుతుందని వివరించారు. రెండోరోజు శుక్రవారం జరిగే వర్క్‌షాప్‌లో దేశంలోని పలు ప్రాంతాల నుంచి పలువురు పరిశోధకులు, విద్యావేత్తలు హాజరవుతున్నారు.

నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

లాలాపేట: అకాల వర్షాల నేపథ్యంలో నగర ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో సూచించారు. హైదరాబాద్ నగరంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. గాలి దుమారం, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. జీహెచ్ఎంసీ అధికారులు అవసరమైన ప్రాంతాల్లో ఎమర్జెన్సీ బృందాలను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. రోడ్లపై వర్షపునీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఒకే విధమైన టౌన్ ప్లానింగ్ అనుసరించాలి

కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు



జీహెచ్ఎంసీ అడిషనల్ సీసీపీని కలిసి సమస్యను వివరించిన కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: అధికారులు జీహెచ్ఎంసీ వ్యాప్తంగా ఒకే విధమైన టౌన్ ప్లానింగ్ పద్ధతులను అనుసరించాలని, లేకపోతే పెద్ద యెత్తున ఉద్యమిస్తామని ఎమ్మెల్యే కూకట్‌పల్లి మాధవరం కృష్ణారావు హెచ్చరించారు. అధికారులు డబ్బులు తీసుకొని కొన్ని భవనాలను సీజ్ చేస్తున్నారని, వసూళ్ల కోసం టీమ్ ఏర్పాటు చేసుకొని నిర్మాణదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అక్రమ నిర్మాణాల పేరుతో కూకట్‌పల్లి నియోజకవర్గంలో 50కిపైగా భవనాలను అధికారులు సీజ్ చేశారన్నారు. గురువారం నిర్మాణదారులు కమిషనర్ దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే అడిషనల్ సీసీపీని కలిసి స్థానికంగా టౌన్ ప్లానింగ్ అధికారుల తీరును ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఒక్కో సర్కిల్ పరిధిలో ఒక్కో విధానం అమలు చేస్తున్నారని విమర్శించారు. కేపీహెచ్‌బీ డివిజన్ పక్కన ఉన్న గోకుల్ ప్లాట్స్‌లో ఒకరకంగా, బాలాజీనగర్ డివిజన్ పక్కన ఉన్న అయ్యప్ప సొసైటీలో మరోవిధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఏకంగా భవనాలను సీజ్ చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అనుమతులు ఉన్న ఫ్లోర్‌లను కూడా సీజ్ చేయటం సరికాదన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి భవనాలకు వేసిన సీల్‌ను తొలగించాలని కోరారు.

ఓగాలో డెంటల్, ఫిజియోథెరపీ

సర్వీస్‌లను ప్రారంభించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



ఓగా వెల్‌నెస్ సెంటర్‌లో డెంటల్ సర్వీస్‌లు ప్రారంభిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

గచ్చిబౌలి: ఓగా వెల్‌నెస్ సెంటర్‌లో ఫిజియోథెరపీ, డెంటల్, ఫేషియల్ ఈస్తటిక్ సర్వీస్‌లను రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. గురువారం గచ్చిబౌలిలోని ఓగా వెల్‌నెస్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వైమానిక దళంలో పని చేయడం వల్ల తాను ఫిట్‌నెస్, హెల్తీ లైఫ్‌స్టైల్‌పై ఫోకస్‌గా ఉంటానన్నారు. హెల్త్, న్యూట్రిషన్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే వివేక్, మిసెస్ ఏసియా పసిఫిక్ శిల్పా కటారియా తదితరులు పాల్గొన్నారు.

మహావీరుడి బోధనలు అనుసరణీయం: తలసాని



అబిడ్స్: భగవాన్ మహావీరుడు బోధించిన పంచ సూత్రాలు అనుసరించదగినవని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మహావీర్ జయంతి సందర్భంగా గురువారం జైన్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా భగవాన్ మహావీర్ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం జైన్ మత గురువుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహావీరుడి బోధనలను అనుసరించి జైన్ సమాజ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. మహావీర్ హాస్పిటల్ ద్వారా అనేకమంది పేదలకు అతితక్కువ ధరలకు వైద్యం అందిస్తూ అండగా నిలుస్తున్నారని అన్నారు. జైన్ సమాజ్ భవన్ నిర్మాణం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో అద్భుతమైన భవనం నిర్మించాలన్నారు. అనంతరం నిర్వాహకులు తలసానిని సన్మానించారు. కార్యక్రమంలో జైన్ సమాజ్ అధ్యక్షుడు యోగేష్ జైన్, సుభాష్ జైన్, హిమాన్షు బాప్నా, వినోద్ అశోక్, విమల్ ముత్త, అమిత్ జైన్, మోహన్ లాల్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల బాట నేటి తరానికి స్ఫూర్తి

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ నడిచిన బాట నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గురువారం ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో ఓయూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్స్‌తోపాటు యూజీసీ వ్యవహారాల డీన్ కార్యాలయం ఆధ్వర్యంలో మహనీయుల జయంతి ఉత్సవాలను నిర్వహించారు. కార్యక్రమానికి వైస్ చాన్స్‌లర్ ప్రొ.కుమార్ అధ్యక్షత వహించగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మహనీయుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ఈ నెల 13 వరకు జరిగే ఉత్సవాలను స్పీకర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్‌లు తమ ఆలోచనా విధానంతో దేశ చరిత్రనే మార్చేశారని పేర్కొన్నారు. సమాజంలో నెలకొన్న వివక్ష, అసమానతలను రూపుమాపడానికి కృషి చేయడమే మహనీయులకు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. పేద, బలహీన వర్గాల విద్యార్థుల సంక్షేమం దిశగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని వివరించారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ మహనీయుల స్ఫూర్తితో రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకునే దిశగా యువత సాగాలని సూచించారు. దేశంలో విద్యా, సామాజిక సమానత్వం, హక్కుల పరిరక్షణకు కోసం మహనీయులు అలుపెరగని పోరాటం చేశారని వీసీ ప్రొ.కుమార్ పేర్కొన్నారు. అనంతరం 'అట్టడుగు వర్గాల సాధికారత, వర్తమానం, భవిష్యత్తు అవకాశాలు' అనే అంశంపై జరిగిన సదస్సులో ప్రొ.సుధారాణి కీలకోపన్యాసం చేశారు. కార్యక్రమానికి ఓయూ అధికారులతోపాటు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

స్థలం కొనేటప్పుడు జాగ్రత్త: రంగనాథ్



హెచ్‌ఆర్‌సీఎస్ ఇండియా.కాం వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

వనస్థలిపురం: 'ఒక పెళ్లి చేసినప్పుడు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటామో, ఇల్లు, స్థలం కొనేటప్పుడు ఇంకా ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి'అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. గురువారం ఎల్బీనగర్‌లో హెచ్‌ఆర్‌సీఎస్ ఇండియా.కాం వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో, ప్రభుత్వ భూముల్లో స్థలాలు కొని మోసపోవద్దని కొనుగోలుదారులకు సూచించారు. చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాలను కాపాడుకోవడానికే హైడ్రా ఏర్పాటైందన్నారు. చెరువుల్లో ఇళ్లు కట్టి అమ్మేవారిపై చర్యలు తప్పవని, కొత్త చట్టం ప్రకారం వారి ఆస్తులను జప్తు చేస్తామని స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ ఎఫ్‌టీఎల్‌ను సరిగా గుర్తించి, కొనుగోలుదారులకు ఉచితంగా సేవలు అందించడానికి హెచ్‌ఆర్‌సీఎస్ డిజిటల్ ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. సంస్థ సీఈఓ కే.హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రెరా అప్రూవ్డ్ సర్టిఫికెట్‌తో కొనుగోలుదారులకు ఉచితంగా సేవలు, పేరొందిన 5 బ్యాంక్‌ల ద్వారా రుణాలు అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ బ్యాంక్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపట్నుంచి సంపూర్ణ శతావధానం



పట్వర్ధన్ శతావధానం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అనంతకృష్ణ తదితరులు

నాంపల్లి: అవధానం మన వారసత్వ విద్య అని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అవధాన విద్యా వికాస పరిషత్ అధ్యక్షుడు మరుమాముల దత్తాత్రేయ శర్మ అన్నారు. తెలుగు వర్సిటీ, ప్రజ–పద్యం, అవధాన విద్యా వికాస పరిషత్ సంస్థల సంయుక్త నిర్వహణలో ఈ నెల 12, 13, 14వ తేదీల్లో నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలో జరగనున్న డాక్టర్ మారేపల్లి వెంకటరమణ పట్వర్ధన్ సంపూర్ణ శతావధానం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ శర్మ మాట్లాడుతూ ఈ శతావధానాన్ని కూడా తెలుగు పండుగలాగా ఘనంగా జరుపుకోవాలన్నారు. ఈ శతావధానానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వంద మంది కవి పండితులు విచ్చేయనున్నారని తెలిపారు. ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి, గౌరవాధ్యక్షుడిగా, హైకోర్టు న్యాయవాది అనంతకృష్ణ అధ్యక్షులుగా, దత్తాత్రేయ శర్మ ప్రధాన కార్యదర్శిగా ఆహ్వాన సంఘం ఏర్పాటైందని తెలిపారు. నారుమంచి వెంకట అనంతకృష్ణ మాట్లాడుతూ ఈ శతావధానం తెలుగు భాష, సాహిత్యాలకు ఒక అపూర్వ కానుకని పేర్కొన్నారు. విఖ్యాత పండితుడైన వెంకటరమణ పట్వర్ధన్ గతంలో మూడు శతావధానాలు చేశారని అన్నారు. దర్శనమ్ ఆధ్యాత్మిక వార్త మాస పత్రిక సంపాదకుడు వెంకటరమణ శర్మ మాట్లాడుతూ మండు వేసవిలో పన్నీటి జల్లులాగా ఈ శతావధాన సభలు సాహిత్య అభిమానులందరినీ అలరిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

పోలింగ్ విధులపై పూర్తి అవగాహన అవసరం

ఎన్నికల అధికారుల శిక్షణ కార్యక్రమంలో నోడల్ అధికారి సునంద రాణి

లక్డీకాపూల్: పోలింగ్ విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎలక్షన్ ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి డాక్టర్ సునంద రాణి అధికారులకు సూచించారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, ఓపీఓలకు తొలి విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ అధికారులు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. మాస్టర్ ట్రైనర్స్ వారికి ఎన్నికల నియమ నిబంధనలు, బ్యాలెట్ బాక్సుల సీల్ విధానం, బ్యాలెట్ పేపర్స్, అవసరమైన ఫారాలు పూరించడం వంటివాటిపై అవగాహన కల్పించారు. నమూనా బ్యాలెట్ బాక్స్ ద్వారా ప్రత్యక్షంగా చేయించి హ్యాండ్స్ ఆన్ శిక్షణను ఇచ్చారు. శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు విజయలక్ష్మి, మమత, పీఓ, ఏపీఓలు, మైక్రో అబ్జర్వర్లు తదితరులు పాల్గొన్నారు.

20 ఈ బైక్స్.. 12 డ్రోన్‌ల వితరణ

సీఎస్ఆర్ కింద భూపాలపల్లి కలెక్టర్‌కు అందజేసిన ఈసీఐఎల్ సీఎండీ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌కు డ్రోన్లు అందజేసిన ఈసీఐఎల్ సీఎండీ అనురాగ్ కుమార్

కుషాయిగూడ: సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్) జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు 20 ఈ బైక్స్, 12 డ్రోన్లు సమకూర్చింది. ఈ మేరకు జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్ శర్మకు ఈసీఐఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) అనురాగ్ కుమార్ వాటిని అందజేశారు. అనురాగ్ కుమార్ మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాల్లో తిరుగుతూ ప్రజలకు సేవలందిస్తున్న ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ స్కీమ్ (ఐసీడీఎస్) సూపర్‌వైజర్ల కోసం ఈ బైక్స్‌ను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈసీఐఎల్ ప్రతినిధులు మురళీధర్, డాక్టర్ పి.వేణు, పి.రమేష్, రామకృష్ణ, మజ్దూర్ సంఘ్ నాయకులు జి.శ్రీనివాసరావు, వినోద్‌కుమార్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

నటీమణులు రాశీసింగ్, సాంచి రాయ్ సందడి





గచ్చిబౌలి: హీరోయిన్లు రాశీసింగ్, సాంచి రాయ్‌లు ఓ స్టోర్‌లో సందడి చేశారు. గురువారం కొత్తగూడలోని శరత్ సిటీ క్యాపిటల్ మాల్ మోహీ వెడ్డింగ్ వియర్(వివాహ దుస్తులు) స్టోర్‌ను వారు ప్రారంభించారు. రాశి సింగ్, సాంచి రాయ్‌లు వెడ్డింగ్ ఫ్యాషన్ దుస్తులతో ఆకట్టుకున్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, శుక్రవారం, 11, ఏప్రిల్, 2025

విద్యార్థుల చదువులు, యువత కాలేజీల పోటీ వాతావరణానికి, ఒత్తిడికి వేసవి ఒక విరామం, వినోదం. అయితే హైదరాబాద్ నగరం వేసవి సెలవుల్లో విద్యార్థులు, యువతకు వివిధ రంగాల్లో నైపుణ్యం పెంపొందించుకునేందుకు అనేక సమ్మర్ క్యాంపులకు వేదికగా మారింది. ఇందులో భాగంగా సాంకేతిక పరిజ్ఞానం నుంచి సృజనాత్మక రంగాల వరకూ, శారీరక దృఢత్వం నుంచి వ్యక్తిత్వ వికాసం వరకూ విస్తరించి ఉన్న ఈ క్యాంపులు, విద్యా జీవితానికి వెలకట్టలేని అనుభవాలను అందిస్తున్నాయి. ఈ రెండు నెలల కాలాన్ని ఇంటి పట్టునే ఉండి వృథా చేయకుండా ఇటు విజ్ఞానం, అటు వినోదం సమ్మిళితంగా ఈ వేసవి శిబిరాలు ఏర్పాటు చేస్తుండటం విశేషం. - సాక్షి, సిటీ బ్యూరో



నగరంలో ది బేర్ హౌస్ ఫ్యాషన్..

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫార్మ్‌లో ప్రసారమైన షార్క్ ట్యాంక్ సీజన్ 4 ద్వారా యూత్‌ని ఆకట్టుకుంటున్న ది బేర్ హౌస్ ఫ్యాషన్ నగరానికి వచ్చింది. నగరంలోని బంజారాహిల్స్‌లో తమ నూతన స్టోర్‌లో ఈ కలెక్షన్ అందుబాటులో ఉందని ది బేర్ హౌస్ సహ వ్యవస్థాపకుడు హర్ష్ సోమయ్య తెలిపారు. రోడ్డు మీద నుంచి మాల్‌లో ఉన్న స్టోర్‌కి నేరుగా చేరుకునేలా వినూత్నంగా ఏర్పాటైన స్టోర్‌లోని తమ కలెక్షన్స్‌లో షర్టులు, బాటమ్స్, పోలోస్, స్వెట్‌షర్టులు, డెనిమ్‌లు, యాక్సెసరీస్ ఉంటాయని తెలియజేశారు.

మే 24న 'హ్యుందాయ్ స్పాట్‌లైట్'..

సాక్షి, సిటీబ్యూరో: హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో 'హ్యుందాయ్ స్పాట్‌లైట్' పేరిట సంగీత కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయాన్ని ఆ సంస్థ హోల్-టైమ్ డైరెక్టర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తరుణ్ గార్గ్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సంగీతకారులు పాల్గొనే ఈ కార్యక్రమం జైపూర్, హైదరాబాద్‌లో నిర్వహించాలని నిర్ణయించామని, ఏప్రిల్ 13న జైపూర్‌లో సంగీత ప్రదర్శన జరుగుతుందని, అదే విధంగా హైదరాబాద్ నగరంలో మే 24న జరుగుతుందన్నారు. నగరంలోని నార్సింగిలో ఉన్న ది అడ్రెస్ కన్వెన్షన్స్ అండ్ ఎగ్జిబిషన్స్ ఆవరణలో జరిగే కార్యక్రమంలో ప్రముఖ సంగీత కళాకారులు నరేష్ అయ్యర్, కార్తీక్ పాల్గొంటారని వివరించారు.



కుట్టు.. ఆకట్టు..

- ఖరీదైన సూట్స్‌కు ఫ్రీ స్టిచ్చింగ్ ఆఫర్స్
- వినియోగదారులను ఆకట్టుకునే పనిలో బ్రాండ్స్..



సాక్షి, సిటీబ్యూరో: సూట్స్ కోసం ఖరీదైన ఫ్యాబ్రిక్స్ కొనుగోలు చేయడం మాత్రమే కాదు వాటిని అంతే స్టైల్‌గా స్టిచ్ చేయడం కూడా ముఖ్యమే. ఎంత మంచి బ్రాండెడ్ క్లాత్ తీసుకున్నా స్టిచ్చింగ్ కుదరకపోతే.. ఆ ఖర్చు బూడిదలో పోసిన పన్నీరే. ముఖ్యంగా విభిన్న హోదాల్లో ఉంటూ సూట్స్ ధరించేవారికి ఆ హోదాకు తగ్గట్టు కుట్టు కూడా కుదరాలి. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రముఖ బ్రాండ్స్ తామే స్టిచ్చింగ్ సేవలను అందిస్తున్నాయి. ఈ విషయంలో మరొక అడుగు ముందుకేసిన.. ప్రముఖ అంతర్జాతీయ బ్రాండ్ నగరవాసులకు ఉచితంగా స్టిచ్చింగ్ సేవల్ని పరిచయం చేస్తూ మేడ్ ఫర్ యూ స్టిచ్ ఫర్ ఫ్రీ పేరిట ఓ కాన్సెప్ట్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ విషయాన్ని ఆ సంస్థ రిటైల్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ ప్రణవ్ దేవ్ తెలిపారు. ఈ పంథాను మరిన్ని బ్రాండ్స్ అనుసరిస్తే.. వేల రూపాయలు వ్యయమయ్యే స్టిచ్చింగ్ సేవలు ఉచితంగా అందించే పరిస్థితి కనిపిస్తోంది.

- విజ్ఞానం, వినోదాలకు వేదికగా సమ్మర్ క్యాంపులు
- కోడింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మొదలు ఫైన్ ఆర్ట్స్ వరకూ
- వ్యక్తిత్వ వికాస శిక్షణ వైపు మొగ్గుచూపుతున్న నగర యువత
- క్రీడలు, ఫిట్‌నెస్ రంగాలకు నగరంలో మంచి డిమాండ్



శిక్షణే వినూత్న లక్షణం..



ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎప్పటికప్పుడు మారుతున్న అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి టెక్నికల్ స్కిల్స్ నేర్చుకోడానికి ఈ తరం ఎక్కువ ఆసక్తి చూపిస్తోందనేది నిపుణుల మాట. ఇందులో భాగంగా వైట్ హాట్ జేఆర్, కోడింగ్ నింజాస్, హ్యాకర్ కిడ్, ఎస్‌పీ రోబోటిక్స్ మేకర్ ల్యాబ్ వంటి సంస్థలు ప్రాథమిక స్థాయి నుంచి అడ్వాన్స్ లెవెల్ వరకూ కోడింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ వంటి రంగాల్లో శిక్షణ అందిస్తున్నాయి. స్పెషల్ ఇంటర్న్‌షిప్ మాడ్యూల్స్ సహా ప్రాజెక్టు ఆధారిత శిక్షణ ద్వారా విద్యార్థులకు రియల్-వరల్డ్ పరిజ్ఞానం అందిస్తోంది. మాదాపూర్, గచ్చిబౌలి వంటి ప్రాంతాల్లో ఈ సంస్థల శిక్షణా కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి.

ఈ తరం కళాత్మకం వైపే..

విద్య, వృత్తి పరమైన నైపుణ్యాలు ఎన్ని ఉన్నా ఏదో ఒక కళలో ప్రావీణ్యముండటం ఈ తరంలో సెలబ్రిటీ హోదాగా మారింది. ముఖ్యంగా సోషల్ మీడియా వైరల్స్ పుణ్యమా అని వినూత్న వ్యక్తిత్వానికి కళలు ఒక ప్రామాణికంగా మారాయి. ఈ నేపథ్యంలో ముఖ్యంగా నగరవాసుల దృష్టి కళల వైపు మళ్లిందనే చెప్పాలి. నగరంలోని రవీంద్ర భారతి అకాడమీ, శిల్పా రామం ఆర్ట్ క్యాంప్, కల్పతరు వంటి విభిన్న కళా వేదికలు, సంస్థలు.. పెయింటింగ్, సంగీతం, నృత్యం, థియేటర్ ఆర్ట్స్ వంటి రంగాల్లో వేసవి శిబిరాలను నిర్వహిస్తున్నాయి. ముఖ్యంగా శిల్పారామం ప్రాంగణంలో నిర్వహించే కళాకారుల వర్క్‌షాపులు, విద్యార్థులకు దేశీయ కళల పట్ల అవగాహన పెంపొందించడంలో మైలురాయిగా నిలుస్తున్నాయి.



ఫిట్ అండ్ స్పోర్ట్స్..

నగర వాసుల సక్సెస్ మంత్ర ఏదైనా ఉందంటే.. అది ఆరోగ్యం, ఫిట్నెస్ అని ఠక్కున చెప్పేస్తారు. ఆరోగ్య శిక్షణ, క్రీడలు, ఫిట్నెస్ రంగాలకు నగరంలో మంచి డిమాండ్, ఆదరణ ఉంది. అంతేకాకుండా ఈ రంగాల్లోని శిక్షణా అంశాలపై హైదరాబాద్ వేదికగా అంతర్జాతీయ స్థాయి కేంద్రాలు ఉండటం విశేషం. డెకథ్లాన్ అకాడమీ, పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ, ఫిట్ కిడ్స్ హైదరాబాద్ వంటి సంస్థలు స్విమ్మింగ్, యోగా, మార్షల్ ఆర్ట్స్, స్పోర్ట్స్ ట్రైనింగ్ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నాయి. ఈ శిక్షణల ద్వారా విద్యార్థుల్లో ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, క్రమశిక్షణ, టీం వర్క్, ఫోకస్ వంటి విలువలు పెంపొందుతున్నాయి. అంతేకాకుండా కేవలం చదువులు మాత్రమే కాదు.. క్రీడలతోనూ అంతర్జాతీయ గుర్తింపు, ఉన్నత స్థాయి జీవితానికి నాంది పలకవచ్చని చెప్పడానికి పలువురు నగర క్రీడాకారులే నిదర్శనం.

చేయూతనిస్తే అద్భుతాలే..

సమ్మర్ క్యాంపుల ద్వారా విద్యార్థులు, యువత కొత్త ప్రపంచాన్ని అన్వేషించే అవకాశం పొందుతున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్లోని ఆసక్తులను గుర్తించి, అనుగుణమైన శిక్షణలకు ప్రోత్సహించగలిగితే, వారు భవిష్యత్తులో విశ్వాసంతో ముందుకు సాగుతారని నిర్వాహకులు, నిపుణులు సూచిస్తున్నారు.



వ్యక్తిత్వ వికాసానికీ పెద్దపీట..

అదనపు నైపుణ్యాలను కోరుకునే నగర వాసులు ఎవరైనా సరే.. వ్యక్తిత్వ వికాస శిక్షణలో ప్రవేశించడానికే మొగ్గు చూపుతున్నారు. వీరి ఆసక్తికి అనుగుణంగా ది పర్సనాలిటీ స్కూల్, టైమ్ కిడ్స్, ఉద్భవ్ అకాడమీ వంటి ప్రత్యేక సంస్థలు కమ్యూనికేషన్ స్కిల్స్, పబ్లిక్ స్పీకింగ్, లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నాయి. ఇవి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంలో, యువత భవిష్యత్తుకు మార్గం చూపడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రధానంగా ఉద్యోగాలను పొందడంలోనూ, ఉపాధి రంగాల్లో రాణించడంలోనూ ఈ వ్యక్తిత్వ వికాస శిక్షణ ఎంతో ఆత్మ విశ్వాసాన్ని, స్థైర్యాన్ని పెంపొందిస్తుందని వ్యక్తిత్వ వికాస నిపుణులు చెబుతున్న మాట.

పెట్ బ్రీడ్.. బీ కేర్‌ఫుల్ డ్యూడ్..

- పెంపుడు శునకాల విషయంలో జాగ్రత్త అవసరం
- నగరానికి నప్పేవే ఎంచుకోవాలి : నిపుణుల సూచన
- నేడు నేషనల్ పెట్స్ డే

ఒకప్పుడు మంచి కాలక్షేపాన్ని అందించే నేస్తాలుగా, అలసిన జీవితాలకు ఆహ్లాదాన్నిచ్చే ఆప్తులుగా భావించిన నగరవాసులు.. ఇప్పుడు పెట్స్‌ను స్టేటస్ సింబల్‌గా చూస్తున్నారు. లక్షలు, కోట్లు వెచ్చించి ఖరీదైన బ్రీడ్స్‌ను కొనుగోలు చేస్తున్నారు. అయితే ఈ క్రమంలో మన వాతావరణానికి నప్పని వాటిని ఎంచుకోవడం పొరపాటవుతుందని పెట్ స్పెషలిస్ట్‌లు హెచ్చరిస్తున్నారు.

సాక్షి, సిటీబ్యూరో



గతంలో సింబా అనే ఒక సెయింట్ బెర్నార్డ్‌ను గతంలో బర్కత్‌పురాకు చెందిన జంతు కార్యకర్తలు రక్షించారు. దాన్ని ఒక కాంపౌండ్ లోపల బంధించి ఉంచారు. సరైన ఆహారం ఇవ్వకపోవడంతో, కంటి చూపు కోల్పోయి అనారోగ్యం భారిన పడిన సింబా ఆ తర్వాతు జంతు ప్రేమికుల సంరక్షణలో కోలుకుంది. అలా సింబా మాదిరిగానే, మరికొన్ని శునకాలనూ వాటిని తగిన విధంగా చూసుకోలేని యజమానులు వాటి ఖర్మానికి వదిలేస్తున్నారు. కొంపల్లి హైవే పైన గ్రేట్ డేన్ ను రక్షించిన శునకాల బిహేవియర్ థెరపిస్ట్ పన్నీరు తేజ మాట్లాడుతూ, ఈ విదేశీ జాతి శునకాలను చాలా వరకూ అక్రమ పెంపకందారుల నుంచి కొనుగోలు చేస్తారని, అయితే అనారోగ్య పరిస్థితి ఏర్పడిన తర్వాత వదిలివేస్తారని తెలిపారు. 'చాలా మంది పెంపుడు జంతువుల యజమానులు జాతి ఆహార నిర్వహణ అవసరాల గురించి అవగాహన లేకుండానే థోరో బ్రెడ్ శునకాలను కొనుగోలు చేస్తారు' అని ఆయన చెప్పారు.

సరిపడకపోతే.. అనారోగ్యాల వెతే..

నప్పని నగర వాతావరణం వల్ల కొన్ని బ్రీడ్స్ అనేక అనారోగ్యాలకు గురవుతాయి. గ్యాస్ట్రోఎంటిరైటిస్, హీట్ స్ట్రోక్, వైరల్ బాక్టీరియల్ ఇన్ఫెక్షన్లకు సులభంగా గురవుతాయి. కాబట్టి ఇండియన్ బ్రీడ్స్ లేదా దశాబ్దాల తరబడి భారతదేశంలో భాగమైన జాతులను దత్తత తీసుకోవాలని నిపుణులు సలహా ఇస్తున్నారు. ఇక్కడి వాటికి ఇన్ఫెక్షన్ల నిరోధకత కలిగి ఉంటాయి. కఠినమైన వాతావరణాన్ని తట్టుకోగలవు అని చెబుతున్నారు.

అవగాహన, సంరక్షణ అవసరం..



జర్మన్ షెపర్డ్ వంటి భారీ బ్రీడ్స్ అపార్ట్‌మెంట్‌లకే పరిమితం కాకూడదని, మన వాతావరణ పరిస్థితులకు అవి తగినవి కాదని నిపుణులు అంటున్నారు. ఇటువంటి శునకాలు అనేక అనారోగ్యాలకు గురవుతాయి, 'కుక్కపిల్లని ఇంటికి తీసుకు రావడం అంటే అది జీవితకాల బాధ్యత. బిడ్డకు ఎంత శ్రద్ధ, సంరక్షణ, సమయం అవసరమో వాటికీ అంతే అవసరం. ఇటీవల, నగరవాసులు కొందరు చౌ చౌస్, సెయింట్ బెర్నార్డ్స్, సైబీరియన్ హస్కీలు, అలాస్కాన్ మాలమ్యూట్స్ వంటి బ్రీడ్స్‌ను పెట్స్‌గా ఎంచుకుంటున్నారు. అయితే ఇవి మన వాతావరణానికి సరిపోవు. ఇవి సున్నా కంటే తక్కువ ఉష్ణోగ్రతలలో మాత్రమే తగిన విధంగా పెరుగుతాయి. భారతీయ వాతావరణానికి ఎప్పటికీ సర్దుబాటు కావు'. అంటూ పెట్ నిపుణుడు మురళి చెబుతున్నారు.



గోవిందం టూర్‌లో శ్రీవారి దర్శనం

- వేసవిలో తేలికగా తిరుమల పుణ్యక్షేత్ర దర్శనం
- నగరం నుంచి ప్రతి రోజూ అందుబాటులో

లక్డీకాపూల్ : తిరుమల వెంకన్న దర్శనం చేసుకోవాలంటే గంటల కొద్దీ క్యూలైన్లలో నిలబడాల్సి ఉంటుంది. నిత్యం భక్తుల రద్దీగా ఉండే తిరుమల శ్రీవారి దర్శన భాగ్యం కలగాలంటే అంత సులభం కాదు. అయితే గంటల కొద్దీ.. రోజుల తరబడి క్యూలైన్లలో నిలబడకుండా కేవలం ఒక్కరోజులోనే స్వామి దర్శనం చేసుకునేలా ఐఆర్‌సీటీసీ 'గోవిందం' ప్యాకేజీని తీసుకొచ్చింది. తక్కువ సమయంలో శ్రీవారిని దర్శించుకోవాలనుకునేవారికి ఈ ప్యాకేజీ ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. 'గోవిందం టూర్'లో తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు స్పెషల్ దర్శనం ఏర్పాటు చేస్తారు. లింగంపల్లి రైల్వే స్టేషన్ నుంచి ట్రైన్ నెంబర్ 12734లో సాయంత్రం 5.25 గంటలకు బయలుదేరుతుంది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు సాయంత్రం 6.10గంటలకు చేరుకుంటుంది. అక్కడ నుంచి నల్గొండకు రాత్రి 7.38 గంటలకు చేరుతుంది. తెలంగాణ నుంచి ఏపీలోని ప్రముఖ పట్టణాల మీదుగా 'గోవిందం టూర్' రైలు ప్రయాణం సాగుతుంది. రెండో రోజు ఉదయం ఆరు గంటలకు తిరుపతి రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుంది. అక్కడ నుంచి హోటల్‌కు భక్తులు వెళ్లి చెక్ ఇన్ అవుతారు. బ్రేక్ ఫాస్ట్ అనంతరం శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు బయలుదేరుతారు. ప్రత్యేక దర్శనం ద్వారా శ్రీవారిని దర్శిస్తారు. సాయంత్రం 6 గంటలకు తిరుపతి రైల్వే స్టేషన్‌కు చేరుకుంటారు. అక్కడ సాయంత్రం 6.25 గంటలకు ట్రైన్ నెంబర్ 12733 ఎక్కుతారు. మరుసటి రోజు ఉదయం 7 గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు, అక్కడ నుంచి లింగంపల్లికి ఉదయం 7.35గంటలకు చేరుకుంటుంది. ఈ ప్యాకేజీలో ప్రయాణికులకు తిరుపతి రైల్వే స్టేషన్‌లో దిగిన తర్వాత ఏసీ వాహనంలో రవాణా, హోటల్లో బసతో పాటు, వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం స్పెషల్ ఎంట్రీని రైల్వే శాఖ ఏర్పాటు చేస్తుంది. ఈ టూర్‌లో బ్రేక్‌ఫాస్ట్ ఇస్తారు. బీమా సౌకర్యం కూడా ఉంది. ఈ తరహా టూర్ ప్యాకేజీ ప్రతి రోజూ అందుబాటులో ఉంటుంది.



భక్తుల డ్రెస్ కోడ్..

తిరుమల శ్రీవారి దర్శనానికి డ్రెస్ కోడ్ పాటించాలి.

పురుషులు : ధోతీ (తెలుపు)చొక్కా లేదా కుర్తా, పైజామా.
మహిళలు : చీర లేదా సల్వార్ కమీజ్.. పల్లు తప్పనిసరి.
ఏ వయసువారైనా టీ-షర్టు, జీన్స్ వంటి దుస్తులు ధరించకూడదు.

టూర్ ప్యాకేజీ ఇలా..

'గోవిందం టూర్' ప్యాకేజీ ధరలు రెండు రకాలుగా ఉన్నాయి.

కేటగిరీ	కంఫర్ట్(3ఏ)	స్టాండర్డ్(ఎస్ఎల్)
సింగిల్ షేరింగ్	రూ.6790లు	రూ.4940లు
ట్విన్ షేరింగ్	రూ.5660లు	రూ.3800లు
ట్రిపుల్ షేరింగ్	రూ.5660లు	రూ.3800లు
పిల్లలకు బెడ్ (5-11 ఏళ్లు)	రూ.4750ల	రూ.2890లు
పిల్లలకు బెడ్ లేకుండా (5-11 ఏళ్లు)	రూ.4750లు	రూ.2890లు



కంచకు చేరని కథ

సాక్షి ఇన్‌డెప్త్

కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూములపై వివాదం

ప్రకృతి నడుమ ప్రశాంతంగా ఉండే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అలజడి రేగింది. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలపై వివాదం రేగింది. విద్యార్థులందరూ ఏకమై ఉద్యమం చేపట్టారు. విద్యార్థి సంఘాలు, విపక్షాలు వీరికి మద్దతు పలకడంతో ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యింది. చివరికి సుప్రీం కోర్టుకు చేరింది. అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు కేంద్ర సాధికార కమిటీ హెచ్‌సీయూలో వివాదాస్పద భూముల పరిశీలనకు వచ్చిన నేపథ్యంలో

అసలు గతంలో ఏం జరిగింది?
ఈ వివాదమెందుకు వచ్చింది?
విద్యార్థుల నిరసనలకు కారణమేంటి?
ప్రభుత్వం వాదనేంటి?
వర్సిటీ వర్గాల కౌంటరేంటి?
ఈ మొత్తం వ్యవహారంపై 'సాక్షి ఇన్‌డెప్త్' స్టోరీ మీకోసం..

- సాక్షి, హైదరాబాద్

400 ఎకరాలతో 'రుణా'నుబంధం

ప్రస్తుతం టీజీఐఐసీ అధీనంలో ఉన్నట్టుగా చెబుతున్న సుమారు 400 ఎకరాలకు పైగా భూమిని వేలం వేయడం ద్వారా రూ.25 వేల కోట్ల మేర రాబడి సమకూర్చుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు అనేక మలుపులు తిరుగుతున్నాయి. వాస్తవానికి ఈ 400 ఎకరాల భూమిని గ్యారంటీగా చూపి 9.6 శాతం వడ్డీపై ఐసీఐసీఐ నుంచి రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది రూ.10 వేల కోట్ల రుణం తీసుకుంది. అయితే రూ.20 వేల కోట్లకు పైగా విలువ కలిగిన ఈ భూములను సెక్యూరిటీగా పెట్టి కేవలం రూ.10 వేల కోట్ల రుణమే తీసుకోవడంపై ప్రభుత్వం పునరాలోచనలో పడింది. వీటి వేలం ద్వారా రూ.25 వేల కోట్ల వరకు ఆదాయం సమకూరే అవకాశముండటంతో అభివృద్ధి పనులు ప్రారంభించింది. అయితే తమకు సెక్యూరిటీగా పెట్టిన భూముల వేలం ఆలోచనపై ఐసీఐసీఐ అభ్యంతరం వ్యక్తం చేసింది. కానీ రూ.10 వేల కోట్ల రుణానికి గాను ప్రభుత్వం ప్రతి నెలా రూ.100 కోట్ల కిస్తీ (ఈఎంఐ) చెల్లిస్తున్న నేపథ్యంలో వచ్చే రెండేళ్ల పాటు చెల్లించాల్సిన కిస్తీల మొత్తం సుమారు రూ.2,500 కోట్లు ముందస్తుగా చెల్లిస్తే బాండ్లు తిరిగి ఇస్తామని చెప్పింది. ఇందుకు అంగీకరించిన ప్రభుత్వం భూమిని చదును చేసే ప్రక్రియను చేపట్టింది.



గతంలో ఏం జరిగింది?

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన తొలి దశ ఉద్యమం, ఆ తర్వాత జై ఆంధ్ర ఉద్యమాల నేపథ్యంలో 1970వ దశకం ప్రారంభంలో తెలంగాణ రాష్ట్రంలో విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలని అప్పటి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు 1974లో హెచ్‌సీయూను ఏర్పాటు చేశారు. తొలుత నాంపల్లి స్టేషన్ రోడ్డులోని సరోజినీ నాయుడు ఇల్లు 'గోల్డెన్ థ్రెషోల్డ్'లో ఇది ప్రారంభమైంది. ప్రస్తుత రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని కంచ గచ్చిబౌలి గ్రామం సర్వే నంబర్ 25లో ఉన్న 2,324 ఎకరాలను కేటాయించిన తర్వాత అక్కడ పెద్ద క్యాంపస్ ఏర్పడింది. అప్పట్లోనే ఆ భూమి చుట్టూ ప్రహరీ గోడను కూడా కట్టారు. అప్పట్నుంచీ ఆ భూములన్నీ వర్సిటీ ఆధ్వర్యంలోనే ఉన్నా.. అధికారికంగా యూనివర్సిటీ పేరిట మాత్రం భూముల బదలాయింపు జరగలేదు. అంటే అధికారికంగా యూనివర్సిటీ పేరిట ఒక్క ఎకరా కూడా లేదన్నమాట. అయితే ఉమ్మడి ఏపీలో 2012 నవంబర్ 20వ తేదీనే అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఈ భూముల బదలాయింపునకు సంబంధించిన ప్రతిపాదనలు భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) కార్యాలయానికి వెళ్లాయి. ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్లు తాజాగా వెలుగులోకి వచ్చాయి. కానీ అప్పటి నుంచి ఇప్పటిదాకా ఈ ప్రతిపాదనలు పరిష్కారానికి నోచుకోకపోవడం గమనార్హం.

నాడు చంద్రబాబు చేసిన నిర్వాకం ఏమిటి?

హెచ్‌సీయూకు కేటాయించిన భూముల్లోని ఈ 400 ఎకరాలూ వివాదాస్పదం కావడానికి ఆద్యుడు 2004లో ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు. ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కీలక నిర్ణయాలు తీసుకోవడానికి నైతికంగా వీల్లేకపోయినా.. క్రీడలకు సంబంధించిన మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసమంటూ పెద్దగా ఊరూ పేరూ లేని ఐఎంజీ భారత అనే సంస్థకు మొత్తం 850 ఎకరాలను చంద్రబాబు కేటాయించారు. అందులో 400 ఎకరాలు హెచ్‌సీయూ కింద ఉన్న కంచ గచ్చిబౌలి సర్వే నంబర్ 25 లోనివి కాగా, మరో 450 ఎకరాలను మామిడిపల్లిలో కేటాయించారు. అవగాహన ఒప్పందాలు, కేటాయింపు ఉత్తర్వులు, రిజిస్ట్రేషన్ కూడా ఆగమేఘాల మీద చేసేశారు. 2004 ఫిబ్రవరి 10వ తేదీన ఆ భూమి ఐఎంజీ పేరిట రిజిస్ట్రేషన్ అయ్యింది. వాస్తవానికి ఆ సమయంలో మొత్తం 534.28 ఎకరాలను వర్సిటీ నుంచి తీసుకున్న బాబు.. 400 ఎకరాలు ఐఎంజీ భారత్‌కు, 134.28 ఎకరాలు ఏపీఎన్జీవోలకు కేటాయించారు. ఐఎంజీ భారత్ పేరుతో బిల్లీరావు అనే వ్యక్తికి చంద్రబాబు ప్రభుత్వం చేసిన ఈ భూ పందేరాన్ని ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది.

వైఎస్సార్ ఏం చేశారు?

వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2006లో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తెచ్చి మరీ ఆ భూములను వెనక్కు తీసుకుంది. దీనిపై ఐఎంజీ సంస్థ హైకోర్టుకు వెళ్లింది. 24781/2006 నంబర్‌తో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డిల పాలనలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ, కేసీఆర్ హయాంలోని తెలంగాణ రాష్ట్రంలోనూ కలిపి 18 ఏళ్ల పాటు విచారణ నడిచింది. తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 3 నెలల తర్వాత ఆ భూమి రాష్ట్ర ప్రభుత్వానికి చెందుతుందంటూ 2024 మార్చి 7న ఈ కేసులో హైకోర్టు తీర్పునిచ్చింది. దీన్ని ఐఎంజీ సంస్థ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) 9266/2024 దాఖలు చేసింది. ఈ కేసు కూడా రెండు నెలల్లోనే ముగిసింది. ఆ భూములు రాష్ట్ర ప్రభుత్వానివేనంటూ 2024 మే 3వ తేదీన సుప్రీంకోర్టు కూడా తీర్పునిచ్చింది. దీంతో ఆ 400 ఎకరాలు తెలంగాణ ప్రభుత్వానికి దఖలు పడ్డాయి. ఈ భూములను తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ (టీజీఐఐసీ)కు బదలాయించేందుకు గత ఏడాది జూన్ 6వ తేదీన పరిశ్రమల శాఖ సిఫారసు చేసింది. ఇందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ మేరకు 2024 జూలై 1న పంచనామా నిర్వహించి 400 ఎకరాలను టీజీఐఐసీకి అప్పగించారు. ఇప్పుడు ఆ భూములను పరిశ్రమలకు కేటాయించేందుకు వీలుగా చెట్లు, రాళ్ల చదును చేసే పనిలో టీజీఐఐసీ పడింది. ఇదే వివాదానికి దారితీసింది.



ప్రభుత్వం ఏమంటోంది?

ఈ భూమి హెచ్‌సీయూది కాదని, మొత్తం 400 ఎకరాల్లో అంగుళం కూడా వర్సిటీ పరిధిలోనికి రాదనేది రాష్ట్ర ప్రభుత్వం వాదన. 'సర్వే నంబర్ 25లో ఉన్న భూమి కంచ పోరంబోకు. చట్టప్రకారం అటవీ భూమి కూడా కాదు. ఈ 400 ఎకరాలను తీసుకున్నందుకు ప్రత్యామ్నాయంగా గోపన్‌పల్లి గ్రామంలోని సర్వే నంబర్ 36లో 191-36 ఎకరాలు, 37లో 205-20 ఎకరాలు కలిపి మొత్తం 397 ఎకరాలు వర్సిటీకి కేటాయించారు. ఈ 397 ఎకరాలను తీసుకోవడం ద్వారా ఆ 400 ఎకరాల భూమిపై వర్సిటీ హక్కులు వదులుకుంది. వర్సిటీ పరిధిలోని భూముల నుంచి ఈ 400 ఎకరాలను వేరు చేసేందుకు గాను 2017 జనవరి 2న రాష్ట్ర ప్రభుత్వం మెమో జారీ చేసింది. అయితే ఈ మెమోను సవాల్ చేస్తూ వర్సిటీ దాఖలు చేసిన రిట్ పిటిషన్ (816/2021)ను హైకోర్టు కొట్టివేసింది. తర్వాత ఈ భూములను డీమార్క్ చేసేందుకు 2024లోనే యూనివర్సిటీ వర్గాల అంగీకారంతోనే సర్వే కూడా నిర్వహించి సరిహద్దులను గుర్తించాం. 2010- 2020ల్లో గూగుల్ మ్యాప్ ద్వారా 400 ఎకరాలు పరిశీలిస్తే అంతా బంజరు భూమి. రాళ్లతో కూడి ఉంది. ఎలాంటి పచ్చదనం లేదు. 2006-2024 వరకు నిర్లక్ష్యంగా ఆ భూములను వదిలేయడంతో చెట్లు, పొదలు మాత్రమే పెరిగాయి. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు చుట్టుపక్కల ఉన్న ఈ భూముల్లో ఐటీతో పాటు ఇతర రంగాల అభివృద్ధికి మంచి అవకాశం ఉంది. పెద్ద ఎత్తున పెట్టుబడులు, ఉద్యోగాలు వస్తాయి. రూ.50 వేల కోట్ల వరకు పెట్టుబడులతో పాటు 5 లక్షల మందికి ఉద్యోగాలు లభించే అవకాశాలున్నాయి. ఈ భూముల్లో అభివృద్ధి జరగడం ద్వారా హైదరాబాద్ లంగ్‌స్పేస్ దెబ్బతింటుందనేది వాస్తవం కాదు. ఈ భూమి చుట్టూ 5 కిలోమీటర్ల వ్యాసార్థంలో పెద్ద పెద్ద లంగ్‌స్పేస్‌లు అభివృద్ధి అయ్యాయి. 274 ఎకరాల విస్తీర్ణంలో కేబీఆర్ బొటానికల్ గార్డెన్ ఈ భూమికి 2 ఏరియల్ కిలోమీటర్ల దూరంలోనే ఉంది. అలాగే ఈ భూమిలోని రాతి అమరికలను ప్రభుత్వం ధ్వంసం చేయదు. అక్కడ ఉన్న చెరువును కూడా కాపాడుతుంది..' అని ప్రభుత్వం చెబుతోంది.

వర్సిటీ వర్గాలు ఏమంటున్నాయి?

యూనివర్సిటీ వర్గాలు మాత్రం భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. ఈ భూమి ఎవరిదన్న అంశం జోలికి వెళ్లకుండా.. 'యూనివర్సిటీకి ఒకసారి కేటాయించిన భూములను రాష్ట్రపతి నియమించే ఆరుగురు సభ్యులతో కూడిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదం మేరకు మాత్రమే ఎవరికైనా కేటాయించాల్సి ఉంటుంది. ఆ భూమిలో ప్రభుత్వం చెపుతున్నట్టు 2024లో ఎలాంటి సర్వే జరగలేదు. యూనివర్సిటీ భూముల నుంచి ఆ 400 ఎకరాలను వేరు చేయలేదు. ఈ భూమి భౌగోళిక స్థితిపై ప్రాథమిక పరిశీలన మాత్రమే జరిగింది. 400 ఎకరాలను వేరు చేసేందుకు వర్సిటీ అంగీకరించలేదు. అసలు ఆ భూములను వేరుచేస్తామనే సమాచారమే మాకు ప్రభుత్వం నుంచి అందలేదు. యూనివర్సిటీ ఏర్పాటై 50 ఏళ్లు గడుస్తున్న స్వర్ణోత్సవ సమయాన మాకు ఇచ్చిన భూములను పూర్తిస్థాయిలో అధికారికంగా బదలాయించాలని మేము రాష్ట్ర ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నాం. ఈ ప్రాంత పర్యావరణాన్ని, జీవ వైవిధ్యాన్ని కాపాడాలని కోరుతున్నాం..' అని చెబుతోంది. అయి తే యూనివర్సిటీ విద్యార్థి సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు మాత్రం ఆ భూములు సెంట్రల్ వర్సిటీవేనని ఘంటాపథంగా చెబుతున్నాయి.

పేరుకే కేటాయింపా? ఇప్పటివరకు హక్కు లేదా?

సెంట్రల్ వర్సిటీకి 2,324 ఎకరాలు కేటాయిస్తున్నట్టు ఉత్తర్వులు ఇచ్చారు కానీ ఆ భూములను యూనివర్సిటీ పేరిట ప్రభుత్వాలు ఇప్పటికీ రిజిస్ట్రేషన్ చేయలేదు. కేవలం అప్పట్లో వచ్చిన ఉత్తర్వుల ఆధారంగా సర్వే చేసి చుట్టూ ప్రహరీగోడను నిర్మించారు. అయితే ఎన్ని ఎకరాల వ్యాసార్థంలో గోడ నిర్మించారో స్పష్టత లేకపోగా నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ గతంలో ఇచ్చిన ఓ నివేదికలో మాత్రం హెచ్‌సీయూ 1800 ఎకరాల్లో విస్తరించి ఉందని పేర్కొంది. తాజా వివాదం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా భూముల అలినేషన్‌పై వివరణ ఇచ్చింది. ఇప్పటివరకు వర్సిటీకి భూముల బదలాయింపు జరగలేదని, వర్సిటీ భూములు అన్యాక్రాంతం కాకూడదనేదే ప్రభుత్వ ఉద్దేశమని, వర్సిటీ యంత్రాంగం ఇప్పుడు దరఖాస్తు చేసుకుంటే ఆ భూములను వర్సిటీ పేరిట బదలాయిస్తామని ఇటీవల విలేకరుల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. మరోవైపు భూముల బదలాయింపు కోసం రాష్ట్ర ప్రభుత్వాన్ని అడుగుతున్నట్టుగా ఈ వివాదం తలెత్తిన తర్వాతే యూనివర్సిటీ వర్గాలు కూడా బహిర్గతం చేశాయి.

గతంలో భూములను ఎవరికి ఇచ్చారు?

ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి యూనివర్సిటీకి భూముల బదలాయింపు జరగకపోవడంతో రెవెన్యూ రికార్డుల్లో ఎక్కడా యూనివర్సిటీ పేరు కనిపించడం లేదని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. ఈ భూములపై యూనివర్సిటీకి శాశ్వత, స్పష్టతతో కూడిన హక్కులు లేకపోవడంతోనే రాష్ట్ర ప్రభుత్వాలు భూములను పందేరం చేశాయి. జవహర్ నవోదయ, ఏపీఎస్ఆర్టీసీ, ఏపీఎస్ఈబీ, రంగారెడ్డి హెడ్‌క్వార్టర్స్, మున్సిపల్, ఎమ్మార్వో ఆఫీసులు, టెలీకాం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ, హాకీ స్టేడియం, మిలటరీ గేమ్స్, షూటింగ్ రేంజ్, ఐఎంజీ భారత్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్, టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ... ఇలా ఇప్పటివరకు 1105.37 ఎకరాలను అనేక సంస్థలకు కట్టబెట్టాయి. ఇందులో ఎక్కువసార్లు చంద్రబాబు ప్రభుత్వంలోనే ఇతర సంస్థలకు భూములు అప్పజెప్పారని రికార్డులు చెబుతున్నాయి. ఈ భూములు వర్సిటీ పేరిట లేకపోవడంతో సదరు సంస్థలకు భూముల బదలాయింపు ప్రభుత్వాలకు సులువుగా మారింది. యూనివర్సిటీ నుంచి అనుమతి తీసుకున్నట్టు సంతకాలు పెట్టించుకోవడం, పంచుల చేత దస్తూరి చేయించుకోవడంతోనే వర్సిటీకి కేటాయించిన భూములను ఇతర సంస్థలకు పందేరం చేసేశారు.



ఆ 397 ఎకరాలకూ పొజిషన్ ఇవ్వలేదా?

ఐఎంజీ భారత్‌కు కేటాయించిన 400 ఎకరాల స్థానంలో 397 ఎకరాలు గోపన్‌పల్లి రెవెన్యూ పరిధిలో వర్సిటీకి కేటాయించారు. కానీ ఆ భూముల పొజిషన్ ప్రభుత్వం ఇప్పటివరకు ఇవ్వకపోవడం గమనార్హం. కాగా అసలు ఆ ప్రత్యామ్నాయ భూములు ఎక్కడ ఉన్నాయో కూడా వర్సిటీ యంత్రాంగం గుర్తించలేని పరిస్థితుల్లో ఉండడం విశేషం.



ఈ భూములు ఎందుకు ప్రత్యేకం? ఎందుకీ నిరసనలు?

విద్యార్థులకు తాము చదువుకునే పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలన్నా, వాటికి చెందిన భూములన్నా సాధారణంగా మక్కువ ఉంటుంది. తాము చదువుకునే సంస్థ భూముల జోలికి వెళితే విద్యార్థి లోకం అస్సలు సహించదు. ఇక ఆహ్లాదకర వాతావరణం ఉట్టిపడే విశ్వవిద్యాలయాల్లో ప్రకృతికి మరింత ప్రాధాన్యత ఉంటుంది. ఉస్మానియా యూనివర్సిటీలోని ల్యాండ్‌స్కేప్ ఇందుకు ఉదాహరణ. ఇప్పుడు హెచ్‌సీయూ విషయంలోనూ అదే జరిగింది. జీవ వైవిధ్యం తెరపైకి వచ్చింది. ప్రస్తుతం వర్సిటీ ఆధ్వర్యంలో ఉన్న భూమిలో 455 జాతుల వృక్ష, జంతుజాలాలున్నాయని అంటున్నారు. నెమళ్లు, జింకలు, పెద్ద పెద్ద చెరువులు, ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన రాళ్ల అమరికలతో రమణీయంగా కనిపించే ఈ భూములు ఎక్కడ ప్రైవేటు వ్యక్తులు, సంస్థల పాలవుతాయోనన్న ఆందోళన విద్యార్థులతో పాటు సామాన్య ప్రజల్లో కూడా కలగడంతోనే ఈ భూముల విషయంలో ఇంతటి అలజడి కనిపిస్తోంది. మరి ఈ కంచ గచ్చిబౌలి భూముల కథ ఏ కంచకు చేరుతుందో వేచి చూడాల్సిందే.

క్లుప్తంగా...

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి: మంత్రి పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: బీఆర్ అంబేడ్కర్ కలలుగన్న సమాజాన్ని నిర్మించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్నామని రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈనెల 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా.. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, అంబేడ్కర్ ఉత్సవాల కమిటీ చైర్మన్ డాక్టర్ వీసాల మల్లేశ్ ఆధ్వర్యంలో జైభీమ్ ర్యాలీ నిర్వహించనున్నారు. ర్యాలీ వాల్ పోస్టర్‌ను గురువారం మంత్రి ఆవిష్కరించి మాట్లాడారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా 14వ తేదీ సాయంత్రం 5 గంటలకు నగరంలో నిర్వహించే సూటు– బూటు ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు.

సబర్మతి మోడల్‌లో మూసీ అభివృద్ధి: మంత్రి పొన్నం



సాక్షి, హైదరాబాద్: గుజరాత్‌లోని సబర్మతి నదిని అభివృద్ధి చేసినట్లుగానే తెలంగాణలోని మూసీ నది పునరుజ్జీవానికి చర్యలు చేపడు తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఏఐసీసీ సమావేశాల్లో పాల్గొనేందుకు వెళ్లిన మంత్రి పొన్నం, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తదితరులు గురువారం సబర్మతి నది అభివృద్ధి తీరును పరిశీలించారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా జీహెచ్‌ఎంసీ మేయర్ నేతృత్వంలో 150 మంది కార్పొరేటర్లతో సబర్మతి స్టడీ టూర్ నిర్వహిస్తామని చెప్పారు. గుజరాత్‌లోని అమూల్ డెయిరీ ప్రధాన కార్యాలయాన్నీ పొన్నం బృందం సందర్శించింది.

రఘునందన్‌రావుపై కేసులో కౌంటర్ వేయండి: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: సిద్దిపేట్ జిల్లా దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో మెదక్ ఎంపీ రఘునందన్‌రావుపై దాఖలైన కేసులో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలతో దుబ్బాక స్టేషన్‌లోకి వచ్చి గొడవ చేశారని ఏఎస్‌ఐ ఎండీ గులామ్ సమ్దాని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు రఘునందన్‌రావుపై కేసు నమోదు చేశారు. ఈ ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ ఆయన హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ గురువారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. రఘునందన్‌రావుపై కేసులో వాదనలు తెలియజేస్తూ కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు.

టాపర్‌కు సీటు ఇవ్వరా?

బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో ఐదో తరగతి ప్రవేశాల కోసం నిర్వహించిన అర్హత పరీక్షలో టాపర్‌గా నిలిచిన విద్యార్థి ఇ.ఆకాశ్‌కు సీటు కేటాయించకపోవడంపై రాష్ట్ర బీసీ కమిషన్ తీవ్రంగా స్పందించింది. దరఖాస్తు సమయంలో.. వివరాల నమోదులో జరిగిన చిన్న పొరపాటును సాకుగా చూపి.. ప్రవేశం ఇవ్వకపోవడం సరికాదని వ్యాఖ్యానించింది. బాధిత విద్యార్థి, తల్లిదండ్రులు గురువారం రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్‌ను కలిశారు. పరిస్థితిని తెలుసుకున్న చైర్మన్ నిరంజన్ స్పందిస్తూ.. ఆయా విద్యార్థులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కుల వివరాల్లో తప్పులుంటే వాటిని సరిదిద్దాలని, సెట్‌లో టాపర్‌గా నిలిచిన విద్యార్థికి సీటు ఇవ్వకపోవడంపై చైర్మన్ నిరంజన్ ఎస్సీ గురుకుల సొసైటీపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉన్నత విద్యామండలి చైర్మన్‌తో కె.కేశవరావు భేటీ

కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లపై చర్చ

సాక్షి, హైదరాబాద్: వర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలన్న ఆందోళనల నేపథ్యంలో గురువారం ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డితో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు సమావేశమయ్యారు. వర్సిటీల అధ్యాపకుల నియామకాల్లో వారికి వెయిటేజ్ ఇవ్వడమా? కాంట్రాక్టు పద్ధతిలో కొనసాగే వారి పోస్టులను అలాగే వదిలేసి మిగతావి భర్తీ చేయడమా? ఏది సరైన నిర్ణయమో నివేదిక రూపంలో తెలియజేయాలని కోరారు. ఇదే క్రమంలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లతోనూ కేశవరావు సంప్రదింపులు జరిపేందుకు సిద్ధమయ్యారు. కొత్త నియామకాలకు తాము వ్యతిరేకం కాదని, కానీ ఇన్నేళ్లు ఈ ఉద్యోగాలనే నమ్ముకున్న తమను రోడ్డుపాలు చేయొద్దని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల జేఏసీ నేతలు ఉపేందర్, ధర్మతేజ, పరుశురాం అంటున్నారు. అలా చేస్తే ఉద్యమించడమే శరణ్యమన్నారు.

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు

సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై కేసు నమోదు

సాక్షి, అమరావతి: చంద్రబాబు రెడ్‌బుక్ అరచకాలను వెలుగులోకి తెస్తున్న 'సాక్షి' పత్రికపై టీడీపీ కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు తెగబడుతోంది. నిజాన్ని నిర్భయంగా ఎత్తి చూపడంతో భరించలేక తప్పుడు కేసులకు ఒడిగడుతూ కుట్ర రాజకీయాలు చేస్తోంది. పల్నాడు జిల్లాలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తను టీడీపీ గూండాలు హత్య చేసిన ఉదంతాన్ని వెల్లడించడంపై అక్రమ కేసు నమోదు చేయించడమే ఇందుకు నిదర్శనం. సాక్షి పత్రికపై మాచర్ల టీడీపీ మండలాధ్యక్షుడు ఎన్.వీరస్వామి అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ ఎమ్మెల్యే ఆనంద్‌బాబు, ఇతర టీడీపీ నేతలు మంగళవారం సాయంత్రం ఇక్కడ డీజీపీకి ఫిర్యాదు చేశారు. ఆ వెంటనే డీజీపీ స్పందించి పల్నాడు జిల్లా ఎస్పీని ఆదేశించడం.. వెనువెంటనే రాత్రికి రాత్రే ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడం అంతా పక్కా పన్నాగంతో చకచకా సాగిపోయింది. దీంతో సాక్షి పత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డితోపాటు ఇదే పత్రికకు చెందిన ఆరుగురు పాత్రికేయులపై బీఎన్‌ఎస్ సెక్షన్లు 196(1), 352, 353,(2), 61(1) రెడ్‌విత్ 3(5) కింద ఎఫ్‌ఐఆర్ నమోదు చేసింది. ఈ అక్రమ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

పింఛన్ కోసం వస్తే కడతేర్చారన్నది వాస్తవం

పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలోని పశువేములకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త హరిశ్చంద్ర టీడీపీ గూండాలకు భయపడి కుటుంబంతో సహా పొరుగున తెలంగాణలోని నల్గొండ జిల్లా కనగల్‌లో పది నెలలుగా తల దాచుకుంటున్నారు. ప్రతి నెల పింఛన్ తీసుకునేందుకు వచ్చి వెంటనే వెళ్లిపోతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన టీడీపీ వర్గీయులు పక్కా పన్నాగంతో ఆయన్ను హత్య చేశారు. ఏప్రిల్ నెల ఫించన్ తీసుకునేందుకు ఈ నెల 3న రాష్ట్ర సరిహద్దుల్లోని నాగార్జునసాగర్ హిల్ కాలనీ వద్దకు వచ్చి.. తమ గ్రామం పశువేములకు చెందిన ఒకరికి ఫోన్ చేశారు. సామాజిక పింఛన్లు ఇస్తున్నారా.. లేదా.. అని అడిగారు. అతను ఆ విషయాన్ని టీడీపీ వర్గీయులకు చేరవేశాడు. వెంటనే టీడీపీ గూండాలు వచ్చి హిల్ కాలనీలో ఉన్న హరిశ్చంద్రను కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. అనంతరం ఆయనపై దాడి చేసి, హత్య చేసి.. మృతదేహాన్ని పశువేములలోని ఆయన పొలంలోనే పడేశారు. హరిశ్చంద్ర భార్య నిర్మల తన భర్తను కిడ్నాప్ చేశారని తెలంగాణలోని విజయపురి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు.. పశువేములలో దారుణ హత్యకు గురైన హరిశ్చంద్ర మృతదేహాన్ని ఈనెల 4న గుర్తించారు. కర్రలతో కొట్టి.. గొంతుకోసి.. ముఖంపై యాసిడ్ పోసి మరీ దారుణంగా హతమార్చినట్టు నాగార్జున సాగర్ పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. హిల్ కాలనీలోని ఓ దుకాణం వద్ద ఉన్న సీసీ టీవీ కెమెరాల నుంచి ఫుటేజీ సేకరించారు. హరిశ్చంద్రను కిడ్నాప్ చేసి తీసుకువెళుతున్న దృశ్యాలు అందులో స్పష్టంగా కనిపించాయి.

పూర్తి అవగాహనతోనే వార్త ప్రచురితం

హరిశ్చంద్ర హత్య సమాచారం తెలియగానే ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. తమపై టీడీపీ గూండాలు కక్ష కట్టిన తీరును హరిశ్చంద్ర భార్య నిర్మల, కుమారుడు మురళి వివరించారు. ఇది టీడీపీ గూండాల పనేనని కన్నీటి పర్యంతమయ్యారు. పల్నాడు జిల్లాలో నెలకొన్న పరిస్థితులు క్షుణ్ణంగా తెలుసుకుని పూర్తి వివరాలతో సాక్షి పత్రిక ఏపీ ఎడిషన్‌లో వార్తను ప్రచురించింది. తెలంగాణలోని విజయపురి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు వివరాలతోపాటు మృతుని కుటుంబ సభ్యుల ఆవేదన, పశువేములలోని నెలకొన్న వాస్తవ పరిస్థితులను సమగ్రంగా వివరించింది. కాగా, తెలంగాణలో పాత్రికేయులు కేవలం అక్కడి పోలీసులు తెలిపిన ప్రాథమిక సమాచారాన్ని మాత్రమే వార్తగా ఇచ్చారు. హరిశ్చంద్రను సమీప బంధువులే హత్య చేశారని సాక్షి పత్రిక ఏపీ ఎడిషన్‌లోనూ, తెలంగాణ ఎడిషన్‌లోనూ ప్రచురించింది. కాగా, ఆ సమీప బంధువులు టీడీపీ గూండాలేనన్నది ఏపీలోని పాత్రికేయులకు పూర్తి సమాచారం, అవగాహన ఉంది కాబట్టి మరింత సమగ్రంగా వార్తను ప్రచురించారు. అంతేతప్ప సాక్షి పత్రిక ఏపీ, తెలంగాణ ఎడిషన్లలో ప్రచురితమైన వార్తలోని అంశాల మధ్య వ్యత్యాసం లేదు. ఈ హత్యపై తెలంగాణ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఏ ఎండకాగొడుగు పచ్చ ముఠా నిర్వాకమే..

ప్రజల్ని మోసగించేందుకు పరస్పర విరుద్ధ వాదనలు, కథనాలు, పత్రికా ప్రకటనలు ఇవ్వడం పచ్చ ముఠా పన్నాగం. ఏపీ, తెలంగాణ ఎడిషన్లలో పరస్పర విరుద్ధంగా ఈనాడుతోపాటు ఎల్లో మీడియా లెక్కకు మించి కథనాలు ప్రచురించిన విషయాన్ని పాత్రికేయ సంఘాలు గుర్తు చేస్తున్నాయి. టీడీపీ.. ప్రజల్ని మోసగించేందుకు ఏపీలోనే ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో పరస్పర విరుద్ధంగా పత్రికా ప్రకటనలు జారీ చేసిన విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. ఎన్నికల ముందు టీడీపీ, ఈనాడుతోపాటు ఇతరత్రా ఎల్లో మీడియాలో ఇచ్చిన ప్రకటనలే అందుకు నిదర్శనం. 'కలల రాజధాని అమరావతి'అని విజయవాడ ఎడిషన్‌లో ప్రకటనలు ఇచ్చిన టీడీపీ.. అదే రోజు విశాఖపట్నం ఎడిషన్‌లో మాత్రం 'ఆంధ్రప్రదేశ్ వికాసానికి గ్యారంటీ' అని ప్రకటనలు జారీ చేయడం గమనార్హం. టీడీపీ, ఎల్లో మీడియా కుయుక్తులకు ఇలాంటి ఉదాహరణలు కోకొల్లలుగా ఉన్నాయి.

ఇది టీడీపీ చేసిన హత్యే

చంపింది టీడీపీ వారేనని మృతుడి భార్య, కుమారుడు వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రత్యేకించి పల్నాడు ప్రాంతం రావణ కాష్టంలా రగిలిపోతోంది. నిత్యం దాడులతో అధికార టీడీపీ నేతల అరాచకం అంతా ఇంతా కాదు. ఎప్పుడు.. ఏ ఊళ్లో.. ఎవరి ఇంటి మీద పడి విధ్వంసం సృష్టిస్తారో తెలియని దుస్థితి. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ నేత, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అనుచరుడైన పశువేములకు చెందిన హరిశ్చంద్ర ప్రాణ భయంతో అత్తగారి ఊరైన తెలంగాణలోని నల్గొండ జిల్లా కనగల్‌లో ఉంటూ పింఛన్ తీసుకోవడానికి స్వగ్రామానికి వస్తూ ఈ నెల 3వ తేదీన టీడీపీ వర్గీయుల చేతిలో దారుణంగా హత్యకు గురయ్యాడు. ఇది ముమ్మాటికీ రాజకీయ హత్యేనని ఇట్టే తెలుస్తోంది. టీడీపీ అధికారంలోకి రాగానే బాధితుడి ఇంటిపై ఆ పార్టీ శ్రేణులు దాడి చేసి బీభత్సం సృష్టించడం వాస్తవం. వారు పోలీసులను రక్షణ కోరడం వాస్తవం. వైఎస్సార్‌సీపీలో ఉన్న మీకు రక్షణ ఎలా కల్పిస్తామని పోలీసులు చేతులెత్తేయడం వాస్తవం. ఇదంతా హత్యకు గురైన హరిశ్చంద్ర భార్య నిర్మల, కుమారుడు మురళి స్వయంగా చెబుతుంటే బంధువులు చంపారంటూ టీడీపీ వక్రభాష్యం చెప్పడం దారుణం. చంపిన వారు టీడీపీ వర్గీయులై ఉండి.. బంధువులైనంత మాత్రాన ఈ దారుణంతో టీడీపీకి సంబంధం లేదనడం దుర్మార్గం. అసలు ఏం జరిగిందో బాధితుల మాటల్లోనే తెలుసుకుందాం.

వైఎస్సార్‌సీపీలో ఉంటున్నామనే హత్య



మేము మొదటి నుంచీ వైఎస్సార్‌సీపీలో ఉంటున్నామనే ఉద్దేశంతో గ్రామంలోని టీడీపీకి చెందిన నాలుగు కుటుంబాలు మాపై దాడులు చేశాయి. మాపై అక్రమంగా కేసులు పెట్టారు. జైలుకు కూడా వెళ్లొచ్చాం. ఇక ఇక్కడ ఉంటే బతకలేమని తెలంగాణ ప్రాంతానికి వెళ్లాం. ప్రతి నెలా మా నాన్న పింఛన్ తీసుకోవడానికి వచ్చేటప్పుడు నేను కూడా తోడు వచ్చే వాడిని. ఈ నెలలో నేను రాకపోడంతో ఒంటరిగా ఉన్న మా నాన్నను హత్య చేశారు. ఇది టీడీపీ హత్యే. నాకు కూడా ప్రాణహాని ఉంది.

– మురళి, మృతుని కుమారుడు

ముమ్మాటికి టీడీపీ హత్యే



టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజే మా ఇంటిపై దాడికి ప్రయత్నించారు. భయపడి అప్పుడే ఊరు విడిచి వెళ్లి కొన్ని రోజులు బయట తల దాచుకున్నాం. తర్వాత గ్రామానికి వచ్చి పంటల సాగు మొదలుపెట్టాం. మరోసారి మా ఇంటిపై టీడీపీ నాయకులు రాత్రి సమయంలో దాడికి పాల్పడ్డారు. భయంతో పోలీస్‌స్టేషన్‌ను వెళ్లి రక్షణ కోరాం. వైఎస్సార్‌సీపీలో ఉన్న మీకు రక్షణ ఎలా కల్పిస్తామని పోలీసులు అన్నారు. దిక్కుతోచక నా పుట్టిల్లు అయిన తెలంగాణ రాష్ట్రంకు వెళ్లి బతుకుతున్నాం. ఐదు ఎకరాల్లో మిరప పంట, ఎకరంలో వరి పంటను టీడీపీ వారే స్వాధీనం చేసుకున్నారు. ఇంట్లోని బంగారు వస్తువులు, నగదు, ఎరువులు, పురుగు మందులు దోచుకెళ్లారు. మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి అనుచరుడిగా ఉండటం వల్లనే నా భర్తను టీడీపీ నాయకులు దారుణంగా హత్య చేశారు.

– నిర్మల, మృతుని భార్య

వాలంతరికి పూర్వ వైభవం తెస్తాం: మంత్రి ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: భూమి, నీరు నిర్వహణ పరిశోధనా సంస్థ వాలంతరికి పూర్వవైభవం తెస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి హామీనిచ్చారు. గురువారం రాజేంద్రనగర్‌లోని వాలంతరిని మంత్రి సీతక్కతో కలిసి ఆయన సందర్శించారు. ఈ నెల 14వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా 199 మంది జూనియర్ టెక్నికల్ అధికారులు (జేటీవో), 224 మంది అసిస్టెంట్ ఇంజనీర్ల (ఏఈ)కు నియామక పత్రాలు అందించనున్నారు. ఈ కార్యక్రమం ఏర్పాట్లను ఎంపీ బలరామ్ నాయక్‌తో కలిసి మంత్రులు పరిశీలించారు. 1983లో ప్రపంచబ్యాంకు సహాయంతో వాలంతరి ఏర్పాటైంది. అయితే, జీతాల కేటాయింపు తప్ప శిక్షణ, పరిశోధన, మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం ఎలాంటి నిధులు విడుదల చేయలేదని వాలంతరి డీజీ అనిత గుర్తు చేశారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో వాలంతరి నిర్లక్ష్యానికి గురయిందని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. అంతకు ముందు వాలంతరి కార్యక్రమాలపై ఆయన సమీక్ష చేశారు.

వివాహమైనా కుమార్తె అర్హురాలే..

కారుణ్య నియామకంపై సర్కార్‌కు హైకోర్టు స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: కుమార్తె వైవాహిక స్థితిని పరిగణనలోకి తీసుకుని కారుణ్య నియామకానికి అర్హురాలు కాదని చెప్పడం సరికాదని ప్రభుత్వానికి హైకోర్టు తేల్చిచెప్పింది. వివాహమైనా ఆమె అర్హురాలేనని, అయితే దీనికి వారి ఆర్థిక పరిస్థితి సహా పలు అంశాలను పరిశీంచాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈమేరకు పిటిషనర్ దరఖాస్తును పునఃపరిశీలించాలని ఆదేశించింది. నిబంధనల మేరకు సంబంధిత డాక్యుమెంట్లతో మళ్లీ వినతిపత్రం సమర్పించాలని పిటిషనర్‌కు సూచించింది. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తూ యూసఫ్ మృతిచెందారు. కారుణ్య నియామకం కింద తన కుమార్తె ఫాతిమాకు ఏదైనా ఉద్యోగం ఇవ్వాలని చేసిన విజ్ఞప్తిని సీపీ నిరాకరించారంటూ యూసఫ్ భార్య షాహీన్ సుల్తానా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు విచారణ చేపట్టారు. 'షాహీన్‌కు ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు. కుమారుడు కెనడా వెళ్లి తండ్రి అంత్యక్రియలకు కూడా రాలేదు. కూతురు ఫాతిమానే తల్లిని చూసుకుంటోంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా తల్లికి సరైన వైద్యం కూడా అందించలేకపోతోంది' అని పిటిషనర్ తరఫు న్యాయవాది చెప్పారు. 'పిటిషనర్‌కు కుమారుడు ఉన్నారు. అతను ఉద్యోగం చేస్తున్నాడు. అందుకే కారుణ్య నియామక విజ్ఞప్తిని సీపీ తిరస్కరించారు. ఫాతిమా, ఆమె భర్త ఆర్థిక పరిస్థితిని షాహీన్ వెల్లడించలేదు' అని ప్రభుత్వ న్యాయవాది పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఆమె డాక్యుమెంట్లను పునఃపరిశీలన చేసి నిబంధనల మేరకు నిర్ణయం తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

6 నెలల్లో ఇంటింటికీ ఇంటర్నెట్

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

ఇకపై టీనెక్ట్స్ బ్రాండ్‌తో టీఫైబర్ సేవలు

టీఫైబర్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి



టీఫైబర్ ఉద్యోగులతో మంత్రి శ్రీధర్‌బాబు

సనత్‌నగర్ (హైదరాబాద్): వచ్చే ఆరునెలల్లో ఇంటింటికీ ఇంటర్నెట్ సేవలు, స్మార్ట్ టీవీ సదుపాయం అందించాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. బేగంపేటలో గురువారం టీఫైబర్ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే టీఫైబర్, టీనెక్ట్స్ జెన్ టెక్నాలజీస్‌కు సంబంధించిన లోగోలను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వానికి సంబంధించిన డేటాను సురక్షితంగా ఉంచగల సావరిన్ క్లౌడ్‌ను మంత్రి ప్రారంభించారు. ఇదే వేదికపై టీఫైబర్ అధికారిక చిహ్నమైన టిరాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కేబుల్ ఆపరేటర్ల సహకారంతో ప్రజలకు టీవీ చానెల్స్ సదుపాయాలు కూడా కల్పిస్తామన్నారు. టీవీ సెట్లను కంప్యూటర్ మానిటర్‌గా వినియోగించుకుని, విద్యార్థులు ప్రయోజనం పొందేలా టెక్నాలజీని రూపొందించినట్లు చెప్పారు. టీఫైబర్ ఇప్పటికే 424 మండలాల్లోని 8,891 గ్రామపంచాయతీలకు అనుసంధానం చేసిందన్నారు. మరో 7,187 పంచాయతీలు ఈ సేవలు అందుకోవడానికి సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. ఈ ఏడాది 30 వేల ప్రభుత్వ కార్యాలయాలకు కనెక్టివిటీ కల్పించినట్లు వివరించారు. 2027 నాటికి 60 వేల కార్యాలయాలను అనుసంధానం చేస్తామన్నారు. టీఫైబర్ ఇకపై టీనెక్ట్స్ పేరుతో సేవలు అందిస్తుందని చెప్పారు. అంతకుముందు తెలంగాణ ఫైబర్ గ్రిడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా శ్రీధర్‌బాబు బాధ్యతలు స్వీకరించారు.

కుక్కల దాడిలో 53 గొర్రెలు మృత్యువాత

రంగారెడ్డి జిల్లా తంగడపల్లిలో ఘటన

రూ.5 లక్షల నష్టం జరిగిందని వాపోయిన బాధితుడు

చేవెళ్ల: గొర్రెల మందపై కుక్కలు దాడి చేసిన సంఘటనలో 53 జీవాలు మృతి చెందాయి. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం తంగడపల్లిలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కుర్వ అనంతయ్య రోజూ మాదిరిగానే బుధవారం సాయంత్రం ఇంటికి కొద్ది దూరంలో ఉన్న దొడ్లో జీవాలను వదిలాడు. గురువారం తెల్లవారుజామున 5 గంటలకు కొట్టం వద్దకు వెళ్లగా ఎనిమిది కుక్కలు గొర్రెలపై దాడిచేస్తున్నాయి. వాటిని అదిలించబోగా అనంతయ్యపై కుక్కలు తిరగబడటంతో పరుగున వెళ్లి గ్రామస్తులను తీసుకుని వచ్చాడు. వారిని గమనించిన కుక్కలు పారిపోగా పెద్ద సంఖ్యలో జీవాలు రక్తమోడుతూ కనిపించాయి. వందకు పైగా ఉన్న మందలో 53 జీవాలు మృతిచెందాయి. దీంతో రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ఈ విషయమై వెటర్నరీ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశాడు.

ఎడ్ల బండ్ల దారి కూడా పబ్లిక్ రహదారే: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: నాడు పల్లెల్లో ఎడ్ల బండ్లు వెళ్లిన దారి కూడా ప్రజా రహదారేనని, దానిని కూడా సర్కారు ఆస్తిగానే పరిగణనలోకి తీసుకోవాలని హైకోర్టు చెప్పింది. రహదారులు, నడకదారులు, నదులు, చెరువులు, వంతెనలు ప్రభుత్వ ఆస్తులేనని ఏపీ (తెలంగాణ ఏరియా) ల్యాండ్ రెవెన్యూ చట్టంలోని సెక్షన్ 24 పేర్కొంటోందని స్పష్టం చేసింది. సరిహద్దుల చట్టంలోని నిబంధనల ప్రకారం పాత రికార్డుల్లో బండ్ల దారి ఉంటే.. పది ఫీట్లు లేదా 3.04 మీటర్ల దారి వదలాల్సిందేనని చెప్పింది. బండ్ల దారిని కొందరు ఆక్రమించారని సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం కోదూరుకు చెందిన గ్రామస్తులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.మాధవీదేవి విచారణ చేపట్టారు.

పెద్దూరులో నేడు అపెరల్ పార్క్ ప్రారంభం

జౌళి శాఖ ఉన్నతాధికారులతో మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల సమీక్ష

సాక్షి, హైదరాబాద్: సిరిసిల్లలోని పెద్దూరులో రూ. 102 కోట్ల వ్యయంతో నిర్మించిన అపెరల్ పార్క్‌ను శుక్రవారం ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వ్యవసాయ, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం సచివాలయంలో ఆ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. స్వల్ప ఆదాయంతో ఇబ్బంది పడుతున్న మహిళా బీడీ కార్మికులు, పద్మశాలి సామాజికవర్గం వారికి కుట్టుపనిలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నారు. పారిశ్రామిక షెడ్లు, విద్యుత్ సరఫరా లాంటి మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించగా, బెంగళూరుకు చెందిన టెక్స్ పోర్ట్ ఇండస్ట్రీస్ రూ.40 కోట్లతో యంత్రాలను ఏర్పాటు చేసి పరిశ్రమను నెలకొల్పింది. ఇక్కడ తయారు చేసే దుస్తులను 'టెక్స్ పోర్ట్' వంద శాతం ఎగుమతి చేస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. ఏటా రూ. 300 కోట్ల విలువైన దుస్తులను టామీ హిల్ఫిగర్, రాబర్ట్ గ్రాహం, వ్యాన్స్, మైఖేల్ కోర్స్ లాంటి అంతర్జాతీయ బ్రాండ్లకు సరఫరా చేస్తుందని పేర్కొన్నారు. ఇక్కడ ఏటా 70 లక్షల పీస్‌లు తయారు అవుతాయి. ప్రస్తుతం వెయ్యి కుట్టు మెషీన్లను ఏర్పాటు చేసి రెండు షిఫ్టుల్లో 1,600 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తారు. మరో మూడేళ్లలో ఇంకో రెండు వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని జౌళి శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్ తెలిపారు. ప్రారంభ కార్యక్రమం అనంతరం మంత్రులు తుమ్మల, శ్రీధర్‌బాబు ఉద్యోగాలు పొందిన మహిళలకు నియామక పత్రాలు అందజేస్తారు.

అగ్నిమాపక శాఖకూ దర్యాప్తు బాధ్యతలు



వివేక్ శ్రీవాస్తవకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాగిరెడ్డి

ప్రతిపాదనలు పరిశీలిస్తున్నాం

కేంద్ర ఫైర్ సర్వీసెస్ డీజీ వివేక్ శ్రీవాస్తవ

విపత్తులపై కేంద్ర స్టాండింగ్ ఫైర్ అడ్వైజరీ కౌన్సిల్ భేటీలో చర్చ

సాక్షి, హైదరాబాద్: అగ్నిప్రమాదాలు, ఇతర విపత్తులు జరిగినప్పుడు పోలీసుల దర్యాప్తుతో పూర్తి నిజాలు వెలుగులోకి రావడం లేదని, ఈ నేపథ్యంలో అగ్నిమాపక శాఖ అధికారులు కూడా దర్యాప్తు చేయాలన్న ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని కేంద్ర ఫైర్ సర్వీసెస్ డీజీ వివేక్ శ్రీవాస్తవ అన్నారు. కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలో 45వ స్టాండింగ్ ఫైర్ అడ్వైజరీ కౌన్సిల్ (ఎస్ఎఫ్ఏసీ) సదస్సు బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. సదస్సులో భాగంగా రెండో రోజు గురువారం గచ్చిబౌలిలోని ఒక హోటల్‌లో నిర్వహించిన సమావేశానికి డీజీ వివేక్ శ్రీవాస్తవ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూకంపం, బహుళ అంతస్తుల భవనాలు కూలిపోవడంతో పాటు ఇతర ప్రమాదాలు జరిగినప్పుడు అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, ఇతర ప్రత్యేక టీమ్‌లు కూడా సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిపోయిన ఘటనలోనూ ఇవే టీమ్‌లు సహాయక చర్యల్లో పనిచేస్తున్నాయని తెలిపారు. ఏవైనా పెద్ద ప్రమాద ఘటనలు జరిగినప్పుడు ఆయా రాష్ట్రాలలో ఉన్న స్థానిక పోలీసులతో పాటు ఫైర్ సిబ్బంది తమ పరిధి మేరకు మెరుగ్గానే పనిచేస్తున్నారని అన్నారు. తెలంగాణ అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి మాట్లాడుతూ, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఘటనలో నెల పదిహేను రోజులుగా రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోందని, ఇంకా వారం నుంచి పది రోజుల పాటు సహాయక చర్యలు కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. దేశవ్యాప్తంగా అగ్నిమాపక శాఖలో అధికారులు, సిబ్బందికి శిక్షణ, అత్యాధునిక పరికరాలు సమకూర్చుకోవడం వంటి అంశాలపై చర్చించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని నాగిరెడ్డి వివరించారు. సమావేశంలో అన్ని రాష్ట్రాల అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు, ఆయిల్ ఇండస్ట్రీ సేఫ్టీ డైరెక్టరేట్, సీఐఎస్ఎఫ్, డీఆర్‌డీఓ, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ సహా పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశాలు శుక్రవారంతో ముగియనున్నాయి.

నోటిఫికేషన్ ఇచ్చాక నిబంధనల మార్పు చెల్లదు

ఎన్ఐపీహెచ్ఎం ఏడీ భర్తీపై హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని ఏదైనా నియామకాలకు సంబంధించి ఒకసారి నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత ఎంపిక ప్రక్రియను, నిబంధనలను మార్చడం చెల్లదని హైకోర్టు తేల్చిచెప్పింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీహెచ్ఎం) అసిస్టెంట్ డైరెక్టర్ నియామకాన్ని తొలుత ఇచ్చిన నోటిఫికేషన్ నిబంధనల మేరకే చేపట్టాలని కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. నోటిఫికేషన్‌లో ఇచ్చిన నిబంధనల ప్రకారం అర్హత సాధించిన తనను పక్కకు పెట్టి, అదనపు అర్హతల పేరుతో మరొకరిని ఏడీగా నియమించడం చెల్లదంటూ నీలమ్ లావణ్య హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి, లావణ్య అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీనిని సవాల్ చేస్తూ ఇ. శ్రీలత అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం విచారణ చేపట్టింది. లావణ్య తరఫున సీనియర్ న్యాయవాది కె.లక్ష్మీనరసింహ వాదనలు వినిపించారు. నోటిఫికేషన్‌లో రాత పరీక్ష, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, ఇంటర్వ్యూ అని పేర్కొని.. తర్వాత విద్యార్హతలు, పరిశోధన ప్రచురణలు చేర్చారన్నారు. వీటిని పరిగణనలోకి తీసుకుని అప్పీలెంట్‌ను ఏడీగా నియమించారని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఒకసారి నోటిఫికేషన్ ఇచ్చాక నిబంధనల మార్పు కుదరదని, శ్రీలత ఎంపిక చెల్లదని ఉత్తర్వులు జారీ చేశారు.


మూడు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలకు బస

అంబర్‌పేటలో తాత్కాలికంగా ఏర్పాటు

హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: మూడు ఎన్‌డీఆర్ఎఫ్ (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) బృందాలకు నాలుగేళ్లపాటు తాత్కాలిక బసను అంబర్‌పేట పోలీస్ ట్రైనింగ్ సెంటర్ (పీటీసీ)లో కల్పిస్తూ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ నగరంతోపాటు రాష్ట్రంలో వరదలు, అగ్నిప్రమాదాలు, భవనాలు కుప్పకూలడం వంటి ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు.. ఈ బృందాలు వెంటనే రంగంలోకి దిగేలా తాత్కాలిక బస కల్పిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం షేక్‌పేటలోని జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సరైన వసతులు లేకపోవడంతో.. ఈ బృందాలు విజయవాడలోని కేంద్ర కార్యాలయం నుంచి పనిచేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఏదైనా విపత్తు సంభవిస్తే అంత దూరం నుంచి చేరుకోవడం కష్టసాధ్యమన్న అభిప్రాయాలు.. ఇటీవల ఎస్ఎల్‌బీసీ సొరంగం కూలిపోయిన సందర్భంగా జరిగిన సమీక్ష సమావేశంలో ప్రస్తావనకు వచ్చాయి. అయితే, ఇప్పటికే శంషాబాద్ మండలం, హమీదుల్లా నగర్‌లో ఎన్‌డీఆర్ఎఫ్ శాశ్వత భవన నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించింది. ఈ భవనం పూర్తయ్యేందుకు మరో నాలుగేళ్ల సమయం పట్టే అవకాశం ఉన్నందున.. అప్పటి వరకు తాత్కాలికంగా 150 మంది సభ్యులతో కూడిన మూడు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలకు వసతి సదుపాయం అంబర్‌పేటలో కల్పిస్తున్నట్టు రవిగుప్తా తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జీఎంఆర్‌కు స్కైట్రాక్స్ ఉత్తమ అవార్డు



స్కైట్రాక్ అవార్డును అందుకుంటున్న జీఎంఆర్ ప్రతినిధి

శంషాబాద్ (హైదరాబాద్): జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ మరోసారి స్కైట్రాక్స్ సర్వేలో దేశంతో పాటు దక్షిణాసియాలో ఉత్తమ అవార్డును సొంతం చేసుకుంది. ప్రయాణికులు, అతిథి సేవలను మెరుగుపరచడం, లాంజ్ సౌకర్యం డిజిటలైజేషన్, కస్టమర్ టచ్ పాయింట్ వద్ద ఉద్యోగులు, సిబ్బంది వ్యవహరించే తీరుపై స్కైట్రాక్స్ నిర్వ హించిన ఆడిట్ల ద్వారా 2025 బెస్ట్ ఎయిర్‌పోర్టుగా ఎంపికైందని జీఎంఆర్ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో జరిగిన ప్యాసింజర్ టెర్మినల్ ఎక్స్‌పోలో జీఎంఆర్ ప్రతినిధులకు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు సీఈవో ప్రదీప్ పణీకర్ మాట్లాడుతూ.. ప్రయాణికుల సేవల కోసం హైదరాబాద్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ సంస్థ.. అన్ని విభాగాల్లో అత్యుత్తమ సేవలందించేందుకు నిరంతర కృషి చేస్తోందన్నారు.

క్లుప్తంగా...

సత్వరమే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- 129 జీవోను సవరించండి.. దానితో వీఆర్వోలకు నష్టం
- మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్కకు ఉద్యోగ జేఏసీ వినతి



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందిస్తున్న మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలను వేగంగా పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్కతో గురువారం రాష్ట్ర ఉద్యోగ జేఏసీ నేతలు సమావేశమై తమ సమస్యలపై వినతి పత్రం అందించారు. ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి 57 రకాల సమస్యలు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. వాటిని ప్రాధాన్యం ప్రకారం పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్థికపరమైన, ఆర్థికేతర సమస్యలను మంత్రికి వివరించారు. అలాగే, వీఆర్వోలు, వీఆర్ఏలను తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకునేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీచేసిన 129 జీవోను సవరించాలని కోరారు. గతంలో వారు చేసిన సేవలను పరిగణలోకి తీసుకోపోతే భవిష్యత్తులో వారి సీనియారిటీకి సంబంధించిన సమస్యలు వస్తాయని, ఈ జీవోతో ప్రతి వీఆర్వోకు నష్టం జరుగుతుందని వెల్లడించారు. మంత్రులను కలిసిన వారిలో ఇంకా టీ వీఆర్వోల జేఏసీ చైర్మన్ గోల్కొండ సతీష్, సెక్రటరీ జనరల్ హరాలే సుధాకర్‌రావు, అదనపు సెక్రటరీ జనరల్ పల్లెపాటి నరేష్ తదితరులున్నారు.

ఏఐజీలో కేసీఆర్‌కు వైద్య పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: మాజీ సీఎం కేసీఆర్ ఏఐజీ ఆస్పత్రిలో సాధారణ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. గురువారం ఉదయం ఆయన ఫాంహౌస్ నుంచి బయలుదేరి నేరుగా గచ్చిబౌలి ఏసియన్ గ్యాస్ట్రో ఎంటరాలజీ ఆస్పత్రికి చేరుకున్నారు. ఆస్పత్రి వైద్య బృందం ఆయనకు పలు రకాల వైద్య పరీక్షలు చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అనంతరం ఆయన నందినగర్‌లోని నివాసానికి చేరుకున్నారు.

పోస్టర్‌లో నీ ఫొటో లేదు చూసుకో..

బీఆర్ఎస్ నేత హరీశ్‌రావుకు ఎంపీ చామల కౌంటర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణను కేసీఆర్ నిలబెడితే, రేవంత్‌రెడ్డి పడగొడుతున్నారని ముచ్చట్లు చెపుతున్న మాజీ మంత్రి హరీశ్ రావు.. ముందు బీఆర్ఎస్‌లో తన పరిస్థితి ఏంటో చూసుకోవాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. గురువారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో పీసీసీ నేతలు పున్నా కైలాశ్ నేత, గజ్జి భాస్కర్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్‌తో కలిసి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ పోస్టర్లలో హరీశ్‌రావు ఫొటో లేదని తెలిపారు. హరీశ్‌రావు ముందు అది చూసుకోవాలని, ఆ తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడాలని అన్నారు. మామకు వారసుడిని తానేనని కలలు కంటున్న హరీశ్‌రావు ఫొటో పోస్టర్లలో ఎందుకు లేదో ఆత్మావలోకనం చేసుకోవాలని హితవు పలికారు. కేటీఆర్ వచ్చాక పార్టీలో హరీశ్‌రావు పరిస్థితి మరింత దిగజారిందని ఎద్దేవా చేశారు. కళ్లుండీ చూడలేని కబోది హరీశ్‌రావు అయితే, బూతు పితామహుడు ఆయన మామ కేసీఆర్ అని విమర్శించారు. బీఆర్ఎస్ సిల్వర్‌జూబ్లీ సందర్భంగానైనా ఒక బీసీ నేతను పార్టీ అధ్యక్షుడిని చేయగలరా అని సవాల్ విసిరారు.

బీఆర్ఎస్‌ది ఆత్మవంచన

ఆ 400 ఎకరాలు ప్రభుత్వానిదేనని ఎంపవర్డ్ కమిటీ ముందు అంగీకరించారు: సామా రామ్మోహన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కంచ గచ్చిబౌలి వ్యవహారంలో బీఆర్ఎస్ ఆత్మవంచనతో వ్యవహరిస్తోందని టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్స్ కమిటీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి విమర్శించారు. ఎట్టకేలకు అక్కడి 400 ఎకరాల భూమి రాష్ట్ర ప్రభుత్వానిదేనని ఆ పార్టీ నేతలు కేంద్రం నుంచి వచ్చిన ఎంపవర్డ్ కమిటీ ముందు అంగీకరించడం సంతోషమని వ్యాఖ్యానించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఆ భూమి డీమ్డ్ ఫారెస్ట్ అంటూ బీఆర్ఎస్ తన ద్వంద్వ ధోరణిని బయటపెట్టిందని, డీమ్డ్ ఫారెస్టు అయితే పదేళ్ల పాటు ఎందుకు ఆ భూమిని డీమ్డ్ ఫారెస్ట్ అంటూ అధికారికంగా ప్రకటించలేదని ప్రశ్నించారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారం పేరుతో సెంట్రల్ వర్సిటీలో సహజంగా పెరిగిన వృక్షాలను నరికించి మొక్కలను నాటిస్తే ఒక్క మొక్క కూడా బతకలేదని, దీనిపై బహిరంగ చర్చకు హరీశ్‌రావు సిద్ధమేనా అని ప్రశ్నించారు.

అసలేం జరిగింది?

కంచ గచ్చిబౌలి భూముల్లో కేంద్ర సాధికార కమిటీ పర్యటన

- రాష్ట్ర అధికారులతో కలిసి చెట్ల కూల్చివేత, భూమి చదును చేసిన ప్రాంతాల పరిశీలన.. పీకాక్, బఫెల్లో లేక్ వరకు వెళ్లి చూసిన కేంద్ర బృందం
- వివిధ శాఖల అధికారులతో వాస్తవ పరిస్థితిపై ఆరా



హెచ్‌సీయూ భూముల్లో పర్యటిస్తున్న సిద్ధార్థ దాస్, చంద్రప్రకాశ్ గోయల్, సునీల్ లేహమనయ్య, చంద్రదత్, జయేశ్ రంజన్, ఇతర అధికారులు

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు నియమించిన కేంద్ర సాధికార కమిటీ గురువారం కంచ గచ్చిబౌలిలోని వివాదాస్పద 400 ఎకరాల భూమిని సందర్శించింది. ఉదయం 9.30 గంటల ప్రాంతంలో టీఎన్‌జీవోల కాలనీకి వెళ్లే రోడ్డు మీదుగా లోపలికి వెళ్లిన కమిటీ..చదును చేసిన భూమి విస్తీర్ణం, చెట్ల కూల్చివేత, వన్యప్రాణులు, జీవ వైవిధ్యానికి జరిగిన నష్టానికి సంబంధించిన వాస్తవ పరిస్థితులపై ఆయా విభాగాల అధికారులతో ఆరా తీసింది. రెండు గంటల పాటు అక్కడ పర్యటించింది. హెచ్‌సీయూలోని పీకాక్, బఫెల్లో లేక్ వరకు కమిటీ వెళ్లినట్లు సమాచారం. కాగా ఆ తర్వాత నగరంలోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో విద్యార్థి సంఘాలు, అధ్యాపకులు, పర్యావరణవేత్తలు, పౌరసమాజం నుంచి వినతిపత్రాలు స్వీకరించింది. అనంతరం తాజ్ కృష్ణ హోటల్‌లో..రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశమయ్యింది. బీఆర్ఎస్ నేతలు, బీజేపీ ఎంపీల నుంచి వినతిపత్రాలను స్వీకరించింది. ఈ నెల 16న సుప్రీంకోర్టులో ఈ భూములకు సంబంధించిన కేసు విచారణకు రానున్న నేపథ్యంలో..వాస్తవ పరిస్థితులను పరిశీలించి నివేదిక ఇవ్వడానికి ఈ కమిటీ రాష్ట్రానికి వచ్చింది.

ఫొటోలు, వీడియోలు తీసిన కమిటీ!

కమిటీ చైర్మన్, కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అధికారి సిద్ధార్థ దాస్, సభ్యులు చంద్రప్రకాశ్ గోయల్, సునీల్ లేహమనయ్య, చంద్రదత్‌లు భూములు సందర్శించారు. ఈ సందర్భంగా చైర్మన్, సభ్యులు.. చెట్ల నరికివేతకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీసుకున్నట్టు తెలిసింది. ఉదయం 11.30 గంటల వరకు కమిటీ అక్కడ ఉంది. పరిశ్రమలు, వాణిజ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ఐఏఎస్ అధికారి శశాంక్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అటవీ శాఖ ఉన్నతాధికారులు రాకేష్‌కుమార్ డోబ్రియాల్, ఏలూసింగ్ మేరు, ప్రియాంక వర్గీస్, సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, హెచ్ఎండబ్ల్యూఎస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు వారి వెంట ఉన్నారు. అక్కడ వారిని హెచ్‌సీయూ విద్యార్థి సంఘాలు, అధ్యాపకులు, పౌర సమాజానికి చెందిన వారు కలుసుకునేందుకు పోలీసులు అవకాశం ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ఎంసీహెచ్ఆర్‌డీలో విద్యార్థి సంఘాలు, ఎన్జీవోలతో కమిటీ సమావేశమయ్యింది.

వాదనలు వినిపించిన విద్యార్థులు, ప్రభుత్వం

హెచ్‌సీయూ భూముల్లో చెట్లను నరికేశారని, వన్యప్రాణులకు నష్టం జరుగుతోందని వర్సిటీ విద్యార్థి సంఘాల నేతలు, అధ్యాపకులు కమిటీ దృష్టికి తెచ్చారు. కాగా వివాదం నెలకొన్న భూమి హెచ్‌సీయూది కాదని, ప్రభుత్వ భూమి అని, అటవీ ప్రాంతం కాదని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వ అధికారులు కమిటీకి పలు డాక్యుమెంట్లను సమర్పించినట్టు తెలిసింది. పీకాక్, బఫెల్లో లేక్‌లు 400 ఎకరాల్లో లేవని చెప్పినట్లు తెలిసింది. గతంలో యూనివర్సిటీ నుంచి భూములు తీసుకుని ఐఎంజీ భారత్‌కు కేటాయించడం, ఆ తరువాత సుదీర్ఘ న్యాయ పోరాటం, న్యాయస్థానాలు ఆ భూమి ప్రభుత్వానిదేనని తీర్పులిచ్చిన విషయాన్ని సీఎస్ శాంతికుమారి, ఇతర అధికారులు కమిటీకి వివరించారు. కాగా చెట్లు నరకడానికి అనుమతులు తీసుకున్నారా? అని కమిటీ ప్రశ్నించినట్లు తెలిసింది. అడవికి సంబంధించిన వివరాలు కచ్చితంగా చూపించకపోవడంపై అటవీ అధికారులను కమిటీ తప్పుపట్టినట్టు సమాచారం. ఇక బీఆర్ఎస్, బీజేపీ నేతలు కూడా కమిటీ ముందు వేర్వేరుగా ప్రభుత్వ వైఖరిని తప్పుబడుతూ వాదనలు వినిపించారు. హెచ్‌సీయూలోని 400 ఎకరాల భూమిని పరిరక్షించాలని, అక్కడున్న చెట్లు, జీవవైవిధ్యాన్ని కాపాడే దిశలో చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా తాము మరోసారి ఈ భూముల పరిశీలనకు వస్తామని, ఇదే చివరిసారి కాదని కమిటీ చెప్పినట్టు విద్యార్థి సంఘాలు, అధ్యాపకులు, ఆయా సంఘాల ప్రతినిధులు తెలిపారు. కమిటీకి ఆ భూముల్లో ఉన్న పక్షులు, జంతువులు చెట్ల వివరాలు ఇచ్చామని హెచ్‌సీయూ విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఎ.ఉమేష్ అంబేద్కర్ తెలిపారు. తాము చెప్పినవి అక్కడ ఉన్నట్టుగా కమిటీ సభ్యులు అంగీకరించారని చెప్పారు. ఈ భూముల్లో జరిగిన విధ్వంసానికి సంబంధించిన పూర్తి ఆధారాలను కమిటీ కి అందజేశామని ఏబీవీపీ నేత బాలకృష్ణ తెలిపారు. తాజ్‌కృష్ణ హోటల్‌లో సీఎస్ శాంతికుమారి, స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్, డీజీపీ జితేందర్, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ సృజనతో పాటు అటవీ శాఖ ఉన్నతాధికారులు కమిటీతో సమావేశమయ్యారు.

సర్కారు బరితెగింపు

కంచ గచ్చిబౌలిలో జీవ విధ్వంసం చేసింది

- సీఎం రేవంత్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- కేంద్ర సాధికార కమిటీతో బీఆర్ఎస్ బృందం
- పర్యావరణ ఉల్లంఘనలపై హరీశ్‌రావు తదితరుల నివేదిక



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో వేలాది చెట్లను నరికి, జింకలను చంపి జీవ వైవిధ్యాన్ని విధ్వంసం చేస్తున్న తీరు ప్రభుత్వానికి ఎందుకు కనిపించడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. కంచ గచ్చిబౌలి భూముల్లో ప్రభుత్వం బరితెగింపు వైఖరి ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. వందల ఎకరాల్లో చెట్ల నరికివేతకు బాధ్యులైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కంచ గచ్చిబౌలి భూములను పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర సాధికార కమిటీ చైర్‌పర్సన్ సిద్ధాంత్‌దాస్, సభ్యులు చంద్రప్రకాశ్ గోయల్‌ను హరీశ్‌రావు నేతృత్వంలోని బీఆర్ఎస్ బృందం గురువారం కలిసింది. పర్యావరణ విధ్వంసంపై వినతిపత్రం సమర్పించింది. అనంతరం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, దేవీ ప్రసాద్‌తో కలిసి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.

రేవంత్ మూడు జింకల చావుకు కారణమయ్యారు..

'హెచ్‌సీయూ భూముల్లో ఏడు చట్టాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉల్లంఘించింది. వరుస సెలవు దినాలను అడ్డుపెట్టుకుని నిబంధనలు ఉల్లంఘించి పర్యావరణాన్ని విధ్వంసం చేసిన తీరును 11 పేజీల వినతిపత్రంలో వివరించడంతోపాటు 200 పత్రాలను కమిటీకి అందజేశాం. కంచ గచ్చిబౌలి భూముల్లో చెట్ల నరికివేతకు టీజీఐఐసీ పోలీసు విభాగానికి తప్ప ఏ ఒక్క ప్రభుత్వ శాఖకూ దరఖాస్తు చేయలేదు. పోలీసుల రక్షణలో జరిగిన విధ్వంసంతో మూడు జింకలు చనిపోగా, అనేక జంతువులు ఆవాసం కోల్పోయాయి. గతంలో జింకను వేటాడిన కేసులో సినీ నటుడు సల్మాన్ ఖాన్ జైలుకు వెళ్లాడు. మరి మూడు జింకల చావుకు కారణమైన రేవంత్‌పై ఏ తరహా చర్యలు తీసుకోవాలి' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

సుప్రీం తీర్పులను ఉల్లంఘించడమే

'అటవీ స్వభావం కలిగిన భూముల వివరాలు ఇవ్వాలని ఓ వైపు సుప్రీం కోర్టు అన్ని రాష్ట్రాలను కోరుతుంటే తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఆ భూములను తెగనమ్మే ప్రయత్నం చేస్తోంది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల పట్ల కూడా రేవంత్‌కు భయం లేకుండా పోతోంది. సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చిన తర్వాత కూడా కంచ గచ్చిబౌలి భూములు టీజీఐఐసీకి చెందినవే అని బోర్డులు పెట్టారు. గతంలో కొత్త సచివాలయం నిర్మాణ సమయంలో గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేసి ఉన్నత న్యాయస్థానాల్లో కేసులు వేసిన రేవంత్ ఇప్పుడు ఏం చేస్తున్నారో చెప్పాలి. పర్యావరణ విధ్వంసాన్ని ప్రశ్నించిన విద్యార్థులను పది రోజులుగా జైల్లో పెట్టారు. గత ఏడాది అక్టోబర్‌లో కంచ గచ్చిబౌలి భూములను తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్ల రుణం కోసం రూ.169.84 కోట్లు బ్రోకర్‌కు చెల్లించింది' అని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ సెంటర్లకు గ్రేడింగ్

పనితీరు ఆధారంగా అవార్డులు..

- ప్రతి సెంటర్‌లో కనీసం 20 మంది చిన్నారులు ఉండాల్సిందే: మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు ఆధారంగా గ్రేడింగ్ ఇస్తామని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. మంచి గ్రేడింగ్ ఉన్న వాటికే అవార్డులు వస్తాయన్నారు. ప్రతీ కేంద్రం పూర్తిస్థాయిలో పనిచేయాలని స్పష్టంచేశారు. గురువారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో సీతక్క మాట్లాడారు. చిన్నారులు లేరనే సాకుతో 313 సెంటర్లు తెరుచుకోకపోవడం సరికాదని, అలాంటి కేంద్రాలను డిమాండ్ ఉన్న ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలకు అందే సరుకుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీ సెంటర్ లో కనీసం 20 మంది చిన్నారులు ఉండేలా చర్యలు తీసుకోవాలని, బడిబాట తరహా లోనే గ్రామాల్లో చిన్నారులను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. 30 కేంద్రాల్లో పిల్లలే లేరని, 198 కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య 5 లోపే ఉందని, 586 కేంద్రాల్లో పదిలోపే పిల్లలున్నారని చెప్పారు.

అధికారులు సరిగా పనిచేయట్లేదు..: చిన్నారుల సంక్షేమంపై రూ.కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ అధికారులు సీరియస్‌గా పనిచేయడం లేదని సీతక్క చెప్పారు. జిల్లా సంక్షేమాధికారులు వారానికి కనీసం మూడు కేంద్రాలను సందర్శించాలన్నారు. కంది పప్పు కొనుగోలు విషయంలో సొంత నిర్ణయాలు ఎందుకు తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ–టెండర్ విధానాన్ని పాటించాలన్న ఆదేశాలను ఎందుకు విస్మరించారన్నారు. అధికారుల తప్పిదాల వల్ల ప్రభుత్వం విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కొన్ని జిల్లాల అధికారులు పాత కాంట్రాక్టర్లకే కందిపప్పు సరఫరాను నామినేషన్ పద్ధతిలో ఎందుకు కట్టబెట్టారో సంజాయిషీ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా కొనుగోలు కమిటీ ద్వారా టెండర్లు పిలవాలన్నారు. హైదరాబాద్ జిల్లాలో కోడిగుడ్లను సరిగా సరఫరా చేయని ఓ కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్ చేశామన్నారు. తప్పు ఎక్కడ జరిగినా ఉపేక్షించేది లేదని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, సంచాలకులు కాంతి వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ల వ్యవహారంలో సుప్రీంకోర్టు జోక్యం కరెక్టే

మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వాలు పంపిన బిల్లులను ఆమోదించకుండా గవర్నర్లు జాప్యం చేయడం సరికాదని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు అన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడం సమంజసమనని అభిప్రాయపడ్డారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్లు నిర్ణయం తీసుకోవడంలో అంతులేని జాప్యం చేయడంపై సుప్రీంకోర్టు అభ్యంతర పెట్టడాన్ని చూస్తుంటే.. అక్కడా ఇదే రకమైన తీర్పు రావొచ్చని ఆయన వ్యాఖ్యానించారు. ఏదైనా రాజ్యాంగం ప్రకారమే జరగాలని సూచించారు. గురువారం తనను కలిసిన వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా బృందంతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా అక్రమ చొరపాట్లను అరికట్టడంలో అనేక సవాళ్లు ఉన్నాయని, ఒక్కోదానిని అధిగమిస్తూ ముందుకు సాగాలన్నారు. నందనం కృపాకర్, రావికంటి శ్రీనివాస్, సిద్దిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి విద్యాసాగర్‌రావును కలిసిన వారిలో ఉన్నారు.

స్వతంత్ర భారత చరిత్రలో సన్నబియ్యం ఇచ్చింది మేమే

- కేంద్రం సన్నబియ్యం ఇస్తుందనేది అవాస్తవం.. అక్కడి నుంచి వచ్చేది దొడ్డుబియ్యమే
- అది కూడా కొందరికే... దుష్ప్రచారాన్ని ప్రజాప్రతినిధులు సమర్థవంతంగా తిప్పికొట్టాలి
- అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు.. ప్రతి ధాన్యం గింజా కొంటాం: మంత్రి ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరుపేదలందరికీ ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, స్వతంత్ర భారత చరిత్రలో మొదటిసారి పేదలకు సన్నబియ్యం ఇస్తోంది కూడా తామేనని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సన్నబియ్యం పంపిణీ అవుతాయన్నది అవాస్తవమని, కేంద్రం నుంచి కేవలం దొడ్డు బియ్యం మాత్రమే వస్తాయని, అది కూడా కొందరికే పరిమితమని స్పష్టం చేశారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లతో జలసౌధ నుంచి ఆయన గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ కేంద్రం సరఫరా చేస్తున్న దొడ్డుబియ్యం స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని పేదలకు సన్నబియ్యం ఇస్తోందని, ఇందుకు 20 శాతం నిధులను అదనంగా వెచ్చిస్తున్నామని చెప్పారు. ఈ పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.13 వేల కోట్లు ఖర్చు చేస్తున్న విషయాన్ని ప్రజలకు వివరించాలని కోరారు. సన్నబియ్యం పంపిణీలో కేంద్రం వాటా కూడా ఉందనే దుష్ప్రచారాన్ని ప్రజాప్రతినిధులు ముక్తకంఠంతో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని అర్హులైన నిరుపేదలకు తెల్ల రేషన్‌కార్డులు త్వరలోనే పంపిణీ చేస్తామని ఉత్తమ్ ప్రజాప్రతినిధులకు భరోసా ఇచ్చారు. రేషన్‌కార్డులు కొత్తగా ఇస్తే సన్నబియ్యం లబ్ధిదారుల సంఖ్య 2.81 కోట్ల నుంచి 3.10 కోట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నామని, ఆ మేరకు పంపిణీకి సన్నద్ధంగా ఉన్నామని చెప్పారు.

రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి

బీఆర్ఎస్ హయాంలో కట్టిన కాళేశ్వరం కూలిపోయి.. మేడిగడ్డ పనిచేయకపోయినా ఖరీఫ్, రబీ సీజన్‌లలో కలిపి 123.27 లక్షల ఎకరాల్లో 281 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అయ్యిందని మంత్రి ఉత్తమ్ చెప్పారు. ఖరీఫ్‌లో 66.78 లక్షల ఎకరాల్లో 153.5 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తే, రబీలో 56.49 లక్షల ఎకరాల్లో 127.5 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నామన్నారు. రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు 8,209 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. సన్నబియ్యానికి రూ.500 బోనస్ కింద 24 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి 1,199 కోట్లు రైతులకు చెల్లించామని చెప్పారు.

జగన్ అద్భుత నాయకుడు

జీవితంలో అత్యంత కఠిన సమయాలు ఎదుర్కొన్నాడు: ఎమ్మెల్సీ కవిత

- పవన్ కల్యాణ్‌ను నేను సీరియస్‌గా తీసుకోవడం లేదు
- చెగువేరాను ప్రేమించే వ్యక్తి సనాతనవాదిగా మారతాడా అని ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: 'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అద్భుతమైన నాయకుడు.. జీవితంలో ఆయన అత్యంత కఠిన సమయాలను ఎదుర్కొన్నాడు. ప్రతిపక్ష నాయకుడిగా ఆయన మాట్లాడే తీరు బాగుంటుంది. ఆయన పోరాట యోధుడు. ప్రతిపక్ష నాయకుడిగా జగన్ 2.0ను చూస్తున్నాం' అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో కవిత మాట్లాడుతూ, వైఎస్ జగన్, పవన్ కల్యాణ్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గురించి పాడ్‌కాస్ట్‌లో ప్రస్తావన రాగా కవిత పలు వ్యాఖ్యలు చేశారు. 'పవన్ కల్యాణ్‌ను నేను సీరియస్‌గా తీసుకోవడం లేదు. దురదృష్టవశాత్తూ ఆయన పొరుగు రాష్ట్రం ఏపీకి ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. రాజకీయాల్లో ఆయన గురించి అన్నీ ప్రశ్నించాల్సిన అంశాలే. చెగువేరాను ప్రేమించే వ్యక్తి ఏకంగా సనాతన వాదిగా ఎలా మారతాడు. ఆయన ఇచ్చే రాజకీయ ప్రకటనలు పరస్పర విరుద్ధంగా ఉంటాయి. రేపు తమిళనాడుకు వెళ్లి హిందీని రుద్దకూడదు అని కూడా అంటాడు. అందుకే పవన్ కల్యాణ్‌కు సంబంధించిన ప్రశ్నలపై నేను నిజంగా స్పందించాలని అనుకోవడం లేదు. ఆయనను సీరియస్ రాజకీయ నాయకుడిగా పరిగణించడం లేదు' అని కవిత వ్యాఖ్యానించారు. గతంలో ఏపీ హోంమంత్రి అనితను ఉద్దేశించి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను కవిత గుర్తు చేశారు. 'దళిత మహిళ కాబట్టే హోంశాఖ మంత్రి అనితను పక్కన పెట్టి తాను హోంమంత్రిత్వ శాఖ తీసుకుంటాను అన్నాడు. లోకేశ్ హోంమంత్రిగా ఉంటే పవన్ కల్యాణ్ ఈ వ్యాఖ్యలు చేసేవాడా' అని కవిత ప్రశ్నించారు.

విద్యా ప్రయోజనాల దృష్ట్యా హెచ్‌సీయూ భూమిని పరిరక్షించండి

- సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీకి బీజేపీ ఎంపీల వినతిపత్రం
- తమ విజ్ఞప్తిపై కమిటీ సానుకూలంగా స్పందించిందన్న ఎంపీలు

సాక్షి, హైదరాబాద్: విద్యా వ్యవస్థ విస్తృత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని హెచ్‌సీయూ భూముల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర సాధికార కమిటీకి బీజేపీ ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎం.రఘునందన్‌రావు, ఈటల రాజేందర్ విజ్ఞప్తిచేశారు. 1974లో ఆరు సూత్రాల పథకంలో భాగంగా ఈ వర్సిటీకి భూములు కేటాయించారని, దీనిపై కేంద్ర గెజిట్‌లో విడుదల చేశాక... 1975 ఫిబ్రవరిలో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో కంచ గచ్చిబౌలిలోని 2,300 ఎకరాల భూమిని హెచ్‌సీయూకి అప్పగించారని తెలియజేశారు. 2012లో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కూడా ప్రభుత్వ స్పెషల్ సీఎస్, సీసీఎల్ఏలకు 2,185 ఎకరాల భూమి హెచ్‌సీయూ అధీనంలో ఉందని (ప్రస్తుత వివాదంలోని 400 ఎకరాలు కలిపి) లేఖ రాశారని తెలిపారు. గురువారం తాజ్‌కృష్ణాలో ఈ మేరకు సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీకి బీజేపీ ఎంపీలు వినతిపత్రం సమర్పించారు. 'అప్పటి కేంద్రం హెచ్‌సీయూకి ఇచ్చిన గెజిట్, కేటాయించిన భూమి పత్రాలు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కాపీ. 2012లో అప్పటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రాసిన లేఖ, ఈ విషయమై 2022లో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాసిన లేఖ. ఇలా మరికొన్ని పత్రాలను ఎంపవర్డ్ కమిటీకి సమర్పించాము. ఇవన్నీ కలిపి సుప్రీంకోర్టులో వాదిస్తే మీరే కేసు గెలుస్తారు అంటూ కమిటీ సభ్యులే అన్నారు'అని ఈ భేటీ అనంతరం బీజేపీ ఎంపీలు మీడియాకు తెలిపారు.

కేటీఆర్, హరీశ్ అప్పుడు ఎక్కడున్నారు?

తాము సమర్పించిన వినతిపత్రంపై కమిటీ సానుకూలంగా స్పందించిందని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చెప్పారు. 'సాంకేతికంగా అది ప్రభుత్వభూమి అయినా, గతంలోని ఎంఓయూలు ఇతర చట్టపరమైన అంశాల ప్రకారం చూస్తే మాత్రం హెచ్‌సీయూదే ఈ భూమి'అని తెలిపారు. రఘునందన్‌రావు మాట్లాడుతూ.. 'దొంగే దొంగ అన్నట్టుగా బీఆర్ఎస్ నేతలు మొసలి కన్నీళ్లు కారుస్తున్నారు. ఈ భూమి మీదుగానే టీఎన్జీవో కాలనీకి రోడ్డు వేసినప్పుడు హరీశ్, కేటీఆర్ ఎక్కడికి పోయారు. సీఎంగా ఉన్నపుడు కేసీఆర్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను రికార్డులకు ఎందుకు ఎక్కించలేదు? 'అని ప్రశ్నించారు. ప్రభుత్వం భూములను వేలం వేయకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపేది బీజేపీయేనని ఈటల రాజేందర్ చెప్పారు. 'గతంలో తెలంగాణ ఉద్యమం ద్వారా యూనివర్సిటీని సాధించుకున్నాం. ఇప్పటికైనా భూముల వేలాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి'అని ఆయన డిమాండ్ చేశారు.

సీఎం రేవంత్ మతి లేకుండా మాట్లాడుతున్నారు

- కుర్చీని కాపాడుకోవడానికే బీజేపీపై రేవంత్ విమర్శలు
- కొడంగల్‌లో సీఎం మళ్లీ గెలిచే పరిస్థితి లేదు
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి మతి స్థిమితం లేకుండా, బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. సీఎం తన కుర్చీని కాపాడుకోవడం కోసం రాహుల్ గాంధీని మెప్పించడానికి ప్రధాని మోదీని, బీజేపీని టార్గెట్ చేశారన్నారు. తెలంగాణను రాహుల్ పాదాల వద్ద రేవంత్ తాకట్టు పెట్టారని ధ్వజమెత్తారు. రేవంత్ చెబుతున్నట్టుగా తెలంగాణలో బీజేపీని అడుగుపెట్టనివ్వడం కాదని.., హామీలు అమలు చేయనందుకు ప్రజలే రాహుల్‌ని ఇక్కడ అడుగుపెట్టనివ్వరని వ్యాఖ్యానించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొడంగల్‌లో మళ్లీ పోటీ చేస్తే రేవంత్ గెలిచే పరిస్థితి లేదని, అక్కడ ఆయన రాజీనామా చేసి మళ్లీ పోటీ చేయాలని సవాల్ విసిరారు. 'లోక్‌సభ ఎన్నికల్లో కొడంగల్‌లో అసెంబ్లీ ఎన్నికల కంటే కాంగ్రెస్‌కు 23 వేల ఓట్లు తగ్గాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి అక్కడ రేవంత్‌ని ఓడించేది బీజేపీనే. ఉప ఎన్నిక వస్తే అక్కడ ఆయన బీజేపీ చేతిలో ఓడిపోవడం ఖాయం. సొంత సీటులోనే గెలిచే సత్తా లేని రేవంత్.., తెలంగాణ నుంచి బీజేపీని ఖతం చేస్తామనడం బుడ్డర్ ఖాన్ మాటలే'అని అన్నారు. 'హామీలు అమలు చేయకుండా అహ్మదాబాద్‌లో గొప్పలు చెప్తావా? గ్యారంటీలపై చర్చకు సిద్ధమా? రాహుల్ గాంధీకి తెలంగాణకు వచ్చేందుకు ముఖం లేదు. దమ్ముంటే హెచ్‌సీయూలో రాహుల్ గాంధీ మీటింగ్ పెట్టగలరా?'అని మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. తన పదవికి కౌంట్ డౌన్ మొదలైందని భావిస్తున్న రేవంత్‌రెడ్డి, ఎలాగైనా దానిని కాపాడుకోవాలనే ఎత్తుగడలో భాగంగానే మోదీ, బీజేపీలపై విమర్శలు సంధిస్తున్నారన్నారు.

అంతుచిక్కని కార్మికుల ఆచూకీ

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో కొనసాగుతున్న మట్టి తొలగింపు

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం ప్రమాద ఘటనలో చిక్కుకున్న వారి ఆచూకీ కోసం అధికారుల ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ప్రమాదం జరిగి గురువారం నాటికి 48 రోజులు అవుతోంది. సొరంగం పైకప్పు కూలిన ప్రదేశంలో సహాయక సిబ్బంది నిరంతరాయంగా పనులు చేపడుతున్నారు. నిత్యం సహాయక సిబ్బంది 20 మీటర్ల మేర తవ్వకాలు చేపడుతూ శిథిలాలను బయటకు తరలిస్తున్నారు. సొరంగం పైకప్పు కూలిన ఘటనలో ఎనిమిది మంది కార్మికులు చిక్కుకోగా, మార్చి 9న టీబీఎం ఆపరేటర్ గురుప్రీత్‌సింగ్ మృతదేహాన్ని డీ2 ప్రదేశంలో వెలికితీశారు. మార్చి 25న ప్రాజెక్టు ఇంజనీర్ మనోజ్‌కుమార్ మృతదేహాన్ని కనుగొన్నారు. ప్రస్తుతం శిథిలాల కింద చిక్కుకున్న ఆరుగురి అచూకీ కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. సొరంగం లోపల 13.73 కిలోమీటరు నుంచి 13.8 కిలోమీటరు వరకు కన్వేయర్ బెల్టును పొడిగించేందుకు గురువారం లోకో ట్రిన్ ద్వారా కన్వేయర్ బెల్టు, ఇతర సామగ్రిని సొరంగం లోపలికి తరలించారు. ప్రమాద స్థలం వరకు కన్వేయర్ బెల్టును పొడిగిస్తూ మట్టిని తవ్వే ప్రక్రియను మరింత వేగవంతం చేశారు. వారం రోజుల్లో శిథిలాల తొలగింపును పూర్తి చేసేందుకు సహాయక సిబ్బంది కృషి చేస్తున్నారు.

మెనోపాజ్ అర్థం చేసుకుందాం

నిర్వహణ: సరస్వతి రమ

మెనోపాజ్ అనేది స్త్రీ జీవితంలో సహజమైన దశ. ఆ సమయంలో ఎదురయ్యే శారీరక, మానసిక సమస్యల గురించి తరచూ మాట్లాడుతూ.. చర్చిస్తూ ఉంటేనే దానిపట్ల అవగాహన పెరుగుతుంది. మెనోపాజ్‌ను అనుభవిస్తున్న మహిళే కాదు కుటుంబ సభ్యులూ దాన్ని అంగీకరించాలి. ఆమె దైనందిన జీవితం సాఫీగా సాగడానికి తగిన సపోర్ట్ అందించాలి. మహిళలు కూడా తమ పట్ల వ్యక్తిగత శ్రద్ధను మరచిపోవద్దు.



– జూహీ చావ్లా, నటి, పర్యావరణ ప్రేమికురాలు.

మెనోపాజ్ అనేది సహజమైన స్థితి. దాన్ని అంగీకరించి.. కొత్త అభిరుచులు, కొత్త అవకాశాలు, కొత్త పనులతో ఆ దశలో వచ్చే సవాళ్లను ఎదుర్కోవాలి. ఈ ట్రాన్సిషన్‌తో సరికొత్త జీవితాన్ని ఆరంభించాలి తప్ప అంతా అయిపోయిందనే నిరాశకు లోనుకాకూడదు.



– నటి నీనా గుప్తా
ఆటోబయోగ్రఫీ 'సచ్ కహూ తో'లోంచి!



సునీత

మార్పును అంగీకరిస్తేనే మనోనిబ్బరం, శక్తి తెలుస్తాయి.. స్త్రీలకు మెనోపాజ్ అలాంటి మార్పే! దాన్ని అంగీకరిస్తూ జీవితాన్ని రీస్టార్ట్ చేసుకోవాలి! అలా అంగీకరించాలంటే ఆ దశ మీద ముందు అవగాహన రావాలి. అవగాహన రావాలంటే మౌనం వీడాలి! ఆ నిశ్శబ్దాన్ని బద్దలు కొట్టడానికి ప్రముఖ గాయని సునీత ముందుకు వచ్చారు.

పాజ్ కాదు.. కొత్త ఫేజ్!

''మెనోపాజ్ మనకు చాలా దూరం అనుకునేవాళ్లలో నేనూ ఒకదాన్ని. కానీ అది మన శరీరంలో ఓ వలయంలా తిరుగుతూ మెల్లగా మన జీవితాన్నే ఎఫెక్ట్ చేస్తుంది. ఒకరోజు హఠాత్తుగా మనలో చిత్రమైన ఒత్తిళ్లు మొదలవుతాయి. మూడ్ మారిపోవడం, అసహనం, చర్మం ముడతలు పడటం, నిద్రలేమి, ఒంటరితనపు వేదన.. ఇవన్నీ ఓ పెద్ద సవాలుగా మారుతాయి. అదే మెనోపాజ్. పైకి ఉచ్చరించలేని మౌనంగా భరించే మార్పు. అదొక భయంకరమైన ప్రయాణం. మన చేయిపట్టుకునే వాళ్లు లేక ఒంటరితనం ఆవహిస్తుంది. దిగులు తోడవుతుంది.

అదృష్టమే.. కాని అరుదు!

మెనోపాజ్ దశకు చేరేప్పటికి జీవితం నెమ్మదిస్తుంది. పిల్లలు సెటిలవుతారు. భర్తా బిజీ అయిపోతాడు. మన ఉద్యోగంలో పెద్దగా మార్పు కనపడదు. వీటన్నిటికి తోడు మెనోపాజ్ ఇబ్బందులు.. అంతా అయిపోయిందనే భావన. మనల్ని మనమే సహించలేని రోజులు, భర్తకు చెబితే అసహనంగా చూసే క్షణాలుంటాయి. పిల్లలతో షేర్ చేసుకోనివ్వని బిడియం. స్నేహితులతో మాట్లాడదామంటే వారు ఇంకా ఆ దశకు చేరనివారే! అమ్మ కూడా అర్థంచేసుకోలేదేమో అనిపిస్తుంటుంది.. 'మా రోజుల్లో..' అంటూ అసలు విషయాన్ని పట్టించుకోకుండా నాస్టాల్జియాలోకి వెళ్లే ఆమె మాటలను వింటుంటే! మెనోపాజ్ స్టేజీని అర్థం చేసుకుని అండగా నిలబడే వాళ్లుంటే అదృష్టమే! కాని అది అరుదు! అందుకే మనల్ని మనమే సముదాయించుకోవాలి.. మోటివేట్ చేసుకోవాలి. డాక్టర్‌ను సంప్రదించి అవసరమైన మెడికేషన్ తీసుకోవాలి. మెనోపాజ్‌ను కొత్త ఫేజ్‌గా భావించాలి. అప్పటిదాకా నిర్వర్తించిన బాధ్యతల నుంచి వెసులుబాటు దొరికిందని ఆనందపడాలి. మనల్ని మనం ప్రేమించుకోవాలి. ఆ స్వేచ్ఛను ఆస్వాదించాలి. మన శక్తిసామర్థ్యాలకు ఓ అవకాశం అనుకోవాలి. ఫిజికల్ ఫిట్‌నెస్, మెడిటేషన్, అభిరుచులు, ఆసక్తులతో జీవితాన్ని రీస్టార్ట్ చేయాలి. కొత్త విషయాలను నేర్చుకుంటూ జీవితం పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలి.

వదిలేయకండి..

ఎంత సెల్ఫ్‌మోటివేషన్‌తో ఉన్నా కుటుంబం, ఫ్రెండ్స్ నుంచి ఆమెకు సపోర్ట్ అవసరమవుతుంది. ముఖ్యంగా ఇంట్లో వాళ్లు తనతో మాట్లాడాలి.. తను అనుభవిస్తున్న స్థితి గురించి అడగాలని కోరుకుంటుంది. తనను వినాలని ఆశపడుతుంది. అందుకే ఆమెతో మాట్లాడాలి.. ఆమెను వినాలి.. ఆత్మీయంగా హత్తుకోవాలి. ఇవన్నీ ఆమెకు దివ్యౌషధాలు. కుటుంబ సభ్యులు ఆమెను వినడం వల్ల వాళ్లకు మెనోపాజ్ దశ పట్ల అవగాహన పెరిగి.. వర్క్‌ప్లేస్‌లోని మహిళలను అర్థంచేసుకుని సహానుభూతి చూపించగలుగుతారు. దీనివల్ల ఆడవాళ్లలో బిడియం పోయి.. ధైర్యం వస్తుంది. తమ ఇబ్బందుల గురించి చెప్పగలుగుతారు. ఆ స్టేజ్ ఎలా ఉంటుందో అమ్మాయిలూ గ్రహించగలుగుతారు. అప్పుడు ఆటోమేటిగ్గా మెనోపాజ్ పట్ల ఉన్న సైలెన్స్ బ్రేక్ అయ్యి అవేర్‌నెస్ పెరుగుతుంది. అందుకే ఆ దశను అనుభవిస్తున్న ఆడవాళ్లను ఒంటరితనానికి వదిలేయకండి. అప్పటిదాకా ఇంటిని.. ఇంట్లో మిమ్మల్ని కంటికి రెప్పలా కాచుకున్న ఆమెకు తోడుగా నిలబడండి. ఈ ప్రయాణం మనది అనే భరోసానివ్వండి!'' అంటూ ముగించారు సునీత.

– శిరీష చల్లపల్లి

కూల్ సమ్మర్

ఎండల్లో... కొబ్బరి నీళ్లతో గేమ్స్ వద్దు!



ఎండ వేడిని తట్టుకోవడానికి, ఎండా కాలంలో సత్తువతో ఉండడానికి కొబ్బరి నీళ్ల ఎంత ఎక్కువగా తాగితే అంతమంచిది అనుకుంటారు చాలామంది. అయితే ఇది సరియైనది కాదు అంటున్నారు పోషకాహార నిపుణులు. ఎందుకంటే...

- కొబ్బరి నీళ్లలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. కొబ్బరి నీళ్ల ఎక్కువగా తాగడం వల్ల రక్తంలో పొటాషియం స్థాయులు పెరుగుతాయి. శరీరంలో లవణాల సమతూకం దెబ్బతింటుంది. కిడ్నీల పనితీరుపై ప్రభావం చూపుతుంది.
- కొబ్బరినీళ్లలో అధిక పొటాషియం వల్ల జీర్ణవ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది.
- కొబ్బరి నీళ్లలో అధిక చక్కెర కంటెంట్ వల్ల బరువు పెరగడానికి దారి తీయవచ్చు. డయాబెటిస్, గుండె జబ్బులు, దంత క్షయ ప్రమాదం పెరగవచ్చు.
- కొబ్బరితో అలర్జీలు అసాధారణమేమీ కాదు. కొంతమందికి కొబ్బరి నీటి వల్ల అలెర్జీలు రావచ్చు. దద్దుర్లు, వాపుతోబాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురు కావచ్చు.
- హైబీపీ ఉన్న వారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, పేగు పూత వ్యాధి ఉన్న వాళ్లు కొబ్బరినీళ్లకు దూరంగా ఉండటమే మంచిది.

అదర్‌సైడ్

గజి బి జి బ్లీ!

జిబ్లీ స్టైల్ ట్రెండ్ గురించి అందరూ ఘనంగా మాట్లాడుకుంటున్నారు. అయితే 'జిబ్లీ' అదర్ సైడ్ గురించి ఇప్పుడిప్పుడే మాట్లాడుకుంటున్నారు. సాంకేతిక లోపాల వల్ల 'జిబ్లీ'లో చిత్ర విచిత్రాలు జరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో అబ్బాయిల ఫొటోలు అమ్మాయిలుగా మారుతున్నాయి. అమ్మాయిల చిత్రాలలో మీసాలు, గడ్డాలు వచ్చి చేరుతున్నాయి.

ఇన్‌స్టాగ్రామ్, 'ఎక్స్'లో షేర్ చేసిన ఒక వీడియోలో దారి తప్పిన జిబ్లీ స్టైల్ ట్రెండ్ దృశ్యాలు కనిపిస్తాయి.

మచ్చుకు రెండు...

ఇద్దరు అమ్మాయిల ఫొటో జిబ్లీ స్టైల్లోకి వచ్చేసరికి... అందులో ఒక అమ్మాయి అబ్బాయిగా మారింది!



పూల దండ వేసుకున్న ఒక అమ్మాయి ఫొటో... జిబ్లీ స్టైల్లోకి వచ్చేసరికి ఆమె మీసాలు గెడ్డాలతో కనిపించింది.

....ఇలా చెప్పుకుంటూ పోతే జిబ్లీ వింతలు ఇంతింత కాదయా!

అందుకే ఒక యూజర్...

'టైమ్ టు ఎండ్ దిస్ ట్రెండ్' అని స్పందించాడు.

విజయ శిఖరం

అమిత ప్రతిభ

అడ్వర్‌టైజింగ్, సినిమా ఫీల్డ్‌ల గురించి అమ్మాయిలకు ఆసక్తి ఉంటే...

'అడ్వర్‌టైజింగ్ ఫీల్డ్‌కు వెళతావా! సినిమా ఫీల్డ్‌కు వెళతావా!!' అని ఆశ్చర్యపోయే కాలం అది. అలాంటి కాలంలో అడ్వర్‌టైజింగ్ ఆ తరువాత ఫిల్మ్ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది ముంబైకి చెందిన అమిత మద్వాని.

'ఏం తెలుసు అని ఇక్కడికి వచ్చావు!' అని ఒకరు వెటకారం చేశారు.

'తెలుసుకుందామనే ఇక్కడికి వచ్చాను' అని సమాధానం ఇచ్చింది అమిత.

అవును... ఎన్నో దశాబ్దాలుగా ఆమె నేర్చుకుంటూనే ఉంది. ఆ నిరంతర ఉత్సాహమే అమితను అడ్వర్‌టైజింగ్, ఫిల్మ్ ఇండస్ట్రీలో విజయ కేతనం ఎగరేసేలా చేసింది.



తన కమ్యూనిటీలోని సాంస్కృతిక వేడుకలు, మారాఠీ నాటక రంగ ప్రభావం కళల పట్ల అమితలో ఆసక్తిని పెంచింది. 1980 దశకంలో అడ్వర్‌టైజింగ్ ఇండస్ట్రీలో పురుషాధిక్యత ఉన్న కాలంలో ఆమె తన కెరీర్‌ను మొదలు పెట్టింది. 'ఇది నువ్వు ఎంచుకోవాల్సిన రంగం కాదు' అంటూ కొద్దిమంది ఆమెను వెనక్కిలాగే ప్రయత్నం చేశారు. అయితే ఆమె ఉత్సాహంలో ఎలాంటి మార్పూ లేదు.

'ఎన్ని సమస్యలు ఎదురైనా ఎదుర్కొంటాను' అంటూ ముందుకు కదిలింది. నేర్చుకోవాలనే కుతూహలం ఆమె వేగంగా నడిచేలా చేసింది. ప్రారంభ రోజులు... కష్టపడడంలో ఉన్న ప్రాముఖ్యత గురించి చెప్పాయి.

'నేను ఎంచుకున్న ప్రయాణం అడుగడుగునా సవాలుతో కూడుకున్నదనే విషయం తెలిసినా రాజీ పడలేదు. సినిమా సెట్‌లో బ్యాగులు ప్యాకింగ్ చేయడం దగ్గర్నుంచి 35 ఎం.ఎం. సినిమా ఎడిటింగ్ మెళకువలను అర్థం చేసుకోవడం వరకు ఎన్నో నేర్చుకున్నాను' అంటుంది అమిత.

ఒగిల్వి, లియో బర్నెట్‌లాంటి అడ్వర్‌టైజింగ్ దిగ్గజ సంస్థలలో పనిచేయడం ఆమె అనుభవ జ్ఞానాన్ని విస్తృతం చేసింది. సినీ పరిశ్రమను అడ్వెర్‌టైజింగ్ ఏజెన్సీల కోణం నుంచి చూడడానికి ఆమెకు ఉపకరించాయి. క్యాంపెయిన్ బిల్డింగ్, క్లయింట్ సర్వీసింగ్, క్రియేటివ్, ప్రొడక్షన్ బృందాల మధ్య సమన్వయం.... ఇలా ఎన్నో విషయాలలో నైపుణ్యాన్ని సాధించింది.

ఈ అనుభవ, నైపుణ్యజ్ఞానంతో 'ఈక్వినాక్స్ ఫిలిమ్స్'లో కో–ఓనర్, నిర్మాతగా ప్రయాణం ప్రారంభించింది. మంచి పేరు తెచ్చుకుంది. కోవిడ్ మహమ్మారి సమయంలో వచ్చిన విరామంలో...'ఏం చేస్తున్నాం? ఏం చేయకూడదు' అనే కోణంలో ఆలోచించి సరికొత్త నిర్ణయాలు తీసుకుంది. అందులో ఒకటి... స్టోరీ టెల్లింగ్, డిజిటల్–ఫస్ట్ స్ట్రాటజీలను ఒకే వరుసలోకి తీసుకురావడం. భారీ బడ్జెట్‌తో కూడిన టెలివిజన్ వాణిజ్య ప్రకటనల నుంచి రీల్స్, డిజిటల్ ప్రకటనల ప్రస్తుత యుగం వరకు మన ప్రకటనల రంగంలో నాటకీయ మార్పులను అమిత ప్రత్యక్షంగా చూసింది.

'విజయపథంలో ప్రయాణించాలంటే కష్టపడి పనిచేయడానికి సిద్ధంగా ఉండాలి. మరింత నేర్చుకోవాలి అనే ఆసక్తి ఉండాలి. వర్తమానం గురించే కాదు భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని కూడా ఆలోచనలు చేయాలి. నేను ఎంచుకున్న పని నన్ను ఎక్కడికి తీసుకువెళుతుందో తెలియదు. అయితే ఎప్పుడూ కొత్త విషయాలు నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండేదాన్ని. మారుతున్న కాలానికి అనుగుణంగా నాలోని నైపుణ్యాలకు పదును పెట్టాను' అంటుంది అమిత మద్వాని.

ప్రేక్షకులు కనెక్ట్ అయ్యేలా...

మనం ఎంచుకున్న మార్గం కఠినం, సవాళ్లతో కూడుకున్నది అయినప్పటికీ... నేర్చుకోవాలి, తెలుసుకోవాలి అనే తపన ఉంటే విజయం సాధించవచ్చు. నేను అడ్వర్‌టైజింగ్, ఫిల్మ్ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టినప్పుడు ఏమీ తెలియదు. చాలా ఓపికగా నేర్చుకున్నాను. పది సెకన్ల డిజిటల్ స్పాట్ అయినా, మూడు గంటల ఫీచర్ ఫిల్మ్ అయినా ప్రేక్షకులు కనెక్ట్ అయ్యేలా చూడడమే ప్రధానం. సోషల్ మీడియా ఫ్రెండ్లీ ఫార్మట్‌లను ఏకీకృతం చేయడం ద్వారా, ప్రేక్షకులకు ఎండ్–టు–ఎండ్ పరిష్కారాలను అందించడం ద్వారా ఈక్వినాక్స్ ఫిల్మ్స్ ముందంజలో ఉంది. టీమ్ అంకితభావం మా విజయానికి కారణం.

– అమిత మద్వాని

ఫ్యాషన్

సంప్రదాయ రూపమైనా ఇండో వెస్ట్రన్ కాంబినేషన్ అయినా కాటన్‌తో డ్రెస్సింగ్ స్టైల్స్ ఏమీ ఉండవు అనుకునేవారికీ ప్రతి వేసవి కొత్త మోడల్స్‌ని పరిచయం చేస్తూనే ఉంది. ఉన్న మోడల్స్‌ని మరింత వినూత్నంగా కళ్లకు కడుతోంది. ఫ్యాషన్ వేదికలపైనా స్టైలిష్‌గా వెలిగిపోతోంది... ఇంటింటికీ వచ్చి కాటన్ షో చేస్తోంది.

ఇంటికి వచ్చిన.. కాటన్ షో







శరీరానికి పట్టిన చెమటను పీల్చుకొని, కంఫర్ట్‌గా ఉంచే కాటన్ ఫ్యాబ్రిక్‌ను స్టైలిష్ వేర్‌కు జతచేసేటప్పుడు ఆ మెటీరియల్ బరువు, నేత, రంగును కూడా చూడాలి.

సల్వార్ సూట్

రోజువారీ ధరించేదే కదా ఏముంది స్పెషల్... అనుకోవడానికి వీలు లేని కంఫర్ట్‌బుల్ డ్రెస్‌గా మన్ననలు అందుకుంది సల్వార్ సూట్. స్ట్రెయిట్ కట్, ఎ లైన్, ఫ్రాక్ స్టైల్, పలాజో, టులిప్, ధోతీ ప్యాంట్స్.. అంటూ సోషల్ మీడియా ట్రెండ్‌గా ఉన్న సల్వార్స్ కాటన్స్‌లో కంఫర్ట్‌గా లభిస్తున్నాయి.

బ్రైట్ వైట్

కాటన్ పాప్లిన్ క్లాత్ వేడి వాతావరణానికి అనువైనదిగా పేరొందింది. మస్లిన్, వాయిల్, సీర్ సకర్.. వంటివి ఈ కాలం తేలికగా అనిపించే మెటీరియల్. సాధారణంగా కాటన్స్‌లో వైట్, లైట్ షేడ్స్ మెటీరియల్ లభిస్తుంది. డల్‌గా ఉండే కలర్ ఫ్యాబ్రిక్ అంటూ పక్కన పెట్టేసే రోజులు కావివి. ఫ్లోరల్ మోటిఫ్స్, ప్యాచ్‌వర్క్, టై అండ్ డై తో షార్ట్ అండ్ లాంగ్ ఫ్రాక్స్, వెస్టర్న్‌స్టైల్‌లో ఆకట్టుకునే ట్యునిక్స్.. ఈ సమ్మర్‌లో వెలిగిపోనున్నాయి.

ఫెదర్ లైట్

జమదాని, ఫెదర్ లైట్ మల్‌మల్ కాటన్స్, చందేరీ, ఇక్కత్ కాటన్స్‌తో చేసే ప్రయోగాలు స్టైలిష్‌వేర్‌ని వినూత్నంగా చూపుతున్నాయి. ఎంపిక చేసుకునేటప్పుడు స్టైలిష్‌గానే కాదు మన్నిక ఎంత ఉన్నాయో చూసుకోవాలి.






- రెడీమేడ్ అయితే ఆ డ్రెస్‌పై ఉండే లేబుల్‌ను చెక్ చేయాలి. ఉతకడం, ఆరబెట్టడం వంటి సూచనలపై లేబుల్ తగిన సమాచారాన్ని ఇస్తుంది.
- కొన్ని రకాల కాటన్ డ్రెస్సులు నీళ్లలో పెట్టినప్పుడు రంగు పోతుంటాయి. ఒకదాని కలర్ మరో డ్రెస్‌కు పట్టే అవకాశం ఉంటుంది. ముదురు, లేత రంగులు, ఒకే రంగు కలవి విడివిడిగా ఉతకడం మేలు.
- నీళ్లలో పెట్టినప్పుడు కాటన్ ఫ్యాబ్రిక్ ష్రింక్ అవడం, స్టార్చ్ పోవడం జరుగుతుంది. శుభ్రపరచడానికి చల్లటి నీటిని ఉపయోగించడం, డ్రైయర్‌ను ఉపయోగించకుండా ఆరవేయడం వల్ల కాటన్ క్లాత్ ఎక్కువ కాలం మన్నికగా ఉంటుంది.

సిరీస్-39
12.4.2025
6 పీఎం నిజాం కాలేజి, హైదరాబాద్

యువ కవి సంగమం



● కవి యాకూబ్

కవిసంగమం ఆన్‌లైన్ కవిత్వవేదిక ఫిబ్రవరి తొమ్మిది, 2012లో మొదలైంది. చాలామంది సాహిత్యకారులు సొంతంగా బ్లాగ్‌లు సృష్టించుకున్నారు. ఆన్‌లైన్ మాగజైన్‌లు మొదలు అయ్యాయి. అయితే అవన్నీ చాలా కొద్దిమందికి మాత్రమే పరిమితం అయ్యాయి. అలాంటి సందర్భంలో కవిసంగమం ఒక ప్రయోగం. కొత్తతరం ఆలోచనలకు ఒక వేదిక. సోషల్ మీడియాలోకి అన్ని వర్గాలవాళ్ళూ చేరిపోయారు. ముఖ్యంగా యువతరం విరివిగా దాన్ని వాడుతున్నారు. అటువంటి స్థితిలో వాళ్ళ లోపలి సృజనాత్మకతను సరైన మార్గంలో పయనించేట్లు చూడ్డం అవసరం. ఆ దిశలోనే కవిసంగమం ఒక కవిత్వ వేదికగా వాళ్ళముందుకు వచ్చింది. తమలోపల దాగిన అనేక విషయాలను కవిత్వప్రక్రియలో రాసి పోస్ట్ చేసుకునే విధంగా కవిసంగమం దారులు వేసింది. కవిత్వమంటే ఏమిటో, ఎందుకో, రాయడం ఎలానో చెప్పేందుకు అనేక రకాల పద్ధతుల్ని పాటించింది. శీర్షికలు, మూడుతరాలు, ఊరూరా కవిసంగమాల వంటివి, పొయెట్రీ ఫెస్టివల్స్ వంటివి ఒకదగ్గరికి చేర్చడం కోసం, ఒకరినొకరు కలుసుకోవడం కోసం, అంతా ఒక్కటేనన్న భావన అందరిలో ప్రోది చేయడం కోసం ఈ కార్యక్రమాలు నిరంతరంగా చేస్తూ ఒక ప్రేమమయ, మానవీయ సంస్కృతిలోకి నడిపించడం కోసం కవిత్వాన్ని ఒక మాధ్యమంగా కవిసంగమం తీసుకుంది. పదిహేడు వేలమంది సోషల్ మీడియా కవిసంగమం వేదికలో ఉన్నారు. ఇప్పుడు 'రెండుతరాల కవిసంగమం' కార్యక్రమం ఐదేళ్ల విరామం తర్వాత హైదరాబాద్ నిజాం కాలేజి ఆవరణలో మొదలవబోతోంది. ఆరేళ్లపాటు మూడుతరాల కవిసంగమం కార్యక్రమాలు, రెండేళ్లపాటు ఊరూరా కవిసంగమం కార్యక్రమాల తర్వాత ఈ కొనసాగింపు. ఈ కొనసాగింపు కవిత్వం ఇంకా ఇంకా సమాజంలోకి చొచ్చుకుపోవడం కోసం. జయహో కవిత్వం!



నిత్య విద్యార్థిగా...

ఒకవైపు కవిత్వం రాస్తూ, కవితా సంకలనాలు ప్రచురించడం మాత్రమే కాక, ఈ వేదికలో ప్రతి మంగళవారం 'కవి చూపు' శీర్షిక రాసే అవకాశం వచ్చింది. దీని వల్ల అధ్యయనం పెరిగింది. నిత్య కవిత్వవిద్యార్థిగా సాగే అవకాశం వచ్చింది.

- పల్లిపట్టు నాగరాజు
కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత



ఎంతోమందిని పరిచయం చేసింది...

మహబూబ్‌నగర్ లోని చిన్న కవిసమాజాన్ని దాటి నాకు ఎంతోమంది కవులు, వారి కవిత్వాన్ని పరిచయం చేసింది కవిసంగమం. కవిసంగమం పరిచయం అవ్వకపోతే నేను చాలా పరిమితమైన సాహిత్యంలోనే ఉండేదాన్ని.

- శ్రీనిధి విప్లవశ్రీ



కవిత్వ ఓపెన్ యూనివర్శిటీ

'కవిసంగమం' పబ్లికేషన్స్ ద్వారా నా కవితా సంపుటి 'దండకడియం' రావడం ఎప్పటికీ మరిచి పోలేను. కవిత్వానికి సంబంధించిన అనేక పాఠాలు నేర్పిస్తున్న ఒక ఓపెన్ యూనివర్సిటి లాంటిది కవిసంగమం.

- తగుళ్ళ గోపాల్, కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత



పచ్చని చెట్టు

కవిత్వవేదిక కవిసంగమం నిజంగా ఒక పచ్చని చెట్టు. దాని మీద పక్షినై వాలటం నా అదృష్టం. మూడు తరాలను కలిపిన వారధి ఇది. నేను పుట్టిన ఆదివాసీ కోయ జీవితాన్ని, నేపథ్యాన్ని కవిత్వంలో రాసేందుకు ప్రోత్సహించింది.

- కల్యాణి కుంజ

● టెక్... టాక్



రేవ్ ఇమేజ్

● ఢిల్లీలో ఎలాన్ మస్క్: 'రేవ్ ఇమేజ్ సృష్టి'

కాలిఫోర్నియాకు చెందిన ఏఐ స్టార్టప్ 'రెవ్ ఏఐ ఇంక్' తన టెక్స్ట్ టు ఇమేజ్ జనరేషన్ మోడల్ 'రేవ్ ఇమేజ్ 1.0'ను లాంచ్ చేసింది. ప్రస్తుతం 1.0 జనరేషన్ 'ప్రివ్యూ.రేవ్.ఆర్ట్'లో ఉచిత ప్రివ్యూకు అందుబాటులో ఉంది. ఇది టెక్స్ట్ ప్రాంప్ట్‌లతో ఇమేజ్‌లను జనరేట్ చేయడానికి యూజర్‌లను అనుమతిస్తుంది. ఈ ఇమేజ్ మోడల్‌ను ఉపయోగించి తాము సృష్టించిన ఇమేజ్‌లను ఏఐ ఔత్సాహిక ఆర్టిస్ట్‌లు సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు.

Friends

ఫేస్‌బుక్ 'ఫ్రెండ్స్' ట్యాబ్

పోస్ట్‌లు, స్టోరీలు, పుట్టిన రోజులు, ఫ్రెండ్స్ రిక్వెస్ట్‌లు...చూపించడానికి రీడిజైన్ చేసిన 'ఫ్రెండ్స్' ట్యాబ్‌ను ఫేస్‌బుక్ పరిచయం చేసింది. ఇది ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోయింగ్, క్లోజ్‌ఫ్రెండ్స్ ఫీచర్‌ల మాదిరిగానే ఉంటుంది. రికమెండెడ్ పోస్ట్‌లను డిస్‌ప్లే చేయదు. రాబోయే నెలల్లో కంపెనీ విడుదల చేయాలనుకుంటున్న అనేక 'ఓజీ ఫీచర్‌'లలో 'ఫ్రెండ్స్' ఫీచర్ మొదటిది.

తన కళ్లే తనకు సహకరించవు. అడుగు దూరం దాటి ఏమీ చూపించవు. రెండో అడుగు నుంచి అంతా చిమ్మచీకటే. అయినా...ఏదో 'వెలుగు'ను చేరుకోవాలన్న తపన తనను నడిపిస్తోంది. 'నాకు చూపొక్కటే సమస్య అన్నా..' అని సింపుల్‌గా తన అంధత్వాన్ని కొట్టిపారేస్తాడు. 'సమస్య లేని మనిషి ఉంటడా..!' అంటూ తన సమస్యను లైట్‌గా తీసుకోమంటాడు మహేశ్.

మనసుతో చూస్తాడు!

మహేశ్‌కు కంటిచూపు లేదు. అందుకే ఆయన మనసుతో చూస్తున్నాడు. నిర్మల్ జిల్లా భైంసా మండలం వాలేగాం గ్రామానికి చెందిన పంచగుడి మహేశ్ తాను నెలకొల్పిన 'దివ్యాంగశక్తి ఫౌండేషన్' ద్వారా సమాజసేవ చేస్తున్నాడు. ఇటీవల దివ్యాంగులైన ఇద్దరు పిల్లలు ఉన్న ఓ వితంతువుకు రెండుగదుల ఇంటిని నిర్మించి ఇచ్చాడు.

● సేవాపథం

చూపున్న మనసు

మనసు లేని వాళ్లు చూపు ఉన్నప్పటికీ... సమాజాన్ని చూడలేరు. మనసు ఉన్న వాళ్లు చూపు లేకపోయినప్పటికీ సమాజాన్ని చూస్తారు. సమాజానికి తమ వంతుగా తోడ్పడతారు. అలాంటి ఒక యువకుడు పంచగుడి మహేశ్...

వాలేగాం టు నాందేడ్

వాలేగాం గ్రామానికి చెందిన పంచగుడి అనూషబాయి, లక్ష్మణ్ దంపతులకు మహేశ్, శ్రీకాంత్ కుమారులు, భాగ్యశ్రీ కుమార్తె. పెద్దకొడుకైన మహేశ్‌కు అడుగు దూరం వరకు అది కూడా ఒక కన్ను ఐదు శాతమే కనిపిస్తుంది. రెండో కుమారుడు శ్రీకాంత్‌కు ఐదేళ్ల వయసులో వచ్చిన అనారోగ్య సమస్యతో రెండు కళ్లూ దెబ్బతినడంతో పూర్తిగా అంధుడయ్యాడు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే అనూష-లక్ష్మణ్ దంపతులు తమ కొడుకులను బాగా చదివించాలనుకున్నారు. మహేశ్ మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకాలోని బొదిడి అంధుల పాఠశాలలో పదోతరగతి వరకు చదివాడు. ఇంటర్, బీకామ్ డిగ్రీ నాందేడ్ జిల్లాలోనే పూర్తిచేశాడు. నాందేడ్‌లో ఉన్నప్పుడే దివ్యాంగుల కోసం ఏర్పాటైన 'సక్షమ్' సంస్థలో చురుకుగా పనిచేశాడు. కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో తిరిగి స్వగ్రామానికి వచ్చేశాడు.



దివ్యాంగ శక్తి... తన వ్యాపారసంస్థ 'దివ్యాంగశక్తి' పేరిటనే 2021లో ఫౌండేషన్ ప్రారంభించాడు మహేశ్. సమాజానికి తన వంతుగా కొంత ఇవ్వాలి అనేది అతడి విధానం. తన ఫౌండేషన్ ద్వారా దివ్యాంగులు, అనాథలు, వృద్ధులకు సేవలు అందిస్తున్నాడు. మూడేళ్లుగా పది, ఇంటర్ పాసైన దివ్యాంగులకు సహకారం అందిస్తున్నాడు. వారి కోసం పరీక్షలు రాసిచ్చే వారిని సన్మానిస్తున్నాడు. సర్కారు బడి పిల్లలకు ఉచితంగా బ్యాగులు అందిస్తున్నాడు. ఇటీవల చుచుంద్ గ్రామంలో రూ.30వేలు ఖర్చు చేసి వాటర్ ప్యూరిఫయర్ ఏర్పాటు చేశాడు.



● దివ్యాంగశక్తి ఫౌండేషన్ నిర్మించి ఇచ్చిన ఇల్లు

దివ్యాంగశక్తి ఎంటర్‌ప్రైజెస్

నాందేడ్ నుంచి వచ్చిన మహేశ్ నిర్మల్ జిల్లాలో 'సక్షమ్' సంస్థ కార్యకలాపాలు ప్రారంభించాడు. మిత్రుల సూచన మేరకు బెంగళూరులో ఒకేషనల్ ట్రెనింగ్‌కు వెళ్లాడు. 2016లో తన ఇంట్లోనే ఫ్లోర్ క్లీనర్ తయారు చేశాడు. తెలిసిన వాళ్లకు విక్రయించాడు. మంచి స్పందన రావడంతో 2017లో 'దివ్యాంగశక్తి ఎంటర్‌ప్రైజెస్' పేరిట భైంసా మండలం మాటేగాం గ్రామంలో చిన్న యూనిట్ ఏర్పాటు చేసుకున్నాడు. ఇందుకు పీఎంఈజీపీ నుంచి రూ.15 లక్షల ఆర్థికసాయం అందడం తోడైంది. ఈ యూనిట్‌లో 'దివ్యాంగశక్తి' పేరిట ఫ్లోర్‌క్లీనర్ నుంచి గ్లాస్ క్లీనర్స్ వరకు ఎన్నో తయారు చేస్తున్నాడు. వీటితో పాటు బయోడిగ్రేడబుల్ కవర్స్ విక్రయిస్తున్నాడు. నిర్మల్ జిల్లాతో పాటు నిజామాబాద్, ఆదిలాబాద్, మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో తన ప్రాడక్ట్సను మార్కెటింగ్ చేస్తున్నాడు. ఈ యూనిట్ ద్వారా తాను ఉపాధి పొందడంతో పాటు మరో ఆరుగురికి ఉపాధి అందిస్తున్నాడు.

- రాసం శ్రీధర్, సాక్షి, నిర్మల్, ఫొటోలు: బాతూరి కైలాష్



● తల్లి, చెల్లితో మహేశ్

యంత్ర ● గేమింగ్

రాకాసితో ఫైట్ చేయగలరా?



అదిగో...అక్కడ... నిర్మానుష్యమైన బంజరు భూమిలో చైన్‌గన్‌తో సాయుధుడైన యంత్రుడు కనిపిస్తాడు. అతని ఎత్తు ఎనిమిది మీటర్లు. ఇలాంటి వింత యంత్రులు ఎంతోమంది 'స్టీల్ హంటర్స్' గేమ్‌లో కనిపిస్తారు. ఎన్నో యుద్ధ ట్యాంకులు కనిపిస్తాయి. ఇక గేమ్ ప్లే విషయానికి వస్తే...ఏడు విభిన్న పాత్రలలో (హంటర్స్) ఒకటిగా ఈ గేమ్ ఆడాలి. మొత్తం ఆరు జట్లు ఉంటాయి. ఆట లక్ష్యం మిగిలిన ఐదు జట్లను తుడిచిపెట్టడం. ఈ థర్డ్-పర్సన్ హీరో షూటర్ గేమ్‌లో ప్రతి హంటర్‌కు డిఫరెంట్ స్కిల్స్ ఉండాలి. తనదైన వ్యూహం ఉండాలి. లాంగ్ రేంజ్ నుంచి అప్ క్లోజ్ వరకు ఎన్నో ఫైట్లు ఉంటాయి.

డెవలపర్: వార్‌గేమింగ్ | ప్లాట్‌ఫామ్: మైక్రోసాఫ్ట్ విండోస్ | ఇంజిన్: అన్ రియల్ ఇంజిన్ 5 | జానర్స్: షూటర్ వీడియో గేమ్, ఎర్లీ యాక్సెస్, ఫ్రీ టు ప్లే

సాక్షి సినిమా



● పూరి జగన్నాథ్, టబు, ఛార్మి

పూరి సినిమాలో టబు

విజయ్ సేతుపతి హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా మూవీ రూపొందనున్న సంగతి తెలిసిందే. పూరి జగన్నాథ్, చార్మి కౌర్ ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ సినిమాలోని ఓ కీలక పాత్ర కోసం టబును సంప్రదించారు. ఈ సినిమా కథ, ఇందులోని ఆమె పాత్ర నచ్చడంతో టబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ విషయాన్ని గురువారం ప్రకటించారు మేకర్స్. ''ఈ సినిమా కోసం పూరి జగన్నాథ్ ఓ పవర్‌ఫుల్ స్టోరీ రాశారు. విజయ్ సేతుపతిని ఓ కొత్త గెటప్, కొత్త క్యారెక్టరైజేషన్‌లో చూపించనున్నారు. ఈ సినిమాలోని ఓ కీలక పాత్రలో టబు కనిపిస్తారు. ఆమె డైనమిక్‌గా కనిపిస్తారు. ఈ చిత్రంలో ఆమె పాత్ర కూడా అలా డైనమిక్‌గా ఉంటుంది.. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీతో సహా పలు భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

రామ... రామ...

చిరంజీవి హీరోగా నటించిన చిత్రం 'విశ్వంభర'. ఈ చిత్రంలో త్రిషా కృష్ణన్, ఆశికా రంగనాథ్ హీరోయిన్లుగా, కునాల్ కపూర్ ఓ లీడ్ రోల్‌లో నటించారు. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మించిన చిత్రం ఇది. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఈ సినిమాలోని భక్తి పాట 'రామ... రామ' లిరికల్ వీడియోను ఈ నెల 12న విడుదల చేయనున్నట్లు గురువారం వెల్లడించి పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఎమ్ఎమ్ కీరవాణి స్వరకల్పనలో ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. కాగా ఈ సినిమాలో ఆంజనేయస్వామి భక్తుడు దొరబాబు పాత్రలో చిరంజీవి నటించారని, కృష్ణా జిల్లాలోని నందిగామ దగ్గర ఉన్న భారీ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద ఈ 'రామ... రామ' పాటను రిలీజ్ చేయనున్నారని, సినిమాను జులై 24న విడుదల చేస్తారని సమాచారం. ఈ విషయాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది.



● చిరంజీవి

విలన్లతో ప్రేమ గీతం

సన్నీ అఖిల్, అజయ్ ఘోష్, రవి కాలే, గిడ్డేష్, 'శుభలేఖ' సుధాకర్, షాయాజీ షిండే, హిమజ, జయవాహిని, 'శంకరాభరణం' తులసి ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'పోలీస్ వారి హెచ్చరిక'. బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్థన్ నిర్మించారు. గజ్వేల్ వేణు సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి ఓ పాటని నటుడు రాజేంద్రప్రసాద్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''సాధారణంగా సినిమాల్లో హీరో-హీరోయిన్లు ప్రేమ గీతాలు పాడుకుంటారు. కానీ, ఈ సినిమాలో విలన్లు ప్రేమ గీతం పాడుకోవడం వైవిధ్యమైన ఆలోచన. ఈ చిత్రం విడుదలైన తర్వాత విలన్లకూ డ్యూయెట్‌లు పెట్టే ట్రెండ్ మొదలవుతుందని నా నమ్మకం'' అన్నారు. ''మా సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభవాన్నిస్తుంది'' అని బెల్లి జనార్థన్ చెప్పారు. ''మా చిత్రాన్ని త్వరలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం'' అని బాబ్జీ అన్నారు.



● బాబ్జీ



● రష్మికా మందన్నా

తిరిగొచ్చిన కాలం!

దేవన్ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న సూపర్ నేచురల్ లవ్‌స్టోరీ 'కృష్ణ లీల'. 'తిరిగొచ్చిన కాలం' అనేది ఈ సినిమా ఉపశీర్షిక. ఈ చిత్రంలో ధన్య బాలకృష్ణన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మహాసేన్ విజువల్స్ పతాకంపై జ్యోత్స్న. జి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్, మోషన్ పోస్టర్ లాంచ్ ఈవెంట్‌కు హీరో నిఖిల్, ఎల్వీ గంగాధర్ శాస్త్రి, ఛోటా కె.నాయుడు తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ వేడుకలో నిఖిల్ మాట్లాడుతూ– ''దేవన్ మంచి ప్యాషన్ ఉన్న యాక్టర్, డైరెక్టర్. 'హ్యాపీ డేస్'కి ముందు నేను కూడా ఒక మంచి అవకాశం కోసం తపన పడేవాడిని. దేవుడి దయతో నాకు 'హ్యాపీ డేస్' దొరికింది. ఆ దేవుడి దయతోనే దేవన్‌కు 'కృష్ణ లీల'తో పెద్ద హిట్ రావాలని కోరుకుంటున్నాను'' అని అన్నారు. ''ప్రతి ఒక్కరి జీవితానికి కనెక్ట్ చేసే పాయింట్స్ మా సినిమాలో ఉన్నాయి'' అన్నారు జ్యోత్స్న. ''దేవన్ చాలా అంకితభావంతో పని చేశారు. కృష్ణుడు మొదట ప్రేమికుడు. ఎవరైతే కరెక్ట్‌గా ప్రేమించగలరో అతనికి మించి యుద్ధం చేసే వ్యక్తి ఎవరూ ఉండరు. అందుకే ప్రేమ గురించైనా... యుద్ధం గురించైనా పేరు చెప్పాలంటే కృష్ణుని పేరే చెప్తాం. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది'' అన్నారు కథా రచయిత అనిల్ కుమార్. ఈ సినిమాకు సంగీతం: భీమ్స్.



● నిఖిల్, దేవన్

కాన్స్‌కు హోమ్ బౌండ్

● 78వ కాన్స్ చిత్రోత్సవాల్లో ఏకైక భారతీయ చిత్రం!



ఇండియన్ ఫిల్మ్ మేకర్ నీరజ్ ఘైవాన్ రెండో ఫీచర్ ఫిల్మ్ 'హోమ్ బౌండ్' కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎంపికైంది. 78వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ఈ ఏడాది మే 13 నుంచి 24 వరకు ఫ్రాన్స్‌లో జరగనుంది. ఈ చిత్రోత్సవాలకు సంబంధించిన వివరాలను గురువారం వెల్లడించారు నిర్వాహకులు. ఫ్రెంచ్ నటుడు లారెంట్ లాఫిట్టే ఈ ఏడాది కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభ, ముగింపు వేడుకలకు వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నారు. ఫ్రెంచ్ నటి జూలియట్ బినోచె జ్యూరీ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తారు. కాగా 'అన్ సర్టెన్ రిగార్డ్' విభాగంలో ఇండియన్ ఫిల్మ్ మేకర్ నీరజ్ ఘైవాన్ దర్శకత్వం వహించిన ఫీచర్ ఫిల్మ్ 'హోమ్ బౌండ్' పోటీలో నిలిచింది. 78వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎంపికైన ఏకైక భారతీయ చిత్రం 'హోమ్ బౌండ్' అని సమాచారం. అలాగే ఇప్పటివరకూ నీరజ్ దర్శకత్వం వహించినది రెండే సినిమాలైతే వాటిలో తొలి సినిమా 'మసాన్' కాన్స్‌కి ఎంపికైంది. రిచా చద్దా, విక్కీ కౌశల్, శ్వేతా త్రిపాఠి, సంజయ్ మిశ్రా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా 2015లో జరిగిన 68వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'అన్ సర్టెన్ రిగార్డ్' విభాగానికి నామినేట్ అయింది. ఇప్పుడు ఇదే విభాగానికి నీరజ్ రెండో చిత్రం 'హోమ్ బౌండ్' ఎంపిక కావడం విశేషం. ఈ సంగతి ఇలా ఉంచితే... నీరజ్ పుట్టి, పెరిగింది హైదరాబాద్‌లోనే. అయితే అతని తల్లిదండ్రులు మహారాష్ట్రకు చెందినవారు. కానీ హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఇక నీరజ్ చదువుకున్నదంతా హైదరాబాద్‌లోనే. ఇంజనీరింగ్ పూర్తి చేశాక రెండు ప్రముఖ సంస్థల్లో ఉద్యోగం చేశారాయన. సినిమాల మీద మక్కువతో జాబ్ మానేసి, సినీ విమర్శకుడిగా కథనాలు రాశారు. 'మసాన్'తో దర్శకుడిగా మారక ముందు దర్శకత్వ శాఖలో చేశారు. ఆ సమయంలోనే ఓ షార్ట్ ఫిల్మ్‌కి దర్శకత్వం వహించారు. ఇక కాన్స్ చిత్రోత్సవాలకు ఎంపికైన ఆయన 'హోమ్ బౌండ్'కి సంబంధించిన నటీనటులు, ఇతర వివరాలేవీ బయటపెట్టలేదు. బహుశా ఈ ఫెస్టివల్‌లో ప్రదర్శితమయ్యే సమయానికి లేదా ఆ తర్వాత ప్రకటిస్తారేమో. ఇక 'అన్ సర్టెన్ రిగార్డ్' విభాగంలో పోటీలో నిలిచిన దాదాపు పదిహేను చిత్రాల్లో 'హోమ్ బౌండ్' ఒకటి.

ఎంటర్‌టైన్ చేస్తాం... ప్రామిస్ - ప్రదీప్ మాచిరాజు

''ఈ సమ్మర్‌లో ఫ్యామిలీ అంతా కలిసి హాయిగా నవ్వుకునే సినిమా 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. మా కోసం రెండున్నర గంటలు కేటాయించండి. సూపర్‌గా ఎంటర్‌టైన్ చేస్తాం. ఇది నా ప్రామిస్'' అని హీరో ప్రదీప్ మాచిరాజు అన్నారు. ప్రదీప్ మాచిరాజు, దీపికా పిల్లి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. నితిన్-భరత్ దర్శకత్వంలో మాంక్స్ అండ్ మంకీస్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ప్రదీప్ మాట్లాడుతూ– ''ఈ సినిమాతో చాలామంది కొత్త వాళ్ల పరిచయం అవుతున్నారు. ఈ మూవీ రిలీజ్ తర్వాత వారందరి పేర్లు గట్టిగా వినిపిస్తాయి. రిలీజ్‌కు ముందే మా సినిమా ఓటీటీ, శాటిలైట్ బిజినెస్ పూర్తి కావడం సంతోషంగా ఉంది'' అని అన్నారు. ''ఇందులోని పాటలన్నీ ఒక్కొక్కటి ఒక్కొక్క జానర్‌లో ఉంటాయి. 60 ఇయర్స్ ఓల్డ్ వాయిస్‌తో ఓ పాటను చేయడం జరిగింది. ఆ పాటని మా మామగారు పాడారు'' అన్నారు మ్యూజిక్ డైరెక్టర్ రథన్.



● ప్రదీప్, దీపిక

ఇక చంద్రుడే కనిపిస్తాడు!

నేషనల్ క్రష్ అని రష్మికా మందన్నాను అభిమానులు ఎంతో అభిమానంగా పిలుచుకుంటారు. ఈ బ్యూటీ ఇన్‌స్టా స్టోరీస్, ఇన్‌స్టా పోస్ట్‌లు ఫాలో అయ్యేవారికి మరో రెండు రోజుల పాటు ఈ పోస్ట్‌లలో ఎక్కువగా చంద్రుడే కనిపిస్తాడు. లేకపోతే... రాత్రివేళ వెలుగులు జిమ్మే కెమేరా లైట్స్ లేదా కనిపించని నక్షత్రాలు మాత్రమే ఉంటాయి. ఈ విషయాన్ని రష్మికా మందన్నాయే చెప్పారు. ఇంతకీ విషయం ఏంటంటే... ఆయుష్మాన్ ఖురానా, రష్మికా మందన్నా లీడ్ రోల్స్‌లో హిందీలో 'థామా' అనే హారర్ మూవీ రూపొందుతోంది. ఈ సినిమాకు ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా నైట్ షూట్ జరుగుతోంది. మరో రెండు రోజుల పాటు ఈ నైట్ షూట్ కొనసాగుతోంది. అందుకే తన ఇన్‌స్టా స్టోరీస్, పోస్ట్‌లలో 'చందమామ లేదా కెమేరా లైట్స్ లేదా కనిపించని నక్షత్రాలు మాత్రమే'(ప్రస్తుతం మేం ఉన్న సిటీలో ఇవి కనిపించడం అసాధ్యం) తన ఇన్‌స్టాలో షేర్ చేస్తానన్నట్లుగా రష్మిక పోస్ట్ చేశారు. కాగా ఈ సినిమాలో ఆమె పాత్ర వినూత్నంగా ఉంటుందని, యాక్షన్ సీక్వెన్స్‌లు కూడా ఉంటాయని టాక్. ఇక ఈ చిత్రం ఈ ఏడాది దీపావళి సందర్భంగా రిలీజ్ కానుంది.

సాక్షి బిజినెస్
శుక్రవారం
11-4-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (బుధవారం ముగింపు)

సెన్సెక్స్ ▽	380	73,847
నిఫ్టీ ▽	137	22,399

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

నాస్‌డాక్	16,292	▽	833
డోజోన్స్	39,184	▽	1,424
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,913	△	234
డాక్స్	20,563	△	892
షాంఘై	3,224	△	37
నికాయ్	34,609	△	2,895

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		84.05	87.68
£	బ్రిటన్ పౌండ్		107.73	112.68
€	యూరో		91.93	96.50
¥	జపాన్ ఎన్ (100)		47.00	69.00
AU$	ఆస్ట్రేలియా డాలర్		49.69	54.63
S$	సింగపూర్ డాలర్		61.39	66.12
SAR	సౌదీ రియాల్		21.99	23.55
UAE D	యూఏఈ దిర్హామ్		22.48	24.26
¥	చైనా యువాన్		10.87	12.69

టారిఫ్ ‘రిలీఫ్’ ర్యాలీ..!

- ట్రంప్ సుంకాలకు 90 రోజుల విరామం
- బలంగా పుంజుకున్న అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు
- నేడు భారత మార్కెట్ గ్యాప్‌అప్ ప్రారంభానికి ఛాన్స్

న్యూఢిల్లీ: చైనా మినహా మిగతా దేశాలపై ప్రతీకార సుంకాలు 90 రోజుల పాటు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు బలంగా పుంజుకున్నాయి. బుధవారం రాత్రి అమెరికా నాస్‌డాక్ ఇండెక్స్ 12.16%, ఎస్అండ్‌పీ సూచీ 9.52%, డోజోన్స్ ఇండెక్స్ 8% లాభపడ్డాయి. యూఎస్ నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న ఆసియా, యూరప్ మార్కెట్లు గురువారం రాణించాయి. జపాన్ నికాయ్ 9%, దక్షిణ కొరియా కోస్పీ 7%, సింగపూర్ స్ట్రెయిట్ టైమ్స్ 5%, హాంగ్‌కాంగ్ హాంగ్ సెంగ్ 2%, చైనా షాంఘై ఒకశాతం పెరిగాయి. యూరప్‌లో జర్మనీ డాక్స్ 5%, ఫ్రాన్స్ సీఏసీ 5%, బ్రిటన్ ఎఫ్‌టీఎస్‌ఈ నాలుగు శాతం పెరిగాయి. కాగా బుధవారం భారీగా ర్యాలీ చేసిన అమెరికా మార్కెట్‌లో గురువారం లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. దీంతో అమెరికా మార్కెట్లు మళ్లీ భారీగా పడ్డాయి. నాస్‌డాక్ 5% క్షీణించి 16,292 వద్ద, డోజోన్స్ 3% పడి 39,184 వద్ద, ఎస్అండ్‌పీ 4% నష్టంతో 5,243 వద్ద ట్రేడవుతోంది.

భారత మార్కెట్ భారీ గ్యాప్‌అప్..?

అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న సానుకూలతల కారణంగా శుక్రవారం దేశీయ మార్కెట్ భారీ గ్యాప్‌అప్‌తో ప్రారంభం కావచ్చని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నాయి. ఇందుకు సంకేతంగా దలాల్ స్ట్రీట్‌ను ప్రతిబింబించే గిఫ్ట్ నిఫ్టీ 3% (680 పాయింట్లు) పెరిగింది. శ్రీ మహావీర్ జయంతి సందర్భంగా భారత మార్కెట్ గురువారం పనిచేయలేదు. భారత్‌తో సహా 60 దేశాల నుంచి అమెరికా దిగుమతి చేసుకునే వస్తువులపై ఏప్రిల్ 2 నుంచి ట్రంప్ భారీగా పన్నులు వడ్డించారు. దీంతో అంతర్జాతీయంగా ప్రపంచ వాణిజ్య యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి. నాటి (ఏప్రిల్ 2)నుంచి సెన్సెక్స్ 2,770 పాయింట్లు(3.61%), నిఫ్టీ 933 పాయింట్లు(4%) క్షీణించాయి. ఇన్వెస్టర్ల సంపద రూ.19.15 లక్షల కోట్లు తుడిచిపెట్టుకుపోయి రూ.393.82 లక్షల కోట్లకు దిగివచ్చింది.



మన మార్కెట్‌లోనూ దూకుడు...!

నిఫ్టీ సుమారు 700 పాయింట్లు లాభంతో ట్రేడింగ్ ప్రారంభించవచ్చు. షార్ట్ కవరింగ్‌తో మార్కెట్ భారీగా పెరిగే అవకాశం ఉంది. విస్తృత స్థాయిలో కొనుగోళ్ల పర్వం కొనసాగొచ్చు. ఐటీ షేర్లు బౌన్స్‌బ్యాక్ అయ్యే వీలుంది. ఫార్మా షేర్లు డిమాండ్ లభించవచ్చు. లార్జ్ క్యాప్ బ్యాంకులు, ఫైనాన్షియల్స్ షేర్లు ర్యాలీ చేయొచ్చు. అమెరికా–చైనా ట్రేడ్ వార్ ముదరడంతో విదేశీ ఇన్వెస్టర్లు త్వరలో భారత ఈక్విటీల కొనుగోళ్లకు ఆసక్తి చూపొచ్చు.

– వీకే విజయ్‌కుమార్, జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ చీఫ్ స్ట్రాటజిస్ట్



పసిడి జిగేల్

అమెరికా చైనాల మధ్య వాణిజ్య యుద్ధం తీవ్ర స్థాయికి చేరుకోవడంతో రక్షణాత్మక పెట్టుబడి సాధనం బంగారానికి భారీ డిమాండ్ నెలకొంది. కామెక్స్ మార్కెట్లో ఔన్స్ బంగారం 100 డాలర్లు (3.5%) పైగా పెరిగి 3,180 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలో దూకుడు కారణంగా దేశీయంగా నేడు స్పాట్ మార్కెట్లో పసిడి పరుగులు పెట్టే వీలుందని బులియన్ మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. ఎంసీఎక్స్‌లో చురుగ్గా ట్రేడవుతున్న కాంట్రాక్ట్ ధర గురువారం రాత్రి రూ. 2,356 ఎగసి రూ.92,160 వద్ద కదలాడుతోంది.



టీసీఎస్ బోణీ.. ఫ్లాట్!

- క్యూ4లో నికర లాభం రూ. 12,224 కోట్లు
- 42,000 మంది ట్రెయినీలకు ఉపాధి
- షేరుకి రూ. 30 తుది డివిడెండ్

ముంబై: ఐటీ సేవల దేశీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 1.7 శాతం నీరసించి రూ. 12,224 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో రూ. 12,434 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం 5%పైగా వృద్ధితో రూ. 64,479 కోట్లను తాకింది. వాటాదారులకు షేరుకి రూ. 30 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది.

పూర్తి ఏడాదికి...

పూర్తి ఏడాది (2024–25)కి టీసీఎస్ నికర లాభం 5.8 శాతం ఎగసి రూ. 48,553 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం 6% పెరిగి రూ. 2,55,324 కోట్లను తాకింది. వార్షికంగా 30 బిలియన్ డాలర్ల ఆదాయం అందుకోవడంతోపాటు వరుసగా రెండో క్వార్టర్‌లోనూ పటిష్ట ఆర్డర్ బుక్‌ను సాధించినట్లు కంపెనీ సీఈవో కె.కృతివాసన్ పేర్కొన్నారు. 2024–25లో ప్రణాళికలకు అనుగుణంగా 42,000మంది ట్రెయినీలకు ఉపాధి కల్పించినట్లు హెచ్‌ఆర్ చీఫ్ మిలింద్ లక్కడ్ వెల్లడించారు. కాగా.. కంపెనీ బోర్డు 2025 మే1 నుంచి ఆర్తి సుబ్రమణ్యన్‌కు సీవోవో, ప్రెసిడెంట్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఐదేళ్లపాటు బాధ్యతలు అప్పగించింది. చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్‌గా మంగేష్ సాథేను నియమించింది.



ఇతర విశేషాలు...

- క్యూ4లో నికరంగా 625 మందికి ఉద్యోగాలు కల్పించింది. మార్చి31 నాటికి మొత్తం సిబ్బంది సంఖ్య 6,07,979కు చేరింది.
- క్యూ4లో 12.2 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులను కుదుర్చుకుంది.

2026 ఓకే, కానీ..

ఆదాయరీత్యా గతేడాదితో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) మెరుగైన పనితీరు చూపే వీలుంది. అయితే విచక్షణా వ్యయ నిర్ణయాలు ఆలస్యమవుతున్నాయి. కొన్ని ప్రాజెక్టులలో కోతలు కనిపిస్తున్నప్పటికీ, ప్రధాన ప్రాజెక్టులలో ఎలాంటి సవాళ్లు ఎదురు కావడం లేదు. ఇందుకు టారిఫ్ ఆందోళనలు కారణమవుతున్నాయి.

– కృతివాసన్, టీసీఎస్ సీఈవో



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
11-4-2025	
విశాఖ	435–00
చిత్తూరు	460–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	415–00
విజయవాడ	420–00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	390–00
వరంగల్	392–00
రిటైల్ ధర	4.50

రుణ రేట్లను తగ్గించిన బీవోబీ

న్యూఢిల్లీ: ఆర్‌బీఐ రెపో రేటును పావు శాతం (25 బేసిస్ పాయింట్లు) తగ్గించగా, దీన్ని తన కస్టమర్లకు బదిలీ చేస్తున్నట్టు ప్రభుత్వరంగ బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) ప్రకటించింది. ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ అనుసంధానిత రిటైల్, ఎంఎస్ఎంఈ రుణ రేట్లను 0.25 శాతం తగ్గించినట్టు తెలిపింది. అదే సమయంలో మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధారిత రుణ రేటు (ఎంసీఎల్‌ఆర్)ను బీవోబీ ఎలాంటి మార్పు చేయకపోవడం గమనార్హం. ఆటో, వ్యక్తిగత రుణాలు సహా అధిక శాతం రుణాలకు ప్రామాణికమైన ఏడాది కాల ఎంసీఎల్‌ఆర్ రేటును మార్చకుండా 9 శాతం వద్దే కొనసాగించింది.



మిల్లెట్స్ ఉత్పత్తుల్లోకి తెనాలి డబుల్ హార్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ తాజాగా తృణధాన్యాల ఉత్పత్తుల విభాగంలోకి ప్రవేశించింది. మిల్లెట్ మార్వెల్స్ పేరిట రూపొందించిన ఉత్పత్తులను అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జేఎండీ సంగీత రెడ్డి చేతుల మీదుగా మార్కెట్లోకి విడుదల చేసింది. వీటి ధర రూ. 95–120 వరకు ఉంటుంది. తెలుగు రాష్ట్రాల తర్వాత దేశవ్యాప్తంగా, అమెరికా తదితర దేశాల్లో వీటిని అందుబాటులోకి తేనున్నట్లు సంస్థ సీఎండీ మునగాల మోహన్ శ్యామ్ ప్రసాద్ ఈ సందర్భంగా తెలిపారు. రాబోయే మూడేళ్లలో గ్రూప్ ఆదాయంలో 5% ఈ విభాగం నుంచి సమకూర్చుకోనున్నట్లు చెప్పారు. 2024–25లో కంపెనీ ఆదాయం రూ. 535 కోట్లుగా ఉండగా ఈసారి 15% వరకు వృద్ధి అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఆఖరు నాటికి రెండు తెలుగు రాష్ట్రాల్లో 50 స్టోర్స్ ప్రారంభించనున్నట్లు ప్రసాద్ వివరించారు. రాబోయే రెండేళ్లలో వ్యాపార విస్తరణపై రూ.10–25 కోట్లు వెచ్చించనున్నట్లు చెప్పారు.



సాక్షి స్పోర్ట్స్



క్వార్టర్ ఫైనల్లో అర్జున్ ఓటమి

ఫ్రీస్టయిల్ చెస్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్, తెలంగాణ ప్లేయర్ ఇరిగేశి అర్జున్ పోరాటం ముగిసింది. పారిస్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో ప్రపంచ నాలుగో ర్యాంకర్ అర్జున్ క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగాడు. ప్రపంచ రెండో ర్యాంకర్ హికారు నకముర (అమెరికా)తో గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్ రెండో గేమ్‌లో అర్జున్ 62 ఎత్తుల్లో ఓడిపోయాడు. బుధవారం వీరిద్దరి మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్ తొలి గేమ్ 77 ఎత్తుల్లో ‘డ్రా’గా ముగిసింది. ఓవరాల్‌గా నకముర 1.5-0.5తో అర్జున్‌పై గెలిచి సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. ప్రపంచ నంబర్‌వన్, నార్వే దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్, ఫాబియానో కరువానా (అమెరికా) కూడా సెమీఫైనల్లోకి అడుగు పెట్టారు. 12 మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య జరుగుతున్న ఈ టోర్నీలో రౌండ్ రాబిన్ దశ ముగిశాక భారత్ నుంచి అర్జున్ మాత్రమే క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు. క్లాసిక్ ఫార్మాట్‌లో ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద, విదిత్ లీగ్ దశకే పరిమితమయ్యారు.

ఒలింపిక్స్‌లో ఆరు క్రికెట్ జట్లు

- టి20 ఫార్మాట్‌లో మ్యాచ్‌ల నిర్వహణ
- ఐఓసీ ప్రకటన



న్యూఢిల్లీ: లాస్ ఏంజెలిస్ వేదికగా 2028లో జరిగే ఒలింపిక్స్‌లో క్రికెట్ క్రీడాంశంపై మరింత స్పష్టత వచ్చింది. ఈ మెగా ఈవెంట్‌లో పురుషుల విభాగంలో ఆరు, మహిళల విభాగంలో ఆరు దేశాలకు చెందిన క్రికెట్ జట్లు బరిలోకి దిగుతాయని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ప్రకటించింది. టీమ్‌లో 15 మంది చొప్పున ఒక్కో విభాగంలో 90 మంది ఆటగాళ్లకు అవకాశం కల్పిస్తున్నారు. 1900లో జరిగిన పారిస్ ఒలింపిక్స్ తర్వాత 128 ఏళ్లకు మళ్లీ ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు అవకాశం దక్కింది. మ్యాచ్‌లన్నీ టి20 ఫార్మాట్‌లోనే జరగనున్నాయి. అయితే ఏ ఆరు జట్లు పాల్గొంటాయనే విషయంపై మాత్రం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)లో పూర్తి స్థాయి సభ్యదేశం కాకపోయినా... ఆతిథ్య జట్టుగా అమెరికాకు క్రికెట్ పోరులో అవకాశం దక్కడం ఖాయం. అంటే మరో ఐదు జట్లు మాత్రమే ఒలింపిక్స్‌కు అర్హత సాధించవచ్చు. ఏదైనా కటాఫ్ తేదీని నిర్ణయించి ఆ సమయంలో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్–5లో ఉన్న జట్లను ఒలింపిక్స్ కోసం ఎంపిక చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మరోవైపు వెస్టిండీస్ టీమ్ అర్హత సాధిస్తే ఏ దేశం బరిలోకి దిగుతుందనేది ఆసక్తికరం. క్రికెట్‌లో వెస్టిండీస్ పేరుతో కరీబియన్ ద్వీపంలోని వేర్వేరు దేశాలు కలిసి ఆడుతున్నాయి. సాధారణంగా ఒలింపిక్స్‌లో మాత్రం ఈ దేశాలన్నీ విడిగా పోటీ పడతాయి. 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ క్రీడల్లో మహిళల క్రికెట్ పోటీలు నిర్వహించినప్పుడు బార్బడోస్ టీమ్ ప్రాతినిధ్యం వహించింది. విండీస్ రీజియన్ పోటీల్లో విజేతగా నిలవడంతో ఆ జట్టుకు అవకాశం లభించింది.



మొత్తం 351 మెడల్ ఈవెంట్లు...

లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌తో పాటు మరో నాలుగు కొత్త క్రీడాంశాలకు చోటు లభించింది. బేస్‌బాల్/సాఫ్ట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, స్క్వాష్, లాక్రోస్‌లను కొత్తగా చేర్చారు. పారిస్ ఒలింపిక్స్‌లో మొత్తం 329 మెడల్ ఈవెంట్లు ఉండగా... ఇప్పుడు మరో 22 జత కలవడంతో ఈ సంఖ్య 351కి చేరింది. స్విమ్మింగ్‌లో గరిష్టంగా 41 పతకాలు అందుబాటులో ఉన్నాయి. ఒలింపిక్స్ చరిత్రలో తొలిసారి పురుష అథ్లెట్ల సంఖ్య (5,167)తో పోలిస్తే ఎక్కువ సంఖ్యలో మహిళా అథ్లెట్లు (5,333) బరిలోకి దిగనున్నారు. ఫుట్‌బాల్‌లో 12 పురుష జట్లు ఉంటే 16 మహిళా టీమ్‌లు ఉంటాయి. గోల్ఫ్, జిమ్నాస్టిక్స్, టేబుల్ టెన్నిస్, కాంపౌండ్ ఆర్చరీలలో తొలిసారి మిక్స్‌డ్ టీమ్‌లు ఉండబోతున్నాయి. అథ్లెటిక్స్‌లో కూడా మొదటిసారి 4x100 మిక్స్‌డ్ రిలే ఈవెంట్‌ను చేర్చారు. ఓవరాల్‌గా అథ్లెట్ల సంఖ్య మాత్రం ఎప్పటిలాగే 10,500 ఉండనుంది.

పసిడి పతక పోరుకు ధీరజ్ బృందం

ఫ్లోరిడా (అమెరికా): ప్రపంచకప్ స్టేజ్–1 ఆర్చరీ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ బొమ్మదేవర ధీరజ్‌తో కూడిన భారత జట్టు పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించింది. గురువారం జరిగిన పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్ సెమీఫైనల్లో ధీరజ్, తరుణ్‌దీప్ రాయ్, అతాను దాస్‌లతో కూడిన భారత జట్టు 6–2 (54–54, 55–54, 56–56, 56–53) సెట్ పాయింట్ల తేడాతో పాబ్లో అచా, ఆండ్రెస్ టెమినో, జేవియర్ మెరీడాలతో కూడిన స్పెయిన్ జట్టును ఓడించింది. ఆదివారం జరిగే ఫైనల్లో చైనా జట్టుతో భారత్ తలపడుతుంది. అంతకుముందు తొలి రౌండ్‌లో భారత్ 6–2 సెట్ పాయింట్ల తేడాతో బ్రెజిల్ జట్టుపై, క్వార్టర్ ఫైనల్లో 6–2 సెట్ పాయింట్ల తేడాతోనే ఇండోనేసియా జట్టుపై గెలిచింది. మరోవైపు దీపిక కుమారి, అంకిత, అన్షికలతో కూడిన భారత మహిళల రికర్వ్ జట్టు క్వార్టర్ ఫైనల్లో 2–6 సెట్ పాయింట్ల తేడాతో అమెరికా జట్టు చేతిలో ఓడిపోయింది.



తరుణ్‌దీప్ రాయ్, ధీరజ్, అతాను దాస్

రాహుల్ గెలిపించాడు

ఢిల్లీకి వరుసగా నాలుగో విజయం

- 6 వికెట్లతో బెంగళూరు చిత్తు
- రాహుల్ 93 నాటౌట్

బెంగళూరు: ఐపీఎల్ 18వ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు అజేయ ప్రదర్శన కొనసాగుతోంది. ఓటమి లేకుండా సాగుతున్న జట్టు వరుసగా నాలుగో విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. గురువారం జరిగిన పోరులో ఢిల్లీ 6 వికెట్లతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టును ఓడించింది. సొంత మైదానంలో ఆడిన రెండో మ్యాచ్‌లోనూ ఆర్‌సీబీకి పరాజయం ఎదురుకాగా... తన సొంత నగరంలో మ్యాచ్‌ను గెలిపించిన అనంతరం ‘ఇది నా అడ్డా’ అన్నట్లుగా రాహుల్ విజయనాదం చేయడం విశేషం. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. టిమ్ డేవిడ్ (20 బంతుల్లో 37 నాటౌట్; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), ఫిల్ సాల్ట్ (17 బంతుల్లో 37; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు. అనంతరం ఢిల్లీ 17.5 ఓవర్లలో 4 వికెట్లకు 169 పరుగులు చేసింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ కేఎల్ రాహుల్ (53 బంతుల్లో 93 నాటౌట్; 7 ఫోర్లు, 6 సిక్స్‌లు) చెలరేగిపోగా, ట్రిస్టన్ స్టబ్స్ (23 బంతుల్లో 38 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) అండగా నిలిచాడు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 55 బంతుల్లో అభేద్యంగా 111 పరుగులు జోడించారు.

ఒకే ఓవర్లో 30 పరుగులు...

ఇన్నింగ్స్‌లో తొలి 22 బంతులు ఆర్‌సీబీ విధ్వంసంతో 61 పరుగులు... చివరి 12 బంతుల్లో అదే తరహా దూకుడుతో 36 పరుగులు... మధ్యలో మిగిలిన 86 బంతుల్లో ఢిల్లీ బౌలర్ల ఆధిపత్యం... పేలవ బ్యాటింగ్‌తో బెంగళూరు చేసిన పరుగులు 66 మాత్రమే... జట్టు ఇన్నింగ్స్ ఇలా భిన్న పార్శ్వాలలో సాగింది. తొలి ఓవర్లో స్టార్క్ 7 పరుగులే ఇవ్వగా, అక్షర్ వేసిన రెండో ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 16 పరుగులు వచ్చాయి. అయితే అసలు విధ్వంసం మూడో ఓవర్లో సాగింది. స్టార్క్ బౌలింగ్‌లో సాల్ట్ ఊచకోత కోశాడు. అతను 2 సిక్స్‌లు, 3 ఫోర్లు బాదగా, ఎక్స్‌ట్రాల రూపంలో మరో 6 పరుగులు వచ్చాయి. సాల్ట్ వరుసగా 6, 4, 4, 4 (నోబాల్), 6తో చెలరేగిపోయాడు. అయితే తర్వాతి ఓవర్లో ఆట ఒక్కసారిగా మలుపు తిరిగింది. అనవసరపు సింగిల్‌కు ప్రయత్నించి వెనక్కి రాలేక సాల్ట్ రనౌటయ్యాడు. ఆ తర్వాత బెంగళూరు వరుసగా వికెట్లు కోల్పోవడంతో పాటు పరుగులు రావడం గగనంగా మారింది. అయితే అక్షర్ వేసిన 19వ ఓవర్లో డేవిడ్ 2 సిక్స్‌లు, ఫోర్ బాదడంతో 17 పరుగులు రాగా, ముకేశ్ వేసిన చివరి ఓవర్లోనూ అతను 2 సిక్స్‌లు, ఫోర్ కొట్టడంతో 19 పరుగులు వచ్చాయి.



రాహుల్

కీలక భాగస్వామ్యం...

ఛేదనలో ఢిల్లీ ఆరంభంలో తడబడింది. డుప్లెసిస్ (2), ఫ్రేజర్ (7), పొరేల్ (7) విఫలం కాగా, అక్షర్ (15) కూడా ఎక్కువ సేపు నిలవలేదు. ఈ సమయంలో చక్కటి బౌలింగ్‌తో ఆర్‌సీబీ పైచేయి సాధించినట్లు కనిపించింది. అయితే రాహుల్, స్టబ్స్ భాగస్వామ్యంలో జట్టు గెలుపు దిశగా దూసుకుపోయింది. పిచ్ ఇబ్బందికరంగా ఉండటంతో నిలదొక్కుకునేందుకు కొంత సమయం తీసుకున్నా... ఆ తర్వాత వీరిద్దరు దూకుడు ప్రదర్శించారు. చివర్లో 6 ఓవర్లలో 65 పరుగులు అవసరం కాగా...రాహుల్, స్టబ్స్ కలిసి 7 ఫోర్లు 4 సిక్సర్లతో మ్యాచ్‌ను ముగించారు. హాజల్‌వుడ్ ఓవర్లో రాహుల్ 3 ఫోర్లు, సిక్స్‌తో 22 పరుగులు రాబట్టడం మ్యాచ్‌ను ఢిల్లీ వైపు తిప్పింది.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: సాల్ట్ (రనౌట్) 37; కోహ్లి (సి) స్టార్క్ (బి) నిగమ్ 22; పడిక్కల్ (సి) అక్షర్ (బి) ముకేశ్ 1; పాటీదార్ (సి) రాహుల్ (బి) కుల్దీప్ 25; లివింగ్‌స్టోన్ (సి) అశుతోష్ (బి) మోహిత్ 4; జితేశ్ (సి) రాహుల్ (బి) కుల్దీప్ 3; కృనాల్ (సి) అశుతోష్ (బి) నిగమ్ 18; డేవిడ్ (నాటౌట్) 37; భువనేశ్వర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 15; మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 163. వికెట్ల పతనం: 1-61, 2-64, 3-74, 4-91, 5-102, 6-117, 7-125. బౌలింగ్: స్టార్క్ 3-0-35-0, అక్షర్ 4-0-52-0, నిగమ్ 4-0-18-2, ముకేశ్ 3-1-26-1, కుల్దీప్ 4-0-17-2, మోహిత్ 2-0-10-1.

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: డుప్లెసిస్ (సి) పాటీదార్ (బి) దయాళ్ 2; ఫ్రేజర్ (సి) జితేశ్ (బి) భువనేశ్వర్ 7; పొరేల్ (సి) జితేశ్ (బి) భువనేశ్వర్ 7; రాహుల్ (నాటౌట్) 93; అక్షర్ (సి) డేవిడ్ (బి) సుయాశ్ 15; స్టబ్స్ (నాటౌట్) 38; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (17.5 ఓవర్లలో 4 వికెట్లకు) 169. వికెట్ల పతనం: 1-9, 2-10, 3-30, 4-58. బౌలింగ్: భువనేశ్వర్ 4-0-26-2, దయాళ్ 3.5-0-45-1, హాజల్‌వుడ్ 3-0-40-0, సుయాశ్ 4-0-25-1, కృనాల్ 2-0-19-0, లివింగ్‌స్టోన్ 1-0-14-0.

ఐపీఎల్-2025 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
గుజరాత్	5	4	1	8	1.413
ఢిల్లీ	4	4	0	8	1.278
బెంగళూరు	5	3	2	6	0.539
పంజాబ్	4	3	1	6	0.289
లక్నో	5	3	2	6	0.078
కోల్‌కతా	5	2	3	4	-0.056
రాజస్తాన్	5	2	3	4	-0.733
ముంబై	5	1	4	2	-0.010
చెన్నై	5	1	4	2	-0.889
హైదరాబాద్	5	1	4	2	-1.629

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

చెన్నై X కోల్‌కతా
వేదిక: చెన్నై
రాత్రి 7: 30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

కెప్టెన్ ధోని

- మరోసారి చెన్నై జట్టు సారథ్య బాధ్యతలు
- గాయంతో టోర్నీకి దూరమైన రెగ్యులర్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్





చెన్నై: ఐపీఎల్‌లో మరోసారి మహేంద్ర సింగ్ ధోని కెప్టెన్‌గా కనిపించనున్నాడు. చెన్నై సూపర్ కింగ్స్ సారథి రుతురాజ్ గైక్వాడ్ గాయం కారణంగా టోర్నీలో మిగిలిన మ్యాచ్‌లకు దూరం కావడంతో ఈ మార్పు అనివార్యమైంది. గత నెల 30న గువాహటిలో రాజస్తాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్ చేస్తుండగా రుతురాజ్ మోచేతికి గాయమైంది. అయితే దానికి చికిత్స కొనసాగిస్తూ అతను మరో రెండు మ్యాచ్‌లు ఆడాడు. నొప్పి తీవ్రం కావడంతో పరీక్షలు చేయగా మోచేతికి ఫ్రాక్చర్ అయినట్లు తేలింది. దాంతో ‘అన్‌క్యాప్డ్’ ప్లేయర్ ఎమ్మెస్ ధోని కెప్టెన్‌గా బాధ్యతలు తీసుకుంటున్నాడు. ఇప్పటి వరకు ఆడిన ఐదు మ్యాచ్‌లలో ఓడిన చెన్నై ప్రస్తుతం 9వ స్థానంలో కొనసాగుతోంది. రుతురాజ్ 5 మ్యాచ్‌లలో కలిపి 2 అర్ధ సెంచరీలతో 122 పరుగులు చేశాడు. నేడు సొంత మైదానంలో జరిగే పోరులో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో చెన్నై తలపడుతుంది.

సీఎస్‌కే టీమ్‌కు కర్త, కర్మ, క్రియగా ఉన్న ధోని 2008–2023 మధ్య 235 మ్యాచ్‌లలో జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. అతని నాయకత్వంలో 5 సార్లు జట్టు ఐపీఎల్ చాంపియన్‌గా నిలిచింది. 2022లో ధోని స్థానంలో రవీంద్ర జడేజాను చెన్నై యాజమాన్యం కెప్టెన్‌గా ఎంపిక చేసింది. అయితే టోర్నీ మధ్యలో అతను 8 మ్యాచ్‌ల తర్వాత కెప్టెన్సీ నుంచి తప్పుకోవడంతో ధోనియే బాధ్యతలు తీసుకున్నాడు. 2024 సీజన్ నుంచి జట్టు సారథ్య బాధ్యతలు రుతురాజ్‌కు అప్పగించారు. అతని కెప్టెన్సీలో టీమ్ 19 మ్యాచ్‌లు ఆడింది. వీటిలో 8 గెలిచి, 11 ఓడింది.



ఏరు.. మళ్లీ నీరు..

నిన్నటి వరకు నీళ్లులేక ఎండిపోయి బండలు తేలి.. నెర్రలు కనిపించిన మహబూబాబాద్ జిల్లా గార్ల సమీపాన ఉన్న పాకాల ఏరు ప్రస్తుతం నీటితో నిండుకుండను తలపిస్తోంది. నెల రోజులుగా పాకాల ఏరు ఎండిపోయి.. కనీసం పశువులు తాగేందుకు సైతం నీళ్లులేని పరిస్థితి. ఇళ్లల్లోని బావులు, బోర్లు ఇంకిపోయాయి. జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయడంతో గురువారం ఉదయం ఒక్కసారిగా ఏటిలోకి నీళ్లు చేరుకున్నాయి.

- గార్ల



రూపాయిన్నర కోసం లొల్లి

ఐకేపీ కొనుగోలు కేంద్రంలో రెండు రోజులుగా నిలిచిన విక్రయాలు



చర్చలు జరుపుతున్న ఏఎంసీ చైర్మన్, అధికారులు

జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్ కాటన్ యార్డులో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రంలో రూ.1.50 (రూపాయిన్నర) లొల్లితో రెండు రోజులుగా కొనుగోళ్లు నిలిచి పోయాయి. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులకు తీవ్ర ఇబ్బందులు తప్పడంలేదు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని బస్తాలో నింపి కాంటా వేసిన తర్వాత లారీలో లోడ్ చేసినందుకు హమాలీలకు రైతులు క్వింటాకు రూ.80 చెల్లిస్తున్నారు. అయితే లారీ కాంట్రాక్టర్ నుంచి బస్తాకు రూ. 1.50 పైసలు ఇవ్వాలని హమాలీలు డిమాండ్ చేస్తుండగా.. ససేమిరా అనడంతో రెండు రోజులుగా కాంటా నిలిచి పోయింది. రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో ఏఎంసీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, సివిల్ సప్లయిస్ డీఎం హతీరామ్, మార్కెటింగ్ మేనేజర్ నరేంద్ర, పౌర సరఫరాల శాఖ నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్ లారీ కాంట్రాక్టర్, హమాలీలతో చర్చలు జరిపారు. అయినా రూ.1.50 పైసలు ఇచ్చేందుకు సదరు కాంట్రాక్టర్ ఒప్పుకోలేదు. ప్రస్తుతం జిల్లాలోని ఐకేపీ సెంటర్లలో క్వింటా ధాన్యం కాంటా వేసి, లోడ్ చేస్తే రూ.60 ఉండగా, ఇక్కడ మాత్రం రూ.80 ఇస్తున్నారని, సర్దుకు పోవాలని హమాలీలకు నచ్చ చెప్పే ప్రయత్నం చేశారు. ఇరువురి మధ్య గురువారం రాత్రి వరకు చర్చలు సాగుతూనే ఉన్నాయి.

నేడు సీతారాముల కల్యాణోత్సవం

ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట ఏకశిలా నగరిలో వెలసిన శ్రీ కోదండ రామాలయంలో శుక్రవారం ఉదయం 8 నుంచి 10 వరకు శివ ధనుర్భంగాలంకారంలో స్వామి భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాత్రి 6:30 నుంచి 8:30 గంటల వరకు సీతా రాముల కల్యాణోత్సవం నిర్వహిస్తారు.

చదువు కోసమే వచ్చారా?

భారతీయ విద్యార్థులపై అమెరికాలో నిరంతర నిఘా

- చదువుతున్నారా? పార్ట్‌టైం ఉద్యోగాలు చేస్తున్నారా?అని ఏఐ సాయంతో ఆరా
- ధ్రువపత్రాలు, బ్యాంక్ బ్యాలెన్స్ వివరాల సేకరణ
- కేంద్ర ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసిన భారత ఎంబసీ
- కన్సల్టెన్సీల సమాచారం ఇవ్వాలని రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం

అమెరికాలో భారతీయ విద్యార్థుల ప్రతి కదలికపై ఆ దేశ అధికారులు నిఘా పెడుతున్నారు. ఎక్కడికి వెళ్లినా, ఏం చేస్తున్నా నీడలా వెంటాడుతున్నారు. విద్యార్థులు నిజంగానే చదువుతున్నారా? చట్ట వ్యతిరేకంగా ఉద్యోగాలేమైనా చేస్తున్నారా? వాళ్ల బ్యాంకు లావాదేవీలు ఎలా ఉన్నాయి? సరైన పత్రాలతోనే వచ్చారా? అనే వివరాలను సేకరిస్తున్నారు. హెచ్-1బీ వీసా పొందిన వారిపైనా నిఘా కొనసాగుతోందని ప్రవాస భారతీయులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

- సాక్షి, హైదరాబాద్



ప్రధాన వర్సిటీలపై దృష్టి

అమెరికా వెళ్లే భారత విద్యార్థుల సంఖ్య రానురాను పెరుగుతోంది. 2022–23లో 2,68,923 మంది వెళ్తే, 2023–24లో 3,31,602 మంది వెళ్లారు. ప్రధానంగా న్యూయార్క్ వర్సిటీ, నార్త్ ఈస్టర్న్ వర్సిటీ, కొలంబియా వర్సిటీ, అరిజోనా స్టేట్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియాలోనే లక్షకుపైగా భారతీయ విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో చాలామంది క్యాంపస్‌ల బయట పార్ట్ టైం ఉద్యోగాలు చేస్తున్నారనేది అమెరికా అనుమానం. వారిని వెతికి పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే న్యూయార్క్, బోస్టన్, టెంపే, లాస్ ఏంజెలిస్ ప్రాంతాల్లో నిఘా కొనసాగుతోంది.

తలనొప్పిగా ఓపీటీ

అమెరికాలో ఎంఎస్ చేసిన తర్వాత తాత్కాలిక ఉద్యోగాలు చేసుకునేందుకు (ఇవి కూడా స్కిల్డ్ మాత్రమే) ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రెనింగ్ (ఓపీటీ) ఇస్తారు. 2023–24 లెక్కల ప్రకారం భారత విద్యార్థులు 97,556 మంది ఓపీటీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఓపీటీ చేసిన తర్వాత ఉద్యోగ ప్రయత్నంలో భాగంగా మరికొంత కాలం అమెరికాలో ఉండొచ్చు. ట్రంప్ సర్కార్ ఇప్పుడు ఈ సదుపాయాన్ని ఎత్తివేసే ఆలోచనలో ఉంది. అందుకోసం త్వరలో చట్టం తెస్తానని ట్రంప్ ప్రకటించారు. అదే జరిగితే ఎంఎస్ పూర్తయిన వెంటనే ఉద్యోగం వచ్చిన వాళ్లు మాత్రమే అక్కడ ఉంటారు. మిగతా వాళ్లు తిరిగి ఇండియాకు రావాల్సి ఉంటుంది. అమెరికా వెళ్లడం కోసం ఒక్కో విద్యార్థి సగటున రూ.35 లక్షల నుంచి రూ.49 లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఉత్త చేతులతో ఇండియాకు తిరిగి వచ్చే పరిస్థితిని తలచుకుంటేనే గుండె పగిలిపోతోందని విద్యార్థులు అంటున్నారు.

ఏఐతో పటిష్టమైన డేటా

ప్రతి విదేశీ విద్యార్థిపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో నిఘా పెట్టినట్టు ప్రవాస భారతీయులు చెబుతున్నారు. విద్యార్థి ఎక్కడి నుంచి వచ్చాడు? ఎక్కడ ఉన్నాడు? అతని బ్యాంకు బ్యాలెన్స్ ఎంత? అమెరికా వచ్చిన తర్వాత ఎంత సంపాదించాడు? ఎలా సంపాదించాడు? ఏయే ఉద్యోగాలు చేశాడు? అనే వివరాలు సేకరిస్తున్నారు. విద్యార్థి ఏడాది కాలంగా ఎక్కడెక్కడికి వెళ్లాడు? ఏయే లొకేషన్స్‌లో ఉన్నాడు? ఆ లొకేషన్స్‌లో మాల్స్, పెట్రోల్ బంకులు, రెస్టారెంట్లు ఏం ఉన్నాయి? వాటి నుంచి ఎవరికి డబ్బు చెల్లించారు? ఇందులో విద్యార్థులుగా ఉన్నవారికి ఎంత? ఎందుకు? అనే వివరాలపై దృష్టి పెట్టారు. వీటి ఆధారంగా విద్యార్థి చదువు కోసం కాకుండా, ఉపాధి కోసం వచ్చినట్టు గుర్తించే ఆలోచనలో ఉన్నారు. ఇది అమెరికా చట్టాలకు విరుద్ధం కాబట్టి అలాంటి విద్యార్థులకు సమస్యలు తప్పేట్టు లేదు.

కన్సల్టెన్సీలపై నిఘా

అమెరికా అధికారుల నిఘాపై ఆ దేశంలోని భారత రాయబార కార్యాలయం ఇటీవల భారత ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసింది. విద్య కన్సల్టెన్సీలు విద్యార్థులను అక్రమంగా అమెరికాకు పంపుతున్నాయని ఆక్షేపించింది. ఇప్పటివరకు 5 వేల మందిని ఈ కేటగిరీ కింద గుర్తించినట్టు తెలిపింది. దీంతో భారత ప్రభుత్వం అన్ని రాష్ట్రాలకు కన్సల్టెన్సీల వివరాలు ఇవ్వాలని ఇటీవల లేఖ రాసింది.

పత్రాలన్నీ చూస్తున్నారు

ఇండియా నుంచి వచ్చిన విద్యార్థి ఆర్థిక స్థితిగతులపై అమెరికాలో ఆరా తీస్తున్నారు. చదువు కోసమే వచ్చిన వారికి ఇబ్బంది ఉండదు. కానీ ఇతర మార్గాల్లో డబ్బులు సంపాదించిన వారిని ప్రశ్నించే వీలుంది.

- విక్రమ్ శశాంక్, ప్రవాస భారతీయుడు.

ఓపీటీ తీసేస్తే పరిస్థితి ఏమిటి?

రూ.45 లక్షలు అప్పు చేసి అమెరికా వచ్చాను. పార్ట్ టైం జాబ్ చేసి కొంత తీర్చాను. ఇప్పుడు ఓపీటీ ఎత్తివేస్తే తిరిగి ఇండియా వెళ్లిపోవాలి. అక్కడ ఉద్యోగం వస్తుందో రాదో చెప్పలేం. అప్పు తీర్చే మార్గం కన్పించడం లేదు.


- అఖిలేష్ పూనాటి, అమెరికాలో ఎంఎస్ పూర్తిచేసిన విద్యార్థి.

హెచ్-1బీకీ తిప్పలే

ఇక్కడి ఉద్యోగాలు ఇక్కడివాళ్లకే (అమెరికన్లకు) అనే నినాదం ఊపందుకుంటోంది. ఇండియాతోపాటు ఇతర దేశాలవారినీ ఎందుకు రప్పించాలనే భావనతో ట్రంప్ వెళ్తున్నారు. భవిష్యత్‌లో హెచ్-1బీ వీసాలు ఉండకపోవచ్చు. ఇక్కడే పిల్లలను చదివిద్దామని వచ్చాను. ఇప్పుడు వాళ్లు కూడా ఇబ్బంది పడాల్సిందే.

- మంజులా రాయ్, హెచ్-1బీ వీసాపై అమెరికా వెళ్లిన ఎంఎన్‌సీ ఉద్యోగిని.

అమెరికాలో అత్యధికంగా భారతీయ విద్యార్థులున్న వర్సిటీలు





సాక్షి, హైదరాబాద్: జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ మెయిన్) ఫలితాలు ఈ నెల 17న విడుదల చేయనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) తెలిపింది. ఈ నెల 1న ప్రారంభమైన రెండో విడత మెయిన్స్ పరీక్షలు 9వ తేదీతో ముగిశాయి. మొత్తం 12 లక్షల మంది ఈ పరీక్షకు హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాల నుంచి 2 లక్షల మంది వరకూ పరీక్ష రాశారు. తొలి విడత పరీక్షలు జనవరిలో జరిగాయి. ఫిబ్రవరిలో ఫలితాలు విడుదల చేశారు. రెండు విడతల మెయిన్స్ పూర్తవడంతో విద్యార్థులకు ర్యాంకులు కేటాయించనున్నారు. వీటి ఆధారంగా జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక చేస్తారు.

23 నుంచి అడ్వాన్స్‌డ్ రిజిస్ట్రేషన్

దేశవ్యాప్తంగా మే 18న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష జరుగనుంది. మెయిన్స్ ఫలితాలు వెలువడిన తర్వాత ఈ నెల 23 నుంచి అడ్వాన్స్‌డ్‌కు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను మొదలు పెడతారు. ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా 2.5 లక్షల మందిని ఎంపిక చేస్తారు.

రిశాల్ అగర్వాల్ బరువును తూస్తున్న అంగన్‌వాడీ టీచర్



అంగన్‌వాడీలో అదనపు కలెక్టర్ కుమారుడు

బిడ్డ పేరు నమోదు

కొండపాక(గజ్వేల్): సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ పరిధి సెలంపు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ తన కుమారుడిని చేర్పించారు. కుమారుడు రిశాల్ అగర్వాల్ పేరును నమోదు చేశారు. రిశాల్ ఎత్తు, బరువును తూచారు. ఈ సందర్భంగా గ్రోత్ నమోదు మానిటరింగ్ కార్డును, పిల్లల పౌష్టికత కోసం ప్రభుత్వం అందించే బాలామృతం ప్యాకెట్‌ను అదనపు కలెక్టర్‌కు.. సెక్టార్ సూపర్‌వైజర్ ఇందిర, అంగన్‌వాడీ టీచర్ బాల్‌లక్ష్మితో కలిసి అందించారు. వచ్చే నెలలో మారోమారు గ్రోత్ మానిటరింగ్‌ను నిర్వహించి నివేదికను తెలియజేస్తామన్నారు.

ట్రాక్టర్‌పై ట్యాంకర్ ద్వారా నీరు తీసుకొచ్చి పట్టుకుంటున్న గ్రామస్తులు



దాహం తీరాలంటే రాష్ట్రం దాటాలి..

రెండు గిరిజన గ్రామాల్లో తాగునీటి ఇక్కట్లు

అశ్వారావుపేట రూరల్: దాహం తీర్చుకోవడానికి ఆ రెండు గ్రామాల గిరిజనులు ఏకంగా.. రాష్ట్ర సరిహద్దు దాటాల్సి వస్తోంది. నెల రోజులుగా వారిని వేధిస్తున్న తాగునీటి సమస్య గురువారం వెలుగులోకి వచ్చింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం కొండరెడ్ల గ్రామాలైన గోగులపూడి, కొత్త కన్నాయిగూడెంల్లో నెల రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఈ గ్రామాల్లో 50కి పైగా గిరిజన కుటుంబాలు నివసిస్తుండగా, ఒకే తాగునీటి పథకం ద్వారా నీరు అందేది. అయితే, బోరు నుంచి ట్యాంక్‌లోకి నీరు ఎక్కించే ప్రధాన పైపు విరగడంతో సరఫరా నిలిచిపోయింది. పంచాయతీ ఉద్యోగుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన రాలేదు. దీంతో గ్రామస్తులు తాగునీటి అవసరాల కోసం నిత్యం రెండు కిలోమీటర్లు ప్రయాణించి.. ఆంధ్రప్రదేశ్‌లోని ఓ రైతు పొలంలోని బోర్ నుంచి ట్యాంకర్‌తో నీరు తెచ్చుకుని బిందెలు, బకెట్లలో పట్టుకుంటున్నారు. దీనిపై ఎంపీడీవో ప్రవీణ్‌ను వివరణ కోరగా సమస్య దృష్టికి రాలేదని, తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
శుక్రవారం। 11-4-2025

కిరాణా సరుకులు కావాలా? 10 నిమిషాల వ్యవధిలోనే ఇంటి వద్దకే వచ్చేస్తాయి! సొంత మొబైల్‌లోని క్విక్ కామర్స్ యాప్ ద్వారా ఆర్డర్ చేసిన తరువాత నిమిషాలలోపే ఇంటికి అవసరమైన బియ్యం, పప్పు, ఉప్పు, కూరగాయలు వంటి కిరాణా సరుకులన్నీ వచ్చేస్తున్నాయి. ఆన్‌లైన్ ఈ కామర్స్ యాప్స్ ద్వారా క్విక్ కామర్స్ (త్వరిత వాణిజ్యం) దేశంలో ప్రస్తుతం 31.33 శాతం వార్షిక వృద్ధిరేటుతో వేగంగా విస్తరిస్తోంది. కాగా 2025–2030 మధ్య సంవత్సరానికి 44.9 శాతం వృద్ధి రేటుతో ఈ రంగం దూసుకుపోనుందని నిపుణులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో టెక్ జనం ఎక్కువ కావడంతో తెలంగాణలో క్విక్ కామర్స్ మరింత అధికంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. బిగ్‌బాస్కెట్, జెప్టో, స్విగ్గీ, బ్లింకిట్, డంజో లాంటి సంస్థలు రాష్ట్రంలో హైదరాబాద్‌తో పాటు మరిన్ని నగరాల్లో వినియోగదారుల ఇళ్లకే గ్రోసరీని తీసుకెళ్తూఆదరణ పొందుతున్నాయి. హైదరాబాద్ కేంద్రంగా వేర్‌హౌజ్ ఏర్పాటు చేసుకొని ఈ–కామర్స్ వ్యాపారంలో దూసుకుపోతున్న అమెజాన్ సంస్థ 'అమెజాన్ తేజ్' పేరుతో క్విక్ కామర్స్ రంగంలో తన స్థానాన్ని పదిలం చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రస్తుతం 'జెప్టో' సంస్థ అత్యధిక వృద్ధిరేటుతో హైదరాబాద్ మార్కెట్‌ను ఆక్రమించుకుంటోంది. కాగా 'అమెజాన్ తేజ్' రంగంలోకి దిగితే పరిస్థితి ఆ సంస్థకు అనుకూలంగా మారుతుందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. కాగా రాష్ట్రంలో హైదరాబాద్‌లో మొదలైన క్విక్ కామర్స్ జోరు వరంగల్, కరీంనగర్ వంటి నగరాలకు కూడా విస్తరిస్తోంది. – సాక్షి, హైదరాబాద్





విస్తరిస్తున్న క్విక్ కామర్స్

నిమిషాల వ్యవధిలోనే ఇంటి వద్దకు కిరాణా!

- హైదరాబాద్ నుంచి వరంగల్ వరకు సరుకుల సరఫరా
- యాప్‌ల ద్వారా నిత్యావసరాలు అందిస్తున్న ఈ కామర్స్ సంస్థలు
- హైదరాబాద్ మార్కెట్‌లో బిగ్ బాస్కెట్, స్విగ్గీ ఇన్‌స్టా మార్ట్, జెప్టో, బ్లింకిట్ తదితర సంస్థల హవా
- త్వరలో క్విక్ కామర్స్ మార్కెట్లోకి అమెజాన్.. ప్రతిరోజూ లక్షన్నర వరకు ఆర్డర్లు
- రూ.5 కోట్లకు పైగా వ్యాపారం.. తెలంగాణలోని ఇతర నగరాలకూ విస్తరిస్తున్న క్విక్ కామర్స్

ఎక్కడికక్కడ గోడౌన్‌లతో...

క్విక్ కామర్స్ అంటే కిరాణా సరుకులు, చిరుతిండ్లు, ఇంటి సామగ్రి కొన్ని నిమిషాల్లోనే వినియోగదారుని ఇంటికి చేర్చడమే. తెలంగాణలో హైదరాబాద్ కేంద్రంగా భారీ ఎత్తున గోడౌన్‌లు ఏర్పాటు చేసుకొని బిగ్‌బాస్కెట్ (బీబీ నౌ), అమెజాన్ (తేజ్), జెప్టో, స్విగ్గీ (ఇన్‌స్టా మార్ట్), బ్లింకిట్, డంజో మొదలైన సంస్థలు క్విక్ కామర్స్ రంగంలో పనిచేస్తున్నాయి. బిగ్ బాస్కెట్ సంస్థకు హైదరాబాద్‌లో దాదాపు 400 వరకు చిన్న గిడ్డంగులు ఉండగా, గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉండే వినియోగదారులకు సేవలు అందిస్తున్నాయి. అమెజాన్ ఇప్పటికే 24 గంటల్లో సేవలు అందించేలా ఈ కామర్స్ వ్యాపారంలో దూసుకుపోతుండగా, కొత్తగా హైదరాబాద్ కేంద్రంగా 'తేజ్' సేవలను ప్రారంభించనుంది. తద్వారా కిరాణా, చిన్నస్థాయి విద్యుత్ సామగ్రి, పండ్లు వంటి వాటిని అందించేందుకు ఏర్పాట్లు చేస్తుంది. జెప్టో సంస్థ కిరాణా, చిరుతిండ్లు, సౌందర్య సామగ్రితో పాటు గృహావసరాలకు అవసరమైన అన్నింటినీ 10 నిమిషాల్లో సరఫరా చేసే హామీతో దూసుకుపోతుంది. గచ్చిబౌలి, హైటెక్‌సిటీ, బంజారాహిల్స్ మొదలుకొని హైదరాబాద్‌లోని అడ్డగుట్ట, పాతబస్తీ వంటి వందలాది ప్రాంతాల్లో గ్రోసరీ గోడౌన్‌లను ఏర్పాటు చేసుకొని సేవలు అందిస్తుంది. ఇక హోటళ్ల నుంచి ఆహారాన్ని వినియోగదారులకు అందించే సేవల్లో ఉన్న స్విగ్గీ కూడా క్విక్ కామర్స్ రంగంలోకి అడుగుపెట్టింది. స్విగ్గీ ఇన్‌స్టా మార్ట్ పేరుతో కిరాణా, ఇంటి సామగ్రితో పాటు మెడికల్స్‌ను కూడా 15 నుంచి 20 నిమిషాల్లో సరఫరా చేస్తోంది. హైదరాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్‌లోనూ ఈ సంస్థ విస్తరించడం గమనార్హం. గ్రోఫర్స్ పేరుతో దశాబ్దం క్రితం ప్రారంభమై పేరు మార్చుకొని 'బ్లింకిట్'గా సేవలందిస్తున్న మరో సంస్థ కూడా హైదరాబాద్‌లో జొమాటో సహకారంతో పెద్దఎత్తున గోడౌన్‌లను ఏర్పాటు చేసుకొని వినియోగదారులకు సేవలు అందిస్తోంది. డంజో అనే మరో సంస్థ కూడా క్విక్ కామర్స్ రంగంలో హైదరాబాద్‌లో సేవలు అందిస్తోంది.

హైదరాబాద్‌లో క్విక్ కామర్స్ వాటా 10 శాతం

2024 చివరి నాటికి భారతదేశంలో క్విక్ కామర్స్ మార్కెట్ విలువ సుమారు 5 బిలియన్ డాలర్లు. ఇది 2025 చివరి నాటి కి 6–7 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని నిపుణులు భావిస్తున్నారు. హైదరాబాద్‌లో రిటైల్ మార్కెట్ సుమారు రూ. 20,000–25,000 కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తే, క్విక్ కామర్స్ వాటా దాదాపు 8 నుంచి 10 శాతం ఉంటుంది. అంటే రూ. 8,000 కోట్ల నుంచి రూ. 2,500 కోట్ల వరకు ఉండే అవకాశం ఉంది. ఈ వాటా యువత, ఐటీ ఉద్యోగులు ఎక్కువగా ఉండే హైటెక్ సిటీ, గచ్చిబౌలి వంటి ప్రాంతాల్లో మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ కామర్స్ సంస్థలకు వచ్చే ఆర్డర్లు ప్రతిరోజూ లక్ష నుంచి లక్షన్నర వరకు ఉండొచ్చని అంచనా. వీటి విలువ రూ. 5 కోట్లకు పైనే ఉండొచ్చు. కాగా ఈ క్విక్ కామర్స్ మార్కెట్‌లో కూడా బిగ్ బాస్కెట్ సంస్థ ప్రధాన వాటాను సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. 30 నుంచి 40 శాతం వాటా ఈ సంస్థకే ఉండగా, ఇప్పుడు జెప్టో, బ్లింకిట్ సంస్థలు పోటీ పడుతున్నాయి. జెప్టో 5 నుంచి 10 నిమిషాల్లో నిత్యా వసర వస్తువులు, కూరగాయలు, పండ్లతో పాటు వినియోగదారుడు కోరిన వస్తువులన్నింటినీ అందిస్తూ ఇప్పటికే 20 శాతం వాటాను సొంతం చేసుకొని మరింత వేగంగా విస్తరిస్తోంది. వినియోగదారులకు ఆఫర్లతో ఈ సంస్థ హైదరాబాద్‌లో క్విక్ కామర్స్ రంగంలో తన ఆధిపత్యాన్ని పెంచుకుంటోంది. అమెజాన్ సంస్థ 'తేజ్' ద్వారా క్విక్ కామర్స్ రంగంలో 20 శాతం వాటాను సొంతం చేసుకునే అవకాశం ఉంది. స్విగ్గీ ఇన్‌స్టా మార్ట్, బ్లింకిట్, డంజో వంటి సంస్థల వాటా మరో 20 శాతం వరకు ఉంటుంది.

భవిష్యత్తులో చిన్న నగరాలకు విస్తరణ

తెలంగాణలో క్విక్ కామర్స్ రంగం మరింతగా విస్తరించే అవకాశాలు ఉన్నాయి. హైదరాబాద్‌తో పాటు వరంగల్, నిజామాబాద్, కరీంనగర్ లాంటి నగరాలతో పాటు హైదరాబాద్‌ను ఆనుకొని ఉన్న కొన్ని పట్టణాలకు కూడా ఈ సేవలు అందనున్నాయి. అమెజాన్ 'తేజ్' రాకతో పోటీ మరింత ఆసక్తికరంగా మారనుంది. వేగం, నాణ్యత, తక్కువ ధరలు ఇచ్చే సంస్థలే ఈ రంగంలో పైచేయి సాధిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

ఎస్టీ రిజర్వేషన్లపై
కౌంటర్ వేయండి

గ్రూప్–1పై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1లో ఎస్టీ రిజర్వేషన్ల అమలుకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, టీజీపీఎస్సీని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణ జూన్ 12కు వాయిదా వేసింది. గ్రూప్–1 నియామకాల్లో ఎస్టీ రిజర్వేషన్లు 10 కాకుండా 6 శాతమే అమలు చేయాలని కోరుతూ హైకోర్టులో గతంలో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. తాము వెలువరించే తీర్పు మేరకే నియామకాలు ఉంటాయని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయితే టీజీపీఎస్సీ ఏప్రిల్ 16న గ్రూప్–1 అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టింది. ఈ నేపథ్యంలో ఎస్టీ సంఘాలు ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశాయి. ప్రధాన పిటిషన్లపై ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసిన ఎమ్మెల్సీ బాలునాయక్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం 2014లో రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించి.. విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సామాజిక న్యాయ ప్రయత్నానికి భంగం కలిగించవద్దని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం కౌంటర్ల దాఖలుకు ఆదేశించింది.

పదేళ్లూ ఫూలే
గుర్తుకు రాలేదా?

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కైలాశ్ నేత



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సమాజం కర్రు కాల్చి వాత పెట్టినా బీఆర్ఎస్ నేతలకు బుద్ధి రాలేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నా కైలాశ్‌నేత ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో ఫూలే విగ్రహం పెట్టాలని ఇందిరా పార్కులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ధర్నా చేస్తుంటే.. నవ్వాలో ఏడవాలో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. ఆయన గురువారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. పదేళ్ల పాటు ఫూలే విగ్రహం ఏర్పాటు చేయకుండా బీఆర్ఎస్ ఏం చేసిందని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ఫూలే విగ్రహం గురించి కవితకు గుర్తు రాలేదా? అని నిలదీశారు. ఫూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా.. ఆయన ఆశయాలను కాంగ్రెస్ ప్రభుత్వమే నెరవేరుస్తుందని స్పష్టం చేశారు.

విద్యుత్ సంస్థల డైరెక్టర్ల
ఇంటర్వ్యూలు పూర్తి

సాక్షి, హైదరాబాద్: ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కమ్‌ల కొత్త డైరెక్టర్ల నియామకానికి ఇంటర్వ్యూలను ప్రభుత్వం గురువారం పూర్తి చేసింది. బుధవారం దక్షిణ, ఉత్తర డిస్కమ్‌ల డైరెక్టర్ల నియామకాలకు ఇంటర్వ్యూలు నిర్వహించగా,, గురువారం జెన్‌కో డైరెక్టర్ల కోసం 63 మందిని, ట్రాన్స్‌కో డైరెక్టర్ల కోసం 35 మందిని ఇంటర్వ్యూ చేశారు. ఒక్కో డైరెక్టర్ పోస్టుకు ముగ్గురు అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి ప్రభుత్వానికి పంపించనున్నట్లు సమాచారం. ఆ ముగ్గురి నుంచి ఒక్కో పోస్టుకు ఒక్కరిని ఎంపిక చేయనున్నారు.





ఆన్‌లైన్‌లోనే హాజరు

కూలీలు కచ్చితంగా ఉపాధి పనులకు హాజరు కావాల్సిందే. ఆ తర్వాత క్షేత్రస్థాయిలో ఫొటో దిగాల్సిందే.. పనులు పూర్తయ్యాక కూడా ఫొటో దిగి ఇంటికి వెళ్లాలి. కూలీల పనిదినాల సంఖ్య లెక్కించాల్సిందే.. ఇలా పనులు ప్రారంభించినప్పటి నుంచి ముగిసే వరకూ మొబైల్ యాప్‌లో వివరాలన్నీ నమోదు చేయాల్సిందే. అర్హతగల ప్రతీ కుటుంబానికి 100 రోజుల పని దినాలు కల్పిస్తూ, వలసల నివారణ లక్ష్యంగా చేపట్టిన ఈజీఎస్‌లో.. రోజువారీ ప్రక్రియ ఇది. పెద్దపల్లి జిల్లా పెద్దబొంకూర్ గ్రామ శివారులో ఉపాధి హామీ కూలీల హాజరును ఫీల్డ్ అసిస్టెంట్ తన మొబైల్‌లో నమోదు చేస్తూ ఇలా కనిపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



వృక్ష విలాపం

అధిక ఉష్ణోగ్రతలతో కరీంనగర్ జిల్లాలోని మెట్ట ప్రాంతమైన రామడుగు, గంగాధర ప్రాంతాల్లో భారీ వృక్షాలు సైతం మోడువారుతున్నాయి. కాలువ ద్వారా వచ్చే నీటితో దిగువన ఉన్న పొలాలు పారుతుండగా.. ఆపైన మెట్ట ప్రాంతంలో ఉన్న భారీ వృక్షాలు నీరందక ఎండిపోతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

లెండి.. ఎప్పుడు పూర్తి చేస్తారండీ!

పునాదిరాయి వేసి నాలుగు దశాబ్దాలు ● అంతర్రాష్ట్ర ప్రాజెక్టుకు అన్నీ అవరోధాలే..

మొన్నటి బడ్జెట్‌లో రూ.40 కోట్ల కేటాయింపు ● ఈసారైనా పూర్తవుతుందన్న ఆశలో రైతులు



అసంపూర్తిగా మిగిలిపోయిన లెండి ప్రాజెక్టు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల్లో నాలుగు దశాబ్దాల క్రితం పునాదిరాయి వేసిన 'లెండి' ప్రాజెక్టు అసంపూర్తిగానే మిగిలింది. ఇరు రాష్ట్రాల్లోని 60 వేల పైచిలుకు ఎకరాల భూములకు.. సాగునీరు అందించేందుకు చేపట్టిన ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులు భూసేకరణ, నిధుల సమస్యలతో నానుతూ వస్తోంది. ప్రాజెక్టు పనులు పూర్తయితే.. వెనుకబడిన ప్రాంతమైన కామారెడ్డి జిల్లాలోని మద్నూర్, బిచ్కుంద మండలాల్లో దాదాపు 22 వేల ఎకరాల భూములు సాగులోకి వస్తాయి. కేవలం వర్షాధారంతో ఆరుతడి పంటలు సాగు చేస్తున్న రైతులు ఏళ్లుగా ఎదురుచూస్తూనే ఉన్నారు. 1984లో ప్రాజెక్టు పనులు మొదలు పెట్టినపుడు అంచనా వ్యయం రూ.54.55 కోట్లు మాత్రమే. అప్పట్లో నిధుల సమస్య, భూసేకరణ వంటి సమస్యలతో పనులు పలుమార్లు ఆగిపోవడంతో.. ఇప్పుడు అంచనా వ్యయం రూ.వెయ్యి కోట్లు దాటింది. ప్రాజెక్టు ముంపు రైతులకు పునరావాసం కింద అందించాల్సిన డబ్బులు.. అప్పట్లో పూర్తిస్థాయిలో చెల్లించకపోవడంతో ప్రాజెక్టు నిర్మాణం పెండింగులో పడిపోయింది. దీంతో ప్రాజెక్టు కోసం ఎదురుచూస్తున్న రైతుల ఆశలు అడియాసలయ్యాయి.

6.36 టీఎంసీల సామర్థ్యం..

మహారాష్ట్రలోని దెగ్లూర్ తాలూకాలోని గోజేగావ్ వద్ద లెండి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. 6.36 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టు రూపకల్పన జరిగింది. ఇందులో మహారాష్ట్ర 3.93 టీఎంసీలు, తెలంగాణ 2.43 టీఎంసీల నీటిని వాడుకోవాలని నిర్ణయించారు. మహారాష్ట్రంలోని దెగ్లూర్, ముఖేడ్ తాలూకాల పరిధిలోని గ్రామాల్లో 39,275 ఎకరాల ఆయకట్టుకు, తెలంగాణ రాష్ట్రంలో కామారెడ్డి జిల్లాలోని మద్నూర్, బిచ్కుంద మండలాల్లోని గ్రామాల పరిధిలో 22 వేల ఎకరాల ఆయకట్టుకు ఈ ప్రాజెక్టు నీరందిస్తుందని అంచనా వేశారు. కాగా ప్రాజెక్టు నిర్మాణం మొదలుపెట్టిన 1984లో ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.54.55 కోట్లు అవుతుందని అంచనా వేశారు. అప్పట్లో ముంపు గ్రామాల రైతులకు పరిహారం విషయంలో అసంపూర్తి చెల్లింపులు జరగడంతో నిర్మాణానికి ఆటంకాలు ఎదురయ్యాయి. కాగా గోజేగావ్ వద్ద చేపట్టిన లెండి ప్రాజెక్టు నిర్మాణ పనులు దాదాపు 75 శాతం పూర్తయ్యాయి. ప్రాజెక్టుకు 14 గేట్లు నిర్మించాల్సి ఉండగా, 10 గేట్ల నిర్మాణం అప్పుడే పూర్తయ్యింది. మరో నాలుగు గేట్ల నిర్మాణం పూర్తి కావలసి ఉంది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో లెండి ప్రాజెక్టు పనులను కొలిక్కి తెచ్చే ప్రయత్నం జరిగింది. ప్రాజెక్టు కోసం రూ.43.14 కోట్లు ఖర్చు చేశారు. అప్పుడు కామారెడ్డి జిల్లా పరిధిలోని మద్నూర్, బిచ్కుంద మండలాలకు సంబంధించి కెనాల్స్ పనులు జరిగాయి. కానీ ప్రాజెక్టు పనులు మాత్రం అసంపూర్తిగానే ఉండిపోయాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత లెండి ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.554.54 కోట్లని తేల్చారు. ఇందులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వాటాగా 42 శాతం కింద రూ.236.10 కోట్లు, మిగతా మొత్తం రూ.318.45 కోట్లు మహారాష్ట్ర భరించాల్సి ఉంటుంది. రాష్ట్ర వాటాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.189.73 కోట్లు విడుదల చేసింది. అయినా పనులు మాత్రం ముందుకు సాగలేదు. దీంతో ప్రాజెక్టు అంచనా వ్యయం ఏటేటా పెరుగుతూనే ఉంది. భూములకు పరిహారంతో పాటు ప్రాజెక్టు పనుల పూర్తికి అంచనా వ్యయం మరింత పెరగవచ్చని నీటిపారుదల శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ఇప్పుడైనా పూర్తవుతుందా..

ప్రస్తుత జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు.. అసంపూర్తిగా మిగిలిన లెండి ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల అధికారులతో మాట్లాడారు. ప్రాజెక్టు పూర్తి చేయడానికి అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని రైతులకు భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.40 కోట్లు కేటాయించింది. మహారాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి అక్కడి రైతులకు పరిహారం ఇప్పించి పనులు పూర్తి చేయించాల్సిన అవసరం ఉంది.

క్లుప్తంగా...

ఏపీలో హోటళ్ల నిర్మాణానికి పలు సంస్థల ఆసక్తి

పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



సాక్షి, అమరావతి: నూతన పర్యాటక విధానం 2024–29తో దేశంలో ఎక్కడా లేని విధంగా ఆతిథ్య రంగంలో పెట్టుబడులకు రాష్ట్రంలో అనుకూల వాతావరణం ఏర్పడిందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గురువారం ముంబైలో రెండో రోజు దక్షిణాసియా 20వ హోటల్ ఇన్వెస్ట్ మెంట్ కాన్ఫరెన్స్‌లో హోటల్స్ గ్రూప్స్, ట్రావెల్స్ కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సింగపూర్‌కు చెందిన ఆస్కాట్ గ్రూప్ తమ సిటాడైన్స్ హోటళ్లను రాష్ట్రంలో టైర్ 2, 3 నగరాల్లో నెలకొల్పేందుకు ఆసక్తి కనబరిచినట్టు ఓ ప్రకటనలో తెలిపారు. అకార్ హోటల్స్ ప్రతినిధులు అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాల్లో ఐబీస్ బ్రాండెడ్ హోటళ్లను, బ్రిగేడ్ హోటల్స్ యాజమాన్యం విశాఖపట్నం, తిరుపతి, హార్స్ లీ హిల్స్ లో పెట్టుబడులు పెట్టేందుకు సానుకూలత వ్యక్తం చేశాయన్నారు. విశాఖలో 117 గదుల హోటల్ నిర్మాణానికి మైనర్ హోటల్స్, సన్‌రే రిసార్ట్‌లతో కీలక అవగాహన ఒప్పందం జరిగిందన్నారు.

జూలైకల్లా 'నర్సింగ్' ప్రవేశాల ప్రక్రియ ముగించాలి

మంత్రి సత్యకుమార్ ఆదేశం



సాక్షి, అమరావతి: ఏటా జూలై నాటికి నర్సింగ్ ప్రవేశాల ప్రక్రియ ముగించాలని వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. నర్సింగ్ కాలేజీల అసోసియేషన్ ప్రతినిధులతో గురువారం విజయవాడలోని హెల్త్ వర్సిటీలో ఆయన సమావేశమయ్యారు. 2025–26 విద్యా సంవత్సరంలో నర్సింగ్ కామన్ ప్రవేశ పరీక్ష ద్వారా ప్రవేశాలు చేపట్టాలని నిర్ణయించామన్నారు. ఇక నర్సింగ్ కళాశాలల్లో ఏటా దాదాపు 13 వేల ప్రవేశాలు ఉంటున్నాయని.. మూడేళ్ల జీఎన్ఎం నర్సింగ్ కోర్సులకు వార్షిక బోధనా రుసుం రూ.15వేలు, నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ కోర్సులకు రూ.19 వేలు చొప్పున ఫీజులు ఉన్నాయని.. దీంతో నాణ్యమైన విద్యను అందించడంలో సమస్యలు ఎదురవుతున్నాయని అసోసియేషన్ ప్రతినిధులు ఆందోళన వ్యక్తంచేశారు. కళాశాలల ఏర్పాటు, నిర్వహణకు ఇప్పటివరకూ 52 జీఓలు ఇచ్చారని, వాటి స్థానంలో ఒక సమగ్ర జీఓను రూపొందించాలని వారు కోరారు. దీంతో.. మూడునెలల్లో సమగ్ర జీఓను రూపొందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో హైపవర్ కమిటీ నూతన అధ్యక్షులు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యు. దుర్గాప్రసాదరావు, విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ నరసింహం, రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి, పాల్గొన్నారు.

మున్సిపాలిటీల ఆదాయం పెంచాలి

మంత్రి పొంగూరు

సాక్షి, అమరావతి: మున్సిపాలిటీల్లో రోజువారీ కార్యకలాపాల నిర్వహణకు పన్ను వసూళ్లు చాలా కీలకమని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో గురువారం జరిగిన మున్సిపల్ కమిషనర్ల రాష్ట్ర స్థాయి సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజల అవసరాలు తీర్చే విధంగా మున్సిపాలిటీలు స్వయం సమృద్ధి సాధించాలని, ఇందుకు అనుగుణంగా ఆదాయాలు పెంచాలని సూచించారు. 85 లక్షల టన్నుల మున్సిపల్ వ్యర్థాలను అక్టోబర్ 2 నాటికి తొలగించేలా కమిషనర్లు కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. గుంటూరులో కుక్క కరిచి బాలుడు మృతి చెందడం విచారకరమని, 200 రోజుల లోపు కుక్కలకు స్టెరిలైజేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ డైరెక్టర్ పి.సంపత్ కుమార్ సదస్సులో పాల్గొన్నారు.

వ్యవ'సాయా'నికి కార్యాచరణ ప్రణాళిక

డైరెక్టర్ ఢిల్లీ రావు ఆదేశాలు

సాక్షి, అమరావతి: వ్యవసాయంలో స్థూల ఆదాయం రూ.65 వేల కోట్లు సాధించే దిశగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆ శాఖ డైరెక్టర్ ఢిల్లీ రావు అధికారులకు సూచించారు. ఆయన వ్యవసాయ, విత్తనాభివృద్ధి సంస్థ అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ భూములను ఖాళీగా వదిలి పెట్టకుండా మార్చి నుంచి జూన్ వరకు పంపు సెట్లు, బోర్ల ద్వారా చేసే వేసవి పంటల సాగు విధానాన్ని ప్రోత్సహించాలన్నారు.

జెడ్పీ టీచర్ల సర్వీస్ రూల్స్ ఎక్కడ?

సాక్షి, అమరావతి: జిల్లా, మండల పరిషత్ పాఠశాలల్లో 30 సంవత్సరాలుగా 1.40 లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నా ఇప్పటికీ సరైన సర్వీస్ నిబంధనలు లేవని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ విమర్శించింది. ఈ దిశలో ప్రభుత్వ కృషిని తెలియజేయాలని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు కోరారు. పంచాయతీరాజ్,టీచర్ల ఉమ్మడి సర్వీస్ నిబంధనలు కోసం 2017లో రాష్ట్రపతి ఆమోదంతో ఇచ్చిన నిబంధనల చెల్లుబాటు విషయంపై కూడా వివరణ ఇవ్వాలన్నారు.

విద్యుత్ ఆదా చేద్దామిలా



ప్రపంచంలో 40 ఏళ్లకు మాత్రమే సరిపడా విద్యుత్ ఉత్పత్తి వనరులు

- స్టార్ రేటెడ్ విద్యుత్ ఉపకరణాల వాడకంతో విద్యుత్ ఆదా
- ఈవీలు, ఎల్ఈడీ బల్బులు, బీఎల్‌డీసీ ఫ్యాన్లతో ఖర్చులు మిగులు
- వేసవిలో ఏసీల వినియోగంలో మెళకువలు పాటిస్తే విద్యుత్ పొదుపు

సాక్షి, అమరావతి: ప్రపంచవ్యాప్తంగా 40 ఏళ్లకు మాత్రమే సరిపడా విద్యుత్ ఉత్పత్తి వనరులు అందుబాటులో ఉన్నాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. మరోవైపు వేసవిలో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోంది. తద్వారా బిల్లులు కూడా అధికంగా వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో విద్యుత్‌ను ఆదాచేసే స్టార్ రేటెడ్ ఉపకరణాలను వాడటంతో పాటు పొదుపు కోసం పాటించాల్సిన విధానాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

ఏసీ పెంచేయొద్దు

రాష్ట్రంలో ప్రతి 100 ఇళ్లల్లో 24 ఇళ్లకు ఏసీలున్నట్టు ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) ఇటీవల వెల్లడించింది. రాష్ట్రంలో ఏసీలకు ఏటా దాదాపు 3 వేల మిలియన్ యూనిట్ల విద్యుత్ ఖర్చవుతోంది. ఇది రాష్ట్రం మొత్తం విద్యుత్ వినియోగంలో 5 శాతం. ఏసీ ఉష్ణోగ్రతను 24 డిగ్రీల సెల్సియస్‌కు పెట్టుకుంటే దేశంలో ఏటా రూ.10 వేల కోట్ల విలువైన దాదాపు 20 బిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఆదా చేయవచ్చని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) నివేదికలో పేర్కొంది. ఉష్ణోగ్రతలో 1 డిగ్రీ సెల్సియస్ పెరుగుదల వల్ల విద్యుత్తులో 6 శాతం ఆదా చేయవచ్చని అధ్యయనంలో తేలింది.

ఎల్ఈడీలు మేలు

ఎల్ఈడీ బల్బుల్లో విద్యుత్ సామర్థ్యం ఎక్కువ. అధిక నాణ్యతతో దీర్ఘకాలం మన్నుతాయి. ప్రకాశించే బల్బులతో పోల్చినప్పుడు 88 శాతం తక్కువ విద్యుత్‌ను వినియోగిస్తాయి. ఎల్ఈడీల లైటింగ్ టెక్నాలజీ సాధారణంగా ప్రకాశించే లైటింగ్ కంటే 25 రెట్లు ఎక్కువ ఉంటుంది. ఈ బల్బు వల్ల ఏడాదికి 73.7 యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుందని ఆంధ్రా విశ్వవిద్యాలయం, ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా చేసిన అధ్యయనంలో తేలింది.

విద్యుత్ ఆదాకు మరిన్ని చిట్కాలు



- పగటిపూట కర్టెన్లు తెరిచి, లైట్లకు బదులు సూర్యకాంతిని వినియోగించుకోండి.
- ఏసీ ఆన్‌లో ఉన్నప్పుడు కిటికీలు, తలుపులు తెరిచి ఉంచవద్దు.
- ఎండగా ఉన్నప్పుడు, డ్రైయర్‌ని ఉపయోగించకుండా దుస్తులు ఆరు బయట ఆరబెట్టుకోవాలి.
- లేత రంగు, వదులుగా ఉండే కర్టెన్లను ఉపయోగించాలి. పగలు కిటికీలు తెరిచి ఉంచాలి. సన్ ఫిల్మ్‌లు, కర్టెన్లు ఉన్న కిటికీలు ఉండాలి.
- ఎలక్ట్రిక్ ఐరన్, సీలింగ్ ఫ్యాన్ల కోసం సంప్రదాయ రెగ్యులేటర్లకు బదులు ఎలక్ట్రానిక్ రెగ్యులేటర్లను వాడాలి.
- సీలింగ్ ఫ్యాన్ల కంటే ఎక్కువ ఎత్తులో ఎగ్జాస్ట్ ఫ్యాన్లను ఇన్‌స్టాల్ చేయండి.
- ఏసీతో పాటు ఫ్యాన్‌ని ఆన్‌లో ఉంచండి. రూఫ్ గార్డెన్ ఎయిర్ కండీషనర్‌పై భారాన్ని తగ్గిస్తుంది.
- ఎలక్ట్రిక్ వాటర్ హీటర్‌కు బదులు సోలార్ వాటర్ హీటర్ ఉపయోగించండి.
- నియాన్ సైన్ బోర్డులకు బదులు పెయింట్ చేసిన సైన్ బోర్డులను ఉపయోగించండి.
- వ్యవసాయ బోర్లకు వాడే త్రీఫేజ్ మోటార్ టెర్మినల్స్ వద్ద షంట్ కెపాసిటర్‌లను అమర్చాలి.
- ఇంటి పైభాగంపై కూల్ సర్ఫేస్ పెయింట్ వేస్తే ఇంట్లో వేడితో పాటు ఏసీ వినియోగం తగ్గుతుంది.

బీఎల్‌డీసీ ఫ్యాన్లు వాడండి

సాధారణ ఫ్యాన్లతో పోలిస్తే బ్రష్ లెస్ డైరెక్ట్ కరెంటు (బీఎల్‌డీసీ) టెక్నాలజీతో పని చేసే సూపర్ ఎఫిషియెంట్ ఫ్యాన్లు దాదాపు సగం విద్యుత్ మాత్రమే వినియోగిస్తాయి. బీఎల్‌డీసీ ఫ్యాన్ 28 నుంచి 38 వాట్ల విద్యుత్‌ను మాత్రమే వినియోగిస్తుండగా.. సాధారణ సీలింగ్ ఫ్యాన్ 75 వాట్ల విద్యుత్ తీసుకుంటుంది. ఈ ఫ్యాన్ 9 నెలల పాటు రోజుకు 7 గంటల చొప్పున వినియోగిస్తే ఏడాదికి 81 యూనిట్లు ఆదా చేస్తుంది.

స్టార్ రేటింగ్ చూసి కొనండి

విద్యుత్ ఉపకరణాలు స్టార్ రేటెడ్‌వి వాడితే మరింతగా విద్యుత్‌ను ఆదా చేయవచ్చనే ఉద్దేశంతో స్టార్ లేబులింగ్ ప్రోగ్రామ్(ఎస్ఎల్‌పీ)ను 2006లో బీఈఈ ప్రారంభించింది. ఇంధన సామర్థ్యం ఆధారంగా ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు స్టార్ రేటింగ్‌ను (1–5 స్టార్‌లు) కేటాయిస్తుంది. 5 స్టార్ రేటింగ్ లేబుల్ ఉంటే అత్యంత సమర్థవంతమైన మోడల్‌గా సూచిస్తుంది. 5 స్టార్ రేటింగ్ పరికరాలు విద్యుత్ బిల్లులను ఆదా చేయడమే కాకుండా పర్యావరణానికి కూడా ప్రయోజనం చేకూర్చేందుకు దోహదపడతాయి.

– మిలింద్ డియోరా, సెక్రటరీ, బీఈఈ


రాష్ట్ర ఉత్సవాలుగా ప్రముఖుల జయంతి, వర్ధంతులు

అధికారిక క్యాలెండర్ జారీ

సాక్షి, అమరావతి: ప్రముఖుల జయంతి, వర్ధంతులను రాష్ట్ర ఉత్సవాలుగా నిర్వహించేందుకు వీలుగా 2025 ఏడాదికి సంబంధించిన క్యాలెండర్‌ను ప్రభుత్వం జారీ చేసింది. ఏ ఉత్సవానికి ఏ శాఖ నోడల్‌గా వ్యవహరించాలో సూచిస్తూ సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) ముఖ్యకార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర స్థాయిలోనూ, జిల్లా స్థాయిలోనూ అన్ని శాఖలు, శాఖాధిపతులు క్యాలెండర్‌లో పేర్కొన్న తేదీల్లో ఆయా జయంతి, వర్ధంతి ఉత్సవాలను సముచిత రీతిలో నిర్వహించాల్సిందిగా ఉత్తర్వుల్లో సూచించారు.

ఉత్సవం పేరు	తేదీ	నోడల్ శాఖ
ఒడ్డే ఓబన్న జయంతి	జనవరి 11	బీసీ సంక్షేమం
త్రిపురనేని రామ స్వామి చౌదరి జయంతి	జనవరి 15	యువజన సర్వీసులు
యోగి వేమన జయంతి	జనవరి 19	యువజన సర్వీసులు
శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం	మాఘ శుద్ధ విదియ	దేవదాయ
దామోదరం సంజీవయ్య జయంతి	ఫిబ్రవరి 14	బీసీ సంక్షేమం
ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి	ఫిబ్రవరి 22	యువజన సర్వీసులు
కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ (మొల్ల) జయంతి	మార్చి 13	యువజన సర్వీసులు
శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి	మార్చి 16	సాధారణ పరిపాలన
శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు జయంతి	మార్చి 28	యువజన సర్వీసులు
డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి	ఏప్రిల్ 5	సాంఘిక సంక్షేమం
శ్రీ మహాత్మా జ్యోతిబా పూలే జయంతి	ఏప్రిల్ 11	బీసీ సంక్షేమం
డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతి	ఏప్రిల్ 14	సాంఘిక సంక్షేమం
మహాత్మా బసవేశ్వర జయంతి	అక్షయ తృతీయ (ఏప్రిల్-మే)	యువజన సర్వీసులు
శ్రీ అల్లూరి సీతారామరాజు వర్ధంతి	మే 7	యువజన సర్వీసులు
శ్రీ అల్లూరి సీతారామరాజు జయంతి	జూలై 4	యువజన సర్వీసులు
బళ్లారి రాఘవ (తాడిపత్రి రాఘవాచార్యులు) జయంతి	ఆగస్టు 2	యువజన సర్వీసులు
ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి	ఆగస్టు 23	సాధారణ పరిపాలన
శ్రీ విశ్వకర్మ జయంతి	సెప్టెంబర్ 17	బీసీ సంక్షేమం
వాల్మీకి మహర్షి జయంతి	ఆశ్వయుజ (పౌర్ణమి-అక్టోబర్)	బీసీ సంక్షేమం
జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి	నవంబర్ 11	మైనారిటీ సంక్షేమం
సాధువు కనకదాస జయంతి	నవంబర్ 18	బీసీ సంక్షేమం
శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి (ఆత్మార్పణ దినోత్సవం)	డిసెంబర్ 15	సాధారణ పరిపాలన

బాల్య వివాహాల కట్టడిపై కేంద్రం దృష్టి



ఆధారం: నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో

2022 వరకు మూడేళ్లలో 2,837 బాల్య వివాహాలు
తెలంగాణలో 170, ఏపీలో 77 నమోదు
అత్యధికంగా కర్ణాటకలో 672, తమిళనాడులో 401 కేసులు

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో బాల్య వివాహాలను అరికట్టడానికి, బాల్య వివాహాలతో సంబంధం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి కేంద్రం సంబంధిత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తోంది. అందులో భాగంగా 2024 నవంబర్ 27న 'బాల్ వివాహ ముక్త్ భారత్' ప్రచారాన్ని ప్రారంభించింది. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అవగాహన పెంపొందించడం, ఈ ఘటనలు ఎక్కడ జరిగినా నిరోధించేలా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సహకారం అందించడం వంటి చర్యలను కేంద్రం చేపట్టింది. బాల్య వివాహాల నిషేధ పర్యవేక్షణ అధికారులను నియమించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఇచ్చింది. మరోవైపు కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి వ్యవహారాల మంత్రిత్వ శాఖలో 'మిషన్ శక్తి' పథకం కింద బేటీ బచావో బేటీ పఢావో పథకాన్ని అమలు చేస్తోంది. నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ కూడా బాల్య వివాహాలను అరికట్టే విషయంలో ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా 1098 అనే నెంబర్‌తో చైల్డ్ హెల్ప్‌లైన్‌ను ప్రవేశపెట్టింది. మరోవైపు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో వద్ద అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, 2020 నుంచి 2022 వరకు మూడేళ్లలో దేశంలో 2,837 బాల్య వివాహాలు జరిగాయి. ఇందులో అత్యధికంగా 2021లో 1,050 కేసులు నమోదయ్యాయి. రాష్ట్రాల పరంగా చూస్తే ఈ మూడేళ్లలో అత్యధికంగా కర్ణాటకలో 672 , తమిళనాడులో 401, పశ్చిమబెంగాల్‌లో 324 కేసులు నమోదయ్యాయి. తెలంగాణలో 170, ఆంధ్రప్రదేశ్‌లో 77 బాల్య వివాహాలు జరిగాయి.

గోదావరి డెల్టా సీఈగా వి.కృష్ణారావు

సాక్షి, అమరావతి: రాష్ట్ర జలవనరుల శాఖలో ఎస్ఈగా పనిచేస్తున్న వి.కృష్ణారావుకు ప్రభుత్వం తాత్కాలిక పదోన్నతి కల్పించింది. గోదావరి డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజినీర్‌గా నియమించింది. ఈఈగా పనిచేస్తున్న ఆర్.శివరామకృష్ణకు ఎస్ఈగా అడ్‌హక్ పదోన్నతి కల్పించి హైడ్రాలజీ సీఈ కార్యాలయంలో నియమించింది. ఈ మేరకు జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

గిరిజన ప్రాంతాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర!

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు విమర్శ

సాక్షి, అమరావతి: గిరిజన ప్రాంతాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గురువారం మండిపడ్డారు. విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ, రంపచోడవరంలో బుధవారం ఐటీడీఏ వర్క్‌షాప్‌నకు జర్నలిస్టులు రాకుండా అడ్డుకుని, టీడీపీ ఎమ్మెల్యేలు, నాయకులతో మాట్లాడించి నోట్ తయారు చేసి విడుదల చేయడం అనుమానాలకు తావిస్తోందన్నారు. అభివృద్ధి, టూరిజం మాటున ఏజెన్సీ ప్రాంతంలోని ఖనిజ సంపదను దోచుకోవడమే ఐటీడీఏ రహస్య సమావేశం ఉద్దేశమన్నారు. శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు 1 ఆఫ్ 70 చట్టానికి వ్యతిరేకంగా మాట్లాడటం, ఏజెన్సీలో గిరిజనేతరులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గిరిజన ఎమ్మెల్యేతో అసెంబ్లీలో చెప్పించడం అంతా పథకం ప్రకారం జరుగుతున్న కుట్ర అన్నారు. ఏప్రిల్ 13న విజయవాడలో సొసైటీ ఫర్ కమ్యూనల్ హార్మని సంస్థ నిర్వహిస్తున్న సమైఖ్యతా శంఖారావానికి పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు.

విశాఖ స్టీల్ పై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలి

సాక్షి, అమరావతి: విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖ ఉక్కును కాదని, మిట్టల్ స్టీల్ ప్లాంట్ కోసం కూటమి ప్రభుత్వం పాకులాట తగదన్నారు. అనకాపల్లిలో ఏర్పాటు చేయనున్న మిట్టల్ స్టీల్‌కు క్యాపిటివ్ మైన్స్, పోర్టు కేటాయించ వలసిందిగా పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరటం సరైంది కాదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీ కరణను నిరసిస్తూ ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నప్పటికీ ప్రభుత్వాలకు పట్టకపోవడం శోచనీయ మన్నారు.విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించి, అభివృద్ధి చేయకపోతే పాలకులు చరిత్ర హీనులుగా మిగిలిపోవటం ఖాయమని ఆయన హెచ్చరించారు.

కారు డ్రైవర్ దారుణ హత్య

- మృతదేహాన్ని చెత్తకుప్పల్లో పడేసిన వైనం
- పోలీసుల అదుపులో నిందితులు

నెల్లూరు(క్రైమ్): ఓ కారు డ్రైవర్‌ను కొందరు దారుణంగా హత్య చేశారు. మృతదేహం ఎవరికీ కనిపించకుండా ఉండేందుకు తొలుత శ్మశానంలో పూడ్చిపెట్టాలని చూశారు. వీలుకాకపోవడంతో చెత్తకుప్పలో పడేసి గోతాన్ని కప్పి పరారయ్యారు. ఈ ఘటన నెల్లూరు ప్రగతినగర్ ఏ–బ్లాక్‌లో చోటుచేసుకుంది. గురువారం పోలీసులు, బాధితులు వెల్లడించిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా పామూరు మండలం తిరిగలదిన్నె గ్రామానికి చెందిన మాధవ, జ్యోతి దంపతులకు వాసు (23), వాసవి సంతానం. మాధవ కుటుంబం 11 సంవత్సరాల క్రితం నెల్లూరు నగరానికి వలసొచ్చింది. వారు ప్రస్తుతం ప్రగతినగర్ ఏ–బ్లాక్‌లో నివాసం ఉంటున్నారు. మాధవ ఓ ప్రైవేట్ హాస్పిటల్లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. వాసు కారు డ్రైవర్‌గా పనిచేస్తూ చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. పలువురితో అతడికి గొడవలున్నాయి. పని ఉందంటూ వాసు బుధవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి ఏడు గంటల సమయంలో తండ్రికి ఫోన్ చేసి పని మీద ఉన్నానని ఇంటికి రావడం ఆలస్యమవుతుందని చెప్పాడు. అర్ధరాత్రి ఓ యువకుడిపై వాసు కత్తితో దాడి చేశాడు. సదరు యువకుడు ఈ విషయాన్ని అప్పటికే వాసు వల్ల ఇబ్బందులు పడుతున్న వినయ్, మణికంఠ, లోకేశ్ అలియాస్ ఛత్రపతి, తేజ, సంతోష్‌తోపాటు మరికొందరికి తెలియజేశాడు. అందరూ కలిసి వాసును ఆర్టీసీ బస్టాండ్ వద్ద పట్టుకుని ప్రగతినగర్ ఏ–బ్లాక్ పదో వీధిలోని దర్గా వద్దకు తీసుకొచ్చి కత్తులతో విచక్షణారహితంగా పొడిచి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని వెంగళరావ్‌నగర్ సమీప చెరువులో పూడ్చిపెట్టేందుకు తీసుకెళ్లగా అక్కడ జన సంచారం ఉండటంతో ప్రగతినగర్ పదో వీధి కింద చెరువు సమీపంలోని చెత్తకుప్పలో పడేశారు. మృతదేహం కనిపించకుండా ఉండేందుకు పెద్ద చెత్త మూటను పైన వేసి పరారయ్యారు. గురువారం ఉదయం అటుగా వెళుతున్న స్థానికులు చెత్తకుప్పలో మృతదేహం ఉండటాన్ని గమనించి దర్గామిట్ట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. తండ్రి మాధవ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. సాంకేతికత ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించారు. కొందరిని ఇప్పటికే అదుపులోకి తీసుకోగా మిగిలిన వారికోసం గాలింపు చర్యలు చేపట్టారు.





శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 14 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 62,076 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 23,698 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.27 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

మాచర్లరూరల్: చరిత్రలో పల్నాడు ప్రసిద్ధి చెందిన పల్నాటి ప్రజల ఆరాధ్య దైవం శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి వారి బ్రహ్మోత్సవాలలో ఎటువంటి ఆటంకం లేకుండా అన్ని శాఖల అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావులు ఆదేశించారు. గురువారం పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ వద్ద ఏర్పాట్లను వారు పరిశీలించి మాట్లాడారు. చెన్నకేశవుని ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పించాలని, ముఖ్యంగా 12వ తేదీన జరిగే కల్యాణ మహోత్సవం, అలాగే వేలాది మంది పాల్గొనే రథోత్సవంలో తీసుకోవాల్సిన జాగ్రతలపై అధికారులతో మాట్లాడారు.

తెప్పోత్సాహం



తిరుపతిలోని శ్రీకోదండరామస్వామి తెప్పోత్సవాలు గురువారం శ్రీరామచంద్ర పుష్కరిణిలో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం శ్రీసీతా లక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను సర్వాంగసుందరంగా అలంకరించి శ్రీరామచంద్ర పుష్కరిణికి వేంచేపు చేశారు. అక్కడ రాత్రి 7 నుంచి 8 గంటల వరకు తెప్పోత్సవం చేపట్టారు.

– తిరుపతి కల్చరల్



శ్రమిస్తేనే పోటీ ప్రపంచంలో ముందుకు

తిరుపతి సిటీ: విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించి, పోటీ ప్రపంచంలో ముందుకుపోయేందుకు శ్రమించాలని ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతినాయుడు పిలుపునిచ్చారు. గురువారం ఎస్వీ ఆర్ట్స్ కళాశాల 80వ వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. అకడమిక్ విద్యతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, రీజనింగ్ వంటి వాటిపై పట్టు సాధించినప్పుడే పోటీ ప్రపంచంలో ఉన్నత శిఖరాలు అధిరోహించగలరన్నారు. తద్వారా కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తేవాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం గర్వంగా ఉందన్నారు.

సమాజ హితమే సాహిత్యం పరమావధి

అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్

తాడేపల్లి రూరల్: మాతృ భాషలు మృత భాషలు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పేర్కొన్నారు. ఏ ప్రాంత సంస్కృతి పరిరక్షించబడాలన్నా ఆ ప్రాంత భాష ముందుగా రక్షింపబడాలని తెలిపారు. వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో బీఏ (ఐఏఎస్) విభాగం ఆధ్వర్యంలో గురువారం 'ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ప్రక్రియలు, వాదాలు – సమాలోచన' పై ప్రారంభమైన 2 రోజుల అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సమాజ హితమే సాహిత్యం పరమావధి అని పేర్కొన్నారు.

డీసీహెచ్ఎస్ పరిధిలో పోస్టుల ప్రావిజనల్ మెరిట్‌లిస్ట్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా వైద్య విధాన పరిషత్(డీసీహెచ్ఎస్)లోని పలు పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రావిజనల్ మెరిట్ లిస్టులను ఆన్‌లైన్‌లో ఉంచినట్లు డీసీహెచ్ఎస్ పద్మాంజలి దేవి తెలిపారు. రెండు నెలల కిందట పలు పోస్టుల ఖాళీలను భర్తీ చేయాలన్న ఉద్దేశంతో వైద్యశాఖ నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. ఈ దరఖాస్తులకు సంబంధించిన ప్రావిజనల్ మెరిట్‌లిస్టును గురువారం సాయంత్రం ఆన్‌లైన్‌లో ఉంచామన్నారు. ఈ జాబితాను వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చున్నారు. ఇందులో అభ్యంతరాలుంటే ఈనెల 12వ తేదీలోపు కార్యాలయంలో సమర్పించాలని ఆమె సూచించారు.

వాట్ నెక్స్ట్?

చిత్ర పరిశ్రమలో విజయాలను బట్టి కొత్త అవకాశాలు వరిస్తుంటాయి. ఈ విషయంలో నటీనటులకు కొంత మినహాయింపు ఉంటుందని చెప్పొచ్చు. కానీ దర్శకుల పరిస్థితి అలా కాదు. హిట్స్ అనేవి వారి కెరీర్‌ని నిర్ణయిస్తుంటాయన్నది ఇండస్ట్రీ టాక్. ఒక్క హిట్టు పడితే వరుస ఆఫర్లు క్యూ కడతాయి. అదే ఫ్లాపులొస్తే మాత్రం వాట్ నెక్స్ట్? మనకు అవకాశం ఇచ్చే హీరో ఎవరు? నిర్మాత ఎవరు? వంటి ప్రశ్నలు వారిలో మెదులుతుంటాయి. మరికొందరు దర్శకులు హిట్ ఇచ్చినా నెక్స్ట్ ప్రాజెక్ట్ కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. ఈ నిరీక్షణ సమయం కొందరికి ఆరేళ్లు, నాలుగేళ్లు, మరికొందరికి మూడేళ్లు, ఇంకొందరికి రెండేళ్లు, ఏడాదిన్నర ఉంటోంది. మరి... 'వాట్ నెక్స్ట్' అంటే... ప్రస్తుతానికి 'నో ఆన్సర్'.


● కృష్ణవంశీ


● చంద్రశేఖర్ ఏలేటి


● వంశీ పైడిపల్లి


● సురేందర్ రెడ్డి


● కిశోర్ తిరుమల


● శ్రీకాంత్ అడ్డాల


● పరశురాం

రెండేళ్లు దాటినా...

కృష్ణవంశీ పేరు చెప్పగానే కుటుంబ కథా చిత్రాలు గుర్తొస్తాయి. బంధాలు, బంధుత్వాలు, అనురాగం, ఆప్యాయతలు, భావోద్వేగాలను తనదైన శైలిలో అందంగా తెరకెక్కించే క్రియేటివ్ దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు. అయితే 'చందమామ' (2007) సినిమా తర్వాత కృష్ణవంశీకి చెప్పుకోదగ్గ హిట్ పడలేదు. 2017లో వచ్చిన 'నక్షత్రం' సినిమా తర్వాత దాదాపు ఆరేళ్ల గ్యాప్ తీసుకున్న అనంతరం ఆయన తెరకెక్కించిన చిత్రం 'రంగ మార్తాండ'. ప్రకాశ్‌రాజ్, రమ్యకృష్ణ, బ్రహ్మానందం కీలక పాత్రల్లో నటించారు. 2023 మార్చి 22న విడుదలైన ఈ సినిమా ప్రేక్షకుల చేత చప్పట్లు కొట్టించి, కన్నీరు పెట్టించింది. ఈ సినిమా విడుదలై రెండేళ్లు దాటినా కృష్ణవంశీ తర్వాతి ప్రాజెక్టుపై ఇప్పటివరకూ ఎలాంటి అధికారిక ప్రకటన లేదు.

నాలుగు సంవత్సరాలు దాటినా...

తెలుగు చిత్ర పరిశ్రమలో వైవిధ్యమైన చిత్రాలకు కేరాఫ్‌గా పేరు సొంతం చేసుకున్నారు చంద్రశేఖర్ ఏలేటి. 'ఐతే' (2003) మూవీ ద్వారా డైరెక్టర్‌గా పరిచయమయ్యారాయన. ఇండస్ట్రీలో రెండు దశాబ్దాలకుపైగా కెరీర్ పూర్తి చేసుకున్న చంద్రశేఖర్ తీసింది కేవలం ఏడు సినిమాలు (ఐతే, అనుకోకుండా ఒక రోజు, ఒక్కడున్నాడు, ప్రయాణం, సాహసం, మనమంతా, చెక్) మాత్రమే. వీటిలో 'ఐతే, అనుకోకుండా ఒకరోజు, సాహసం' సినిమాలు విజయాలు అందుకున్నాయి. 'ఒక్కడున్నాడు, ప్రయాణం, మనమంతా' వంటివి మంచి చిత్రాలుగా నిలిచాయి. ఇక నితిన్ హీరోగా చంద్రశేఖర్ ఏలేటి దర్శకత్వం వహించిన 'చెక్' సినిమా 2021 ఫిబ్రవరి 26న విడుదలై ప్రేక్షకులను నిరాశపరచింది. ఈ చిత్రం విడుదలై నాలుగు సంవత్సరాలు దాటినా ఆయన తర్వాతి సినిమాపై ఇప్పటికీ ఎలాంటి స్పష్టత లేదు.

ఆరేళ్లు అవుతున్నా...

తెలుగు చిత్ర పరిశ్రమలో దర్శకుడిగా పద్దెనిమిదేళ్ల ప్రయాణం వంశీ పైడిపల్లిది. ప్రభాస్ హీరోగా నటించిన 'మున్నా' (2007) మూవీతో డైరెక్టర్‌గా ఎంట్రీ ఇచ్చారాయన. ఇన్నేళ్ల కెరీర్‌లో తెలుగులో ఇప్పటివరకూ ఆయన తీసింది ఐదు చిత్రాలే (మున్నా, బృందావనం, ఎవడు, ఊపిరి, మహర్షి) అయినా అన్నీ విజయాలు అందుకున్నాయి. తమిళ స్టార్ హీరోల్లో ఒకరైన విజయ్‌తో తమిళంలో 'వారిసు' (తెలుగులో వారసుడు) సినిమా చేశారు. ఈ చిత్రం 2023 సంక్రాంతి కానుకగా జనవరి 11న రిలీజై తమిళంలో సూపర్ హిట్‌గా నిలిచింది. మహేశ్‌బాబు హీరోగా నటించిన 'మహర్షి' (2019) వంటి హిట్ సినిమా తర్వాత వంశీ పైడిపల్లి మరో తెలుగు సినిమా చేయలేదు. అలాగే తమిళంలోనూ 'వారిసు' తర్వాత అక్కడ కూడా ఏ మూవీ కమిట్ కాలేదు. తెలుగులో ఆయన సినిమా విడుదలై దాదాపు ఆరేళ్లు కావస్తున్నా తర్వాతి ప్రాజెక్టుపై ఇప్పటివరకూ క్లారిటీ లేదు. ఆ మధ్య మహేశ్‌బాబుతో మరో సినిమా చేయనున్నారనే వార్తలు వచ్చినా ఎలాంటి ప్రకటన లేదు. అదే విధంగా షాహిద్ కపూర్ హీరోగా హిందీలో వంశీ పైడిపల్లి ఓ మూవీ తెరకెక్కించనున్నారని బాలీవుడ్‌లో వినిపించినా ఈ ప్రాజెక్టు గురించి ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. మరి... వంశీ పైడిపల్లి తర్వాతి చిత్రం తెలుగులోనా? తమిళంలోనా? బాలీవుడ్‌లోనా? అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడకతప్పదు.

మూడేళ్లయినా...

మాస్ సినిమాలు తీయడంలో, హీరోలకు మాస్ ఎలివేషన్స్ ఇవ్వడంలోనూ సురేందర్ రెడ్డి శైలి ప్రత్యేకమనే చెప్పాలి. కల్యాణ్‌రామ్ హీరోగా రూపొందిన 'అతనొక్కడే' (2005) సినిమాతో దర్శకుడిగా పరిచయమయ్యారు సురేందర్ రెడ్డి. 'అతనొక్కడే, కిక్, రేసు గుర్రం, ధృవ, సైరా నరసింహారెడ్డి' వంటి విజయవంతమైన సినిమాలను తన ఖాతాలో వేసుకుని ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్న ఆయన తర్వాతి ప్రాజెక్ట్ ఏంటి? అనేదానిపై స్పష్టత లేదు. అఖిల్ హీరోగా సురేందర్ రెడ్డి తెరకెక్కించిన 'ఏజెంట్' సినిమా 2023 ఏప్రిల్ 28న రిలీజైంది. భారీ ఓపెనింగ్స్‌తో విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద అంచనాలు అందుకోలేకపోయింది. ప్రస్తుతం 'లెనిన్' అనే సినిమా చేస్తున్నారు అఖిల్. అయితే 'ఏజెంట్' తర్వాత సురేందర్ రెడ్డి తెరకెక్కించనున్న మూవీపై ఇప్పటివరకూ ఒక్క ప్రకటన కూడా రాలేదు. ఫలానా హీరోతో ఆయన తర్వాతి సినిమా ఉంటుందనే టాక్ కూడా ఇప్పటి వరకూ రాలేదు.

ఏడాది దాటినా....

టాలీవుడ్‌లో దాదాపు పదిహేన్నేళ్ల ప్రయాణం పరశురామ్‌ది. నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా వచ్చిన 'యువత' (2008) సినిమాతో డైరెక్టర్‌గా పరిచయమయ్యారాయన. ఆ తర్వాత 'ఆంజనేయులు, సోలో, సారొచ్చారు, శ్రీరస్తు శుభమస్తు, గీత గోవిందం, సర్కారువారి పాట, ఫ్యామిలీ స్టార్' వంటి సినిమాలు తీశారు పరశురామ్. విజయ్ దేవరకొండ హీరోగా ఆయన తెరకెక్కించిన 'గీత గోవిందం' (2018) సినిమా బ్లాక్‌బస్టర్ అందుకోవడంతో పాటు వంద కోట్లకుపైగా వసూళ్లు రాబట్టింది. ఆ సినిమా హిట్ అయినా నాలుగేళ్లు వేచి చూశారాయన. ఆ తర్వాత మహేశ్ బాబుతో 'సర్కారువారి పాట' (2022) సినిమా తీసి, హిట్ అందుకున్నారు. 'గీత గోవిందం' వంటి హిట్ మూవీ తర్వాత విజయ్ దేవరకొండ హీరోగా 'ఫ్యామిలీ స్టార్' అనే చక్కని కుటుంబ కథా చిత్రం తీశారు పరశురామ్. 2024 ఏప్రిల్ 5న విడుదలైన ఈ సినిమా మంచి విజయం అందుకుంది. అయితే ఈ సినిమా రిలీజై ఏడాది దాటినా ఆయన తర్వాతి సినిమాపై ఇప్పటికీ స్పష్టత లేదు. 'ఫ్యామిలీ స్టార్' నిర్మించిన నిర్మాత 'దిల్' రాజు బ్యానర్‌లోనే పరశురామ్ మరో సినిమా చేసే అవకాశం ఉందని వార్తలొచ్చినా ఎలాంటి ప్రకటన లేదు. అదే విధంగా కార్తీ హీరోగా పరశురామ్ ఓ సినిమా చేయనున్నారనే వార్తలు కూడా గతంలో వచ్చాయి. కానీ, ఈ ప్రాజెక్ట్‌పైనా ఎలాంటి అప్‌డేట్ లేదు.

మూడేళ్లు పూర్తయినా....

అందమైన కుటుంబ కథా చిత్రాలతో పాటు సున్నితమైన ప్రేమకథలను తెరకెక్కించడంలో కిశోర్ తిరుమల శైలే వేరు. రామ్ హీరోగా ఆయన తెరకెక్కించిన 'నేను శైలజ' (2016) మూవీ సూపర్ హిట్‌గా నిలిచింది. ఆ సినిమా తర్వాత కిశోర్ తిరుమలని మరో హిట్ వరించలేదు. శర్వానంద్, రష్మికా మందన్నా జోడీగా ఆయన దర్శకత్వం వహించిన 'ఆడవాళ్లు మీకు జోహార్లు' చిత్రం 2022 మార్చి 4న రిలీజైంది. మంచి అంచనాల మధ్య విడుదలైన ఈ మూవీ ప్రేక్షకులను నిరాశపరిచింది. ఈ సినిమా విడుదలై మూడేళ్లు పూర్తయినా ఆయన నెక్స్ట్ ప్రాజెక్ట్‌పై ఎలాంటి ప్రకటన లేదు. హీరో రవితేజతో ఓ సినిమా చేయనున్నారనే వార్తలు వినిపించినప్పటికీ ఇప్పటికీ స్పష్టత లేదు.

ఒకటిన్నర సంవత్సరమైనా...

అందమైన ప్రేమకథలే కాదు... చక్కని కుటుంబ కథా చిత్రాలు తీయడంలో దిట్ట శ్రీకాంత్ అడ్డాల. 'కొత్తబంగారు లోకం, సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, ముకుంద, బ్రహ్మోత్సవం' వంటి చిత్రాల తర్వాత తన పంథా మార్చి 'నారప్ప, పెదకాపు 1' వంటి మాస్ సినిమాలు తీశారాయన. ఆ చిత్రాలు అనుకున్నంత విజయాలు సాధించలేదు. 'పెదకాపు 1' చిత్రం 2023 సెప్టెంబర్ 29న రిలీజైంది. ఈ మూవీకి సీక్వెల్‌గా 'పెదకాపు 2' ఉంటుందని చిత్ర యూనిట్ గతంలో ప్రకటించింది. అయితే రెండో భాగంపై ఇప్పటివరకూ ఎలాంటి అప్‌డేట్ లేదు. మరి శ్రీకాంత్ అడ్డాల తర్వాతి చిత్రంగా 'పెదకాపు 2' ఉంటుందా? లేకుంటే మరో ప్రాజెక్ట్‌ని ప్రకటిస్తారా? అనేది వేచి చూడాలి.


● మెహర్ రమేష్

ఏడాదిన్నరగా...

'ఆంధ్రావాలా' (వీర కన్నడిగ), 'ఒక్కడు' (అజయ్) వంటి తెలుగు సినిమాల కన్నడ రీమేక్‌తో శాండిల్‌వుడ్‌కి దర్శకుడిగా పరిచయమయ్యారు మెహర్ రమేశ్. ఎన్టీఆర్ హీరోగా రూపొందిన 'కంత్రీ' (2008) చిత్రం ద్వారా తెలుగులోకి ఎంట్రీ ఇచ్చారాయన. ఆ తర్వాత ప్రభాస్ హీరోగా 'బిల్లా' (2009) చిత్రాన్ని తెరకెక్కించారు మెహర్ రమేశ్. తెలుగులో 'శక్తి, షాడో, భోళా శంకర్' వంటి సినిమాలు, కన్నడలో 'వీర రణచండి' (2017) మూవీ తెరకెక్కించారు. వెంకటేశ్ హీరోగా ఆయన తీసిన 'షాడో' (2013) సినిమా డిజాస్టర్ కావడంతో దాదాపు పదేళ్లు ఒక్క సినిమా కూడా చేయలేదు. అయితే లాంగ్ గ్యాప్ తర్వాత తెలుగు స్టార్ హీరోల్లో ఒకరైన చిరంజీవితో 'భోళా శంకర్' సినిమా చేసే అవకాశం అందుకున్నారు మెహర్ రమేశ్. 2023 ఆగస్టు 11న భారీ అంచనాలతో విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకుల అంచనాలను అందుకోలేకపోయింది. ఈ సినిమా రిలీజై ఏడాదిన్నరకుపైగా అయినా ఇప్పటికీ తన తర్వాతి సినిమా గురించి ఎలాంటి అప్‌డేట్ ఇవ్వలేదు మెహర్ రమేశ్.

ఏడాదిన్నర దాటినా...

'నిన్ను కోరి, మజిలీ' వంటి బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకున్నారు శివ నిర్వాణ. ఆ తర్వాత 'టక్ జగదీష్, ఖుషి' సినిమాలు తీశారాయన. విజయ దేవరకొండ హీరోగా శివ నిర్వాణ దర్శకత్వం వహించిన 'ఖుషి' సినిమా 2023 సెప్టెంబరు 1న విడుదలై విజయం అందుకుంది. ఆ చిత్రం రిలీజై ఏడాదిన్నర దాటిపోయినా శివ నిర్వాణ నెక్స్ట్ ప్రాజెక్ట్ గురించి ఎలాంటి అప్‌డేట్ లేదు.


● అజయ్ భూపతి

తొలి చిత్రం 'ఆర్‌ఎక్స్ 100' (2018) సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకున్నారు డైరెక్టర్ అజయ్ భూపతి. ఆ తర్వాత 'మహాసముద్రం' (2021) సినిమాతో ప్రేక్షకులను నిరాశపరిచన ఆయన 'మంగళవారం' (2023) సినిమాతో మరో హిట్‌ని తన ఖాతాలో వేసుకున్నారు. ఆ సినిమా విడుదలై ఏడాదిన్నర కావస్తున్నా ఆయన తర్వాతి చిత్రంపై ఎలాంటి అప్‌డేట్ లేదు. అయితే 'మంగళవారం' సినిమాకి సీక్వెల్ ఉంటుందని, ఈ మూవీ ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఆయన బిజీగా ఉన్నారని ఫిల్మ్‌నగర్ టాక్.

వీరే కాదు... మరికొందరు దర్శకుల తర్వాతి సినిమాలపైనా ఎలాంటి ప్రకటన లేదు.

- దేరంగుల జగన్ మోహన్

జోడీ రిపీట్?

అల్లు అర్జున్, సమంత మరోసారి సిల్వర్ స్క్రీన్‌పై జంటగా కనిపించే అవకాశాలు ఉన్నాయనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో తెరపైకి వచ్చింది. 'సన్నాఫ్ సత్యమూర్తి' సినిమాలో అల్లు అర్జున్, సమంత తొలిసారిగా జోడీ కట్టారు. ఆ తర్వాత అల్లు అర్జున్ హీరోగా నటించిన 'పుష్ప: ది రైజ్' చిత్రంలోని ప్రత్యేక గీతం 'ఊ అంటావా...'లో అల్లు అర్జున్, సమంత కలిసి కొన్ని డ్యాన్స్ స్టెప్పులేశారు. తాజాగా ఈ జోడీ మరోసారి రిపీట్ కానుందట. అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. కళానిధి మారన్ సమర్పణలో సన్ పిక్చర్స్ ఈ సినిమాను నిర్మించనుంది. ఈ ఏడాది ద్వితీయార్ధంలో ఈ సినిమా చిత్రీకరణను మొదలు పెట్టాలనుకుంటున్నారట. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఈ చిత్రంలో ఇద్దరు మెయిన్ హీరోయిన్స్, మరో ముగ్గురు అమ్మాయిలు కీలక పాత్రల్లో నటించనున్నారట. ఈ మెయిన్ హీరోయిన్స్‌లోని ఒక రోల్ కోసం సమంతను తీసుకోవాలని చిత్రయూనిట్ ప్లాన్ చేస్తోందని సమాచారం. మరి... అల్లు అర్జున్, సమంతల జోడీ మరోసారి స్క్రీన్‌పై రిపీట్ అవుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ. ఈ సంగతి ఇలా ఉంచితే... అట్లీ దర్శకత్వంలో వచ్చిన 'తేరీ' (తెలుగులో 'పోలీసోడు'), 'మెర్సల్' (అదిరింది) చిత్రాల్లో సమంత ఓ హీరోయిన్‌గా నటించిన విషయం గుర్తుండే ఉంటుంది.


● సమంత

ఓ తల్లి తపన

రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'తల్లి మనసు'. సీనియర్ డైరెక్టర్ ముత్యాల సుబ్బయ్య వద్ద దర్శకత్వ విభాగంలో పని చేసిన వి.శ్రీనివాస్ (సిప్పీ) ఈ చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయమయ్యారు. ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిశోర్ నిర్మించిన తొలి చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై రూపొందిన ఈ చిత్రం ఈ జనవరి 24న విడుదల అయింది. కాగా ఈ చిత్రం ఈ నెల 14 నుంచి అమేజాన్ ప్రైమ్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఈ సందర్భంగా


● సాత్విక్, రచిత మహాలక్ష్మి

ముత్యాల అనంత కిశోర్ మాట్లాడుతూ– ''తల్లి ప్రేమకు ఏదీ సాటి రాదు. ఓ తల్లి తపన, భావోద్వేగాలను ఆవిష్కరిస్తూ తీసిన మా చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు వచ్చాయి. అమేజాన్ ఓటీటీ ద్వారా మరింత ఎక్కువ మంది కుటుంబ ప్రేక్షకులకు మా సినిమా చేరువవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.
ముత్యాల సుబ్బయ్య మాట్లాడుతూ– ''చాలాకాలం తర్వాత 'తల్లి మనసు' లాంటి ఓ మంచి చిత్రాన్ని చూశామని ప్రేక్షకులు చెప్పడం మా యూనిట్‌కు ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఇప్పుడు ఓటీటీ ద్వారా మిగతా ప్రేక్షకులకు దగ్గరవడం ద్వారా మా లక్ష్యం నెరవేరుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.

నగరంలో ఏం జరిగింది?

బాలీవుడ్ నటి ఆలియా భట్ ఓ వైపు హీరోయిన్‌గా నటిస్తూనే మరోవైపు నిర్మాతగానూ బిజీ అవుతున్నారు. ఎటర్నల్ సన్ షైన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌ని స్థాపించిన ఆమె తొలి సారి అమేజాన్ ప్రైమ్‌తో కలిసి 'పోచర్' అనే మలయాళ వెబ్ సిరీస్ నిర్మించిన సంగతి తెలిసిందే. రిచీ మెహతా దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌లో రోషన్ మాథ్యూ, దిబ్యేందు భట్టాచార్య, నిమిషా సజయన్, అంకిత్ మాధవ్ కీలక పాత్రల్లో నటించారు. 2015లో కేరళలో జరిగిన 'ఆపరేషన్ శిఖర్' నేపథ్యంలో క్రైమ్ డ్రామాగా రూపొందిన ఆ సిరీస్ ఎనిమిది ఎపిసోడ్స్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సిరీస్‌కి మంచి స్పందన దక్కింది కూడా. తాజాగా ఆమె మరోసారి నిర్మాతగా కొత్త సిరీస్ నిర్మించనున్నారని బాలీవుడ్ టాక్. అమేజాన్ ప్రైమ్‌తో కలిసి ఈ సిరీస్‌ను నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారట. ఒక నగరంలో జరిగే కథ ఆధారంగా రూపొందనున్న ఈ సిరీస్‌లో నలుగురు కుర్రాళ్లు ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారని టాక్. అడల్ట్ కంటెంట్ నేపథ్యంలో రూపొందనున్న ఈ సిరీస్ ద్వారా నలుగురు కొత్త కుర్రాళ్లు నటులుగా పరిచయం కానున్నారని బాలీవుడ్‌లో వినిపిస్తోంది.. ఇందుకోసం ప్రస్తుతం ఆడిషన్స్ చేస్తున్నారట. ఇదిలా ఉంటే.. ఆలియా భట్ ప్రస్తుతం 'ఆల్ఫా, లవ్ అండ్ వార్' వంటి సినిమాల్లో నటిస్తున్నారు.


● ఆలియా భట్



సింధు ఇంటికి...

● ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిన భారత స్టార్ షట్లర్
● కిరణ్ జార్జి, ప్రియాన్షు కూడా అవుట్

నింగ్బో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ వ్యక్తిగత చాంపియన్‌షిప్ సింగిల్స్ విభాగం నుంచి భారత క్రీడాకారులు రిక్తహస్తాలతో వెనుదిరిగారు. మహిళల సింగిల్స్‌లో ప్రపంచ మాజీ చాంపియన్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ పీవీ సింధు... పురుషుల సింగిల్స్‌లో కిరణ్ జార్జి, ప్రియాన్షు రజావత్ ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ఓటమి చవిచూశారు. గతంలో రెండుసార్లు ఈ టోర్నీలో కాంస్య పతకాలు సాధించిన సింధు ఈసారి మాత్రం నిరాశపరిచింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 17వ ర్యాంకర్ సింధు 12-21, 21-16, 16-21తో ప్రపంచ నాలుగో ర్యాంకర్, తన చిరకాల ప్రత్యర్థి అకానె యామగుచి (జపాన్) చేతిలో పోరాడి ఓడిపోయింది. 66 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సింధు తొలి గేమ్ కోల్పోయినా, వెంటనే తేరుకొని రెండో గేమ్‌లో నెగ్గి మ్యాచ్‌లో నిలిచింది. గతంలో 14 సార్లు అకానె యామగుచిపై నెగ్గిన సింధుకు నిర్ణాయక మూడో గేమ్‌లో గట్టిపోటీ లభించింది. కీలకదశలో యామగుచి పైచేయి సాధించి సింధుపై 12వ సారి విజయాన్ని అందుకుంది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో ప్రియాన్షు 14-21, 17-21తో ప్రపంచ ఏడో ర్యాంకర్ కొడాయ్ నరోకా (జపాన్) చేతిలో, కిరణ్ జార్జి 21-19, 13-21, 16-21తో ప్రపంచ ఐదో ర్యాంకర్ కున్లావుత్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలయ్యారు.



క్వార్టర్ ఫైనల్లో తనీషా-ధ్రువ్ జోడీ

మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల (భారత్) జోడీ పతకానికి విజయం దూరంలో నిలిచింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో తనీషా-ధ్రువ్ కపిల జంట 12-21, 21-16, 21-18తో యె హాంగ్ వె-నికోల్ గొంజాలెస్ చాన్ (చైనీస్ తైపీ) ద్వయంపై గెలిచి క్వార్టర్ ఫైనల్ చేరింది. ఐదో సీడ్ చున్ మాన్ టాంగ్-యింగ్ సుయెట్ సె (హాంకాంగ్) జోడీతో నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో తనీషా-ధ్రువ్ గెలిస్తే సెమీఫైనల్‌కు చేరుకొని కనీసం కాంస్య పతకాన్ని ఖరారు చేసుకుంటారు. మరో ప్రిక్వార్టర్ ఫైనల్లో అశిత్ సూర్య-అమృత (భారత్) జంట 11-21, 14-21తో టాప్ సీడ్ జియాంగ్ జెన్ బాంగ్-వె యా జిన్ (చైనా) చేతిలో ఓడిపోయారు. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో రూబన్ కుమార్-హరిహరన్ (భారత్) జంట 15-21, 14-21తో ఆరోన్ చియా-వుయ్ యిక్ సో (మలేసియా) జోడీ చేతిలో ఓడిపోయింది.

రష్మిక 'హ్యాట్రిక్'

● వరుసగా మూడో మ్యాచ్‌లోనూ నెగ్గిన హైదరాబాద్ టెన్నిస్ క్రీడాకారిణి
● హాంకాంగ్‌పై 2-1తో గెలిచిన భారత్



పుణే: అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్న హైదరాబాద్ టెన్నిస్ క్రీడాకారిణి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక బిల్లీ జీన్ కింగ్ కప్ మహిళల టీమ్ టోర్నీలో అదరగొడుతోంది. ఆసియా ఓసియానియా గ్రూప్-1లో భాగంగా గురువారం హాంకాంగ్‌తో జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు 2-1తో గెలుపొందింది. ఈ టోర్నీలో భారత్‌కిది రెండో విజయం. హాంకాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ సింగిల్స్‌లో ఒక మార్పు చేసింది. న్యూజిలాండ్, థాయ్‌లాండ్ జట్లతో జరిగిన మ్యాచ్‌ల్లో బరిలోకి దిగిన హైదరాబాద్ ప్లేయర్ సహజ యామలపల్లి స్థానంలో గుజరాత్‌కు చెందిన వైదేహి చౌధరీకి అవకాశం ఇచ్చారు. తొలి మ్యాచ్‌లో పోటీపడ్డ వైదేహి 2 గంటల 3 నిమిషాల్లో 7-6 (10/8), 6-1తో హో చింగ్ వుపై గెలిచి భారత్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించింది. రెండో మ్యాచ్‌లో బరిలోకి దిగిన శ్రీవల్లి రష్మిక 7-6 (8/6), 2-6, 6-3తో హాంగ్ యి కొడీ వోంగ్‌ను ఓడించి భారత్‌కు 2-0తో విజయాన్ని ఖరారు చేసింది. 2 గంటల 27 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక ఎనిమిది ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తొలి సర్వీలో 43 పాయింట్లు సాధించిన రష్మిక రెండో సర్వీలో 14 పాయింట్లు సంపాదించింది. తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయిన రష్మిక, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో, థాయ్‌లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా రష్మిక సింగిల్స్‌లో విజయం అందుకుంది. ఫలితం తేలిపోవడంతో నామమాత్రమైన మూడో మ్యాచ్‌లో అంకిత రైనా-ప్రార్థన తొంబారే (భారత్) జోడీ పోరాడినా చివరకు విజయానికి దూరమైంది. 2 గంటల 2 నిమిషాలపాటు జరిగిన డబుల్స్ మ్యాచ్‌లో అంకిత-ప్రార్థన ద్వయం 7-6 (7/2), 3-6, 11-13తో 'సూపర్ టైబ్రేక్'లో యుడైస్ చోంగ్-హాంగ్ యి కొడీ వోంగ్ జంట చేతిలో ఓడిపోయింది.



హై పెర్ఫార్మెన్స్ శిబిరానికి ధృతి

సాక్షి, హైదరాబాద్: అండర్-19 స్థాయిలో నిలకడైన ప్రదర్శన చేస్తున్న తెలంగాణ ప్లేయర్లు గొంగడి త్రిష, కేసరి ధృతికి హై పెర్ఫార్మెన్స్ క్యాంప్ నుంచి పిలుపు వచ్చింది. బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో ఈ నెల 21 నుంచి మే 15 వరకు బీసీసీఐ అండర్-19 మహిళల హై పెర్ఫార్మెన్స్ క్యాంప్ జరగనుంది. దీని కోసం ఆలిండియా మహిళల సెలెక్షన్ కమిటీ తెలంగాణ నుంచి త్రిష, ధృతిని ఎంపిక చేసింది. ఈ ఏడాది ఆరంభంలో మలేసియా వేదికగా జరిగిన ఐసీసీ మహిళల అండర్-19 టి20 ప్రపంచకప్‌లో వీరిద్దరూ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ఓపెనర్‌గా బరిలోకి దిగి 309 పరుగులతో టోర్నమెంట్ టాప్ స్కోరర్‌గా నిలిచిన త్రిష 7 వికెట్లు సైతం పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు దక్కించుకుంది. ఇక ధృతి వరల్డ్ కప్ నెగ్గిన జట్టులో సభ్యురాలైనా... ఆమెకు తుది జట్టులో చోటు దక్కలేదు. హై పెర్ఫార్మెన్స్ క్యాంప్‌లో ప్లేయర్ల నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు... ఫిట్‌నెస్‌ను మరింత మెరుగు పర్చనున్నారు. దీని కోసం బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రత్యేక ప్రోగ్రామ్‌ను సిద్ధం చేశారు.

సురుచి-సౌరభ్ జోడీకి కాంస్యం

ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో భారత బృందానికి రెండో స్థానం





బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా): అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) తొలి ప్రపంచకప్ టోర్నమెంట్‌ను భారత బృందం రెండో స్థానంతో ముగించింది. టోర్నమెంట్ చివరిరోజు గురువారం భారత్‌కు ఒక కాంస్య పతకం లభించింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సురుచి ఇందర్ సింగ్-సౌరభ్ చౌధరీలతో కూడిన భారత జోడీ కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. కాంస్య పతక మ్యాచ్‌లో సురుచి-సౌరభ్ ద్వయం 16-8తో భారత్‌కే చెందిన మనూ భాకర్-రవీందర్ సింగ్ జంటపై విజయం సాధించింది. ఓవరాల్‌గా ఈ టోర్నీలో భారత్ నాలుగు స్వర్ణాలు, రెండు రజతాలు, రెండు కాంస్యాలతో కలిపి ఎనిమిది పతకాలతో రెండో స్థానంలో నిలిచింది.

వినేశ్‌కు రూ. 4 కోట్ల ప్రైజ్‌మనీ

హరియాణా రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు అంగీకారం

చండీగఢ్: పారిస్ ఒలింపిక్స్‌లో అధిక బరువు కారణంగా అనర్హతకు గురైన భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు హరియాణా రాష్ట్ర ప్రభుత్వం భారీ నగదు బహుమతి అందించనుంది. 2024 విశ్వక్రీడల మహిళల 50 కేజీల విభాగంలో వినేశ్ ఫొగాట్ ఫైనల్‌కు చేరగా... తుదిపోరుకు ముందు నిబంధనల విరుద్ధంగా నిర్ణీత బరువు కంటే 100 గ్రాములు ఎక్కువ ఉందనే కారణంతో ఆమెపై అనర్హత వేటు పడింది. దీంతో వినేశ్ పారిస్ ఒలింపిక్స్ నుంచి రిక్తహస్తాలతో వెనుదిరిగింది. తదనంతర పరిణామాల మధ్య రెజ్లింగ్‌కు రిటైర్మెంట్ ప్రకటించి రాజకీయాల్లో చేరిన వినేశ్... హరియాణాలోని జులానా నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్‌పై అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచింది. కాగా... ఒలింపిక్స్ ఫైనల్ చేరిన వినేశ్‌ను రజత పతకం గెలిచిన ప్లేయర్‌గానే భావిస్తామని గతంలోనే హరియాణా ప్రభుత్వం ప్రకటించింది. అందుకు తగ్గట్లే ఆమెకు పురస్కారం అందిస్తామని వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వ క్రీడా పాలసీ ప్రకారం వినేశ్‌కు 3 ఆఫర్లు కేటాయించగా... అందులో వినేశ్ రూ. 4 కోట్ల నగదు బహుమతిని ఎంచుకున్నట్లు సమాచారం. ఈ మేరకు క్రీడా మంత్రిత్వ శాఖకు ఆమె తన నిర్ణయాన్ని వెల్లడించింది. ఒలింపిక్స్‌లో రజతం గెలిచిన అథ్లెట్లకు హరియాణా ప్రభుత్వం... రూ. 4 కోట్ల ప్రైజ్‌మనీ, గ్రూప్-1 ఉద్యోగం, షెహ్రీ వికాస్ ప్రాధికారణ్ ఇంటి స్థలం రూపంలో మూడు ఆఫర్లను ప్రకటించడం ఆనవాయితీ. అందులో అథ్లెట్లు ఎంపిక చేసుకున్న దాన్ని వారికి కేటాయిస్తారు. మార్చి నెలలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో వినేశ్ ఈ అంశాన్ని గుర్తుచేసింది. 'వినేశ్ దేశానికి గర్వకారణం అని ముఖ్యమంత్రి గతంలో అన్నారు. రజత పతక విజేతతో సమానంగా సత్కరిస్తామని మాటిచ్చారు. డబ్బు ముఖ్యం కాదు... కానీ ఇది గౌరవానికి సంబంధించిన విషయం. ఇప్పటి వరకు సీఎం హామీ నెరవేరలేదు' అని వినేశ్ పేర్కొంది. దీంతో తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఆమెకు నగదు పురస్కారం ఇవ్వాలని నిర్ణయించింది.





నిగార్ సుల్తానా సూపర్ సెంచరీ

● థాయ్‌లాండ్‌పై బంగ్లాదేశ్ గెలుపు
● మహిళల వన్డే వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ టోర్నీ


లాహోర్: కెప్టెన్ నిగార్ సుల్తానా (80 బంతుల్లో 101; 15 ఫోర్లు, 1 సిక్స్) 'శత'క్కొట్టడంతో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో బంగ్లాదేశ్ జట్టు బోణీ కొట్టింది. గురువారం జరిగిన పోరులో బంగ్లాదేశ్ మహిళల జట్టు 178 పరుగుల తేడాతో థాయ్‌లాండ్‌పై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 271 పరుగులు చేసింది. వన్డేల్లో బంగ్లాదేశ్ జట్టుకిదే అత్యధిక స్కోరు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నిగార్ సుల్తానా ధనాధన్ షాట్లతో సెంచరీ పూర్తి చేసుకోగా... షర్మిన్ అక్తర్ (126 బంతుల్లో 94 నాటౌట్; 11 ఫోర్లు) శతకానికి 6 పరుగుల దూరంలో నిలిచిపోయింది. ఫర్జానా హక్ (53) అర్ధశతకంతో రాణించింది. థాయ్‌లాండ్ బౌలర్లను అలవోకగా ఎదుర్కొన్న బంగ్లాదేశ్ బ్యాటర్లు జట్టుకు మంచి స్కోరు అందించారు. అనంతరం లక్ష్యఛేదనలో థాయ్‌లాండ్ జట్టు 28.5 ఓవర్లలో 93 పరుగులకు ఆలౌటైంది. చనిడా సుతిరాంగ్ (22) టాప్ స్కోరర్ కాగా... మిగిలిన వాళ్లు విఫలమయ్యారు. బంగ్లాదేశ్ బౌలర్లలో ఫహీమా, జన్నతుల్ ఫిర్దోస్ చెరో 5 వికెట్లు ఖాతాలో వేసుకున్నారు. తదుపరి మ్యాచ్‌లో ఆదివారం ఐర్లాండ్‌తో బంగ్లాదేశ్ జట్టు తలపడుతుంది.

క్వార్టర్ ఫైనల్లో బోపన్న జోడీ

మోంటెకార్లో (మొనాకో): భారత టెన్నిస్ డబుల్స్ దిగ్గజ ప్లేయర్ రోహన్ బోపన్న మోంటెకార్లో ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. అమెరికా రైజింగ్ స్టార్ బెన్ షెల్టన్‌తో జత కట్టి ఈ టోర్నీలో బరిలోకి దిగిన బోపన్న ప్రిక్వార్టర్ ఫైనల్లో మూడో సీడ్ సిమోన్ బొలెలీ-ఆండ్రియా వావాసోరి (ఇటలీ) జోడీకి షాక్ ఇచ్చాడు. 96 నిమిషాలపాటు జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో బోపన్న-షెల్టన్ ద్వయం 2-6, 7-6 (7/4), 10-7తో 'సూపర్ టైబ్రేక్'లో బొలెలీ-వావాసోరి జోడీని బోల్తా కొట్టించింది. మూడు ఏస్‌లు సంధించిన బోపన్న-షెల్టన్ ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయిన ఈ ఇండో-అమెరికన్ జంట ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసింది. క్వార్టర్ ఫైనల్లో మాన్యుయెల్ గినార్డ్ (ఫ్రాన్స్)-రొమైన్ అర్నియోడో (మొనాకో)లతో బోపన్న-షెల్టన్ తలపడతారు. ఈ ఏడాది ఏడో టోర్నీలో ఆడుతున్న బోపన్న ప్రస్తుతం మోంటెకార్లో ఓపెన్‌లో, దోహా ఓపెన్‌లో మాత్రమే క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు.



సాకేత్-రామ్‌కుమార్ జంట పరాజయం



సాక్షి, హైదరాబాద్: మాడ్రిడ్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో భారత క్రీడాకారుల కథ ముగిసింది. భారత డేవిస్ కప్ జట్టు సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్ మైనేని, హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్, భారత ప్లేయర్ సిద్ధాంత్ బంతియా వేర్వేరు భాగస్వాములతో ఈ టోర్నీలో పోటీపడ్డారు. స్పెయిన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో గురువారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో సాకేత్-రామ్‌కుమార్ రామనాథన్ (భారత్) జంట 2-6, 4-6తో మూడో సీడ్ ఫ్రాన్సిస్కో కబ్రాల్ (పోర్చుగల్)-లుకాస్ మిడ్లెర్ (ఆస్ట్రియా) జోడీ చేతిలో ఓడిపోయింది. మరో క్వార్టర్ ఫైనల్లో అనిరుధ్ (భారత్)-డేవిడ్ వేగా హెర్నాండెజ్ (స్పెయిన్) జోడీ 4-6, 2-6తో ఇనిగో సెర్వాంటెస్ (స్పెయిన్)-డెనిస్ మొల్చనోవ్ (ఉక్రెయిన్) జంట చేతిలో పరాజయం పాలైంది. మరో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో సిద్ధాంత్ బంతియా (భారత్)-అలెగ్జాండర్ డాన్‌స్కీ (బల్గేరియా) ద్వయం 6-7 (2/7), 6-7 (4/7)తో ఒర్లాండో లుజ్ (బ్రెజిల్)-అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జంట చేతిలో ఓటమి పాలైంది. క్వార్టర్ ఫైనల్లో ఓడిన సాకేత్, అనిరుధ్, సిద్ధాంత్ జోడీలకు 1,470 యూరోల (రూ. 1 లక్ష 42 వేలు) చొప్పున ప్రైజ్‌మనీతోపాటు 20 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

రిత్విక్ ద్వయం శుభారంభం



3మెక్సికో సిటీ: భారత పురుషుల టెన్నిస్ డబుల్స్ నాలుగో ర్యాంకర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ మెక్సికో సిటీ ఓపెన్ ఏటీపీ చాలెంజర్-125 టోర్నమెంట్‌లో శుభారంభం చేశాడు. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో రెండో సీడ్ రిత్విక్ (భారత్)-నికోలస్ బరియంతోస్ (కొలంబియా) ద్వయం 3-6, 6-3, 10-7తో 'సూపర్ టైబ్రేక్'లో రే హో (చైనీస్ తైపీ)-క్రిస్టోఫర్ రొమియోస్ (ఆస్ట్రేలియా) జంటను ఓడించి క్వార్టర్ ఫైనల్ చేరింది. 78 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్-బరియంతోస్ ద్వయం రెండు ఏస్‌లు సంధించి, ఆరు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తొలి సర్వీలో 38 పాయింట్లకుగాను 29 పాయింట్లు, రెండో సర్వీలో 24 పాయింట్లకుగాను 11 పాయింట్లు సాధించింది.

సామ్సన్‌పై రూ. 24 లక్షల జరిమానా

అహ్మదాబాద్: రాజస్తాన్ రాయల్స్ కెప్టెన్ సంజూ సామ్సన్‌పై జరిమానా పడింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్‌లో భాగంగా బుధవారం గుజరాత్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్తాన్ జట్టు స్లో ఓవర్ రేట్‌కు పాల్పడినందుకుగానూ సామ్సన్‌పై ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ రూ. 24 లక్షలు జరిమానా విధించింది. రాయల్స్ జట్టు నిర్ణీత సమయంలో ఓవర్లు పూర్తి చేయకపోవడం ఈ సీజన్‌లో రెండోసారి కావడంతో భారీ జరిమానా పడింది. 'రాజస్తాన్ కెప్టెన్ సామ్సన్‌పై జరిమానా విధించాం. ఈ సీజన్‌లో రాయల్స్ జట్టు రెండోసారి స్లో ఓవర్ రేట్‌కు పాల్పడింది. దీంతో ఐపీఎల్ నియమావళిలోని 2.22 ఆర్టికల్ ప్రకారం జరిమానా విధించాం' అని ఐపీఎల్ ఒక ప్రకటనలో తెలిపింది. కెప్టెన్‌తో పాటు ఆటగాళ్లపై కూడా జరిమానా పడింది. ఇంపాక్ట్ ప్లేయర్ సహా ప్లేయర్లందరికి రూ. 6 లక్షలు లేదా మ్యాచ్ ఫీజులో 25 శాతం ఏది తక్కువ ఉంటే అది జరిమానాగా విధించింది. స్లో ఓవర్ రేట్ కారణంగా ఈ సీజన్‌లో కెప్టెన్‌లు హార్దిక్ పాండ్యా (ముంబై), రిషభ్ పంత్ (లక్నో), రియాన్ పరాగ్ (రాజస్తాన్), రజత్ పాటీదార్ (ఆర్‌సీబీ) జరిమానాకు గురయ్యారు.



రాష్ట్రపతి ముర్ముకు స్లొవేకియా వర్సిటీ గౌరవ డాక్టరేట్

బ్రాటిస్లావా: భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు స్లొవేకియా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. రాష్ట్రపతి ముర్ము స్లొవేకియాలో పర్యటిస్తుండటం తెల్సిందే. పోర్చుగల్, స్లొవేకియాల్లో నాలుగు రోజుల పర్యటనలో ఆఖరు రోజైన గురువారం చారిత్రక నిత్ర నగరంలో పర్యటించారు. ఈ సందర్భంగా కాన్‌స్టంటైన్ ది ఫిలాసఫర్ వర్సిటీ ముర్ముకు గౌరవ డాక్టరేట్ అందజేసింది. యూనివర్సిటీ సైంటిఫిక్ కౌన్సిల్ ఈ పురస్కారాన్ని ఆమెకు అందజేసింది. ప్రజలకు ముర్ము అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా డాక్టరేట్‌తో గౌరవిస్తున్నట్లు తెలిపింది. 140 కోట్ల భారతీయుల తరఫున ఈ గౌరవాన్ని స్వీకరిస్తున్నట్లు ముర్ము తెలిపారు. గతంలో బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు ఫెర్నాండో హెన్రిక్ కార్డొసో 2002లో ఈ డాక్టరేట్ అందుకున్నారు. ప్రముఖ తత్వవేత్త సెయింట్ కాన్‌స్టంటైన్ సిరిల్ పేరుతో ఏర్పాటైన ఈ వర్సిటీలో ఐదు ఫ్యాకల్టీలకు గాను 400 మంది అంతర్జాతీయ విద్యార్థులు సహా 7 వేల మంది విద్యార్థులున్నారు. స్లొవేకియాలోని అత్యంత ప్రాచీన నగరంగా నిత్రకు పేరుంది. అంతకు ముందు, రాష్ట్రపతి ముర్ము ప్రెసోవ్ నగరంలోని బబడ్లో పప్పెట్ థియేటర్‌లో ప్రదర్శించిన రామాయణం తోలు బొమ్మలాటను తిలకించారు. శ్రీకృష్ణుని భక్తురాలు, భారతీయ సంస్కృతిని అభిమానించే లెంకా ముకోవా అలియాస్ లేఖా స్రవంతి దేవిదాసి ఈ షోను రూపొందించారు. ఈ ప్రదర్శనకు 150 మంది స్లొవాక్ విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం భారతీయ పంచతంత్ర, జాతక కథలు ఇతివృత్తంగా స్లొవాక్ చిన్నారులు వేసిన పెయింటింగ్స్ ఎగ్జిబిషన్‌ను రాష్ట్రపతి ముర్ము తిలకించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడారు.



స్లొవేకియా రాజధాని బ్రాటిస్లావాలో గురువారం పెయింటింగ్స్ ఎగ్జిబిషన్‌ను సందర్శించిన సందర్భంగా చిన్నారులతో ముచ్చటిస్తున్న భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

మేం బాగుచేస్తే బీజేపీ నాశనం చేస్తోంది

ఢిల్లీలో విద్యుత్ సరఫరాపై అరవింద్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ: దేశరాజధాని ఢిల్లీలో తరచూ విద్యుత్ అంతరాయంపై ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ విరుచుకుపడ్డారు. పదేళ్ల పాలనలో ఆప్ ప్రభుత్వం మెరుగుపరిచిన వ్యవస్థను.. బీజేపీ ప్రభుత్వం నాశనం చేస్తోందని కేజ్రీవాల్ ఆరోపించారు. ''గత పదేళ్లలో ఢిల్లీలో విద్యుత్ వ్యవస్థను చాలా కష్టపడి చక్కదిద్దాం. ఏదైనా సరిచేయడానికి సంవత్సరాలు పడుతుంది. దాన్ని రెండు గంటల్లో దెబ్బతీయొచ్చు'' అని ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేశారు. గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 5462 మెగావాట్లతోనే బుధవారం విద్యుత్ సరఫరాలో కొరత ఏర్పడిందని, గత సంవత్సరం గరిష్ఠ డిమాండ్ సుమారు 8500 మెగావాట్లకు చేరుకుందని, అయినా తమ ప్రభుత్వ హయాంలో ఢిల్లీలో విద్యుత్ అంతరాయాలు లేవని పేర్కొన్నారు. రాబోయే వారాల్లో ఢిల్లీలో ఎండలు పెరిగి విద్యుత్ డిమాండ్ కూడా పెరుగుతుందని, ప్రభుత్వం దానిపై దృష్టి పెడితే మంచిదని హితవు పలికారు. విద్యుత్ సరఫరా విషయంలో బీజేపీ నేతృత్వంలోని ఢిల్లీ ప్రభుత్వంపై ఆప్ విరుచుకుపడుతున్న తరుణంలో కేజ్రీవాల్ ఈ ట్వీట్ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆప్ ఎమ్మెల్యే, మాజీ ముఖ్యమంత్రి అతిశీ సైతం ఎక్స్ వేదికగా స్పందించారు. విద్యుత్ సరఫరా సరిగా లేదని అతిషి ట్వీట్ చేశారు.

పీఎంకే అధ్యక్ష పగ్గాలు చేపట్టిన రాందాస్

ఆ పదవి నుంచి కుమారుడిని తొలగిస్తూ ప్రకటన

విల్లుపురం: తమిళనాడులోని పట్టాలి మక్కల్ కట్చి(పీఎంకే) వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్ రాందాస్(85) ఆకస్మిక నిర్ణయం తీసుకున్నారు. పీఎంకే అధ్యక్ష బాధ్యతల నుంచి కుమారుడు అన్బుమణిని తొలగించారు. ఇకపై తానే వ్యవస్థాపక అధ్యక్ష బాధ్యతల్లో కొనసాగనున్నట్లు ప్రకటించారు. అన్బుమణి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉంటారన్నారు. పార్టీలో అంతర్గత విభేదాల నేపథ్యంలో ఆయనీ నిర్ణయం తీసుకున్నట్లుగా భావిస్తున్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన విల్లుపురంలోని తన నివాసంలో మీడియాతో అన్నారు. 'అసెంబ్లీ ఎన్నికల వ్యూహం ఖరారు చేసుకున్నాం. దీని అమలుకు పార్టీ పునర్వ్యవస్థీకరణ అవసరమని భావిస్తున్నాం' అని ఆయన తెలిపారు. పార్టీ మాజీ అధ్యక్షుడు జీకే మణి ఇకపై గౌరవ అధ్యక్షుడిగా ఉంటారని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు కొనసాగించే విషయం పార్టీ శ్రేణులే నిర్ణయిస్తాయన్నారు. అయితే, తిండివనం ప్రాంతానికి చెందిన అన్బుమణి మద్దతుదారులు నిరసనకు దిగారు. అన్బుమణిని తిరిగి అధ్యక్షుడిని చేయాలంటూ నిరసనకు దిగారు. వన్నియార్ కులస్తుల ఆధిపత్యం ఉన్న పీఎంకే 1989లో ఏర్పాటైంది. 2021 ఎన్నికల్లో ఏఐఏడీఎంకేతో కలిసి 23 స్థానాల్లో పోటీ చేసిన పీఎంకే ఐదు సీట్లు గెలుచుకుంది.

ఇజ్రాయెల్‌ను మెచ్చని అమెరికన్లు

పాలక రిపబ్లికన్లలోనూ తగ్గిన సదభిప్రాయం • ప్యూ రీసెర్చ్ పోలింగ్‌లో వెల్లడి

వాషింగ్టన్: గాజా భూభాగంలో పాలస్తీనియన్లను పొట్టనబెట్టుకుంటూ, హమాస్ సాయుధులపై సమరభేరి మోగించిన ఇజ్రాయెల్‌కు అమెరికా పూర్తిస్థాయిలో ఆయుధ, ఆర్థికసాయం చేస్తుంటే మరోవైపు అమెరికన్లలో మాత్రం ఇజ్రాయెల్ పట్ల వ్యతిరేక భావన రోజురోజుకూ పెరుగుతోంది. సంబంధిత వివరాలు ప్యూ రీసెర్చ్ పోల్‌లో వెల్లడయ్యాయి. 2022 మార్చిలో ఇజ్రాయెల్ పట్ల 42 శాతం మంది అమెరికన్లు వ్యతిరేకత చూపిస్తే ఇప్పుడా వ్యతిరేకత 53 శాతానికి పెరిగింది. మరోవైపు విపక్ష డెమొక్రాట్లలో ఏకంగా 69 శాతం మంది ఇజ్రాయెల్‌పై వ్యతిరేకత కనబరిచారు. 2022 ఏడాదిలో రిపబ్లికన్ పార్టీ సభ్యుల్లో 27 శాతం మంది ఇజ్రాయెల్‌పై వ్యతిరేకత చూపగా ఇప్పుడు వారి సంఖ్య మరింత పెరిగింది. 50 ఏళ్లలోపు వయస్సున్న రిపబ్లికన్లలో దాదాపు సగం మంది ఇజ్రాయెల్ వైఖరిపై ధ్వజమెత్తారు. 2022లో డెమొక్రాట్లలో 53 శాతం మంది ఇజ్రాయెల్ పట్ల విముఖత వ్యక్తంచేయగా ఇప్పుడా వ్యతిరేకంగా 69 శాతానికి చేరిందని ప్యూ రీసెర్చ్ పోల్ వెల్లడించింది. ఈవారం అమెరికాలో ట్రంప్‌తో భేటీ కోసం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ వాషింగ్టన్‌కు రావడానికి కొద్దిరోజుల ముందు ఈ సర్వే చేపట్టారు.

గాజాను స్వాధీనం చేసుకోవడంపై...

గాజాను స్వాధీనం చేసుకోవాలన్న ట్రంప్ ఆలోచనలను అమెరికన్లు ఇష్టపడటం లేదు. ఇజ్రాయెల్ యుద్ధం విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యవహరించిన తీరుపై అమెరికన్లలో మిశ్రమ స్పందన వ్యక్తమైంది. ట్రంప్ వైఖరి ఇజ్రాయెల్‌కు అత్యంత అనుకూలంగా ఉందని 31 శాతం మంది భావిస్తున్నారు. అయితే ఇజ్రాయెల్‌తో ట్రంప్ సమదూరం పాటిస్తున్నారని 29 శాతం మంది చెప్పారు. అయితే పాలస్తీనియన్లకు అనుకూలంగా ట్రంప్ వ్యవహరిస్తున్నాడని కేవలం 3 శాతం మంది మాత్రమే చెప్పడం విశేషం. ఒకసారి స్వాధీనం చేసుకుంటానని, మరోసారి స్వాధీనం చేసుకోబోనని, మరోసారి సుందర పర్యాటక క్షేత్రంగా మారుస్తానంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలనుద్దేశిస్తూ అసలు ట్రంప్ భవిష్యత్ ప్రణాళిక ఏమిటో అర్థంకావట్లేదని 37 శాతం మంది చెప్పారు. గాజా స్ట్రిప్‌ను తన ఆధీనంలోకి తీసుకోవాలనే తన మునుపటి ప్రణాళికను ట్రంప్ పునరుద్ఘాటించారు. ఈ ఆలోచనను మెజారిటీ అమెరికన్లు స్వాగతించలేదు. 62 శాతం మంది అమెరికన్లు గాజాను అమెరికా స్వాధీనం చేసుకోవాలనే ఆలోచనను చెత్తపనిగా అభివర్ణించారు. స్వాధీనం చేసుకోవాలనే ట్రంప్ నిర్ణయాన్ని 49% మంది తీవ్రంగా వ్యతిరేకించారు. పాలస్తీనా ను దేశంగా ప్రకటిస్తే బాగుంటుందని 46 శాతం మంది అభిప్రాయపడ్డారు. ప్రపంచ వ్యవహారాలకు సంబంధించి నెతన్యాహు సరైన నిర్ణయాలే తీసుకుంటారన్న విశ్వాసం తమకు అస్సలు లేదని 52% మంది అమెరికన్లు చెప్పారు. అమెరికన్ యూదుల్లో 53% మంది సైతం ఇదే అభిప్రాయం వ్యక్తంచేశారు.

యూదు అమెరికన్ల భిన్న మనస్తత్వం

గత కొంతకాలంగా అమెరికన్ యూదులు ఇజ్రాయెల్ ధోరణిని బాగా తప్పుబడుతున్నారు. ఇజ్రాయెల్ న్యాయ వ్యవస్థలో బెంజమిన్ నెతన్యాహూ ప్రభుత్వం కల్పజేసుకోవడాన్ని అమెరికన్ యూదులు విబేధిస్తున్నారు. న్యాయనియామకాల్లో ఇజ్రాయెల్ ప్రభుత్వ జోక్యం అనవసరమని వాళ్లు చెబుతున్నారు. అయితే గాజాలో హమాస్‌తో యుద్ధం విషయానికి వచ్చేసరికి ఇజ్రాయెల్ ప్రభుత్వానికి మెజారిటీ యూదు అమెరికన్లు మద్దతు పలుకుతున్నారు. ఏకంగా 73 శాతం మంది అమెరికన్ యూదులు ఇజ్రాయెల్ పట్ల సానుకూల దృక్పథం కనబరిచారు. ఇక క్రైస్తవుల్లో లెక్కిస్తే 53 శాతం మంది అమెరికన్ క్యాథలిక్‌లు ఇజ్రాయెల్‌కు మద్దతు పలకట్లేరు. శ్వేతవర్ణ ప్రొటెస్టాంట్లలో సైతం సగం మంది ఇజ్రాయెల్‌ను విమర్శిస్తున్నారు. అమెరికన్ ముస్లింలలో ఏకంగా 81 శాతం మంది ఇజ్రాయెల్ దండయాత్రను తీవ్రంగా తప్పుబట్టారు.

షుజాయియా ఇళ్లపై ఇజ్రాయెల్ దాడి

35 మంది పాలస్తీనియన్ల మృతి

గాజా: గాజాపై ఇజ్రాయెల్ మారణకాండను కొనసాగిస్తోంది. నగరంలోని షుజాయాలో బుధవారం ఇళ్లను లక్ష్యంగా చేసుకుని జరిపిన ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు దాడుల్లో 35 మందికి పైగా పాలస్తీనియన్లు మృతి చెందారు. 60 మందికి పైగా గాయపడ్డారు. 80 మంది జాడ తెలియడం లేదు. ఈ దాడుల్లో 10 భవనాలు ధ్వంసమయ్యాయి. శిథిలాల కింద అనేకమంది చిక్కుకుపోవడంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. క్షిపణుల దాడిలో కొంత మంది శిథిలాల కింద నలిగిపోయారు. భారీ విధ్వంసంతో ఆ ప్రాంతమంతా దుమ్ముతో నిండిపోయింది. ప్రజల ఆర్తనాదాలు, కేకలతో ప్రాంతం మార్మోగింది. గాజా స్ట్రిప్‌లోని ఇతర ప్రాంతాలైన రఫా, ఖాన్‌యూనిస్, డెయిర్ అల్–బలహ్, బెయిట్ హనూన్‌లపైనా ఇజ్రాయెల్ దాడులు చేసింది. బాధితుల్లో ఎక్కువ మంది మహిళలు, పిల్లలు ఉన్నారు. క్షతగాత్రులు వెల్లువెత్తడంతో ఆస్పత్రులు, వైద్య సిబ్బంది ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సేఫ్‌జోన్‌గా పరిగణిస్తున్న అల్‌మవాసీని కూడా ఇజ్రాయెల్ వదల్లేదు. అక్కడ దాడులు తాము ఊహించలేదని బాధితులు వాపోతున్నారు. అయితే.. ఒక సీనియర్ హమాస్ నాయకుడిని లక్ష్యంగా దాడి చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం దాడి తెలిపింది. అతని పేరు వెల్లడించలేదు. పౌరులకు హాని కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది.

గాజా భూముల్లో బఫర్‌జోన్ కోసం..

గత నెలలో కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన నాటి నుంచి గాజాపై ఇజ్రాయెల్ దాడులు పునఃప్రారంభించింది. ఇజ్రాయెల్ సైన్యం దాదాపు 1,500 మంది పాలస్తీనియన్లను చంపింది. వైమానిక దాడులతోపాటు క్షేత్రస్థాయిలో కూడా మారణహోమం సృష్టిస్తోంది. గాజా ప్రాంతాన్ని నేలమట్టం చేసి బఫర్ జోన్‌గా మార్చాలన్న ఆదేశాల ప్రకారం సైనికులు ముందుకెళ్తున్నారు. వ్యవసాయ భూములను, నివాస సముదాయాలను ధ్వంసం చేస్తున్నారు. అవసరమైతే అడ్డువచ్చినవారిపై కాల్పులు జరపాలన్న ఆదేశాలతో మారణకాండను కొనసాగిస్తున్నారు. దక్షిణ గాజా స్ట్రిప్‌లోని జనసాంద్రత కలిగిన పాలస్తీనా నగరమైన రఫాను బఫర్‌జోన్‌గా మార్చాలని సైన్యం యోచిస్తున్నట్లు ఇజ్రాయెల్ వార్తాపత్రిక హారెట్జ్ బుధవారం నివేదించింది. నగరంలోని ప్రముఖ నివాస ప్రాంతాలపై దాడి చేసిన సైనికులు.. వైద్యులు సహా పౌరులను విచక్షణారహితంగా హతమార్చారు. అనేక మంది ఆ ప్రాంతాన్ని వదిలి వెళ్లిపోయారు. గాజా స్ట్రిప్ మీదుగా తూర్పు నుంచి పడమరకు విస్తరించి ఉన్న ఖాన్ యూనిస్, రఫాల మధ్య 'మోరాగ్ అక్షం'గా పిలిచే ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ నెల ప్రారంభంలో ప్రకటించారు.

జుత్తు సరిగా లేకున్నా అరెస్టే.. తాలిబన్ పాలనలో నిర్బంధాలు

కాబూల్: రంజాన్ మాసంలో మసీదుకు వెళ్లని వారితో పాటు జుత్తు సరిగ్గా కట్ చేయించుకోని వారిని కూడా అఫ్గానిస్తాన్ తాలిబన్ పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు. నిబంధనలకు అనుగుణంగా జుత్తు కత్తిరించని క్షురకులను సైతం కటకటాల వెనక్కి నెట్టేస్తున్నారు. ఇందుకు సంబంధించిన నియమ నిబంధనలను ప్రకటించిన ఆరు నెలల అనంతరం వాటిని పాటించని వారిపై తాలిబన్లు చర్యలు తీసుకుంటున్నట్లు ఐక్యరాజ్యసమితి గురువారం వెలువరించిన నివేదికలో పేర్కొంది. పౌరులు దైనందిన జీవితంలో ముఖ్యంగా రవాణా, సంగీతం, షేవింగ్, వేడుకల సమయంలో ఎలా మెలగాలో నిర్దేశిస్తూ తాలిబన్ పాలకులు గతేడాది ఆగస్టులో నియమ నిబంధనలను ప్రకటించారు. బహిరంగ ప్రదేశాల్లో మహిళల స్వరం వినిపించరాదు, వారి ముఖాలు కనిపించరాదనేవి కూడా ఇందులో ఉన్నాయి. వీటిపై అప్పట్లోనే ఐరాస అభ్యంతరం తెలిపినా తాలిబన్లు పట్టించుకోలేదు. ఆగస్టు తర్వాత అరెస్టయిన వారిలో సగం మంది ఇలా నిబంధనలు పాటించని వారేనని ఐరాస అఫ్గానిస్తాన్ మిషన్ పేర్కొంది. గడ్డం పొడవు, జుత్తు నిర్దేశించిన మేరకు లేకున్నా గడ్డం ట్రిమ్మింగ్ చేసిన క్షురకులను నైతిక విభాగం పోలీసులు నిర్బంధిస్తున్నారని తెలిపింది. ఇటువంటి అరెస్టులపై ఎలాంటి చట్టపరమైన ప్రక్రియలను అమలు చేయడం లేదని, ఇదంతా ఏకపక్షంగా సాగుతోందని పేర్కొంది. రంజాన్ మాసంలో సామూహిక ప్రార్థనలను తాలిబన్లు తప్పనిసరి చేశారు. నిఘా పెట్టిన నైతిక పోలీసులు సామూహిక ప్రార్థనల్లో పాలుపంచుకోని వారిని ఎలాంటి హెచ్చరికలు లేకుండానే అదుపులోకి తీసుకుంటున్నట్లు నివేదిక వెల్లడించింది. ఇలాంటి చర్యలతో చిన్న వ్యాపారాలు, ప్రైవేట్ విద్యాసంస్థలు, హెయిర్ డ్రెస్సింగ్ సెంటర్లు, టైలర్లు, రెస్టారెంట్లు, వెడ్డింగ్ కేటరర్లకు పని దొరక్కుండా పోయిందని, ఆయా వ్యాపారాలు మూతబడే పరిస్థితికి చేరుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికే అనేక రకాలుగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్న సామాన్యుల జీవనం మరింత భారంగా మారిందని ఐరాస తెలిపింది.

మహిళలకు విద్య, ఉద్యోగావకాశాలు లేకుండా చేయడంతో అఫ్గానిస్తాన్ ఏడాదికి 14 బిలియన్ డాలర్ల మేర నష్టపోతోందని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. అయితే, అఫ్గాన్ సమాజం, ప్రజలను సంస్కరించేందుకే ఇస్లామిక్ చట్టాలను అమలు చేస్తున్నామని తాలిబన్ నేత హైబతుల్లా అఖుండ్‌జాదా చెప్పుకుంటున్నారు. నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా 3,300 మంది ఇన్‌స్పెక్టర్లను తాలిబన్ ప్రభుత్వం నియమించింది.

ఏటీఎఫ్ తాత్కాలిక చీఫ్ పదవి నుంచి కాశ్ పటేల్ తొలగింపు

ఏటీఎఫ్ కొత్త చీఫ్‌గా డేనియల్ డ్రిస్కాల్

వాషింగ్టన్: ఏటీఎఫ్ తాత్కాలిక చీఫ్ పదవి నుంచి ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాశ్ పటేల్‌ను తొలగించారు. ఆయన స్థానంలో ఆర్మీ సెక్రటరీ డేనియల్ డ్రిస్కాల్ నియమితులయ్యారు. న్యాయశాఖలో నాయకత్వం గురించి చర్చల నేపథ్యంలో ఈ మార్పు జరిగింది. ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా ప్రమాణస్వీకారం చేసిన మూడు రోజులకే ఫిబ్రవరి 24న పటేల్ తాత్కాలిక ఏటీఎఫ్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. పటేల్ తొలగింపును న్యాయ శాఖ అధికారి ఒకరు ధ్రువీకరించారు. ఒక వ్యక్తి, ఒకేసారి రెండు ప్రధాన న్యాయ శాఖ విభాగాలకు నాయకత్వం వహించడం అసాధారణమని, ఈ తొలగింపునకు ఉద్యోగ పనితీరుకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. తొలగింపునకు నిర్దిష్ట కారణాలను కూడా వెల్లడించలేదు. అయితే పటేల్ ఏటీఎఫ్ బాధ్యతలు తాత్కాలికమేనని, డైరెక్టర్ పటేల్ ఇప్పుడు ఎఫ్‌బీఐలో తన బాధ్యతలను అద్భుతంగా నిర్వహిస్తున్నారని, అద్భుతమైన ఫలితాలను సాధిస్తున్నారని వైట్‌హౌస్ ప్రతినిధి హారిసన్ ఫీల్డ్స్ చెప్పారు.

పంజాబ్‌లో ఎస్‌ఐ హత్య

తార్న్ తరన్: పంజాబ్‌లోని తార్న్ తరన్ జిల్లాలో సబ్ ఇన్‌స్పెక్టర్ దారుణ హత్యకు గురయ్యారు. ఇద్దరు పోలీసులకు గాయాలయ్యాయి. ఇద్దరు గ్రామస్తుల మధ్య వివాదాన్ని పరిష్కరించడానికి వచ్చిన పోలీసు స్థానికులు కాల్చి చంపారు. కోట్ మహ్మద్‌ఖాన్ గ్రామంలో గ్రామ సర్పంచ్ కుమారుడు కుల్దీప్ సింగ్, స్థానికుడు అర్ష్‌దీప్ మధ్య చాలా రోజులుగా ఘర్షణలు జరుగుతున్నాయి. గురువారం సైతం ఘర్షణ నెలకొంది. దీంతో సమాచారం అందుకున్న ఎస్‌ఐ చరణ్‌జీత్ సింగ్ తన బృందంతో గ్రామానికి చేరుకున్నారు. గొడవను పరిష్కరించేందుకు ఆయన జోక్యం చేసుకోవడంతో గుర్తు తెలియని వ్యక్తి కాల్పులు జరిపారు. ఎస్‌ఐ అక్కడికక్కడే మృతి చెందారు. జస్బీర్ సింగ్ అనే మరో అధికారి, స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దాడి చేసిన వారికోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. దాడి ప్రణాళిక ప్రకారం చేశారని పోలీసులు భావిస్తున్నారు. మరోవైపు పోలీసు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటనను పంజాబ్ డీజీపీ తీవ్రంగా ఖండించారు. నిందితులపై చర్యలు తీసుకుంటామని, చరణ్‌జీత్ సింగ్ కుటుంబానికి అండగా ఉంటామని ప్రకటించారు.

తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల అభివృద్ధిలో ప్రైవేటు భాగస్వామ్యం

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని వామపక్ష తీవ్రవాద(ఎల్‌డబ్ల్యూఈ) ప్రాంతాల అభివృద్ధికి ప్రైవేటు రంగం కూడా భాగస్వామిగా ఉందని కేంద్ర హోంశాఖ పేర్కొంది. సంబంధిత రాష్ట్రాల్లో ప్రజలకు అవగాహన సదస్సులు మొదలు అభివృద్ధి పనుల వరకు ప్రైవేటు సంస్థలు తోడ్పాటు అందిస్తున్నాయని తెలిపింది. 2015లో ఇందుకు సంబంధించిన జాతీయ విధానం, కార్యచరణ ప్రణాళికను కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందని ఆ శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ ఇటీవల లోక్‌సభలో తెలిపారు. కేంద్ర సాయుధ పోలీసు దళాల బెటాలియన్లు, శిక్షణ, రాష్ట్ర పోలీసు దళాల ఆధునీకరణకు నిధులు, పరికరాలు, ఆయుధాలు, నిఘా భాగస్వామ్యం, పోలీస్‌స్టేషన్ల నిర్మాణంలో కేంద్రం ఆయా రాష్ట్రాలకు ప్రైవేటు రంగాలతో కలసి సహకారం అందిస్తుందన్నారు. ప్రైవేటు భాగస్వామ్యంతో 17,589 కిలోమీటర్ల రోడ్లు మంజూరు కాగా, 14,618 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం పూర్తయిందని చెప్పారు. టెలికాం కనెక్టివిటీ కోసం 10,505 మొబైల్ టవర్లను మంజూరు చేయగా 7,768 టవర్లను ఇప్పటికే ప్రారంభించినట్లు తెలిపారు. నైపుణ్యాభివృద్ధి కోసం ఆమోదం పొందిన 48 పారిశ్రామిక శిక్షణ సంస్థలు, 61 నైపుణ్య అభివృద్ధి కేంద్రాల్లో 46 ఐటీఐలు, 49 ఎస్‌డీసీలు పనిచేస్తున్నట్లు వివరించారు. ఆయా జిల్లాల్లో బ్యాంకింగ్ సేవలతో తపాలా శాఖ 5,731 పోస్టాఫీసులను ప్రారంభించినట్లు మంత్రి నిత్యానంద్ రాయ్ చెప్పారు.

ఆర్టీఐను బలహీనపరుస్తోన్న ప్రైవసీ చట్టం

- డిజిటల్ వ్యక్తిగత సమాచార చట్టంలో కొన్ని సెక్షన్లను తొలగించాల్సిందే
- విపక్షాల 'ఇండియా'కూటమి డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: ప్రైవసీని పరిరక్షిస్తున్నామన్న సాకుతో ప్రజలకు ఖచ్చితంగా అందుబాటులో ఉండాల్సిన సమాచారాన్ని సైతం కేంద్ర ప్రభుత్వం పౌరులకు అందకుండా తొక్కిపెడుతోందని విపక్షాల 'ఇండియా'కూటమి నేతలు ఆరోపించారు. ప్రజలకు తెలియాల్సిన సమాచారాన్ని దాచేందుకు ఉద్దేశించిన డిజిటల్ ప్రైవసీ డేటా ప్రొటెక్షన్(డీపీడీపీ) చట్టంలోని 44(3)సెక్షన్‌ను తక్షణం తొలగించాలని పలువురు 'ఇండియా'కూటమి నేతలు గురువారం డిమాండ్‌చేశారు. ఈ మేరకు ఢిల్లీలో కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్, డీఎంకే నాయకుడు ఎంఎం అబ్దుల్లా, శివసేన(యూబీటీ) నాయకురాలు ప్రియాంక చతుర్వేది, సీపీఎం నేత జాన్ బ్రిటాస్, సమాజ్‌వాదీ పార్టీ నేత జావెద్ అలీ ఖాన్, రాష్ట్రీయ జనతాదళ్ నేత నవల్ కిశోర్‌లు సంయుక్త పత్రికా సమావేశంలో మాట్లాడారు. ''సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) ద్వారా పౌరులకు అందించాల్సిన సమాచారాన్ని ప్రైవసీ తెరలమాటున ప్రభుత్వం దాచేస్తోంది. ముఖ్యంగా 44(3) సెక్షన్ ఈ దుర్నీతికి దన్నుగా నిలుస్తోంది. అందుకే ఈ సెక్షన్‌ను తొలగించాలి. ఈ డిమాండ్‌తో దాదాపు 120కిపైగా విపక్ష ఎంపీలు సంతకాలు చేసిన మెమోరండంను త్వరలోనే కేంద్ర ఇన్ఫర్మేషన్, టెక్నాలజీ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు అందజేస్తాం. డిజిటల్ డేటా ప్రొటెక్షన్ చట్టంలోని సవరణలను విపక్షాలు క్షుణ్ణంగా అధ్యయనం చేశాయి. పౌర హక్కులకు, పత్రికా స్వేచ్ఛకు భంగం కల్గించేలా డీపీడీపీ చట్టంలో సవరణలుచేశారు. పార్లమెంట్, శాసనసభలకు అందుబాటులో ఉంచాల్సిన ప్రతి సమాచారం ప్రతిఒక్కరికీ అందుబాటులో ఉండాలని ఆర్టీఐ చట్టంలోని సెక్షన్8(1) చెబుతోంది. ప్రజాప్రయోజనాల దృష్ట్యా అయితే వ్యక్తిగత సమాచారం కూడా ఇవ్వాల్సి ఉంటుందని సెక్షన్ 8(1) ఉద్ఘాటిస్తోంది. అందులో కీలకమైన 8(1)(జే) సెక్షన్‌ను సవరించారు. దీంతో ప్రజాప్రయోజనాలులేని, ఇతర మినహాయింపులులేని వ్యక్తిగత సమాచారాన్ని కోరితే దానిని బహిర్గతం చేయకుండా నిలువరించే అధికారం కేంద్రానికి దఖలుపడిందని విపక్ష పార్టీల నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు.



ఒక్క గుడ్డు 44 రూపాయలు!

అమెరికాలో అనూహ్యంగా పెరుగుతున్న ధరలు

వాషింగ్టన్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో స్థానిక చిరు వ్యాపారుల వద్ద ఒక కోడిగుడ్డు ధర ఐదారు రూపాయల మధ్యే తిరుగుతుంటుంది. అమెరికాలో మాత్రం ఒక్క గుడ్డు ధర ఏకంగా 44 రూపాయలకు పెరిగింది. అమెరికాలో డజను గుడ్ల ధర 6.23 డాలర్ల(దాదాపు రూ.536)కు చేరుకుంది. మార్చి నెలకు సంబంధించి వినియోగదారుల ధరల సూచీలో గుడ్ల ధరను అమెరికా ప్రభుత్వం గురువారం వెల్లడించడంతో గుడ్ల కొరత అంశం మరోసారి తెరమీదకొచ్చింది. గత కొన్నాళ్లుగా అమెరికాలో బర్డ్ ఫ్లూ విజృంభిస్తుండటంతో వ్యాధి వ్యాప్తి కట్టడే లక్ష్యంగా కోట్లకొలదీ కోళ్లను వధించారు. దీంతో గుడ్ల కొరత విపరీతమైంది. అందుకు తగ్గట్లే డజను గుడ్ల ధర కొండెక్కింది. ఫిబ్రవరిలో ఒక దశలో డజను గుడ్ల ధర ఏకంగా 7.34 డాలర్లకు పెరిగి మళ్లీ దిగొచ్చింది. ఇప్పుడది మళ్లీ 6 డాలర్లను దాటింది. ఈస్టర్ పండుగ సందర్భంగా గుడ్లకు గిరాకీ ఎక్కువైంది. ఈ ఏడాది ఏప్రిల్ 20వ తేదీన ఈస్టర్ జరుపుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఆ తేదీదాకా ధరల ఉరవడి ఆగకపోవచ్చని తెలుస్తోంది. బర్డ్ ఫ్లూ భయాలతో జనవరి, ఫిబ్రవరిలో ఏకంగా 3 కోట్లకుపైగా గుడ్లు పెట్టే కోళ్లను వధించడంతో ఈ సమస్య మరింత ఎక్కువైంది. కోళ్లఫారాలను పూర్తిగా శానిటైజ్‌చేసి, కొత్త కోళ్లను సాకుతున్నారు. దీంతో కొత్త కోళ్లతో గుడ్ల దిగుబడి పెరిగితే ధరలు కిందకు దిగొచ్చే వీలుంది.

విమానం ల్యాండైన వెంటనే అనారోగ్యంతో పైలట్ మృతి

న్యూఢిల్లీ: విమానం ల్యాండయిన కొద్ది సేపటికే అస్వస్థతకు గురైన పైలట్ ప్రాణాలు విడిచారు. ఈ ఘటన బుధవారం ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో చోటుచేసుకుంది. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం బుధవారం శ్రీనగర్ నుంచి ఢిల్లీకి చేరుకుంది. ల్యాండయిన కొద్దిసేపటికే పైలట్(30) అస్వస్థతగా ఉందని చెప్పడంతో వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని విశ్వసనీయ వర్గాలు గురువారం వెల్లడించాయి. అనారోగ్య కారణాలతో ఆ పైలట్ చనిపోయినట్లు ఎయిరిండియా ప్రతినిధి ఒకరు వివరించారు. ఇతర వివరాలను వెల్లడించలేదు. 'ఈ సమయంలో గోప్యతను గౌరవించాలని, అనవసర ఊహాగానాలను నివారించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. అదే సమయంలో సంబంధిత అధికారులకు సహకరించేందుకు కట్టుబడి ఉన్నాం' అని తెలిపారు.

నేడు వారణాసికి ప్రధాని మోదీ

వారణాసి/భోపాల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో పర్యటించనున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని సొంత నియోజకవర్గం వారణాసిలో రూ3,880 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇందులో 130 తాగునీటి పథకాలు, 100 అంగన్‌వాడీ కేంద్రాలు, 356 గ్రంథాలయాలు, ఒక పాలిటెక్నిక్ కాలేజీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉన్నాయని వారణాసి డివిజనల్ కమిషనర్ కౌశల్ రాజ్ శర్మ వివరించారు. మెహెందీగంజ్‌లో జరిగే బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగిస్తారన్నారు. వారణాసిలో సుమారు రెండున్నర గంటలు ప్రధాని గడుపుతారు.

20 నుంచి వక్ఫ్‌పై అవగాహన కార్యక్రమాలు

న్యూఢిల్లీ: వక్ఫ్ చట్టంపై జాతీయ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు ముఖ్యంగా ముస్లింలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో చేపట్టాలని బీజేపీ నిర్ణయించింది. ఈ నెల 20వ తేదీ నుంచి మొదలయ్యే ఈ కార్యక్రమంలో వక్ఫ్ సవరణ చట్టం ప్రయోజనాలను వివరిస్తూ, ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టడమే లక్ష్యంగా ఉంటుందని బీజేపీ చీఫ్ జేపీ నడ్డా, మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు తెలిపారు. వీరిద్దరూ గురువారం బీజేపీ ఆఫీస్ బేరర్ల కార్యక్రమంలో మాట్లాడారు.

ఇంట్లో రూ.14 కోట్ల నకిలీ కరెన్సీ నోట్లు

యశవంతపుర: కర్ణాటకలోని ఉత్తర కన్నడ జిల్లా దాండేలిలో ఐదు వందల రూపాయల నోట్ల కట్టలు కుప్పలు కుప్పలుగా బయటపడ్డాయి. దాండేలి పట్టణంలోని గాంధీనగరలోని నూర్జన్ జుంజువడ్కర్ అనే వ్యక్తి ఇంటిని గోవాకు చెందిన అర్షద్ ఖాన్ అనే వ్యక్తి అద్దెకు తీసుకున్నాడు. నెల నుంచి అర్షద్ ఇంట్లో లేడు. ఇంటి వెనుక తలుపులు తెరిచి ఉండడంతో చోరీ జరిగిందేమోనని యజమాని నూర్జన్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు తాళాలను బద్దలు కొట్టి పరిశీలించగా ఐదు వందల రూపాయల నోట్ల కట్టలు కనిపించాయి. నోట్లను లెక్కించే యంత్రం కూడా అక్కడే ఉంది. పరిశీలించగా అవన్నీ నకిలీవని తెలిసింది. నోట్లపై బ్యాంక్ ఆఫ్ ఇండియా అని ముద్రించి ఉంది. ఆర్‌బీఐ గవర్నర్ సంతకం లేదు. నోట్ సిరీస్ స్థానంలో సున్నాలున్నాయి. ఈ నోట్లు సినిమా చిత్రీకరణకు మాత్రమే అని రాసి ఉంది. లెక్కించగా రూ. 14 కోట్ల విలువగల నకిలీ నోట్లుగా వెల్లడైంది. అర్షద్ ఖాన్ కోసం గాలిస్తున్నట్లు జిల్లా ఎస్పీ నారాయణ తెలిపారు. ఈ నోట్లను ఎందుకు ప్రింట్ చేశారో విచారణలో తేలుతుందని చెప్పారు.

నైట్‌క్లబ్ కూలిన ఘటన... 221కు చేరిన మరణాలు

శాంటా డొమింగో: డొమినికన్ రిపబ్లిక్ రాజధాని శాంటా డొమింగోలో నైట్‌క్లబ్ పైకప్పు కుప్పకూలిన ఘటనలో మృతుల సంఖ్య 221కు చేరింది. శిథిలాల కింద చిక్కుబడిన వారి కోసం గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. ఘటనలో ప్రాణాలు కోల్పోయిన గాయకుడు రుబీ ప్రెజ్, మాంటెక్రిస్టీ ప్రావిన్స్ గవర్నర్ నెల్సీ క్రూజ్, ప్రావెన్షియల్ గవర్నర్, బేస్‌బాల్ ఆటగాడు ఆక్టావియో డోటెల్ తదితరులకు నివాళులర్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. ఈ కార్యక్రమాల్లో అధ్యక్షుడు లూయిస్ అబినడెర్, ఆయన భార్యత రకెల్ అర్బజే పాల్గొన్నారు. జెట్ సెట్ క్లబ్‌లో రుబీ ప్రెజ్ లైవ్‌షో జరుగుతుండగా మంగళవారం తెల్లవారుజామున విషాదం చోటుచేసుకోవడం తెల్సిందే. శిథిలాల కింద చిక్కుకుపోయిన 189 మందిని సహాయక సిబ్బంది కాపాడారని అధికారులు తెలిపారు. క్షతగాత్రులైన 255 మందిలో 24 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని, వీరిలో 8 మంది పరిస్థితి విషమంగా ఉందని వివరించారు. మృతుల్లో 146 మందిని గుర్తించామన్నారు. కాగా, మృతుల సంఖ్య పెరగొచ్చని చెబుతున్నారు.

మన దేశంలో పట్టణ, నగరాల్లో పౌర సదుపాయాల కల్పనకు పట్టణ స్థానిక ప్రభుత్వాలున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 8 రకాలైన పట్టణ స్థానిక ప్రభుత్వాలు పనిచేస్తున్నాయి.

74వ రాజ్యాంగ సవరణ

పట్టణ, నగర పాలక సంస్థలు

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ



పట్టణ స్థానిక ప్రభుత్వాలు

1. మున్సిపల్ కార్పొరేషన్
2. నోటిఫైడ్ ఏరియా కమిటీ
3. కంటోన్మెంట్ బోర్డ్
4. పోర్ట్ ట్రస్ట్, 5. మునిసిపాలిటీ
6. టౌన్ ఏరియా కమిటీ
7. టౌన్షిప్,
8. ప్రత్యేక ప్రయోజన సంస్థలు

దేశంలో తొలిసారిగా 1687లో మద్రాస్‌లో మునిసిపల్ కార్పొరేషన్‌ను బ్రిటిష్‌వారు ఏర్పాటు చేశారు. 1726లో బాంబే, కలకత్తా కార్పొరేషన్లు ఏర్పడ్డాయి. 1992లో 74వ రాజ్యాంగ సవరణ ద్వారా పట్టణ స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారు. 1993, జూన్ 1 నుంచి దేశవ్యాప్తంగా 74వ రాజ్యాంగ సవరణ అమల్లోకి వచ్చింది.

74వ రాజ్యాంగ సవరణ

పట్టణ స్థానిక ప్రభుత్వాలకు సంబంధించిన అంశాలను రాజ్యాంగంలో 'IXA' భాగంలో ప్రకరణ 243P నుంచి 243ZG వరకు పొందుపరిచారు.

- మునిసిపాలిటీ: 243Q ప్రకరణ కింద ఏర్పాటైన స్థానిక స్వపరిపాలన సంస్థ.
- పంచాయతీ: 243B ప్రకరణ కింద పంచాయతీగా ఏర్పడిన ప్రాంతం.
- జనాభా: చివరిసారిగా జనాభా లెక్కల సేకరణ జరిగి, నోటిఫై అయిన సందర్భంలో నిర్ధారించిన జనాభా.

243Q మునిసిపాలిటీల నిర్మాణం గురించి తెలుపుతోంది.

- గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతంగా పరివర్తన చెందుతున్న ప్రాంతాన్ని నగర పంచాయతీగా గుర్తిస్తారు.
- చిన్న పట్టణాల్లో మునిసిపల్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేస్తారు.
- పెద్ద పట్టణాల్లో మునిసిపల్ కార్పొరేషన్లు ఉంటాయి.
- పట్టణంగా పరివర్తన చెందుతున్న ప్రాంతం, చిన్న పట్టణం, పెద్ద పట్టణం వంటి అంశాలకు సంబంధించి రాష్ట్ర గవర్నర్ సరైన అర్థ వివరణ ఇస్తారు.

మునిసిపాలిటీ ఎన్నికలు

ప్రకరణ **243R** మునిసిపాలిటీల నిర్మాణం, ఎన్నికల గురించి తెలియజేస్తోంది.

- మునిసిపాలిటీ సభ్యులను (అన్ని స్థాయిల్లో) ఓటర్లు ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు.
- మునిసిపాలిటీ సభ్యుల కూర్పు, అధ్యక్ష ఎన్నిక ప్రక్రియకు సంబంధించిన చట్టాలను రాష్ట్ర శాసన నిర్మాణ శాఖ రూపొందిస్తుంది.
- నగర పంచాయతీ, మునిసిపాలిటీ, కార్పొరేషన్ అధ్యక్షుల ఎన్నిక రాష్ట్ర శాసన నిర్మాణ శాఖ నిర్ణయించిన మేరకు ప్రత్యక్ష లేదా పరోక్ష పద్ధతిలో జరుగుతుంది.
- సంబంధిత మునిసిపాలిటీ, కార్పొరేషన్ ప్రాంతంలో ప్రాతినిధ్యం వహించే ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు హోదా రీత్యా సభ్యులుగా కొనసాగుతారు.

వార్డు కమిటీలు

- ప్రకరణ **243S** ప్రకారం 3 లక్షలు లేదా అంతకంటే ఎక్కువ జనాభా కలిగిన మునిసిపాలిటీల్లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ వార్డులను కలిపి వార్డు కమిటీలను ఏర్పాటు చేయొచ్చు.
- వార్డ్ కమిటీ ఏర్పడినప్పుడు సంబంధిత వార్డ్ ప్రతినిధిని ఆ కమిటీకి అధ్యక్షుడిగా నియమించాలి. రెండు లేదా అంతకంటే ఎక్కువ వార్డులతో వార్డు కమిటీ ఏర్పాటు చేస్తే ఆయా వార్డుల ప్రతినిధులు తమలో ఒకర్ని అధ్యక్షునిగా ఎన్నుకుంటారు.
- కార్పొరేషన్‌లో వార్డ్ కమిటీల సంఖ్య 50కి తగ్గకుండా, 100కి మించకుండా ఉండాలి.

రిజర్వేషన్స్

ప్రకరణ 243T రిజర్వేషన్ల గురించి పేర్కొంటుంది.

- ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించాలి.
- ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన స్థానాల్లో ఆయా వర్గాలకు చెందిన మహిళలకు 1/3 వంతు స్థానాలను రిజర్వ్ చేయాలి.
- మొత్తం స్థానాల్లో కనీసం 1/3 వంతు స్థానాలను మహిళలకు రిజర్వ్ చేయాలి.
- రిజర్వేషన్లను రొటేషన్ పద్ధతిలో కేటాయించాలి.
- రాష్ట్ర శాసన నిర్మాణ శాఖ బీసీలకు రిజర్వేషన్లు కల్పించే అధికారాన్ని కలిగి ఉంది.

పదవీ కాలం, అనర్హతలు

ప్రకరణ 243U పదవీ కాలం గురించి తెలుపుతోంది. అన్ని స్థాయిల్లోని సభ్యులు, అధ్యక్షుల పదవీకాల పరిమితి ఐదేళ్లు. ప్రకరణ 243V అనర్హతల గురించి పేర్కొంటోంది.

- పంచాయతీరాజ్ వ్యవస్థలో అన్ని స్థాయిల్లో అధ్యక్ష, సభ్యుల అర్హతలను నిర్ణయించే అధికారం రాష్ట్ర శాసన నిర్మాణశాఖకు ఉంటుంది.
- పార్లమెంటుకు, అసెంబ్లీలకు పోటీచేసే అభ్యర్థులకు వర్తించే అర్హత, అనర్హత నిబంధనలే స్థానిక సంస్థలకు పోటీ చేసే అభ్యర్థులకు కూడా వర్తిస్తాయి.
- స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు కనీసం 21 ఏళ్లు ఉండాలి.
- 1995 సంవత్సరం తర్వాత ఇద్దరి కంటే ఎక్కువ సంతానం కలిగుంటే పోటీకి అనర్హులు.

అధికార విధులు

- ప్రకరణ **243W** అధికార విధుల గురించి వివరిస్తోంది.

12వ షెడ్యూల్‌లో 18 విధులను పట్టణ స్థానిక సంస్థలకు నిర్దేశించారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వాలు బదిలీ చేస్తాయి. పన్నెండో షెడ్యూల్‌లో పేర్కొన్న 18 విధుల వివరాలు..

1. నగర ప్రణాళిక
2. సమర్థవంత భూ వినియోగం, భవన నిర్మాణాలపై నియంత్రణ
3. ఆర్థిక, సామాజిక అభివృద్ధి ప్రణాళికలు
4. మురికివాడల నిర్మూలన, అభివృద్ధి
5. పట్టణ అడవులు, పర్యావరణ పరిరక్షణ
6. రహదారులు, వంతెనలు
7. ప్రజారోగ్యం, మురుగు నీటిపారుదల, చెత్త నియంత్రణ
8. అగ్నిమాపక వ్యవస్థ
9. పరిశ్రమలకు, గృహాలకు నీటి వసతి
10. బలహీన వర్గాల సంరక్షణ, వికలాంగులకు వసతి.
11. వీధి దీపాలు, బస్టాండుల నిర్వహణ
12. కబేళాలపై నియంత్రణ
13. నగర దారిద్ర్య నిర్మూలన పథకాలు
14. విద్య, సాంస్కృతిక అభివృద్ధికి చర్యలు
15. జంతువుల సంరక్షణ
16. ఆట స్థలాలు, ఉద్యానవనాల నిర్వహణ
17. శ్మశాన వాటికల నిర్వహణ
18. జనన, మరణాల నమోదు

ఆదాయ వనరులు, హక్కులు

ప్రకరణ 243X ప్రకారం స్థానిక సంస్థలు తమ ఆదాయం కోసం శాసనసభ నిర్ణయించిన మేరకు పన్నులు విధించడం, వసూలు చేయడం చేయవచ్చు. దీంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సహాయ నిధులు అందిస్తాయి.

ప్రకరణ 243Y ప్రకారం ఫైనాన్స్ కమిషన్

- 73వ రాజ్యాంగ సవరణలో పేర్కొన్న ప్రకరణ 243Iలోని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ పట్టణ స్థానిక సంస్థలకు కూడా వర్తిస్తుంది.

ప్రకరణ 243Z ప్రకారం అకౌంటింగ్ అండ్ ఆడిటింగ్

పట్టణ, నగర కార్పొరేషన్ సంస్థల అకౌంట్‌లను పరిశీలించేందుకు రాష్ట్ర శాసనసభ ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయవచ్చు.

ప్రకరణ 243ZA ప్రకారం మునిసిపాలిటీల ఎన్నికల నిర్వహణ

ప్రకరణ 243Kలో ప్రస్తావించిన విధంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తుంది.

ప్రకరణ 243ZB ప్రకారం కేంద్రపాలిత ప్రాంతాలకు వర్తింపు

74వ రాజ్యాంగ సవరణలోని అంశాలు కేంద్రపాలిత ప్రాంతాలకు కూడా వర్తిస్తాయి. పార్లమెంటు చట్టం ద్వారా వీటిని వర్తింప చేస్తుంది.

ప్రకరణ 243ZC ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతాలకు వర్తింపులో మినహాయింపులు

- 244(1) ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతాలు, 244(2) ప్రకారం షెడ్యూల్డ్ తెగల ప్రాంతాల్లో ఈ విభాగం వర్తించదు.
- పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలోని కొండ ప్రాంతాలకు ఏర్పాటు చేసిన గూర్ఖాహిల్ కౌన్సిల్‌కు ఈ విభాగం వర్తించదు.
- ప్రకరణ 244(1), 244(2) ప్రకారం షెడ్యూల్డ్, ఆదివాసీ ప్రాంతాలకు ఈ విభాగాన్ని వర్తింపచేస్తూ పార్లమెంట్ శాసనాలను రూపొందించవచ్చు. అయితే వాటిని రాజ్యాంగ సవరణలుగా పరిగణించరు.

ప్రకరణ 243ZD ప్రకారం జిల్లా ప్రణాళికా కమిటీ

- ప్రతి రాష్ట్రంలో జిల్లా స్థాయిలో జిల్లా ప్రణాళికా కమిటీని ఏర్పాటు చేయాలి. ఈ కమిటీ పంచాయతీ, మునిసిపాలిటీలు రూపొందించిన ప్రణాళికలను సమీకరించి తుది ప్రణాళికలను రూపొందిస్తుంది. జిల్లా ప్రణాళిక కమిటీ నిర్మాణాన్ని రాష్ట్ర శాసనసభ చట్టం ద్వారా నిర్ణయిస్తుంది.

గమనిక: జిల్లా ప్రణాళిక కమిటీ కేంద్రపాలిత ప్రాంతమైన ఢిల్లీకి వర్తించదు.

ప్రకరణ 243ZE ప్రకారం మెట్రోపాలిటన్ ప్రణాళికా కమిటీ

10 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న మెట్రోపాలిటన్ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేస్తారు. వీటి నిర్మాణం, విధులు వంటి అంశాలను రాష్ట్ర శాసనసభ చట్టం ద్వారా నిర్ణయిస్తుంది. నగర మేయర్ ఈ కమిటీకి చైర్మన్‌గా, మునిసిపల్ కమిషనర్ సెక్రటరీగా వ్యవహరిస్తారు. దీంతోపాటు కమిటీలో మునిసిపల్ పాలనలో అనుభవమున్న నలుగురు సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. మొత్తం సభ్యుల్లో 2/3 వంతు సభ్యులను గ్రామ పంచాయతీ అధ్యక్షులు, మునిసిపాలిటీ, కార్పొరేషన్ ప్రతినిధులు ఎన్నుకుంటారు.

ప్రకరణ 243ZF ప్రకారం పాత శాసనాల కొనసాగింపు

74వ రాజ్యాంగ సవరణ అమల్లోకి వచ్చిన ఒక సంవత్సరం వరకు రాష్ట్రంలో అమల్లో ఉన్న పాత చట్టాలే కొనసాగుతాయి. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త చట్టాలను అనువర్తింప చేసుకోవాలి.

పట్టణ స్థానిక సంస్థలు - నిర్మాణం

1992లో 74వ రాజ్యాంగ సవరణ తర్వాత పట్టణాల్లో కూడా మూడంచెల స్థానిక ప్రభుత్వ వ్యవస్థను ఏర్పాటు చేశారు.

మొదటి అంచె - నగర పంచాయతీ
రెండో అంచె - పురపాలక సంస్థలు
మూడో అంచె - నగరపాలక సంస్థలు

నగర పంచాయితీ

గ్రామీణ వ్యవస్థ నుంచి పట్టణీకరణ దిశగా మారుతున్న సుమారు 20,000 నుంచి 40,000 వరకు జనాభా గల చిన్న పట్టణ ప్రాంతాలకు నగర పంచాయతీ హోదా కల్పిస్తారు. నగర పంచాయతీని జనాభా మేరకు వార్డులుగా విభజిస్తారు. ప్రతి వార్డు నుంచి ఓటర్లతో ఒక సభ్యుడు నేరుగా ఎన్నికవుతారు. ప్రతి నగర పంచాయతీలో గరిష్ఠంగా 10 మంది ఎన్నికైన వార్డు సభ్యులు, ముగ్గురు నామినేటెడ్ సభ్యులు ఉంటారు.

- నగర పంచాయతీలో నివాసముంటున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు హోదా రీత్యా సభ్యులుగా ఉంటారు.
- నగర పంచాయతీ సభ్యులు తమలో ఒకర్ని అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షునిగా ఎన్నుకుంటారు.
- సర్పంచ్, ఉప సర్పంచ్‌లను తొలగించినట్లే వీరిని కూడా అవిశ్వాస తీర్మానం ద్వారా తొలగించవచ్చు.

పురపాలక సంస్థలు

1965లో సమగ్ర పురపాలక సంస్థల చట్టం ప్రకారం మునిసిపాలిటీలు ఏర్పడ్డాయి. 74వ రాజ్యాంగ సవరణకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1994లో కొత్త చట్టాన్ని రూపొందించింది. 40,000 నుంచి 3,00,000 జనాభా ఉన్న పట్టణాల్లో పురపాలక సంస్థలను ఏర్పాటు చేస్తారు. వార్షికాదాయ, పరిమాణాల ఆధారంగా పురపాలక సంస్థలను ఐదు రకాలుగా వర్గీకరించారు. అవి..

1. సెలక్షన్ గ్రేడ్ పురపాలక సంఘం: వార్షిక ఆదాయం రూ.8 కోట్ల కంటే ఎక్కువ ఉన్నవి.
2. స్పెషల్ గ్రేడ్ పురపాలక సంఘం:వార్షికాదాయం రూ.6 కోట్ల నుంచి రూ.8 కోట్ల మధ్య ఉన్నవి.
3. గ్రేడ్-1 పురపాలక సంఘం: వార్షికాదాయం రూ.4 కోట్ల నుంచి రూ.6 కోట్ల మధ్య ఉన్నవి.
4. గ్రేడ్-2 పురపాలక సంఘం: వార్షికాదాయం రూ.2 కోట్లు నుంచి రూ.4 కోట్ల మధ్య ఉన్నవి.
5. గ్రేడ్-3 పురపాలక సంఘం: వార్షికాదాయం కోటి రూపాయల నుంచి రూ. రెండు కోట్ల లోపు ఉన్నవి.

సూచన: ఈ వర్గీకరణను ప్రభుత్వం కాలానుగుణంగా మార్చవచ్చు.

ప్రతి పురపాలక సంస్థలో నాలుగు అంగాలు ఉంటాయి. అవి..

పురపాలక మండలి: పురపాలక సంస్థ చర్చా వేదికే పురపాలక మండలి. ఇందులో ఎన్నికైన సభ్యులు. కోఆప్టెడ్ సభ్యులు, ఎక్స్‌అఫీషియో సభ్యులు ఉంటారు.

మున్సిపల్ కౌన్సిలర్లు: వీరిని ఓటర్లు వార్డు ప్రాతిపదికన ఎన్నుకుంటారు. జనాభాను బట్టి వీరి సంఖ్యను నిర్ణయిస్తారు.

- 40 వేల వరకు జనాభా ఉంటే 21 మంది కౌన్సిలర్లు ఉంటారు.
- జనాభా 40 వేల నుంచి లక్ష వరకు ఉంటే 21 మంది సభ్యులు, ప్రతి 10 వేల జనాభాకు ఒక సభ్యుడు అదనంగా ఉంటారు.
- జనాభా లక్ష నుంచి రెండు లక్షల వరకు ఉంటే 27 మంది సభ్యులు, ప్రతి 15 వేల జనాభాకు ఒక సభ్యుడు అదనంగా ఉంటారు.
- జనాభా రెండు లక్షల మించి ఉంటే 33 మంది సభ్యులు, ప్రతి 20 వేల అదనపు జనాభాకు ఒక అదనపు సభ్యుడు ఉండవచ్చు. గరిష్ఠంగా 45 సభ్యులకు మించరాదు.

భూమి మీద మొదట నివసించిన జీవులు ఏవి?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
బయాలజీ

మాదిరి ప్రశ్నలు

1. కార్డేటాలలో ఏ నిర్మాణం ఉండటాన్ని ముఖ్య లక్షణంగా పేర్కొంటారు?
1) హృదయం 2) చర్మం
3) మెదడు 4) పృష్ఠవంశం
2. జీవశాస్త్రంలో విచిత్ర జీవులుగా వేటిని పేర్కొంటారు?
1) హెమీ కార్డేట్‌లు 2) సెఫలో కార్డేట్‌లు
3) యూరో కార్డేట్‌లు 4) కార్డేట్‌లు
3. సకశేరుకాల ఉద్భవానికి సంబంధించిన డింభకం ఏది?
1) బైపిన్నేరియా లార్వా
2) బఫియోప్లుటియస్
3) ఆరిక్యులేరియా 4) ఎకైనోప్లూయస్
4. 'శీతల రక్త జీవులు (బాహ్యోష్ణ సకశేరుకాలు)'గా వేటిని పేర్కొంటారు?
1) చేపలు 2) ఉభయచరాలు
3) సరీసృపాలు 4) పైవన్నీ
5. కింది వాటిలో 'ఉష్ణరక్త జీవులు (అంతరోష్ణ సకశేరుకాలు)' ఏవి?
1) సరీసృపాలు 2) పక్షులు
3) క్షీరదాలు 4) 2, 3
6. అధిక సంఖ్యలో ఉన్న సకశేరుకాలేవి?
1) చేపలు 2) ఉభయచరాలు
3) సరీసృపాలు 4) పక్షులు
7. చేపల్లో ఏవిధమైన హృదయం ఉంటుంది?
1) సిరా హృదయం
2) ధమని హృదయం
3) మిశ్రమ హృదయం 4) ఏదీకాదు
8. చేపల హృదయం విశిష్ట లక్షణం ఏది?
1) మంచి రక్తం ప్రవహించడం
2) చెడు రక్తం ప్రవహించడం
3) మిశ్రమ రక్తం ప్రవహించడం
4) ఎలాంటి రక్తం ప్రవహించకపోవడం
9. విచ్ఛిన్న విస్తరణను ప్రదర్శించే చేపలు ఏవి?
1) నియోసెరటోడస్
2) ప్రోటాప్టిరస్ 3) లెపిడో సైరస్
4) పైవన్నీ
10. కాలేయ నూనెకు ప్రసిద్ధమైన చేప?
1) స్టోన్ ఫిష్ 2) బ్లూవేల్
3) కాడ్ ఫిష్ 4) సిల్వర్ ఫిష్
11. దోమ డింబకాలను ఆహారంగా తీసుకుంటూ మలేరియా వ్యాధి నివారణకు దోహదపడే చేపలు ఏవి?
1) ఎక్సోసీటస్ 2) హిప్పోకాంపస్
3) గాంబూసియా యసినిస్
4) పైవేవీ కావు
12. కింది వాటిలో నిజమైన చేపలు ఏవి?
1) జెల్లీ ఫిష్ 2) సిల్వర్ ఫిష్
3) కటిల్ ఫిష్ 4) షార్క్ ఫిష్
13. ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన చేప?
1) స్టోన్ ఫిష్ 2) గోల్డెన్ ఫిష్
3) సిల్వర్ ఫిష్ 4) స్టార్ ఫిష్
14. బెంగాలీలకు ప్రీతిపాత్రమైన హిల్సా చేప 1కిలోల బరువు పెరగడానికి ఎన్నేళ్లు పడుతుంది?
1) 4 2) 3 3) 2 4) 5
15. ఇక్తియాలజీ అనేది వేటి గురించి అధ్యయనం చేసే శాస్త్రం?
(Tech.Asst. in Archaeology-2012)
1) చేపలు 2) సరీసృపాలు
3) పక్షులు 4) క్షీరదాలు
16. బొటనవేలు లేకపోవడం అనేది కింది వాటిలో ఏ జీవి లక్షణం?
1) కోతి 2) మానవుడు
3) కుందేలు 4) కప్ప
17. భూమి మీద మొదట నివసించిన జీవులు ఏవి?
1) తొండలు 2) డిప్నాన్ చేపలు
3) కప్పలు 4) సర్పాలు
18. రెడ్ ఇండియన్లు బాణాల చివరన విషంగా ఏ కప్ప చర్మగ్రంథుల స్రావాలను పూస్తారు?
1) హైలా 2) రాకోపోరస్
3) పిల్లోబేటస్ 4) ఎలైటస్
19. కింది వాటిలో ప్రపంచంలో అత్యంత విషపూరిత ఉభయచరాల్లో ఒకటి ఏది?
(Gr-II, 2005)
1) బ్లూ డార్ట్ మండూకం
2) రాటిల్ స్నేక్ 3) స్పెర్మ్ వేల్
4) గ్రీన్ టర్టిల్
20. బాహ్య ఫలదీకరణం జరిపే జీవులు ఏవి?
1) చేపలు 2) కప్పలు
3) బల్లులు-పాములు
4) 1, 2
21. టాడ్‌పోల్ లార్వా రూప విక్రియను నియంత్రించే హార్మోన్ ఏది?
1) అడ్రినలిన్ 2) థైరాక్సిన్
3) ఈస్ట్రోజన్ 4) ఆక్సిటోసిన్
22. 'వేసవి కాల నిద్ర' అంటే ఏమిటి?
1) శీతాకాల సుప్తావస్థ
2) ప్రతికూల పరిస్థితులు
3) గ్రీష్మకాల సుప్తావస్థ 4) కోమా
23. స్పాన్ అంటే..?
1) కప్ప అండాల సమూహం
2) పుట్టగొడుగుల విత్తనాలు
3) కప్ప శుక్రకణాల సమూహం
4) 1, 2
24. రెండు కర్ణికలు, ఒక జఠరికతో కూడిన హృదయం ఏ జీవుల్లో ఉంటుంది?
1) చేపలు 2) కప్పలు
3) పాములు 4) పక్షులు-క్షీరదాలు
25. కప్పల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఏమంటారు?
1) ఇక్తియాలజీ 2) బాట్రకాలజీ
3) టార్పిడాలజీ 4) ఓఫియాలజీ
26. రూప విక్రియ ప్రదర్శించే జీవి ఏది?
1) పాము 2) కప్ప
3) హైడ్రా 4) చేప
27. మెడ, తోక, పొలుసులు లోపించిన జీవులు ఏవి?
1) చేపలు 2) కప్పలు
3) సరీసృపాలు 4) పక్షులు
28. సర్పాలకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
1) కదిలే కనురెప్పలు ఉంటాయి
2) కదలని కనురెప్పలు ఉంటాయి
3) కనురెప్పలు ఉండవు
4) నిమేషక పటలం ఉంటుంది
29. విషసర్పాల్లో విషగ్రంథులు వేటి రూపాంతరం?
1) ఆస్య గ్రంథులు
2) లాలాజల గ్రంథులు
3) తైల గ్రంథులు 4) అశ్రు గ్రంథులు
30. కింది వాటిలో పాము కరిచినప్పుడు విరుగుడుగా పనిచేసే మంచి ఇంజెక్షన్ ఏది?
1) పెన్సిలిన్ 2) యాంటీవీనమ్
3) యాంటీబయాటిక్
4) స్ట్రెప్టోమైసిన్
31. నాగుపామును దేని ఆధారంగా గుర్తిస్తారు?
1) నలుపురంగు 2) పడగ
3) రాళ్లలో నివసించడం వల్ల
4) పడగ, మూడో అదిపోష్ట పొలుసు
32. సర్పాల్లో మధ్య చెవి ఉండదు. అవి శబ్దాలను వేటి ద్వారా గ్రహిస్తాయి?
1) నాలుక 2) చర్మం
3) ముట్టె 4) గాలి
33. పాము విషానికి విరుగుడు ఇంజెక్షన్లను ఎక్కడ తయారు చేస్తున్నారు?
1) A.C.D., ఢిల్లీ
2) IICT, హైదరాబాద్
3) హాఫ్‌కిన్ ఇన్‌స్టిట్యూట్, ముంబై
4) పింపు, పుణే
34. సరీసృపాలన్నింటిలో మొసళ్లలో ఉన్న ప్రత్యేక లక్షణం ఏది?
1) దృఢమైన దవడ కండరాలు
2) నేలమీదకు రాగలిగే శక్తి
3) నాలుగు గదుల గుండె
4) అండం చుట్టూ గట్టి పెంకు ఉండటం
35. పక్షుల్లో ఉండే ప్రధాన లక్షణం?
1) ముక్కు 2) రెక్కలు
3) పొలుసులు 4) ఈకలు
36. పాముల గురించి అధ్యయనం చేసే శాస్త్రం?
1) ఇక్తియాలజీ 2) ఓఫియాలజీ
3) లెపిడాప్టరాలజీ 4) ఎంటమాలజీ
37. కింది వాటిలో శిశూత్పాదక సర్పం ఏది?
1) కోబ్రా 2) కట్లపాము
3) రక్తపింజర 4) రాట్ సర్పం
38. రక్తపింజర విషం ఏ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది?
1) జీర్ణ వ్యవస్థ 2) రక్తప్రసరణ వ్యవస్థ
3) శ్వాస వ్యవస్థ 4) విసర్జన వ్యవస్థ
39. నాగుపాము విషం ఏ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది?
1) శ్వాస వ్యవస్థ 2) రక్తప్రసరణ వ్యవస్థ
3) నాడీ వ్యవస్థ 4) జీర్ణ వ్యవస్థ
40. చలనంలో సర్పాలకు సహాయపడేవి ఏవి?
1) తల 2) పొలుసులు
3) పర్శుకలు 4) తోక
41. అతి తక్కువ కాలం చూలు మోసే జీవి?
1) మేక 2) గుర్రం
3) అపోజం 4) చుంచెలుక
42. కింది వాటిలో విష సర్పం కానిది?
1) సముద్ర సర్పం 2) కట్లపాము
3) రక్తపింజర 4) పైథాన్
43. కింది వాటిలో విష సర్పం ఏది?
1) పైథాన్ 2) కట్లపాము
3) ట్రి స్నేక్ 4) రాట్ స్నేక్
44. ఒక వ్యక్తి కాలికి ఏదో జీవి కరవడం వల్ల రెండు గాట్లు పడ్డాయి. ఆ గాట్ల ఆధారంగా కింది వాటిలో అది ఏ జీవి అయి ఉండవచ్చు?
1) తేలు 2) ఎలుక
3) విషరహిత సర్పం
4) విషపూరిత సర్పం
45. పరిసరాలను బట్టి రంగులు మార్చేది?
1) పిల్లి 2) ఎలుక
3) ఊసరవెల్లి (కెమీలియాన్)
4) తొండ
46. కింది వాటిలో దీర్ఘకాలం జీవించే జంతువు?
1) ఏనుగు 2) ఒంటె
3) నక్క 4) తాబేలు
47. డైనోసార్ ఒక...? (UPSC-1989)
1) సరీసృపం 2) ఉభయచరం
3) క్షీరదం 4) పక్షి
48. 'డైనోసార్' అనే పదానికి అర్థం?
1) ఘోర పాకుడు జంతువు
2) భయంకరమైన పాకుడు జంతువు
3) ఘోర బల్లి
4) అధమ పాకుడు జంతువు
49. కింది వాటిలో ఎగిరే డైనోసార్‌గా ప్రసిద్ధి చెందింది ఏది?
(Polytechnic College, Lecturers)
1) స్పినోసారస్ 2) టెరోసారస్
3) అర్జంటినో సారస్ 4) ఏదీకాదు
50. విషం గురించి అధ్యయనం చేసే శాస్త్రం?
(Asst.social welfare officer in A.P. 2012)
1) మార్ఫాలజీ 2) ఆస్టియాలజీ
3) టాక్సికాలజీ 4) కాంకాలజీ
51. భూమిపై అతి పెద్ద పక్షి ఏది?
(Asst.social welfare officer in A.P. 2012)
1) ఈము 2) ఆస్ట్రిచ్
3) ఆల్ బట్రాస్ 4) సైబీరియన్ క్రేన్
52. కింది వాటిలో దేనిలో వాతులాస్థులు ఉంటాయి?
1) గబ్బిలం 2) తిమింగలం
3) పక్షులు 4) ఎక్సోసీటస్
53. పక్షుల్లో కనిపించే దృష్టి లక్షణం ఏది?
1) మోనాక్యులార్-టెలిస్కోపిక్ దృష్టి
2) బైనాక్యులర్-మయోపిక్ దృష్టి
3) బైనాక్యులర్-టెలిస్కోపిక్ దృష్టి
4) మోనాక్యులర్- మయోపిక్ దృష్టి
54. పక్షుల గురించి అధ్యయనం చేసే శాస్త్రం?
(Gr-II, 2012)
1) హెర్పిటాలజీ 2) ఆర్నిథాలజీ
3) ఇథాలజీ 4) ఫినాలజీ
55. కింది వాటిలో పక్షుల్లో ఏవి ఉండవు?
(Gr-II, 2001)
1) నరాలు 2) చెమట గ్రంథులు
3) కనురెప్పలు 4) వాతులాస్థులు
56. నేలపై అతి వేగంగా పరుగెత్తే జంతువు?
(Gr-I, 1998)
1) లేడి 2) చిరుతపులి
3) గుర్రం 4) పెద్దపులి
57. స్వేద గ్రంథులు లేని క్షీరదం?
1) కోతి 2) ఆవు
3) తిమింగలం 4) పంది
58. గబ్బిలం, తిమింగలం ఏ వర్గానికి చెందినవి?
1) పక్షులు 2) సరీసృపాలు
3) క్షీరదాలు 4) ఉభయచరాలు
59. కింది వాటిలో క్షీరదాల అత్యంత ప్రధాన లక్షణం ఏది?
1) హెమియోథర్మిక్
2) విభాజక పటలం
3) శిశు ఉత్పాదకాలు
4) డైకాండైలిక్
60. ఏ జీవికి వేళ్లు ఉండవు కానీ, గోళ్లు ఉంటాయి?
1) కంగారు 2) అపోజం
3) బ్లూవేల్ 4) ఒంటె
61. గుడ్లు పెట్టే క్షీరదం?
1) డక్‌బిల్ ప్లాటిపస్ 2) ఎకిడ్నా
3) గబ్బిలం 4) 1, 2
62. ప్రపంచంలో అతి పెద్ద ప్రాణి ఏది?
(Gr-I, 1998)
1) ఇండియా ఏనుగు 2) బ్లూవేల్
3) రైనోడాన్ 4) ఆఫ్రికా ఏనుగు
63. మానవుడి తర్వాత అతి తెలివైన క్షీరదం?
(S.I.-2008)
1) బ్లూవేల్-తిమింగలం
2) డాల్ఫిన్ 3) ఆఫ్రికా ఏనుగు
4) కంగారు
64. జంతువుల ప్రవర్తనను అధ్యయనం చేసే శాస్త్రం ఏది? (Gr-I, 2010)
1) ఎంటమాలజీ 2) ఇథాలజీ
3) ఎకాలజీ 4) యూజెనిక్స్

సమాధానాలు

1) 4; 2) 3; 3) 3; 4) 4; 5) 4;
6) 1; 7) 1; 8) 3; 9) 4; 10) 3;
11) 3; 12) 4; 13) 1; 14) 2; 15) 1;
16) 4; 17) 3; 18) 3; 19) 1; 20) 4;
21) 2; 22) 3; 23) 4; 24) 2; 25) 2;
26) 2; 27) 2; 28) 3; 29) 2; 30) 2;
31) 4; 32) 2; 33) 3; 34) 3; 35) 4;
36) 2; 37) 3; 38) 2; 39) 3; 40) 3;
41) 3; 42) 4; 43) 2; 44) 4; 45) 3;
46) 4; 47) 1; 48) 2; 49) 2; 50) 3;
51) 2; 52) 3; 53) 1; 54) 2; 55) 2;
56) 2; 57) 3; 58) 3; 59) 2; 60) 3;
61) 4; 62) 2; 63) 2; 64) 2.

ప్రపంచంలో అధిక ఉష్ణోగ్రత కలిగిన ప్రాంతం ఏది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జాగ్రఫీ

ప్రపంచ ప్రకృతిసిద్ధ మండలాలు

1. 'ప్రకృతిసిద్ధ మండలం'గా గుర్తించాలంటే మానవ జీవన విధానంతో కింది వాటిలో ఏ అంశం పోలిక కలిగి ఉండాలి?
   1) నైసర్గిక స్థితి
   2) సహజ వృక్ష సంపద
   3) శీతోష్ణస్థితి 4) పైవన్నీ
2. భూగోళం గురించి మానవుడు మొదటిసారిగా దేని ఆధారంగా పరిశీలన చేశాడు?
   1) వృక్ష సంపద 2) నేలలు
   3) ఉష్ణోగ్రత 4) ప్రజలు
3. జాన్ హెర్బర్ట్‌సన్ భూమిని ఎన్ని ప్రకృతిసిద్ధ మండలాలుగా వర్గీకరించాడు?
   1) 8 2) 10 3) 11 4) 13
4. భూమధ్యరేఖకు ఇరువైపులా 10° అక్షాంశాల వరకు విస్తరించి ఉన్న ప్రకృతిసిద్ధ మండలం ఏది?
   1) భూమధ్యరేఖా మండలం
   2) ఆయనరేఖా ఎడారులు
   3) రుతుపవన మండలం
   4) ఉష్ణమండల పచ్చిక బయళ్లు
5. కింది వాటిలో భూమధ్యరేఖా మండలం విస్తరించని ప్రాంతం ఏది?
   1) శ్రీలంక 2) వెస్టిండీస్ దీవులు
   3) ఫ్రాన్స్ 4) బ్రెజిల్
6. భూమధ్యరేఖా మండలానికి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
   1) ఈ మండలంలో రుతువులు ఏర్పడవు
   2) ఈ మండలంలో సంవత్సరం పొడవునా అధిక ఉష్ణోగ్రత, వర్షపాతం ఉంటుంది
   3) ఈ మండలంలో రాత్రి సమయంలో ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటుంది
   4) ఈ మండలాన్ని 'ప్రశాంత మండలం' అని పిలుస్తారు
7. 'బోగోర్' ద్వీపం ఎక్కడ ఉంది?
   1) జావా 2) కాంగో
   3) బోర్నియా 4) సుమత్రా
8. 'కామెరూన్' పర్వత శిఖరం ఏ ఖండంలో ఉంది?
   1) దక్షిణ అమెరికా 2) ఆఫ్రికా
   3) ఆసియా 4) ఆస్ట్రేలియా
9. 'డోల్డ్రమ్స్' అంటే అర్థం ఏమిటి?
   1) తక్కువ ఒత్తిడి క్షేత్రం
   2) ఎక్కువ ఒత్తిడి క్షేత్రం
   3) అసలు ఒత్తిడి లేని క్షేత్రం
   4) సైక్లోనిక్ క్షేత్రం
10. అమెజాన్ తట్టు (బేసిన్)లో వర్షపు అడవిని ఏ పేరుతో పిలుస్తారు?
    1) కంపాలు 2) సెల్వాలు
    3) పంపాలు 4) లానోలు
11. ప్రపంచంలో అత్యధికంగా కోకో పండించే దేశం ఏది?
    1) ఘనా 2) ఐవరీకోస్ట్
    3) నైజీరియా 4) బ్రెజిల్
12. సమాంగ్ అనే గిరిజన తెగకు చెందిన ప్రజలు కింది ఏ ప్రాంతంలో నివసిస్తారు?
    1) అమెజాన్ బేసిన్ 2) జైర్ బేసిన్
    3) ఇండోనేషియా 4) మలేషియా
13. ప్రపంచంలో కెల్లా అత్యంత దట్టమైన అడవులు ఏవి?
    1) లయనాలు 2) సెల్వాలు
    3) ప్లయాలు 4) స్టెప్పీలు
14. భూమధ్యరేఖా మండలంలో అత్యధిక జనసాంద్రత ఉన్న ద్వీపం ఏది?
    1) బోగోర్ 2) జావా
    3) సుమత్రా 4) శ్రీలంక
15. కింది వాటిని జతపరచండి.

ప్రాంతాలు	తెగలు
ఎ. సుమత్రా	1. వెడ్డాలు
బి. కాంగో	2. పపువాలు
సి. శ్రీలంక	3. కాబూలు
డి. న్యూగినియా	4. పిగ్మీలు

	ఎ	బి	సి	డి
1)	1	2	3	4
2)	2	3	4	1
3)	3	4	1	2
4)	4	1	2	3

16. ప్రపంచానికి రబ్బరును పరిచయం చేసిన ప్రాంతం ఏది?
    1) కాంగో నదీ పరీవాహక ప్రాంతం
    2) మలేషియా ప్రాంతం
    3) అమెజాన్ పరీవాహక ప్రాంతం
    4) జైర్ పరీవాహక ప్రాంతం
17. 'ఫాజెండాలు' అంటే ఏమిటి?
    1) భూమధ్యరేఖా మండలంలోని దట్టమైన అడవులు
    2) ఉష్ణమండల గడ్డి భూములు
    3) ఆయనరేఖా ఎడారుల్లో ప్రవహించే నదులు
    4) భూమధ్యరేఖా మండలంలోని కాఫీ క్షేత్రాలు



18. 'బేతూకర్' అనే అడవులు ఏ దేశంలో పెరుగుతాయి?
    1) ఇండోనేషియా 2) మలేషియా
    3) వెస్టిండీస్ 4) శ్రీలంక
19. ఏ దేశంలో పెరిగే 'జాపోట్' వృక్షాల నుంచి 'చూయింగ్ గమ్'ను తయారు చేస్తారు?
    1) దక్షిణ అమెరికా 2) బ్రెజిల్
    3) వెస్టిండీస్ 4) ఘనా
20. 'ఎర్బామేట్' పానీయానికి ఉపయోగపడే 'ఎర్బా' ఆకులు ఏ దేశంలో లభిస్తాయి?
    1) పశ్చిమ ఇండీస్ 2) ఐవరీ కోస్ట్
    3) మెక్సికో 4) దక్షిణ అమెరికా
21. ఇండోనేషియాలో చేసే పోడు వ్యవసాయాన్ని ఏమని పిలుస్తారు?
    1) జూమ్ 2) లడంగ్
    3) చీనా 4) మిల్పా
22. ప్రపంచంలో గంధకాన్ని అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న దేశం ఏది?
    1) మెక్సికో 2) మలేషియా
    3) బ్రూనై 4) ఇండోనేషియా
23. ఖండాల పశ్చిమ భాగంలో భూమధ్యరేఖకు ఇరువైపులా 15° నుంచి 30° వరకు వ్యాపించి ఉన్న ప్రకృతి సిద్ధ మండలం ఏది?
    1) భూమధ్యరేఖా మండలం
    2) ఉష్ణ మండల ఎడారులు
    3) ఉష్ణమండల గడ్డి భూములు
    4) రుతుపవన మండలం
24. దక్షిణార్ధ గోళంలో పెద్దది, ప్రపంచంలో రెండో పెద్దదైన ఎడారి ఏది?
    1) అటకామా 2) కలహారి ఎడారి
    3) సోనారన్ 4) ఆస్ట్రేలియన్ ఎడారి
25. దక్షిణాఫ్రికా, నమీబియా, బోట్స్‌వానా దేశాల్లో విస్తరించి ఉన్న ఎడారి ఏది?
    1) అటకామా 2) పెటగోనియా
    3) కలహారి 4) సహారా
26. ఎడారి ప్రాంతంలో ప్రవహించే నదులను ఏమని పిలుస్తారు?
    1) ఎక్సోటిక్ నదులు 2) ప్లయాలు
    3) వాడీలు 4) సైమూన్స్
27. 'డార్లింగ్' నది ఏ ప్రాంతంలో ప్రవహిస్తుంది?
    1) ఆఫ్రికా 2) ఆసియా
    3) దక్షిణాఫ్రికా 4) ఆస్ట్రేలియా
28. కింది వాటిలో ఎక్సోటిక్ నది కానిది ఏది?
    1) కొలరాడో 2) సింధు
    3) ఆరెంజ్ 4) అమెజాన్
29. ఎడారుల్లో ఏర్పడే తాత్కాలిక సరస్సులను ఏమని పిలుస్తారు?
    1) వాడీలు 2) ప్లయాలు
    3) రేగ్ 4) ఎర్గ్
30. 'సైమూన్స్' అంటే ఏమిటి?
    1) రాతి ఎడారులు
    2) ఎడారుల్లో పెరిగే వృక్షాలు
    3) తాత్కాలిక వాగులు
    4) ఎడారుల్లో ధూళి తుపానులు
31. ప్రపంచంలో అధిక ఉష్ణోగ్రత కలిగిన ప్రాంతం ఏది?
    1) అజీజియా 2) మృత్యులోయ
    3) కామెరూన్ 4) జాకోబాబద్
32. టైగ్రిస్ నది ఏ దేశంలో ప్రవహిస్తుంది?
    1) ఇరాన్ 2) ఇరాక్
    3) దక్షిణాఫ్రికా 4) ఆస్ట్రేలియా
33. మెక్సికో, కాలిఫోర్నియా, అరిజోనా రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న ఎడారి ఏది?
    1) అటకామా 2) కలహారి
    3) పెటగోనియా 4) సోనారన్
34. కింది వాటిలో సరికాని జత ఏది?
    1) సింధు – ఆసియా
    2) నైలు – ఆఫ్రికా
    3) యూఫ్రటీస్ – ఇరాక్
    4) కొలరాడో – దక్షిణాఫ్రికా
35. రాతి ఎడారులను ఏమని పిలుస్తారు?
    1) ఎర్గ్ 2) హమదా
    3) వాడీలు 4) ప్లయాలు
36. 'అశ్వాన్ డ్యామ్'ను ఏ నదిపై నిర్మించారు?
    1) సింధు 2) కొలరాడో
    3) నైలు 4) అమెజాన్
37. కింది వాటిలో 'గ్జీరోఫైటిక్' లక్షణం కలిగి ఉండే వృక్షం ఏది?
    1) మహాగని 2) టేకు
    3) సుందరి 4) నాగజెముడు
38. కింది వాటిలో అత్యంత అనాగరికమైన తెగగా దేన్ని పేర్కొంటారు?
    1) బుష్‌మెన్లు 2) బిడానియన్లు
    3) బిండిబాలు 4) ఫల్లాహిన్లు
39. కింది వాటిలో సరికాని జత ఏది?
    1) కలహారి – బుష్‌మెన్లు
    2) సహారా – ఫల్లాహిన్లు
    3) ఆస్ట్రేలియా – టౌరెన్లు
    4) అరేబియా – బిడానియన్లు
40. పెరూ తీర ప్రాంతంలో లభించే పక్షి రెట్టను ఏమని పిలుస్తారు?
    1) రూకరీలు 2) గుయానో
    3) కనాట్‌లు 4) డింగో
41. ప్రపంచంలో అతిపెద్ద చమురు శుద్ధి కర్మాగారం ఉన్న ప్రదేశం ఏది?
    1) కిర్‌కుక్ 2) కైరో
    3) మక్కా 4) అబదాన్
42. కాల్‌గూర్లీ, కూల్‌గార్డీ గనులు దేనికి ప్రసిద్ధి చెందాయి?
    1) నైట్రేట్లు 2) చమురు
    3) బంగారం 4) రాగి
43. ప్రపంచంలో పొడుగు పింజ పత్తి ఎక్కువగా ఉత్పత్తి చేసే దేశం ఏది?
    1) ఆస్ట్రేలియా 2) భారతదేశం
    3) దక్షిణాఫ్రికా 4) ఈజిప్టు
44. 'సూయజ్ కాలువ తాళపు చెవి'గా ఏ నగరాన్ని పేర్కొంటారు?
    1) కైరో 2) ఎడిన్
    3) అబదాన్ 4) అలెగ్జాండ్రియా
45. దక్షిణ అమెరికాలోని ఉష్ణమండల గడ్డిభూములను ఏమని పిలుస్తారు?
    1) సవన్నాలు 2) కంపాలు
    3) పంపాలు 4) లానోలు
46. వెనిజులా, అర్జెంటీనా మధ్య ఉన్న ఆకు రాల్చే అడవి ప్రాంతాన్ని ఏమని పిలుస్తారు?
    1) లానోలు 2) సవన్నాలు
    3) గ్రీన్ చాకో 4) వెల్డులు
47. ఒరినాకో నదీ పరీవాహక ప్రాంతంలో విస్తరించి ఉన్న ఉష్ణ మండల గడ్డి భూములేవి?
    1) లానోలు 2) కంపాలు
    3) సవన్నాలు 4) ప్రయరీలు
48. 'సవన్నా' గడ్డి భూములు ఎక్కడ విస్తరించి ఉన్నాయి?
    1) ఉత్తర అమెరికా 2) దక్షిణ అమెరికా
    3) ఆఫ్రికా 4) ఆస్ట్రేలియా
49. ప్రపంచంలో అత్యధిక వర్షపాతం నమోదైన 'వయలిలీ' శిఖరం ఎక్కడ ఉంది?
    1) కామెరూన్ 2) కౌవాయి
    3) బోగోర్ 4) క్యూబా
50. 'ఏనుగు గడ్డి' ప్రధానంగా ఎక్కడ పెరుగుతుంది?
    1) ఉత్తర అమెరికా
    2) ఆస్ట్రేలియా 3) ఆఫ్రికా
    4) దక్షిణ అమెరికా
51. 'క్వెబ్రాషో' వృక్షాల నుంచి తీసే 'టానిన్'ను ఏ పరిశ్రమలో ఉపయోగిస్తారు?
    1) పట్టు పరిశ్రమ
    2) అల్యూమినియం పరిశ్రమ
    3) ఇనుము-ఉక్కు పరిశ్రమ
    4) తోళ్ల పరిశ్రమ
52. కింది వాటిలో సరికానిది ఏది?
    1) పశ్చిమ ఆఫ్రికా – హౌసా
    2) కెన్యా – కాసోవారి
    3) తూర్పు ఆఫ్రికా – మసాయి
    4) వెనిజులా – లానెరో
53. 'కటంగా' ఏ నిల్వలకు ప్రసిద్ధి?
    1) బాక్సైట్ 2) పెట్రోలియం
    3) రాగి 4) ఇనుము
54. ఏ గడ్డి భూములను 'పార్క్‌లాండ్స్' (ఉద్యానవన భూములు) అని పిలుస్తారు?
    1) సవన్నాలు 2) లానోలు
    3) ప్రయరీలు 4) పంపాలు
55. 'విక్టోరియా' జలపాతం ఏ నదిపై ఉంది?
    1) జైరే 2) జాంబేజీ
    3) అమెజాన్ 4) ఆరెంజ్

సమాధానాలు

1) 4; 2) 3; 3) 4; 4) 1; 5) 3; 6) 3; 7) 1; 8) 2; 9) 1; 10) 2; 11) 1; 12) 4; 13) 2; 14) 2; 15) 3; 16) 3; 17) 4; 18) 2; 19) 3; 20) 4; 21) 2; 22) 1; 23) 2; 24) 4; 25) 3; 26) 1; 27) 4; 28) 4; 29) 2; 30) 4; 31) 1; 32) 2; 33) 4; 34) 4; 35) 2; 36) 3; 37) 4; 38) 1; 39) 3; 40) 2; 41) 4; 42) 3; 43) 4; 44) 2; 45) 2; 46) 3; 47) 1; 48) 3; 49) 2; 50) 3; 51) 4; 52) 2; 53) 3; 54) 1; 55) 2.

I think I understand the nuts and..

Bank Exams

ENGLISH

Idioms and Phrases

Idioms and phrases refer to commonly used group of words in English. They carry a specific meaning and are used in specific situations. Phrases are usually made up of a few words and are used as a grammatical unit in a sentence; on the other hand idioms are full sentences. It is an important category in all competitive exams. Candidates preparing for competitive examinations must practice idioms and phrases in their writing as well as speech. By listening to native speakers one will get acquainted with the nuances of the language. It will make them proficient while practicing.

For attempting the questions in this section the candidates should know the rules of grammar. They should also pay attention to various exceptions to the grammatical rules. Good command over grammar is necessary to solve these questions.

List of important Idioms and Phrases

- **A bird in the hand is worth two in the bush**
  Meaning: Having something that is certain is much better than taking a risk for more, because chances are you might lose everything
- **A bitter pill**
  Meaning: A situation or information that is unpleasant but must be accepted
- **A blessing in disguise**
  Meaning: Something good that isn't recognized at first
- **A man of action**
  Meaning: A man who is inclined to act first rather than think about things and discuss them.



- **Add fuel to the fire**
  Meaning: To make a problem worse
- **Every cloud has a silver lining**
  Meaning: Be optimistic
- **From scratch / to start from scratch**
  Meaning: Start from the beginning with no prior preparation
- **Face the music**
  Meaning: Said when someone accepts to confront the unpleasant consequences of one's actions.
- **Gain ground**
  Meaning: To become popular, to make progress, to advance.
- **Cross your fingers**
  Meaning: To hope that something happens the way you want it to.
- **Couch potato**
  Meaning: Lazy person.
- **Cost an arm and a leg**
  Meaning: Extremely expensive.
- **Cry over spilt milk**
  Meaning: When you complain about a loss from the past.
- **Don't put all your eggs in one basket**
  Meaning: Do not put all your resources in one possibility.
- **Lend me your ear**
  Meaning: To politely ask for someone's full attention.
- **Picture paints a thousand words**
  Meaning: A picture will be far more descriptive of something than words can ever be.
- **Raw deal**
  Meaning: Said when someone is ill treated.
- **Red handed**
  Meaning: Be discovered in or just after the act of doing something wrong or illegal
- **Spill the beans**
  Meaning: To reveal a secret.
- **Turn a blind eye**
  Meaning: Refuse to acknowledge something you know is real.
- **Until one is blue in the face**
  Meaning: Pointless efforts while trying to convince someone or change his mind.
- **Walk on air**
  Meaning: Very excited or happy.
- **You can't judge a book by its cover**
  Meaning: Decisions shouldn't be made primarily on appearance.
- **Zero tolerance**
  Meaning: No crime or law breaking big or small will be overlooked.

Directions: which of the phrases (a), (b), (c) and (d) given below each sentence should replace the phrase printed in bold type to make the sentence grammatically correct? If the sentence is correct as it is, mark (e) i.e. No correction required as the answer.

1. Why do you wish **to tread on the toes?**
   a) To give offence to them
   b) To treat them indifferently
   c) To follow them grudgingly
   d) To be kicked by them
   e) No correction required
2. **To keep one's temper**
   a) To be in good mood
   b) To preserve ones energy
   c) To be angry d) To be aloof from
   e) No correction required
3. **To play second fiddle**
   a) To be happy
   b) To reduce importance of one's senior
   c) To support the role and view of another person
   d) To do back seat driving
   e) No correction required
4. Action is the glorious principle of life and the one that saves man from _____.
   a) The use of faculties, physical or mental
   b) Stagnation and unhappiness
   c) The sorrow of fellow beings
   d) The prerequisites of happiness
   e) No correction required
5. Being the head of a large family it difficult to **keep his head above water.**
   a) To take rest
   b) To work properly
   c) To avoid quarrel
   d) To keep out of debt
   e) No correction required
6. **To leave someone in the lurch**
   a) To come to compromise with someone
   b) Constant source of annoyance to someone
   c) To put someone at ease
   d) to leave someone at a time when they need you to stay and help them
   e) No correction required
7. And really the only reason you were there was because **you had a bone to pick with him.**
   a) You wanted to have a discussion with him
   b) You wanted to chat
   c) You wanted to talk
   d) You wanted to have an argument with him
   e) No correction required
8. He doesn't really go around with many people because he is a bit a **lone wolf.**
   a) Single person b) Lonely person
   c) Unhappy person d) Simple person
   e) No correction required
9. I don't honestly think he is capable of being polite as **the leopard never changes his spots.**
   a) Always complain b) Differ in opinion
   c) Never change d) Shout
   e) No correction required
10. The issue was **taken before** the Municipal Corporation meeting last week.
    a) Taking place at b) Taken after
    c) Being taken up d) Taken up at
    e) No correction required
11. As the maestro lifted his baton the theatre was so still you could hear _____.
    a) His heartbeat b) A pin drop
    c) Bird wings d) Drum beating
    e) No correction required
12. I don't agree with you, but your idea certainly gives me **food** _____.
    a) For fun b) For consideration
    c) For thought d) For thinking
    e) No correction required
13. Look, I will pay you back. Would you please call the _____.
    a) Hunters off b) Tigers off
    c) Dogs off d) Apes off
    e) No correction required
14. Just a moment... I've got the answer on the _____ **of my tongue.**
    a) Top b) back c) Tip d) Front
    e) No correction required
15. I'm afraid Chess isn't **my cup of** _____.
    a) Tea b) Coffee
    c) Wine d) Java e) Milk
16. I think I understand the **nuts and** _____ of the operation.
    a) Screws b) Hammer
    c) Nails d) Bolts
    e) No correction required
17. Oh, I'm sorry. I shouldn't have said that. I guess I really **put my** _____ **in my mouth.**
    a) Foot b) Hand
    c) Elbow d) Knee
    e) No correction required
18. I'll be back in the twinkling of _____.
    a) An eye b) A Lighting bolt
    c) A smile d) A laugh
    e) No correction required
19. He is plain, simple and sincere man. He will always **call a spade a spade.**
    a) Find meaning or purpose in your action
    b) Avoid controversial situations
    c) Be outspoken
    d) Resist from making controversial statement
    e) No correction required
20. He has rejoined after a week and looks **run down.**
    a) Cheerful and bubbly
    b) Weak and tired
    c) Active and energetic
    d) Busy and preoccupied
    e) No correction required
21. **To hit the nail on the head**
    a) To do the right thing
    b) To destroy one's reputation
    c) Announce one's fixed views
    d) To teach someone a lesson
    e) None of these
22. All these promises these politicians make are just _____ **in the sky.**
    a) Pie b) Ocean
    c) Music d) Rags
    e) No correction required
23. The small amount of money donated is just a _____ **in the ocean** compared to the large sum of money needed.
    a) Spot b) Drop c) Speck d) Sea
    e) None of the above
24. They had had a dispute yesterday. That's why she gave him the **cold** _____.
    a) Arm b) Hand
    c) Shoulder d) Music
    e) None of the above
25. He has been successful in his life. He went from _____ **to riches.**
    a) Rags b) Shoulder
    c) Colours d) Poor
    e) None of the above

Answers:

1) a 2) a 3) c 4) b 5) d
6) d 7) d 8) b 9) c 10) d
11) b 12) c 13) c 14) c 15) a
16) d 17) a 18) a 19) c 20) b
21) a 22) a 23) b 24) c 25) a